www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

గురువారం | 22-8-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 145

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం; తిథి: తదియ మ. 1.46 తదుపరి చవితి; నక్షత్రం: ఉత్తరాభాద్ర రా 10.05 తదుపరి రేవతి; వర్జ్యం: ఉ.9.09-10.35; దుర్ముహూర్తం: ఉ.10.12-11.02, మ.3.12-4.02; అమృతఘడియలు: సా.5.46-7.12; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.03; సూర్యాస్తమయం: 6.32

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఇన్‌ఫార్మర్ పేరిట మహిళా మావోయిస్టు హత్య

మృతదేహాన్ని రోడ్డు మీద వదిలేసి వెళ్లిన మావోయిస్టులు

పార్టీకి ద్రోహం చేసినందుకే శిక్షించామని లేఖ

గొంతు నులిమి చంపినట్లు అనుమానం.. భద్రాద్రిలో ఘటన

మృతురాలి స్వస్థలం హైదరాబాద్



కొత్తగూడెం జిల్లా చెన్నాపురం రహదారిపై రాధ మృతదేహం

చర్ల/పినపాక, జవహర్‌నగర్, కాప్రా, ఆగస్టు 21: మావోయిస్టు పార్టీలో గత ఆరేళ్లుగా పని చేస్తున్న బంటి రాధ (25) అలియాస్ నీల్సో అనే మహిళా మావోయిస్టు (కమాండర్)ను బుధవారం తెల్లవారుజామున మావోయిస్టులు హత్య చేశారు. అనంతరం ఆమె మృతదేహాన్ని కొత్తగూడెం జిల్లా చర్ల మండలం చెన్నాపురం రహదారిపై పడేశారు. మృతదేహంపై

మిగతా 12వ పేజీలో...

రుణమాఫీపై ఫిర్యాదుల స్వీకరణ ప్రారంభం

2 లక్షల వరకు రుణాలున్న రైతుల నుంచే..

5 క్యాటగిరీల్లో వివరాల సేకరణ

వారం రోజుల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న అధికారులు

13

నెలాఖరులోగా సూపరింటెండెంట్లు!

12

రాష్ట్రంలో 18 బోధనాసుపత్రులకు నియామకం

నెల రోజులుగా వారు లేకుండానే ఆస్పత్రులు!

త్వరలో 10 వైద్య కాలేజీలకు ప్రిన్సిపాళ్లు

అడిషనల్ డీఎంఈ పదోన్నతులపైనా దృష్టి

త్వరలో రెగ్యులర్ డీహెచ్ నియామకం కూడా



13

నోటిఫికేషన్ జారీ చేసిన ఏడేళ్లకు

పీఈటీల ఫలితాలు!

594 పోస్టులకు అభ్యర్థుల ఎంపిక



కల్యాణలక్ష్మికి 1450 కోట్లు విడుదల

తాజాగా దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నిధుల నుంచి చెల్లింపులు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కల్యాణలక్ష్మి పథకం కోసం ప్రభుత్వం రూ. 1450 కోట్లు విడుదల చేసింది. 2024- 25 సంవత్సరానికి గాను నిధులు విడుదల చేస్తున్నట్లు పేర్కొంది. కల్యాణలక్ష్మి కోసం తాజాగా దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నిధుల నుంచి చెల్లింపులు చేస్తామని అధికారులు తెలిపారు. ఈ మేరకు బీసీ సంక్షేమశాఖ బుధవారం జీవో జారీ చేసింది. కాగా, ఈ పథకం కింద లబ్ధిదారులకు రూ. 1,00,116 ప్రయోజనం అందుతుంది.



రెండు కత్తెర్లు అదృశ్యం..

36 విమానాలు రద్దు

201 విమానాలు ఆలస్యం..

జపాన్‌లో ఘటన

2

ఎయిర్‌పోర్టులో ఉన్న దుకాణంలో కత్తెర్లు కనిపించకపోవడంతో కలకలం

గంటలపాటు విస్తృతంగా తనిఖీలు



గ్రామస్థులతో మాట్లాడుతున్న వైద్యులు

కాటేసిన కల్తీకల్లు!

ఒకరి మృతి.. మరొకరి విషమం

మరో 30 మందికి అస్వస్థత

14

వికారాబాద్ జిల్లా పీరంపల్లిలో ఘటన



కర్మాగారం నుంచి పొగలు

ఘోరం



శిథిలాల కింద ఛిద్రమైన మృతదేహాలు

18 మంది దుర్మరణం

ఫార్మా కంపెనీలో భారీ పేలుడు.. ఏపీలోని అనకాపల్లిలో ఘటన

ఎసెన్షియా కంపెనీలో రసాయనం లీక్

ఎలక్ట్రిక్ ప్యానల్‌పై పడిన ద్రావకం

ఉష్ణోగ్రతకు ఆవిరి మేఘాలుగా సాల్వెంట్

మంటలతో 'వేపర్ క్లౌడ్ ఎక్స్‌ప్లోజన్'

కుప్పకూలిన శ్లాబ్, గోడ

కార్మికుల హాహాకారాలు

చెల్లాచెదురుగా మృతదేహాలు

20 మందికి పైగా తీవ్ర గాయాలు

మృతుల సంఖ్య మరింత పెరిగే చాన్స్

ఘోరం జరిగింది! పెను విషాదం చోటు చేసుకుంది. ప్రాణనష్టం పరంగా 'ఫార్మా' చరిత్రలోనే అతి భారీ ప్రమాదమిది! ఏపీలోని అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లోని 'ఎసెన్షియా' కర్మాగారంలో జరిగిన పేలుడుతో 18 మంది ప్రాణాలు కోల్పోయారు. 20 మందికి పైగా గాయాలపాలయ్యారు. మృతుల సంఖ్య అంతకంతకు పెరుగుతూనే ఉంది.

(అనకాపల్లి/విశాఖపట్నం/ అచ్యుతాపురం - ఆంధ్రజ్యోతి)

అది అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా సంస్థ! బుధవారం మధ్యాహ్నం 2.15 గంటల సమయం! మొదటి షిఫ్టు కార్మికులు విధులు ముగించుకుని... రెండో షిఫ్టు సిబ్బంది లోపలికి వెళ్తున్నారు. అంతలోనే... చెవులు దద్దరిల్లేలా భారీ పేలుడు! ఒక్కసారిగా హాహాకారాలు! ఏంజరిగిందో తెలుసుకునేలోగానే

మిగతా 14వ పేజీలో...



క్షతగాత్రులు ఆస్పత్రికి తరలింపు

దక్షిణ భాగం భూసేకరణ

ప్రారంభించండి

ఏమైనా ఇబ్బందులుంటే కేంద్రంతో మాట్లాడండి

ఆర్ఆర్ఆర్ పురోగతిపై రోజువారీ సమీక్ష జరపండి

సీఎస్ శాంతికుమారికి సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

అలైన్‌మెంట్‌లో మార్పులు సూచించిన సీఎం



ఆర్ఆర్ఆర్‌పై సచివాలయంలో సమీక్ష జరుపుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగం మార్గానికి సంబంధించి భూసేకరణను వెంటనే ప్రారంభించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో ఏమైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలని, పనుల్లో జాప్యం లేకుండా ముందుకు సాగాలని అన్నారు. పనుల పురోగతిపై రోజువారీ సమీక్ష జరపాలని, భూసేకరణ, ఇతర విషయాలపై ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని తనకు అందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి సూచించారు. ఈ అంశాలపై కలెక్టర్లు ప్రతి రోజూ సాయంత్రం సీఎస్‌కు నివేదిక

మిగతా 13వ పేజీలో...

పది రోజుల్లో పరిహారం లెక్కలు

2013 చట్టం ప్రకారమే ఆర్ఆర్ఆర్ పరిహారం

ఆర్ఆర్ఆర్ ఉత్తర మార్గం నిర్మాణానికి అడుగులు

13

అధిష్ఠానం పిలుపు

నేడు లేదా రేపు ఢిల్లీకి రేవంత్, భట్టి

నవంబరులో హైదరాబాద్-విజయవాడ

హైవే విస్తరణ పనులు షురూ

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

13

శాంతి సందేశంతో

యుద్ధభూమికి!

ప్రధాని మోదీ ఉక్రెయిన్ పర్యటనపై ప్రపంచదేశాల చూపు

పుతిన్‌ను కలిసిన నెలన్నరలోపే జెలెన్‌స్కీతో భేటీపై సర్వత్రా ఆసక్తి

ఉక్రెయిన్ సంక్షోభానికి శాంతియుత పరిష్కారమే లక్ష్యం

అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ఆ దిశగా చర్చలు: ప్రధాని మోదీ

2 రోజుల పర్యటనలో భాగంగా పోలండ్ చేరుకున్న మోదీ

45 ఏళ్ల తర్వాత తొలిసారి భారత ప్రధాని పర్యటన


రేపు రైలులో ఉక్రెయిన్‌కు ప్రయాణం



వార్సాలో మోదీకి స్వాగతం పలుకుతున్న పోలండ్ అధికారులు

ప్రధాని నరేంద్ర మోదీ 2014లో పగ్గాలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటిదాకా 78 విదేశీ పర్యటనలు చేశారు! ఒక దేశ ప్రధాని ఇలా విదేశీ పర్యటనలు చేయడం సాధారణమైన విషయమే కాబట్టి ఎవరూ ఆ పర్యటనల గురించి అంతగా పట్టించుకోలేదు! కానీ.. ఇప్పుడు ప్రపంచం చూపంతా మోదీపైన, ఆయన ఉక్రెయిన్ పర్యటనపైనే ఉందంటే అతిశయోక్తి కాదు! అమెరికా, యూకే, చైనాలాంటి దేశాల్లాగా.. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం

మిగతా 2వ పేజీలో...



చట్టప్రకారం వెళ్లండి

కేటీఆర్ జన్వాడ ఫాంహౌజ్‌పై హైకోర్టు.. 'స్టే'కు నో

ఆ భవనానికి సర్పంచ్ అనుమతి చెల్లదన్న సర్కారు

ఇవ్వాల్సింది పంచాయతీ కార్యదర్శి అని వెల్లడి

ఫాంహౌజ్ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందని వివరణ

20 ఏళ్ల క్రితం అన్ని అనుమతులతో కట్టుకున్న భవనాలను ఇప్పుడు అక్రమనిర్మాణాలంటే ఎలా?

ఒక శాఖ అనుమతిస్తే మరొక శాఖ కూల్చేస్తుందా?

హైడ్రా హైడ్రామా.. దాన్ని ఎలా ఏర్పాటు చేశారు

పరిధి, విధులేంటి.. చట్టబద్ధత ఏమిటి: హైకోర్టు

తదుపరి విచారణ సెప్టెంబరు 12కు వాయిదా

హైదరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్వాడ ఫాంహౌజ్ విషయంలో చట్టప్రకారమే వ్యవహరించాలని.. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ సంస్థ (హైడ్రా)ను హైకోర్టు ఆదేశించింది. అన్ని పత్రాలు, బిల్లులు, చెల్లింపుల రశీదులు పరిశీలించి నోటీసులు ఇవ్వాలని పేర్కొంది. ఫాంహౌజ్ కూల్చివేయకుండా స్టే ఇవ్వడానికి నిరాకరించింది. కూల్చివేతల

మిగతా 12వ పేజీలో...

జీవో 111 ప్రాంతాలు హైడ్రా పరిధిలోకి?

ఉన్నతస్థాయిలో చర్చలు.. పరిశీలిస్తున్న ప్రభుత్వం

చెరువులు, నాలాలు, పార్కులు, ప్రభుత్వాస్తుల పరిరక్షణే లక్ష్యం

ఔటర్ వెలుపల ఉన్న కొన్ని ప్రాంతాలు హైడ్రా పరిధిలోకే..

12

జన్వాడలో నాకు ఫాంహౌజ్ లేదు

నా మిత్రుడి ఫాంహౌజ్‌ను లీజుకు తీసుకున్నా

అది బఫర్‌జోన్‌లో ఉంటే నేనే కూల్చివేయిస్తా

ముందుగా సీఎం, మంత్రుల ఫాంహౌజ్‌లు కూల్చాలి: కేటీఆర్



మాతో ఆటలొద్దు!

రాజకీయ కక్షలకు కోర్టులను వేదిక చేసుకోవద్దు

వైసీపీ మాజీ ఎమ్మెల్యే ఆళ్లపై సుప్రీంకోర్టు ఫైర్

ఓటుకు నోటు కేసులో ఏపీ సీఎం చంద్రబాబును నిందితుడిగా చేర్చాలన్న పిటిషన్ తిరస్కరణ

సీబీఐ దర్యాప్తునకూ నిరాకరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఓటుకు నోటు కేసులో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును నిందితుడిగా చేర్చాలని కోరుతూ పిటిషన్ వేసిన వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డిపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. ఆధార రహిత అంశాలను తీసుకొచ్చి తమతో ఆటలాడొద్దని హెచ్చరించింది. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను తిరస్కరించింది. ఈ కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని కోరుతూ ఆయన వేసిన మరో పిటిషన్‌ను కూడా తోసిపుచ్చింది. ఈ మేరకు జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ అరవింద్ కుమార్ లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఓటుకు నోటు కేసులో

మిగతా 12వ పేజీలో...

రహస్య కెమెరాలతో మహిళలు, పిల్లల

నగ్న వీడియోలు..

అమెరికాలో ఓ భారతీయ డాక్టర్ దుర్మార్గం

స్వయంగా భార్య ఫిర్యాదుతో వెలుగులోకి..

వేల సంఖ్యలో బాధితులు.. నిందితుడి అరెస్ట్



ఉమర్ అజీజ్

వాషింగ్టన్, ఆగస్టు 21: ఆస్పత్రులకు చికిత్స కోసం వచ్చే మహిళలు, పిల్లల నగ్న చిత్రాలను రహస్య కెమెరాలతో చిత్రీకరించటమేగాక పలువురిపై లైంగికదాడులకు పాల్పడిన ఉమర్ అజీజ్ అనే భారతీయ డాక్టర్‌ను అమెరికా పోలీసులు అరెస్టు చేశారు. ఆస్పత్రుల లోని బాత్‌రూమ్‌లు, దుస్తులు మార్చుకునే గదులు తదితర ప్రాంతాల్లో రహస్యంగా కెమెరాలను ఏర్పాటు చేసి ఈ నగ్నచిత్రాలను, వీడియోలను ఉమర్ రికార్డు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఉమర్ భార్యనే స్వయంగా పోలీసులకు ఫిర్యాదు చేయటంతో అతడి దారుణాలు బయటపడ్డాయి. పోలీసులు మిషిగన్‌లోని రోచ్‌స్టర్ హిల్స్‌లో ఉన్న వారి ఇంట్లో సోదా జరిపినప్పుడు దిగ్ర్భాంతికర అంశాలు వెల్లడయ్యాయి. ఉమర్ రికార్డు చేసిన మహిళల, పిల్లల నగ్న వీడియోలు, ఫొటోలు వేల సంఖ్యలో ఉన్నాయని తెలిసింది. అంతేకాదు, పలువురు మహిళలు స్పృహలో లేనప్పుడు, నిద్ర పోతున్నప్పుడు వారిపై లైంగికదాడులకు, అభ్యంతరకర చర్యలకు పాల్పడి ఆ దృశ్యాలను కూడా ఉమర్ రికార్డు చేశాడు. వీటిని భద్రపరిచిన పలు కంప్యూటర్లు, ఫోన్లు, 15 ఎక్స్‌టర్నల్ డివైజ్‌లను

మిగతా 2వ పేజీలో...



బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కిషన్‌రెడ్డి, లక్ష్మణ్, ఈటల

ఇద్దరూ ఇద్దరే..

కేసీఆర్‌కు రేవంత్‌కు తేడా లేదు!

ఆయనతో బంగారు తెలంగాణ రాలే..

ఈయనతో ప్రజాపాలనా రాలే!

బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒకేతాను ముక్కలు

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం

కేసీఆర్ సూచనతోనే సింఘ్వీ ఎంపిక!

కవిత బెయిల్‌కు వాదించిన సింఘ్వీ

అందుకే 'రాజ్యసభ'కు కారు దూరం

కేంద్ర మంత్రి బండి సంజయ్

హైదరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పదేళ్ల కేసీఆర్ పాలనకు, ఇప్పుడు సీఎం రేవంత్ పాలనకు తేడా లేదని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. రేవంత్‌రెడ్డి నియంతృత్వ పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. ఆరు గ్యారెంటీలకు కాంగ్రెస్ తూట్లు పొడిచిందని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ పోయి, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినా పరిస్థితులు మారలేదు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబం

మిగతా 13వ పేజీలో...

రహస్య కెమెరాలతో మహిళలు, పిల్లల
నగ్న వీడియోలు



(మొదటి పేజీ తరువాయి)

పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై స్థానిక పోలీసు అధికారి మైక్ బుచర్డ్ మాట్లాడుతూ, 'అనేక మంది బాధితులున్నట్లు తెలుస్తోంది. ఆ దృశ్యాలు కలవరపరిచే విధంగా ఉన్నాయి. దర్యాప్తును ఇప్పుడే ప్రారంభించాం. పూర్తి చేయటానికి కొన్ని నెలలు పట్టవచ్చు' అని తెలిపారు. కేవలం ఒక్క హార్డ్‌డ్రైవ్‌లోనే 13 వేల వీడియోలు ఉన్నాయన్నారు. ఇటువంటి అనేక వీడియోలను ఉమర్ క్లౌడ్‌స్టోరేజీలో కూడా అప్‌లోడ్ చేసి ఉండవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 8వ తేదీన పోలీసులు ఉమర్‌ను అరెస్టు చేశారు. అనంతరం కోర్టు ఆదేశాల మేరకు 20 లక్షల డాలర్ల బాండుతో ఆక్లాండ్ కంట్రీ జైలుకు తరలించారు. 2011లో వర్కింగ్ వీసా మీద అమెరికాకు వెళ్లిన ఉమర్.. పలు ఆస్పత్రుల్లో వైద్యుడిగా పని చేశాడు. ఓ స్విమ్మింగ్‌పూల్ క్లబ్‌కూ కన్సల్టెంట్ డాక్టర్‌గా ఉన్నాడు. ఆయా ఆస్పత్రుల్లో, స్విమ్మింగ్‌పూల్ ఆవరణలోని గదుల్లో రహస్య కెమెరాలు పెట్టి నగ్న చిత్రాలు, వీడియోలు తీశాడు.

ఇంటి నుంచి ఆఫీసుకి రోజూ
1,600 కి.మీల ప్రయాణం

ప్రైవేటు జెట్‌లో చక్కర్లు కొట్టనున్న స్టార్‌బక్స్ కొత్త సీఈవో

కాలిఫోర్నియా, ఆగస్టు 21: ప్రముఖ కాఫీ బ్రాండ్ స్టార్‌బక్స్ నూతన సీఈవో బ్రియాన్ నికోల్ ఇంటి నుంచి ఆఫీసుకి ప్రతి రోజు 1600 కిలోమీటర్లు ప్రయాణించనున్నారు. నికోల్ నివాసం అమెరికాలోని కాలిఫోర్నియాలో ఉండగా స్టార్‌బక్స్ ప్రధాన కార్యాలయం సియాటెల్‌లో ఉంది. స్టార్‌బక్స్‌కు చెందిన ప్రైవేట్ జెట్‌లో ఆయన రోజూ ఇంటి నుంచి ఆఫీసుకు చేరుకోనున్నారు. బ్రియాన్ నికోల్‌ను సీఈవోగా నియమిస్తూ స్టార్‌బక్స్ జారీ చేసిన ఆఫర్ లెటర్‌లో ఈ వివరాలు ఉన్నాయి. స్టార్‌బక్స్ హైబ్రిడ్ వర్క్ నిబంధనల ప్రకారం వారంలో కనీసం 3రోజులు ఆయన సంస్థ ప్రధాన కార్యాలయానికి రావాల్సి ఉంటుంది. మిగిలిన రోజులు ఇంటి నుంచి పని చేయవచ్చు. ఇంతకీ బ్రియాన్ నికోల్ జీతం ఎంతో తెలుసా.. ఏడాదికి సుమారు రూ.13.50 కోట్లు. ప్రస్తుతం చిపోటెల్ అనే ఫాస్ట్‌ఫుడ్ వ్యాపార సంస్థ సీఈవోగా పని చేస్తున్న బ్రియాన్ నికోల్ సెప్టెంబరు 9న స్టార్‌బక్స్ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. నికోల్ హయాంలో చిపోటెల్ గతంలో ఆ సంస్థ ఎన్నడూ చూడనంతగా లాభాల బాట పట్టింది.

రెండు కత్తెర్లు కనిపించక..
జపాన్‌లో 36 విమానాల రద్దు

టోక్యో, ఆగస్టు 21: వాతావరణం అనుకూలించక విమానాలు రద్దు కావడమో.. ఆలస్యమవడమో సాధారణమే. కానీ, ఇలాంటి సమస్య లేకుండానే జపాన్‌లోని న్యూ చిటోస్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి 36 విమానాలు రద్దయ్యాయి. 201 విమానాలు గంటల తరబడి ఆలస్యమయ్యాయి. దీనికి కారణమేంటో తెలుసా.. విమానాశ్రయంలోని ఒక దుకాణంలో రెండు కత్తెర్లు కనిపించకపోవడమే! ఈ విషయం తెలిసి అధికారులు అప్రమత్తమై.. వాటి కోసం క్షుణ్ణమైన తనిఖీలు మొదలుపెట్టారు. ఈ సమయంలో ఒక్క విమానాన్నీ ఎగరనివ్వలేదు. విమానాశ్రయం నుంచి బయటకు వెళుతున్న ప్రయాణికులను మరోసారి తనిఖీ చేశారు. మాయమైన కత్తెర్ల కోసం శోధనలో గంటలు గడిచిపోయాయి. ఎట్టకేలకు విమానాలు రాకపోకలు మళ్లీ మొదలయ్యాయి. ఎవరైనా ఉగ్రవాది ఆ కత్తెరను దొంగలించి.. దాన్ని ఆయుధంగా చేసుకునే ప్రమాదం ఉందనే భయంతోనే విస్తృతంగా తనిఖీలు చేశామన్నారు అధికారులు! ఈ ఘటన ఈ నెల 17న జరగ్గా.. అదే రోజు ఆ కత్తెర్లు దొరికాయి. వాటిని ఎవరూ కొట్టేయలేదు.. ఆ దుకాణంలోనే ఓ మూల కనిపించాయి. కానీ.. అధికారులు కత్తెర్లు దొరికిన విషయాన్ని తర్వాత రోజు బయటపెట్టారు. ఎందుకంటే ఇవీ.. పోయాయనుకున్న కత్తెర్లు ఒకటేనా కాదా అని నిర్ధారించుకోవడానికట!

కర్ణాటక గవర్నర్‌కు
బుల్లెట్ ప్రూఫ్ కారు

అధికారిక కార్యక్రమాలకు తాత్కాలికంగా దూరం

బెంగళూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్.. తన అధికారిక పర్యటనల కోసం బుల్లెట్ ప్రూఫ్ కారును తెప్పించుకున్నారు. ముడా ఇంటి స్థలాల వివాదంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రాసిక్యూషన్‌కు అనుమతులు ఇచ్చిన గవర్నర్‌కు వ్యతిరేకంగా రాష్ట్రమంతా అధికార కాంగ్రెస్ పార్టీ నిరసనలు చేపట్టింది. మంత్రులు, సీనియర్ నేతలు, శాసనసభ్యులు గవర్నర్‌కు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా పరిస్థితి గవర్నర్‌కు పడుతుందని సీనియర్ ఎమ్మెల్సీ ఐవాన్ డిసౌజా వ్యాఖ్యానించారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో గవర్నర్ అప్రమత్తమయ్యారు. ఇంటెలిజెన్స్ సూచనల మేరకు సాధారణ కారుకు బదులుగా బుల్లెట్ ప్రూఫ్ కారు వాడాలని నిర్ణయించుకున్నారు. బెంగళూరు విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో ఆయన బుధవారం పాల్గొనాల్సి ఉన్నప్పటికీ హాజరు కాలేదు. బహిరంగ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. కర్ణాటక గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన సమయంలో ఆయన బుల్లెట్ ప్రూఫ్ కారును తిరస్కరించారు. తాజా పరిణామాలతో తన నిర్ణయాన్ని మార్చుకున్నారు.

వ్యక్తిగత సమాచారం కోరుతూ వచ్చే..
మోసపూరిత కాల్స్ వలలో పడవద్దు

న్యూఢిల్లీ, ఆగస్టు 21: మోసపూరిత కాల్స్ వలలో పడవద్దని టెలికాం సంస్థల రెగ్యులేటర్(ట్రాయ్) వినియోగదారులను హెచ్చరించింది. వ్యక్తిగత సమాచారం ఇవ్వకపోతే మొబైల్ నంబరు డిస్‌కనెక్ట్ అవుతుందని బెదిరిస్తూ ట్రాయ్ పేరుతో వచ్చే ఇటువంటి కాల్స్‌కి మోసపోవద్దని కోరింది. మొబైల్ నంబరు డిస్‌కనెక్ట్ చేస్తామని మెసేజ్‌లుగాని, ఇతర విధానాల్లోగాని లేదా మూడో పార్టీ ఏజెన్సీ ద్వారాగాని తాము సమాచారం పంపమని ట్రాయ్ స్పష్టం చేసింది. ఇలా మొబైల్ నంబరు డిస్‌కనెక్ట్ అవుతుందని ట్రాయ్ పేరిట వచ్చే ఎటువంటి సందేశమైనా లేదా కాల్ అయినా కచ్చితంగా మోసం చేయడానికి చేసే ప్రయత్నమేనని, వాటికి స్పందించవద్దని కోరింది. ట్రాయ్ పేరిట వ్యక్తిగత సమాచారం కోరుతూ తమకు ముందుగా రికార్డు చేసిన కాల్స్ వస్తున్నాయని పలువురు ఫిర్యాదు చేసినట్లు టెలికాం సంస్థల రెగ్యులేటర్ వెల్లడించింది.

యుద్ధ విమానం నుంచి జారిపడిన 'ఎయిర్ స్టోర్'

పోఖ్రాన్, ఆగస్టు 21: భారత వైమానిక దళానికి చెందిన ఓ యుద్ధ విమానం(ఫైటర్ జెట్) నుంచి అనుకోకుండా జారిపడిన 'ఎయిర్ స్టోర్' తీవ్ర కలకలం రేపింది. రాజస్థాన్‌లోని థార్ ఎడారి సమీపంలో ఉన్న పోఖ్రాన్ ఫైరింగ్ రేంజ్‌లో ఫైటర్ జెట్ నుంచి బుధవారం 'ఎయిర్ స్టోర్' అకస్మాత్తుగా జారిపడింది. దీంతో ఒక్కసారిగా వెలువడిన అతి భారీ శబ్దాలు కిలో మీటరు దూరంలోని గ్రామస్థులను భీతిల్లేలా చేశాయి. వారంతా రామ్‌దేవ్రా పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. 'ఎయిర్ స్టోర్' జారిపడిన ఘటనపై వైమానిక దళం వెంటనే స్పందించింది. ఈ ఘటన సాంకేతిక లోపంతో అనుకోకుండా జరిగిందని, ఎవరికీ ఎలాంటి ముప్పు వాటిల్లలేదని ఎక్స్‌లో వివరణ ఇచ్చింది. దీనిపై 'కోర్ట్ ఆఫ్ ఎంక్వయిరీ'కి ఆదేశించినట్టు తెలిపింది. యుద్ధ విమానాల కింది భాగం(అండర్ బెల్లీ)లోని హార్డ్ పాయింట్లకు ఏర్పాటు చేసిన పరికరాలు, ఆయుధాలనే ఎయిర్‌స్టోర్ అంటారు. ఒక రకంగా స్టోర్ రూమ్ లాంటిది. యుద్ధ సమయాల్లో ఎయిర్ స్టోర్లలోని ఆయుధాలను సంబంధిత లక్ష్యాలపై జార విడుస్తారు.

కాక్రాపర్‌లో రెండో అణు విద్యుత్ రియాక్టర్ ప్రారంభం

న్యూఢిల్లీ, ఆగస్టు 21: గుజరాత్‌లోని కాక్రాపర్ అణు విద్యుత్ కేంద్రం (కేఏపీఎస్)లో దేశీయంగా నిర్మించిన 700 మెగావాట్ల రెండో అణు విద్యుత్ రియాక్టర్ బుధవారం నుంచి పూర్తిస్థాయి సామర్థ్యంతో అందుబాటులోకి వచ్చింది. కేఏపీఎస్‌లోని యూనిట్-4 ఇప్పటివరకు తొంభై శాతం సామర్థ్యంతో పనిచేసిందని, తాజాగా వంద శాతం సామర్థ్యంతో ఇది అందుబాటులోకి వచ్చిందని న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పీసీఐఎల్) తెలిపింది. కాగా, ఎన్‌పీసీఐఎల్ ప్రస్తుతం 8,180 మెగావాట్ల సామర్థ్యంతో 24 రియాక్టర్లను నిర్వహిస్తోంది. 6,800 మెగావాట్ల సామర్థ్యమున్న 8 యూనిట్లు నిర్మాణ దశలో ఉన్నాయి.

10, 12వ తరగతుల్లో 65 లక్షల మంది ఫెయిల్

» రాష్ట్ర బోర్డుల్లోనే ఫెయిల్యూర్ రేటు అధికం: కేంద్రం

న్యూఢిల్లీ, ఆగస్టు 21: గతేడాది దేశవ్యాప్తంగా 10, 12వ తరగతి బోర్డు పరీక్షల్లో 65లక్షల మందికి పైగా విద్యార్థులు ఉత్తీర్ణత సాధించలేకపోయారు. కేంద్ర బోర్డుతో పోలిస్తే రాష్ట్ర బోర్డుల్లో ఫెయిల్యూర్ రేటు ఎక్కువగా ఉందని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు. 56 రాష్ట్ర బోర్డులు, మూడు జాతీయ బోర్డులతో కలిపి మొత్తం 59 బోర్డుల ఫలితాలను విశ్లేషించగా.. 'పదో తరగతి విద్యార్థుల్లో 28లక్షల మంది ఫెయిలయ్యారు. మరో 5.5 లక్షల మంది అసలు పరీక్షలకు హాజరు కాలేదు. మొత్తంగా 33.5 లక్షల మంది తర్వాత గ్రేడ్‌కు చేరలేదు' అని శాఖ అధికారి ఒకరు వివరించారు. అదేవిధంగా 12వ తరగతి విద్యార్థులు 32.4 లక్షల మంది ఉత్తీర్ణులు కాలేదు. వీరిలో 27.2లక్షల మంది ఫెయిల్ కాగా, మరో 5.2లక్షల మంది పరీక్షలకు హాజరు కాలేదు. పదో తరగతిలో విద్యార్థుల ఫెయిల్యూర్ రేటు కేంద్ర బోర్డులో 6% ఉండగా, రాష్ట్ర బోర్డుల్లో 16 శాతంగా ఉంది. అలాగే 12వ తరగతిలో కేంద్ర బోర్డులో విద్యార్థుల ఫెయిల్యూర్ రేటు 12% కాగా, రాష్ట్ర బోర్డుల్లో 18శాతంగా నమోదైంది.

భారత్ బంద్ పాక్షికం..బిహార్‌లో బడి బస్సుకు నిప్పు

న్యూఢిల్లీ, ఆగస్టు 21: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకు నిరసనగా దేశవ్యాప్తంగా బుధవారం బంద్ జరిగింది. ది రిజర్వేషన్ బచావో సంఘర్ష్ సమితి, ఇతర ఆదివాసీ సంఘాల పిలుపు మేరకు నిరసనకారులు బంద్‌లో పాల్గొన్నారు. పలు చోట్ల ఆందోళనకారులు రాస్తారోకో నిర్వహించారు. వాహనరాకపోకలను, పలు రైళ్లను అడ్డుకున్నారు. అయితే బంద్ ప్రభావం దేశంలో పెద్దగా కనిపించలేదు. బిహార్ రాజధాని పాట్నాలో లోక్‌సభ ఎంపీ పప్పు యాదవ్ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించారు. ఈ క్రమంలో నిరసనకారులపై పోలీసులు లాఠీచార్జి చేశారు. బంద్‌కు ఆర్జేడీ, ఇండియా కూటమి సంపూర్ణ మద్దతు తెలిపాయి. గోపాల్‌గంజ్‌లో 35 మంది పిల్లలతో వెళ్తున్న బస్సుకు కొందరు నిరసనకారులు నిప్పుపెట్టారు. అప్రమత్తమైన పోలీసులు మంటలను ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పింది. అటు రాజస్థాన్‌లో బంద్ దృష్ట్యా ఇంటర్నెట్ సేవలను ప్రభుత్వం నిలిపివేసింది. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలకు సెలవు ప్రకటించింది. ఢిల్లీలో బంద్ ప్రభావం పెద్దగా కనిపించలేదు.

వీసా లేకుండా శ్రీలంకకు.. 35 దేశాలకు అనుమతి

కొలంబో, ఆగస్టు 21: భారత్, బ్రిటన్, అమెరికా సహా 35 దేశాల పౌరులు వీసా లేకుండా తమ ద్వీప దేశానికి రావొచ్చని శ్రీలంక ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. ఈ ఏడాది అక్టోబరు 1వ తేదీ నుంచి ఇది అమల్లోకి వచ్చి ఆరు నెలల పాటు ఉంటుందని, ఈ మేరకు క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు మీడియా కథనాలు వెలువడ్డాయి. ఈ దేశాల జాబితాలో జర్మనీ, నెదర్లాండ్స్, బెల్జియం, స్పెయిన్, ఆస్ట్రేలియా, డెన్మార్క్, పోలాండ్, సౌదీ అరేబియా, యూఏఈ, నేపాల్, ఇండోనేషియా, రష్యా, థాయ్‌లాండ్ తదితర దేశాలున్నాయి. ఇంతకుముందు శ్రీలంకలో ఆన్ అరైవల్ వీసాలకు ఫీజులు పెరగడంతో వివాదం నెలకొంది.

శాంతి సందేశంతో యుద్ధభూమికి!

(మొదటి పేజీ తరువాయి)

విషయంలో భారత్ ఎటూ మొగ్గు చూపకుండా వ్యవహరించడమే ఈ ఆసక్తికి కారణం!! ఆ కారణంతోనే అమెరికా, యూకే, యూరప్ దేశాలు.. యుద్ధాన్ని ఆపేలా పుతిన్‌ను ఒప్పించాలని ప్రధాని మోదీని ఇన్నాళ్లుగా కోరుతున్నాయి. రెండు దేశాలనూ శాంతిచర్చలకు తేవాలని అప్పీలు చేస్తున్నాయి. "ఇది యుద్ధాల శకం కాదు" అని గతంలో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను.. ఎలాంటి సమస్యనైనా చర్చలు, దౌత్యం ద్వారానే పరిష్కరించుకోవాలన్న ఇండియా వైఖరిని.. అమెరికా విదేశాంగ శాఖ అధికారి ఒకరు ఇటీవలే గుర్తుచేశారు. పుతిన్‌తో తనకున్న ప్రత్యేక భాగస్వామ్యాన్ని ఉపయోగించి యుద్ధ విరమణకు ఒత్తిడి తేవాలని మోదీని ఆమె కోరారు. అయినా భారత్ ఆయా దేశాల విజ్ఞప్తులను పెద్దగా పట్టించుకోలేదు. పైగా.. వ్యూహాత్మకంగా రష్యా నుంచి చౌకగా చమురు దిగుమతి చేసుకుంటోంది. ఆ దేశం నుంచి ఆయుధాలను కొనుగోలు చేస్తూనే ఉంది. అదే సమయంలో మానవతా సాయం కింద.. అత్యవసర ఔషధాలు, జనరేటర్లు వంటివాటిని ఉక్రెయిన్‌కు ఈ రెండేన్నరేళ్లుగా పంపిస్తూ తటస్థంగా వ్యవహరిస్తోంది. అయితే, ఉక్రెయిన్‌కు సాయం సంగతి ఎలా ఉన్నా.. రష్యా నుంచి చమురు, ఆయుధాల కొనుగోలుపై యూరప్ దేశాలు మొదట్నుంచీ కినుకగానే ఉన్నాయి. అంతర్జాతీయ ఆంక్షలను సైతం పట్టించుకోకుండా వాటిని కొనుగోలు చేయడం ద్వారా పుతిన్ యుద్ధకాంక్షకు భారత్ ఆజ్యం పోస్తోందని విమర్శిస్తున్నాయి. ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలో.. మోదీ ఉక్రెయిన్ పర్యటన అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. అంతేకాదు.. యుద్ధం మొదలయ్యాక రెండు దేశాల్లోనూ (రష్యా, ఉక్రెయిన్) పర్యటించిన పెద్ద దేశాధినేత ఇప్పటిదాకా ఎవరూ లేరు. ఆ ఘనత కూడా మోదీకి దక్కనుంది. ఇంతటి కీలకమైన పర్యటనలో మోదీ.. ఇరు దేశాలనూ శాంతి చర్చల టేబుల్ వద్దకు తీసుకురాగలరా? లేక.. ఉక్రెయిన్‌కు సాయంతోనే సరిపెడతారా? లేక రష్యాతో మాట్లాడి యుద్ధాన్ని ఆపడానికి ప్రయత్నిస్తానని జెలెన్‌స్కీకి చెబుతారా? అంటే.. వేచి చూడాల్సి ఉందని రాజకీయ నిపుణులు అంటున్నారు. ఉక్రెయిన్ మాత్రం.. మోదీ పర్యటనపై అత్యంత ఆశావహంగా ఉంది. యుద్ధంతో దెబ్బతిన్న తమ ఆర్థికవ్యవస్థను పునర్నిర్మించుకోవడంలో భారత్ సాయాన్ని ఆశిస్తోంది. ఈ క్రమంలోనే.. నెలరోజుల కిత్రం జెలెన్ స్కీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ అండ్రేయ్ యెర్మాక్ మన జాతీయ భద్రత సలహాదారు అజిత్ దోభాల్‌కు ఫోన్ చేసి ఉక్రెయిన్ శాంతి సాధనలో మోదీ కీలకపాత్ర పోషిస్తారన్న ఆశాభావాన్ని వెలిబుచ్చారు.



వార్సాలో మోదీకి చిన్నారుల స్వాగతం

కీలక దశ..

ఉక్రెయిన్ నుంచి రష్యా సైన్యాన్ని పుతిన్ ఉపసంహరించుకుంటేనే.. ఆయనతో చర్చలు సాధ్యమని జెలెన్‌స్కీ ఇన్నాళ్లూ పట్టుపట్టి కూర్చున్నారు. కానీ, రెండున్నరేళ్లుగా ఉక్రెయిన్‌కు జర్మనీ, బ్రిటన్, ఫ్రాన్స్ తదితర దేశాలు చేస్తున్న సాయం క్రమంగా తగ్గుతోంది. మరోవైపు అమెరికా 'అధ్యక్ష' ఎన్నికల హడావుడిలో ఉంది. దీంతో ఇటీవలే జెలెన్‌స్కీ ఒకింత తగ్గి.. ఎలాంటి షరతులూ పెట్టకుండా తాను చర్చలకు సిద్ధమనే సంకేతాలు ఇచ్చారు. అదే సమయంలో.. ఇన్నాళ్లుగా తమ భూభాగంలో మాత్రమే జరుగుతున్న యుద్ధాన్ని రష్యా భూభాగంలోకి తీసుకెళ్లారు. అక్కడికి తన సేనలను పంపి కర్స్క్ ప్రాంతంలో 90 శాతం భూభాగాన్ని ఆక్రమించుకున్నారు. శాంతికి సిద్ధమంటూనే, 'దాడులకు భయపడం.. ప్రతిదాడులకు సిద్ధం' అనే విషయాన్ని పుతిన్‌కు అర్థమయ్యేలా చెప్పడం జెలెన్‌స్కీ లక్ష్యం. అంతే కాదు.. శాంతి చర్చలంటూ జరిగితే 'మీరు ఆక్రమించుకున్న మా భూభాగాలను మాకిస్తే.. మీ భూభాగాలను మీకిస్తాం'అని బేరం పెట్టొచ్చని ఆయన భావిస్తున్నారు. ఇలాంటి కీలకమైన సమయంలో మోదీ ఉక్రెయిన్ పర్యటనకు వెళ్లడం గమనార్హం.

ఉక్రెయిన్‌లో మోదీ ప్రయాణించే
లగ్జరీ రైలు విశేషాలివే..

న్యూఢిల్లీ, ఆగస్టు 21: ఉక్రెయిన్ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ 'ట్రైన్‌ఫోర్స్ వన్' అనే విలాసవంతమైన రైలులో ప్రయాణించనున్నారు. రష్యాతో యుద్ధం కారణంగా ఉక్రెయిన్‌లో విమానాశ్రయాలకు భద్రత లేకుండా పోయింది. రోడ్డు మార్గాలు దెబ్బతిన్నాయి. దీంతో ఆయన రైల్లో కీవ్‌కు వెళ్తున్నారు. పోలండ్ నుంచి 10 గంటల పాటు ట్రైన్ ఫోర్స్ వన్ రైల్లో ప్రయాణించి ఆయన కీవ్‌కు చేరుకుంటారు. ఈ రైలు ఎంతో ప్రత్యేకమైంది. ఇందులో విలాసవంతమైన సౌకర్యాలతో పాటు అధునాతన భద్రత ఏర్పాట్లు ఉంటాయి. ఎప్పటికప్పుడు బయటి పరిస్థితిని అంచనా వేసేందుకు ప్రత్యేక భద్రతా సిబ్బంది కూడా ఉంటారు. అయితే యుద్ధం జరుగుతున్న ప్రాంతాల మీదుగా ఈ రైలును నడపడం అంత తేలికేమి కాదు. అందుకే పకడ్బందీ ఏర్పాట్ల మధ్య దీన్ని కొనసాగిస్తున్నారు. ఇప్పటివరకు అమెరికా అధ్యక్షుడు జోబైడెన్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రాన్, జర్మనీ చాన్స్‌లర్ ఒలాఫ్ స్కోల్జ్ వంటి ప్రపంచ నేతలు ఇందులోనే ప్రయాణించారు.

పోలండ్ చేరుకున్న ప్రధాని

కీవ్, ఆగస్టు 21: ఉక్రెయిన్ సంక్షోభానికి శాంతియుత పరిష్కారం కనుగొనే అంశంపై ఆ దేశ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీతో విస్తృత చర్చలు జరపనున్నట్లు ప్రధాని మోదీ చెప్పారు. ఉక్రెయిన్ భారత్‌కు మిత్ర దేశమని బుధవారం ఆయన పోలండ్, ఉక్రెయిన్ పర్యటనకు బయల్దేరేముందు ఓ ప్రకటనలో తెలిపారు. ఉక్రెయిన్‌లో వీలైనంత త్వరగా శాంతి స్థాపన జరగాలని కోరుకుంటున్నామన్నారు. పోలండ్, ఉక్రెయిన్ దేశాలతో భారత్ బంధాలు మరింత బలోపేతమవుతాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. రెండో రోజుల పర్యటనలో భాగంగా బుధవారం ప్రధాని పోలండ్ చేరుకున్నారు. భారత్, పోలండ్‌ల మధ్య దౌత్యసంబంధాలకు 70 ఏళ్లు పూర్తైన సందర్భంగా మోదీ పోలండ్ పర్యటనకు వెళ్లిన సంగతి తెలిసిందే. 45 ఏళ్ల తర్వాత భారత ప్రధాని పోలండ్ పర్యటనకు వెళ్లడం ఇదే తొలిసారి. కాగా, వార్సాలో ఆయనకు ప్రవాస భారతీయులు ఘన స్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా మోదీ పోలండ్ అధ్యక్షుడు ఆండ్రెజ్ సెబాస్టియన్ డ్యూడా, ప్రధాని డొనాల్డ్ టస్క్‌తో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. తర్వాత ఆయన ఈ నెల 23న రైల్ ఫోర్స్ వన్ రైలులో ఉక్రెయిన్ రాజధాని కీవ్‌కు చేరుకుంటారు.

బద్లాపూర్‌లో ఇంటర్నెట్ నిలిపివేత

ముంబై, ఆగస్టు 21: పాఠశాల టాయిలెట్‌లో మూడు, నాలుగేళ్ల ఇద్దరు చిన్నారులపై ఒక స్వీపర్ లైంగిక దాడికి పాల్పడిన నేపథ్యంలో మంగళవారం అట్టుడికిన బద్లాపూర్‌లో బుధవారం సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. భారీ సంఖ్యలో అక్కడకు చేరుకున్న పోలీసులు పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ముందు జాగ్రత్త చర్యగా అక్కడ ఇంటర్నెట్‌ను నిలిపేశారు. ఆందోళనలకు కారకులైన 72 మందిని అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని ఓ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. పరిస్థితి మరింత అదుపులోకి వచ్చాక ఇంటర్నెట్‌ను పునరుద్ధరిస్తామని చెప్పారు. ఆందోళనల కారణంగా 17 మంది పోలీసులు, 8 మంది రైల్వే పోలీసులు గాయపడ్డారని ఆయన తెలిపారు.

మహిళలపై నేరాల్లో 151 మంది ప్రజాప్రతినిధులు!

న్యూఢిల్లీ, ఆగస్టు 21: మహిళలపై నేరాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రజాప్రతినిధులు దేశవ్యాప్తంగా 151 మంది ఉన్నారు. వీరిలో 16 మంది ఎంపీలు కాగా.. 135 మంది ఎమ్మెల్యేలు. బెంగాల్లో అత్యధికంగా 25 మంది సిటింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలపై ఈ కేసులు ఉన్నట్లు ప్రజాస్వామిక సంస్కరణల సంఘం (ఏడీఆర్) తన తాజా నివేదికలో వెల్లడించింది. ఏపీలో 21 మంది, ఒడిసాలో 17 మంది ప్రజాప్రతినిధులపై ఈ కేసులు నమోదయ్యాయి. 2019-24 మధ్య ఎన్నికల కమిషన్(ఈసీ)కి 4,809 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు సమర్పించిన అఫిడవిట్లు సమర్పించగా.. వాటిలో 4,693 అఫిడవిట్లను ఏడీఆర్ పరిశీలించింది. ఐపీసీ 376 కింద అత్యాచార కేసులు ఎదుర్కొంటున్న ప్రజాప్రతినిధులు 16 మంది (వీరిలో ఇద్దరు ఎంపీలు, 14 మంది ఎమ్మెల్యేలు) ఉన్నారు. వీరికి కనీసం పదేళ్లు.. గరిష్ఠంగా యావజ్జీవ కారాగార శిక్ష విధించేందుకు అవకాశం ఉంది.

కేంద్ర బలగాల అధీనంలోకి ఆర్జీ కర్!

వైద్య కళాశాల వద్దకు సీఐఎస్ఎఫ్ బృందం.. సీబీఐ అధికారుల ఎదుటకు ఆరోసారి మాజీ ప్రిన్సిపాల్

» ఆస్పత్రిలో విధ్వంసం ఘటనలో ముగ్గురు ఉన్నతాధికారులపై మమత సర్కారు వేటు

కోల్‌కతా, ఆగస్టు 21: కోల్‌కతాలోని ఆర్జీకర్ వైద్య కళాశాల, ఆస్పత్రిని కేంద్రబలగాలు తమ అధీనంలోకి తీసుకోనున్నాయి. విమానాశ్రయాలు, పార్లమెంటు వద్ద భద్రతను పర్యవేక్షించే సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్) బలగాల బృందం బుధవారం ఉదయం ఆస్పత్రిని సందర్శించింది. అక్కడ భద్రతా ఏర్పాట్లను పరిశీలించింది. అనంతరం ఆస్పత్రి అధికారులు, పోలీసులతో సీఐఎస్ఎఫ్‌కు చెందిన సీనియర్ అధికారి ప్రతాప్‌సింగ్ మాట్లాడారు. ఆయన్ను మీడియా ప్రశ్నించగా.. 'మాకు అప్పగించిన పని కోసం మేం ఇక్కడికి వచ్చాం. మమ్మల్ని మా పని చేసుకోనివ్వండి. ఆ తర్వాత దీనిపై మీతో ఉన్నతాధికారులు మాట్లాడతారు' అని చెప్పారు. హత్యాచార కేసును సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు.. ఆగస్టు 14 అర్ధరాత్రి తర్వాత ఆర్జీకర్ ఆస్పత్రిలో దుండగులు చొచ్చుకెళ్లి పెను విధ్వంసం సృష్టిస్తే కోల్‌కతా పోలీసులు ఏం చేస్తున్నట్లు? అని నిలదీసిన నేపథ్యంలో ఆస్పత్రి భద్రత ఏర్పాట్లను కేంద్రబలగాలు పరిశీలించడం గమనార్హం. ఇక ఆస్పత్రిలో గూండాల విధ్వంసంపై సుప్రీంకోర్టు నిలదీయడంతో బెంగాల్ సర్కారు వెంటనే చర్యలకు దిగింది. ఆస్పత్రిలో విధ్వంస ఘటనకు సంబంధించి ఇద్దరు ఏసీపీలు సహా ముగ్గురు ఉన్నతాధికారులను సస్పెండ్ చేసింది. ఆర్జీకర్ వైద్యకళాశాలకు చెందిన వివాదాస్పద మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ బుధవారం మరోసారి సీబీఐ కార్యాలాయానికి వెళ్లారు. హత్యాచార ఘటనకు సంబంధించి సీబీఐ ఆయన్ను విచారించడం ఇది ఆరోసారి. ఐదుసార్లు విచారణలో భాగంగా ఆయన్ను సీబీఐ అధికారులు 64 గంటలపాటు ప్రశ్నించారు.



ఆర్జీ కర్ ఆవరణలో సీఐఎస్ఎఫ్ బృందం

ఆస్పత్రుల్లో వైద్యులకు భద్రత కల్పించాలనే డిమాండ్‌తో వరుసగా పదోరోజూ ఢిల్లీలోని రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (ఆర్డీయే) ఆందోళనలు నిర్వహించింది. కాగా, సందీప్ ఘోష్‌కు సీబీఐ పాలీగ్రాఫ్ పరీక్ష నిర్వహించనుంది. ట్రైనీ డాక్టర్ హత్యాచారం వ్యవహారంలో ఆయనపై పలు ఆరోపణలు ఉన్నాయి. గత కొన్ని రోజులుగా ఆయనను సీబీఐ దర్యాప్తు చేస్తోంది.

గిరిజన మహిళపై గ్యాంగ్ రేప్

రాయ్‌గఢ్, ఆగస్టు 21: రక్షాబంధన్ రోజున గ్రామంలో నిర్వహించిన జాతర చూసి ఇంటికి వెళ్తున్న ఓ గిరిజన మహిళలపై సామూహిక అత్యాచారం జరిగింది. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌గఢ్‌లో జరిగింది. సోమవారం 27 ఏళ్ల గిరిజన మహిళ తన గ్రామంలో నిర్వహించిన జాతరకు ఓ వ్యక్తితో కలిసి వెళ్లింది. తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో ఆ వ్యక్తితో పాటు అతని స్నేహితులు మొత్తం 8మంది తనపై గ్యాంగ్ రేప్ చేశారని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. నిందితులకు కఠిన శిక్ష పడేలా చూడాలని సీఎం బఘేల్ పోలీసులను ఆదేశించారు.

అనాథ శవాలను అమ్మేశాడు



సందీప్ ఘోష్

కోల్‌కతా, న్యూఢిల్లీ, ఆగస్టు 21: ట్రైనీ డాక్టర్‌పై హత్యాచార ఘటన వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్‌కు సంబంధించి సంచలన విషయాలు బయటకు వస్తున్నాయి. ఆయన శవాలను సైతం వదలకుండా అమ్ముకుని సొమ్ము చేసుకునే వారని ఆర్జీ కర్ కళాశాల మాజీ డిప్యూటీ సూపరింటెండెంట్ అఖ్తర్ అలీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఘోష్ అనాథ శవాలను అమ్మడంతో పాటు బయోమెడికల్ వ్యర్థాలను అక్రమంగా బంగ్లాదేశ్‌కు రవాణా చేసేవాడని ఆయన ఓ జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఆస్పత్రి, కళాశాలకు సంబంధించిన ఏ పని చేయడానికైనా డబ్బులు వసూలు చేసేవారన్నారు. పరీక్షల్లో పాస్ చేసేందుకు విద్యార్థుల నుంచి డబ్బులు తీసుకొనేవారని చెప్పారు. కాలేజీ ఆస్తులను అనుమతులు లేకుండా లీజ్‌కు ఇచ్చారని పేర్కొన్నారు. ఘోష్ అక్రమాల మీద రాష్ట్ర విజిలెన్స్ కమిషన్‌ను అప్పట్లో తాను అప్రమత్తం చేశానని, ఆయనపై వేసిన విచారణ కమిటీలో సభ్యుడిగా ఉన్నానని, దర్యాప్తులో ఆయన తప్పు చేసినట్లు తేలినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. ఘోష్ అక్రమాలపై తాను నివేదిక ఇస్తే అదే రోజు తనను ఆ కాలేజీ నుంచి ట్రాన్స్‌ఫర్ చేశారని అలీ ఆవేదన వ్యక్తం చేశారు.

చంద్రయాన్-3కి రేపటితో ఏడాది

» 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం

» ఘనంగా నిర్వహణకు భారత్ ఏర్పాట్లు



న్యూఢిల్లీ, ఆగస్టు 21: ఇస్రో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన చంద్రయాన్-3 చంద్రుని దక్షిణ ధ్రువంపై విజయవంతంగా కాలుపెట్టి ఈ నెల 23వ తేదీకి ఏడాది పూర్తవుతుంది. ఈ విజయంతో చంద్రుడి దక్షిణ ధ్రువంపై సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన తొలి దేశంగా భారత్ చరిత్ర సృష్టించింది. ఇంతటి ఘన విజయాన్ని అందించిన ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజనీర్లకు తొలి రాష్ట్రీయ విజ్ఞాన్ పురస్కారం కూడా లభించింది. గతేడాది ఆగస్టు 23న చంద్రుడిపై విక్రమ్ ల్యాండర్ విజయవంతంగా కాలుమోపిన సందర్భంగా ఈ ఏడాది అదే రోజున తొలిసారిగా జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్టు కేంద్ర ప్రకటించింది. 2019లో ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్-2 చివరి నిమిషంలో చంద్రుడిపై కూలిపోయింది. ఈ వైఫల్యం నుంచి పాఠాలు నేర్చుకున్న ఇస్రో.. మరో నాలుగేళ్లలోనే చంద్రయాన్-3తో అద్భుత విజయాన్ని అందుకొంది. చంద్రయాన్-3లోని విక్రమ్ ల్యాండర్ సురక్షితంగా చంద్రుడిపై కాలుపెట్టింది. అలా ల్యాండర్ దిగిన ప్రాంతానికి ఇస్రో శివ శక్తి పాయింట్‌గా నామకరణం చేసింది. శివ శక్తి పాయింట్ నుంచి శాంపిల్స్‌ను సేకరించి తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తామని, బహుశా చంద్రయాన్-4లో దీనికోసం ప్రయత్నిస్తామని ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ చెప్పారు. అలాగే భారత్, జపాన్ చేపట్టే సంయుక్త మిషన్ ద్వారా చంద్రుడిపైకి ప్రజ్ఞాన్ కంటే పెద్ద రోవర్‌ను దింపేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు వెల్లడించారు. 2040 నాటికి భారత వ్యోమగామిని చంద్రుడిపైకి పంపే లక్ష్యంతో పనిచేస్తున్నామని పేర్కొన్నారు. కాగా, నాసా-ఇస్రో సంయుక్త మిషన్‌లో భాగంగా భారత్‌కు చెందిన వ్యోమగామి వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) వెళ్తారని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. యాక్సియోమ్ స్పేస్ ఏఎక్స్-4 మిషన్ కోసం ఎంపిక చేసిన ఇద్దరు భారత వ్యోమగాములు గ్రూప్ కెప్టెన్లు శుభాన్షు శుక్లా, ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్ అమెరికాలో శిక్షణ పొందుతున్నారు.

సెప్టెంబరు నుంచి జన గణన?

» 2026 మార్చిలో విడుదల చేసేందుకు ఏర్పాట్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 21 : ఆలస్యం అయిన దేశ జనాభా గణన సెప్టెంబరు నెలలో మొదలయ్యే అవకాశం ఉంది. జనాభా గణన ఆలస్యంపై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం విమర్శలు ఎదుర్కొంటోంది. దేశంలో పదేళ్లకోసారి నిర్వహించే ఈ కార్యక్రమం 2021లో పూర్తిచేయాల్సి ఉంది. కాని కోవిడ్ కారణంగా ఆలస్యం అయ్యింది. వచ్చే నెలలో మొదలయ్యే ఈ కార్యక్రమం పూర్తిచేయడానికి 18 నెలలు పడుతుందని ప్రభుత్వ వర్గాల సమాచారం. జనాభా లెక్కలు ఆలస్యం అవడం వల్ల ఆర్థిక అంశాలు, ద్రవ్యోల్బణం, ఉద్యోగాల వంటి వాటి అంచనాపై ప్రభావం పడుతోందని ఆర్థికవేత్తలు వాపోతున్నారు. ప్రస్తుతం వీటి అంచనాకు, ప్రభుత్వ పథకాలవంటి వాటి కోసం 2011 జనాభా లెక్కలపైనే ఆధారపడవలసి వస్తోంది. కాగా 15 ఏళ్ల కాలాన్ని పరిగణనలోకి తీసుకుని నూతన జనాభా లెక్కల వివరాలను 2026 మార్చికి విడుదల చేయాలని జనాభా గణనను పర్యవేక్షించే హోం వ్యవహారాల శాఖ, గణాంక శాఖలు భావిస్తున్నాయి. ఈ కార్యక్రమం ప్రారంభించేందుకు ప్రధాని కార్యాలయం నుంచి అనుమతి కోసం ఎదురుచూస్తున్నాయి. గత ఏడాది విడుదల చేసిన ఐక్య రాజ్య సమితి నివేదిక ప్రకారం ప్రపంచంలో అత్యధిక జనాభా గల దేశంగా భారత్ చైనాను అధిగమించింది.

గాజాపై ఇజ్రాయెల్ దాడులు ఉధృతం

» 50మంది పాలస్తీనియన్ల మృతి, 124 మందికి గాయాలు

» ఇజ్రాయెల్‌పై హెజ్‌బొల్లా రాకెట్ల దాడి

జెరూసలెం, ఆగస్టు 21: గాజాపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. గడచిన 24 గంటల్లో ఇజ్రాయెల్ జరిపిన దాడుల వల్ల కనీసం 50 మంది పాలస్తీనియన్లు మరణించారని, 124 మంది గాయాలపాలయ్యారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అలాగే సెంట్రల్ గాజాలోని డీర్ ఎల్-బాలా నుంచి ప్రజలు తరలిపోవాలని ఇజ్రాయెల్ ఆర్మీ తాజాగా ఆదేశించింది. దీన్ని బట్టి ఆర్మీ భూతల ఆపరేషన్స్‌ను దక్షిణం నుంచి సెంట్రల్ గాజాకు విస్తరించినట్టు సంకేతాలు వెలువడుతున్నాయి. మరోవైపు లెబనాన్ బెకా ప్రాంతంపై ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో హెజ్‌బొల్లా ప్రతిదాడులకు దిగింది. నార్తర్న్ ఇజ్రాయెల్‌లోని మిలిటరీ పోస్టులను లక్ష్యంగా చేసుకుని డ్రోన్ దాడులు చేసినట్టు బుధవారం పేర్కొంది. అయితే ఈ ఘటనను ఇజ్రాయెల్ ఆర్మీ ఇప్పటి వరకు ధ్రువీకరించలేదు. కాగా ఇజ్రాయెల్‌పై హెజ్‌బొల్లా రాకెట్లతోనూ విరుచుకుపడింది. 50కి పైగా రాకెట్లతో గోలన్ హైట్స్‌లోని పలు ప్రైవేటు ఇళ్లపై దాడులు జరిపినట్టు పేర్కొంది. ఈ దాడుల వల్ల ఒక ఇల్లుకు మంటలు అంటుకున్నాయని, గ్యాస్ లీకేజీని ఆపడం ద్వారా పెద్ద ప్రమాదాన్ని నిరోధించగలిగినట్టు అగ్నిమాపక సిబ్బంది పేర్కొన్నారు. మంగళవారం రాత్రి లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడికి ప్రతిస్పందనగా ఈ దాడి చేసినట్టు హెజ్‌బొల్లా పేర్కొంది.

పదేళ్లలో రైతుల గురించి కేటీఆర్ మాట్లాడారా?

- చీప్‌గా మాట్లాడితే సీఎం కూడా అలాగే బదులిస్తారు
- అర్హుడైన ప్రతి రైతుకూ రుణమాఫీ
- ఫిర్యాదుదారుల ఇళ్లకు వెళ్లి సర్వే చేస్తాం: తుమ్మల



ఖమ్మం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'అధికారంలో ఉన్న పదేళ్లలో రైతుల గురించి, వారి సమస్యల గురించి ఏనాడూ మాట్లాడని మాజీ మంత్రి కేటీఆర్ ఇప్పుడు రైతు రుణమాఫీపైనా, సీఎం రేవంత్‌రెడ్డిపైనా చీప్‌గా విమర్శలు చేస్తున్నారు. వాళ్లు చీప్‌గా మాట్లాడడం వల్లనే సీఎం కూడా అదే తీరులో సమాధానం చెప్పాల్సి వస్తోంది' అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రుణమాఫీపై అబద్ధాలు చెప్పే బీఆర్ఎస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మి రైతులు ఆగం కావొద్దన్నారు. అర్హత ఉన్న ప్రతి రైతుకూ రుణమాఫీ జరిగి తీరుతుందని స్పష్టం చేశారు. రుణమాఫీ కాని రైతుల నుంచి ఫిర్యాదులు తీసుకుని ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించనున్నట్లు తెలిపారు. అధికారంలో ఉన్నప్పుడు ఏమీ చేయనివారు అధికారం కోల్పోయిన తరువాత రైతులను ఆందోళనకు గురిచేసి లబ్ధి పొందాలని చూస్తున్నారని మండిపడ్డారు. కేంద్రంలో అధికారంలో ఉన్నా ఏనాడు రైతులను పట్టించుకోకుండా పలు చట్టాల ద్వారా వారిని కష్టాల్లోకి నెట్టిన వారు ఇప్పుడు రుణమాఫీపై విమర్శలు చేస్తున్నారన్నారు. వరంగల్ సభలో రాహుల్‌గాంధీ ఇచ్చిన మాట ప్రకారం రూ.2లక్షల రుణమాఫీకి కట్టుబడి 3 విడతలుగా ప్రభుత్వం రుణమాఫీ చేసిందని చెప్పారు. మొదటి పంట కాలంలోనే రూ.31వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమచేయాలని నిర్ణయం తీసుకున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. ఇప్పటి వరకు 22లక్షల ఖాతాల్లోకి రుణమాఫీ సొమ్ము జమైందని, కొన్ని బ్యాంకుల తప్పిదాలు, ఆధార్‌లో ఉన్న తప్పులు, బ్యాంకు అకౌంట్‌లో ఉన్న పేర్ల తప్పుల నేపథ్యంలో కొంతమంది రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. ఆ రైతుల నుంచి ఫిర్యాదు తీసుకుని క్షేత్రస్థాయిలో వారి ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించి ఆ కుటుంబానికి రుణ విముక్తి జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. రేషన్‌కార్డు లేకపోయినా పట్టా పాసు పుస్తకం మీద రుణం తీసుకున్న రైతులు కుడా రుణ మాఫీకి అర్హులని పేర్కొన్నారు. గతంలో సాగుచేయని భూములకు కూడా పెట్టుబడి సొమ్ము ఇచ్చి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు కేవలం 39లక్షల మంది రైతుల పేర్లపైనే రుణాలున్నాయని, తాము అధికారంలోకి వచ్చాక గడిచిన ఐదేళ్లలో ఎంత మందికి పంట రుణాలుంటే అందరి ఖాతాలు పంపాలని కోరామని, దాంతో 41,78,892 లక్షల మంది రైతుల ఖాతాల వివరాలు బ్యాంకులు అందించాయని తెలిపారు. అయితే కొన్నిచోట్ల కిందిస్థాయి బ్రాంచీల్లో రైతుల వివరాలను రాష్ట్రస్థాయి బ్యాంకర్లకు పంపించలేదని, ఆ సమస్యను ఇప్పుడు కొత్తగా చెబుతున్నారన్నారు. అయినా వాటిని కూడా ఫిర్యాదులుగా స్వీకరించి అర్హత కలిగిన రైతులకు మాఫీ చేస్తామని ఆయన చెప్పారు.

కాంట్రాక్టు కార్మికులకు 'సుశీ హైటెక్' శఠగోపం!

- సింగరేణి ఓసీపీ ఓబీ కాంట్రాక్టర్ నిర్వాకం
- 700 మందికి రూ. 5 కోట్ల మేర గ్రాట్యూటీకి ఎగనామం

మంచిర్యాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ సింగరేణి ఓపెన్‌కాస్టు గనిలో ఓబీ (ఓవర్ బర్డెన్) పనులు చేపట్టిన కాంట్రాక్టర్ కాంట్రాక్టు కార్మికులకు శఠగోపం పెట్టాడు. దాదాపు 700 మందికి రూ. 5 కోట్ల వరకు గ్రాట్యుటీ ఇవ్వకుండా బిచాణా ఎత్తేశాడు. దీంతో కాంట్రాక్టు కార్మికులు మూడు రోజులుగా ఆందోళన బాట పట్టారు. శ్రీరాంపూర్ ఓసీపీలో జూన్ 2016 నుంచి మే 2023 వరకు ఓబీ వెలికితీసేందుకు ప్రసాద్ సుశీ అనే సంస్థకు సింగరేణి యాజమాన్యం కాంట్రాక్టు అప్పగించింది. ఈ పనులను కాంట్రాక్టర్ తరుపున సుశీ హైటెక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ చేపట్టింది. ఆ సమయంలో వారి వద్ద 500 నుంచి 700 మంది కార్మికులు పని చేస్తుండేవారు. ఆ సంస్థ కాంట్రాక్టు ముగియడంతో ఏడాది క్రితమే పనులు నిలిపివేసి బిచాణా ఎత్తేసింది. గ్రాట్యుటీ చట్టం-1972 ప్రకారం నెలవారీ రేటింగ్ పొందిన ఉద్యోగి విషయంలో, ఏడాదికి 15 రోజుల వేతనాన్ని గ్రాట్యుటీ కింద చెల్లించాల్సివుంది. ఈ క్రమంలో ప్రసాద్ సుశీ కంపెనీ తమ కాంట్రాక్టు పూర్తి చేసుకొని వెళ్లిపోయేవరకు ఏడేళ్ల కాలంలో అందులో పనిచేసిన సుమారు 700 మందికి గ్రాట్యుటీ కింద దాదాపు రూ. ఐదు కోట్ల వరకు ఇవ్వాల్సి ఉన్నట్లు కాంట్రాక్ట్ కార్మికులు చెబుతున్నారు. ఆ కాంట్రాక్టర్‌కు చెందిన నాలుగు నెలల బిల్లులు సుమారు రూ. 10 కోట్ల వరకు సింగరేణి సంస్థ వద్ద ఉన్నాయని చెబుతున్నారు. అత్యవసరంగా బిల్లులను నిలిపివేసి, వాటిలో నుంచి తమకు రావాల్సిన రూ. 5 కోట్ల పై చిలుకు డబ్బులు ఇప్పించాలని కాంట్రాక్టు కార్మికులు యాజమాన్యాన్ని వేడుకుంటున్నారు. అధికారులు స్పందించని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని తెలిపారు. కాగా, గత రికార్డులు పరిశీలించి కార్మికులకు న్యాయం జరిగేలా చూస్తామని, చట్ట ప్రకారం వారికి రావలసిన డబ్బులు అందేలా చర్యలు తీసుకుంటామని ఓసీపీ ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్ తెలిపారు.

కేజీబీవీలోని కాంట్రాక్టు సిబ్బందికి బదిలీల అవకాశం!

- షెడ్యూల్ విడుదల చేసిన అధికారులు.. నేడు, రేపు దరఖాస్తులు

హైదరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నడుస్తున్న కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో (కేజీబీవీ) తాత్కాలికంగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న సిబ్బందికి అంతర్గత బదిలీలకు అవకాశం కల్పించారు. ఈ మేరకు బుధవారం అధికారులు షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ విద్యాలయాల్లో పనిచేస్తున్న స్పెషల్ ఆఫీసర్లు, పీజీసీఆర్టీలు, సీఆర్టీలు, ఏఎన్ఎంలు, అకౌంటెంట్లు, పీఈటీలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చని అధికారులు సూచించారు. ఈ బదిలీ కోరుకునే వారు సమగ్ర శిక్ష వెబ్‌సైట్‌లో ఈ నెల 22, 23 తేదీల్లో ఆన్‌లైన్ ద్వారా తమ అభ్యర్థనలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

వివేకా హత్య కేసులో..

ఉదయ్‌కుమార్‌రెడ్డికి బెయిల్ మంజూరు

హైదరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఆరో నిందితుడి(ఏ-6)గా ఉన్న గజ్జల ఉదయ్‌కుమార్ రెడ్డికి తెలంగాణ హైకోర్టు బుధవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ.2 లక్షల వ్యక్తిగత బాండ్ సమర్పించాలని.. సీబీఐ కోర్టు సంతృప్తి మేరకు రెండు పూచీకత్తులు ఇవ్వాలని.. పాస్‌పోర్టును కోర్టుకు అప్పగించాలని.. కోర్టు అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లరాదని.. ప్రతివారం పులివెందుల పోలీసు స్టేషన్‌లో హాజరుకావాలని, కేసు దర్యాప్తులో జోక్యం చేసుకోరాదని.. సాక్ష్యాలు తారుమారు చేయరాదని.. పలు షరతులు విధించింది. వీటిని ఉల్లంఘిస్తే బెయిల్ రద్దుచేయాలని సీబీఐ, వివేకా కుమార్తె సునీత కోరవచ్చని తెలిపింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ ఆదేశాలు జారీచేశారు. వివేకా హత్య కేసుకు సంబంధించి ఇప్పట్లో ట్రయల్ ప్రారంభమయ్యేలా లేదని.. తనకు బెయిల్ ఇవ్వాలని పేర్కొంటూ ఉదయ్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. దీనిని సీబీఐ, సునీత తీవ్రంగా వ్యతిరేకించారు. సీఆర్పీసీ 207 (దర్యాప్తు సంస్థ సేకరించిన డాక్యుమెంట్ల కాపీలు నిందితులకు అందజేయడం) అమలులో భాగంగా తమకు ఎలాంటి డాక్యుమెంట్లు ఇవ్వలేదని చెప్పి ట్రయల్ ముందుకు సాగకుండా అడ్డుకుంటున్నారని వారి తరఫు న్యాయవాదులు హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. 13 నెలలుగా ట్రయల్ ముందుకు సాగకుండా ఉదయ్‌రెడ్డి వ్యూహాత్మకంగా అడ్డుకుంటున్నారని.. ఇప్పుడు మళ్లీ హైకోర్టుకు వచ్చి సమీప భవిష్యత్‌లో ట్రయల్ మొదలయ్యే అవకాశం లేనందున బెయిల్ ఇవ్వాలని వాదించడం అక్రమమని పేర్కొన్నారు. నిందితులు కావాలనే ట్రయల్‌ను ఆలస్యం చేస్తున్నారని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఈ నెల 14న తీర్పు రిజర్వు చేసి బుధవారం బెయిల్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. కాగా..ఉదయ్‌రెడ్డికి బెయిల్ రావడంతో ఈ కేసులో కీలక నిందితులు ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, ఉదయ్‌రెడ్డి బెయిల్‌పై బయటే ఉన్నారు. హత్యలో ప్రత్యక్షంగా పాల్గొన్న ఎర్ర గంగిరెడ్డి, సునీల్ యాదవ్, ఉమాశంకర్‌రెడ్డి ప్రస్తుతం జైల్లో ఉన్నారు.

పనులు పూర్తికాకున్నా సర్టిఫికెట్లా?

మార్గదర్శకాల్లో అలా ఇచ్చే క్లాజు ఏదైనా ఉందా?

- బ్యారేజీల నిర్మాణం నాలుగేళ్లు జరిగితే.. క్వాలిటీ కంట్రోల్ తనిఖీలు ఒక్కసారే చేయడమేంటి?
- చెల్లింపుల్లో మార్గదర్శకాలు ఏవీ?
- డీపీఆర్ దాఖలు చేశాక మార్పులా?
- హైపవర్ కమిటీని ఎప్పుడు నియమించారు?
- మాజీ ఈఎన్‌సీని ప్రశ్నించిన పీసీ ఘోష్ కమిషన్
- 'కాళేశ్వరం'పై ప్రారంభమైన క్రాస్ ఎగ్జామినేషన్



హైదరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన బ్యారేజీల నిర్మాణం పూర్తికాకముందే.. వినియోగానికి సరిపడేంత పని జరిగిందని నిర్ధారిస్తూ సర్టిఫికెట్లు ఇవ్వడాన్ని జస్టిస్ పినాకిచంద్ర ఘోష్ కమిషన్ ప్రశ్నించింది. టెండర్ నిబంధనలకు సంబంధించిన క్లాజుల్లో దీని ప్రస్తావన ఉందా? అని, 2020 జూన్ 29న బ్యారేజీల నిర్మాణం పూర్తయితే.. 2019 సెప్టెంబరులోనే సర్టిఫికెట్ ఎలా ఇచ్చారని మాజీ ఈఎన్‌సీ (జనరల్) సి.మురళీధర్‌ను అడిగింది. కాళేశ్వరంపై విచారణలో భాగంగా కమిషన్ బుధవారం క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియను ప్రారంభించింది. తొలి రోజు మాజీ ఈఎన్‌సీని ప్రశ్నించిన కమిషన్.. బ్యారేజీల నిర్మాణం జరుగుతున్న సమయంలో ఏయే రిజిస్టర్‌లను నిర్వహించాల్సి ఉంటుంది? పనులు పూర్తికాకపోయినా వినియోగానికి సరిపడేంత పని జరిగిందని సర్టిఫికెట్లు ఇచ్చే మార్గదర్శకాలేమైనా ఉన్నాయా? అని ఆరా తీసింది. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సర్టిఫికెట్ జారీ చేస్తే.. దానిపై సూపరింటెండెంట్ ఇంజనీర్, చీఫ్ ఇంజనీర్ కౌంటర్ సంతకాలు చేస్తారా? అని, భారతీయ ప్రమాణాల సంస్థ (ఐఎస్) కోడ్‌ను అనుసరించే కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణం జరిగిందా? అని ప్రశ్నించింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు ఎవరు అనుమతి ఇచ్చారు? ఒక్కో కాంపోనెంట్ అంచనాలను ఎవరు తయారు చేశారు? పరిపాలన అనుమతులకు శాఖాధిపతి (హెచ్‌వోడీ)యే కారణమా? అంటూ కమిషన్ ప్రశ్నల వర్షం కురిపించింది. వీటికి ఈఎన్‌సీ మురళీధర్ సమాధానమిస్తూ.. పరిపాలన పరమైన అనుమతులను హెచ్‌వోడీయే ఇచ్చారని తెలిపారు. సంబంధిత ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్లే కాంపోనెంట్ వారీగా అంచనాలను తయారు చేశారని, సబ్‌స్టాన్షియల్ సర్టిఫికెట్ ఇచ్చే అధికారం గానీ, క్లాజు గానీ లేదని చెప్పారు.

ఐఎస్ కోడ్‌ను ఎందుకు పాటించలేదు?

బ్యారేజీల నిర్మాణ సమయంలో క్వాలిటీ కంట్రోల్ అధికారుల, క్షేత్రస్థాయి ఇంజనీర్ల వైఫల్యం కనిపిస్తోందని, ఏ క్లాజునూ, ఐఎస్ కోడ్‌ను పాటించలేదని పీసీ ఘోష్ కమిషన్ పేర్కొంది. 2016 నుంచి 2020 దాకా బ్యారేజీల (మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల) నిర్మాణం జరిగితే.. వరంగల్ లోని క్వాలిటీ కంట్రోల్ విభాగం ఒక్కసారి మాత్రమే తనిఖీ చేసినట్లు రికార్డులు చెబుతున్నాయని గుర్తు చేసింది. రూ.వేల కోట్ల ప్రజాధనంతో ముడిపడి ఉన్న పనులు జరుగుతుంటే ఎప్పటికప్పుడు తనిఖీలు చేయకపోవడమేంటని నిలదీసింది. నిర్మాణ కాలంలో ఒక్కసారే తనిఖీలు చేసి.. నాణ్యతా ప్రమాణాలకు లోబడే పనులు జరిగాయంటూ ఎలా నిర్ధారిస్తారని ప్రశ్నించింది. ఇందుకు మురళీధర్ బదులిస్తూ.. బ్యారేజీల వైఫల్యానికి గల కారణాల్లో క్వాలిటీ కంట్రోల్ వైఫల్యం కూడా ఒకటి అని, రెండు వారాలకోసారి తనిఖీలు జరగాల్సి ఉండగా.. అలా జరగలేదని అన్నారు. దీంతో.. క్వాలిటీ కంట్రోల్ పరీక్షలు చేయించకుండానే రూ.1342.72 కోట్లు ఎలా చెల్లించారు? అని కమిషన్ ప్రశ్నించింది. రిజిస్టర్‌లలో అడ్డదిడ్డంగా మార్పులు ఎందుకు చేశారని, బిల్లుల చెల్లింపుల్లోనూ మార్గదర్శకాలు ఎందుకు పాటించలేదని నిలదీసింది.

కాళేశ్వరంలో మీ పాత్ర ఏంటి?

"కాళేశ్వరంలో మీ పాత్ర ఏంటి? ఈఎన్‌సీగా మీ విధులు, బాధ్యతలేంటి? హైపవర్ కమిటీ వేసిన తర్వాతే కాళేశ్వరంపై నిర్ణయం తీసుకున్నారా? హైపవర్ కమిటీని ఎప్పుడు వేశారు?" అని పీసీ ఘోష్ కమిషన్ ప్రశ్నించింది. అయితే ఈఎన్‌సీ(జనరల్)గా ప్రాజెక్టుల పర్యవేక్షణ తనదేనని, దీంతోపాటు క్షేత్రసాయి నుంచి వచ్చిన ప్రతిపాదనల్ని పరిశీలించడం (వెట్టింగ్ చేయడం), వాటిని ప్రభుత్వానికి పంపించడం తన బాధ్యత అని మురళీధర్ వివరించారు. ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకాన్ని రీ డిజైన్ చేసి, కాళేశ్వరం చేపట్టారని, డీపీఆర్‌ను వ్యాప్కోస్ తయారు చేసిందని చెప్పారు. కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ)లోని పలు విభాగాలు 17 రకాల అనుమతుల అనంతరం కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి నేతృత్వంలోని టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ (టీఏసీ) క్లియరెన్స్ ఇచ్చిందని గుర్తు చేశారు. కాగా, డీపీఆర్‌ను సీడబ్ల్యూసీలో దాఖలు చేశాక జరిగిన మార్పులకు కారణమేంటని, మార్పులను ఎవరు సూచించారని కమిషన్ ప్రశ్నించింది. ప్రభుత్వ ఆదేశాలు, ఆమోదంతోనే మార్పులు జరిగాయని మురళీధర్ బదులిచ్చారు. దాదాపు రెండు గంటలపాటు ఈ క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియ జరిగింది.

మాజీ ఈఎన్సీ నరేందర్‌రెడ్డి క్రాస్ ఎగ్జామినేషన్ నేడు

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో డ్రాయింగ్, డిజైన్లను తయారుచేసిన/ఆమోదించిన నీటిపారుదల శాఖలోని సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్(సీడీవో) చీఫ్ ఇంజనీర్‌గా పని చేసిన మాజీ ఈఎన్సీ ఎ.నరేందర్ రెడ్డిని గురువారం జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్ చేయనుంది. అఫిడవిట్లు దాఖలు చేసిన 57 మందిలో దాదాపు 25 మందిని క్రాస్ ఎగ్జామిన్ చేయాలని కమిషన్ ఇదివరకు నిర్ణయించిన విషయం విదితమే.

ఆ పత్రాలు లాక్కున్న కమిషన్

క్రాస్ ఎగ్జామినేషన్ జరుగుతుండగా.. కమిషన్ వేసిన కొన్ని ప్రశ్నలకు జవాబులు ఇవ్వడానికి వీలుగా మాజీ ఈఎన్సీ మురళీధర్‌కు నీటిపారుదల అధికారులు కొన్ని పత్రాలు అందించారు. అయితే.. హైపవర్ కమిటీ నియామకానికి సంబంధించిన ఈ పత్రాలను కమిషన్ లాక్కుంది. తమ అనుమతి లేకుండా పత్రాలివ్వడానికి వీల్లేదని స్పష్టం చేసింది.

షీట్‌పైల్స్ స్థానంలో సీకెంట్ పైల్స్ ఎందుకు వాడారు?

బ్యారేజీల డిజైన్, డ్రాయింగ్‌లో పొందుపరిచిన విధంగా నిర్మాణ సంస్థ షీట్‌పైల్స్‌ను వినియోగించాల్సి ఉండగా.. సీకెంట్ పైల్స్ వాడినట్లు తెలిసిందని పీసీ ఘోష్ కమిషన్ పేర్కొంది. నిర్మాణం జరుగుతున్న క్రమంలో ఇలా మధ్యలో మార్పులు చేయవచ్చా? అని ప్రశ్నించింది. దీంతో.. రాఫ్ట్ (పునాది)కు రక్షణగా షీట్ పైల్స్‌ను వాడతారని, పనులు జరుగుతున్నప్పుడు అనుకూలతను బట్టి సీకెంట్ పైల్స్ వాడినట్లు తెలుస్తోందని ఈఎన్‌సీ మురళీధర్ తెలిపారు. అంచనాలను ఏ విధంగా తయారు చేస్తారని కమిషన్ ప్రశ్నించగా.. పనుల ఆధారంగా అంచనాలు సిద్ధమవుతాయని చెప్పారు. "2019 నవంబరులో వరదల అనంతరం గేట్లు మూసినప్పుడు లోపాలు బయటపడ్డాయి. ఆ సమయంలో తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి ఏమైనా ఆదేశాలిచ్చారా? బ్యారేజీల డిజైన్లు సిద్ధం చేయడానికి ముందు నమూనా అధ్యయనాలు జరిగాయా? జియో టెక్నికల్, జియో ఫిజికల్ పరీక్షలు చేశారా?" అని కమిషన్ ప్రశ్నించింది. అయితే ఏమేం లోపాలు జరిగాయో.. వాటిని సరిచేయాలని తాము ఆదేశాలు ఇచ్చామని మురళీధర్ బదులిచ్చారు. దాంతోపాటు నమూనా అధ్యయనాల అనంతరమే డిజైన్/డ్రాయింగ్‌లు సిద్ధమయ్యాయని చెప్పారు. ఇక డిజైన్‌కు తగ్గట్లుగా డ్రాయింగ్‌లు ఉంటాయని, తేడాలు లేవని తెలిపారు.

పాత ఫోన్లు కొంటారు..

సైబర్ నేరాలకు వాడేస్తారు!

- రాష్ట్రంలో బిహార్ ముఠా నయా దందా
- ముగ్గురు వ్యక్తుల్ని అరెస్టు చేసిన పోలీసులు
- 4 వేల పాత సెల్‌ఫోన్లు స్వాధీనం
- గుర్తుతెలియని వ్యక్తులకు పాత ఫోన్లు అమ్మొద్దని సూచన



హైదరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పాత పేపర్లు, సామాన్లు, సెల్‌ఫోన్లు కొంటాం అంటూ.. బిహార్ ముఠా సభ్యులు తెలంగాణలోని పల్లెల్లో తిరుగుతున్నారు. పాతవి, పనిచేయని మొబైల్ ఫోన్లను అతి తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటిని సైబర్ నేరాలకు కేంద్రమైన జాంతారకు ఎగుమతి చేస్తున్నారు. మారుమూల పల్లెల్లో అనుమానాస్పదంగా తిరుగుతూ పాత ఫోన్లు కొంటున్న బిహార్ ముఠాను పట్టుకోవడంతో సైబర్ నేరగాళ్ల గుట్టు రట్టయింది. ముగ్గురు నిందితుల్ని అరెస్ట్ చేసిన సైబర్ సెక్యూరిటీ పోలీసులు.. వారి నుంచి ఎగుమతికి సిద్ధంగా ఉన్న 4 వేల పాత సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం గాలిస్తున్నారు. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో వెలుగులోకి వచ్చిన సైబర్ నేరగాళ్ల వినూత్న వ్యూహం కేసులో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

ఇలా చిక్కారు..

బిహార్‌కు చెందిన కొందరు వ్యక్తులు గోదావరిఖని మేడిపల్లి ఎన్టీపీసీ ఏరియాలో అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు సైబర్ సెక్యూరిటీ పోలీసులకు సమాచారం అందింది. ఆ ముఠా పాతవి, పనిచేయని సెల్ ఫోన్లను అతి తక్కువ మొత్తానికి, ప్లాస్టిక్ వస్తువులు ఇచ్చి కొనుగోలు చేస్తున్నట్లు గుర్తించారు. గోదావరిఖనిలో తనిఖీలు చేపట్టగా ముగ్గురు వ్యక్తుల్ని పట్టుకున్నారు. పట్టుబడ్డ మహ్మద్ షమీమ్, అబ్దుల్ సలాం, మహ్మద్ ఇఫ్తికార్‌ను విచారించగా అసలు విషయం బయటపడింది. బిహార్‌కు చెందిన తాము తెలంగాణ పల్లెల్లో తిరుగుతూ పాతవి, పనిచేయని ఫోన్లు అతి తక్కువ మొత్తానికి కొనుగోలు చేసి బిహార్‌లోని ముఠా సభ్యులకు ఎగుమతి చేస్తున్నట్లు వెల్లడించారు. అక్కడ వీటికి అవసరమైన రిపేర్లు చేసి సైబర్ నేరాలకు కేంద్రమైన జాంతార, దేవగఢ్‌లోని సైబర్ నేరగాళ్లకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ప్రాథమిక విచారణ అనంతరం వారి నుంచి ఎగుమతికి సిద్ధంగా మూడు సంచుల్లో దాచిన సుమారు 4 వేల పాత సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న అక్తర్ అలీ కోసం గాలింపు చేపట్టారు. మదర్ బోర్డు మార్చి, చిన్న చిన్న రిపేర్లు, సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌తో పాత ఫోన్లను నిందితులు సైబర్ నేరాలకు ఉపయోగిస్తారని.. గుర్తు తెలియని వ్యక్తులకు పాత ఫోన్లు విక్రయించొద్దని సైబర్ సెక్యూరిటీ బ్యూరో చీఫ్ శిఖాగోయల్ తెలిపారు.

శ్రీశైలానికి పెరిగిన వరద

- 1.24 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- కృష్ణా ప్రాజెక్టులపై 1,033 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పాదన..
- మట్టి గోడ కూలి ఒకరు.. వాగులో కొట్టుకుపోయి మరొకరి మృతి
- మురికికాలువలో పడి చిన్నారి గల్లంతు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



నల్గొండ జిల్లా కేతేపల్లి వద్ద మూసీ ప్రాజెక్టు క్రస్ట్ గేట్ల నుంచి విడుదల అవుతున్న నీరు

కృష్ణా బేసిన్ పరీవాహకంలో వర్షాలతో శ్రీశైలం ప్రాజెక్టుకు వరద పెరిగింది. మంగళవారం 31 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రికార్డు కాగా... బుధవారం 1,24,112 క్యూసెక్కులుగా నమోదైంది. ఎగువన ఉన్న సుంకేసుల బ్యారేజీకి 1,03,950 క్యూసెక్కుల వరద వస్తుండగా.. అంతేస్థాయిలో శ్రీశైలానికి వదులుతున్నారు. రెండు వైపులా జలవిద్యుత్తు ఉత్పాదనతో శ్రీశైలం నుంచి 71,910 క్యూసెక్కులను సాగర్‌కు వదిలేస్తున్నారు. శ్రీశైలం జలాశయం ఘాట్‌రోడ్డులో మంగళవారం రాత్రి భారీ వర్షానికి కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో తెలంగాణ నుంచి వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఇక నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు 47 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. జలవిద్యుత్తు ఉత్పాదనతో 47 వేలను దిగువకు వదులుతున్నారు. పులిచింతలకు 19 వేల ఇన్‌ఫ్లో ఉండగా... 33 వేల ఔట్ ఫ్లో ఉంది. కృష్ణా బేసిన్ ప్రాజెక్టులన్నీ నిండుగా ఉండటంతో జలవిద్యుత్తు ఉత్పాదన జోరందుకుంది. రోజుకు గరిష్ఠంగా 46 మిలియన్ యూనిట్ల దాకా విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్నారు. ఈ సీజన్‌లో మంగళవారం రాత్రి 12 గంటలదాకా 1033.92 మిలియన్ యూనిట్ల జలవిద్యుత్తు ఉత్పాదన జరిగింది. ఇందులో శ్రీశైలం భూగర్భ జలవిద్యుత్తు కేంద్రంలో 488.88 మిలియన్ యూనిట్లు... నాగార్జునసాగర్‌లో 342.38 మిలియన్ యూనిట్లు, జూరాలలో 90.16 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేశారు. ఇక తుంగభద్ర ప్రాజెక్టుకు 30 వేల ఇన్‌ఫ్లో ఉండగా... 9,010 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది. గోదావరి బేసిన్‌లోని ఎల్లంపల్లికి 12 వేలు, ఎస్సారెస్పీకి 10 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రికార్డయింది. సూర్యాపేట, నల్లగొండ జిల్లాల సరిహద్దుల్లోని మూసీ ప్రాజెక్టుకు 3,756 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ఇప్పటికే గరిష్ఠస్థాయి నీటి నిల్వకు దగ్గరలో ఉండటంతో.. సాయంత్రం 3 గేట్లను అడుగు మేర ఎత్తి 1,935 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ నీటి మట్టం పూర్తి సామర్థ్యం 513.41 మీటర్లకు.. ప్రస్తుతం 513.60 మీటర్ల మేర నీరు ఉంది. దీంతో 1,700 క్యూసెక్కులు దిగువకు వదిలారు.

గోడ కూలి ఒకరు.. వాగులో కొట్టుకుపోయి మరొకరు





మృతి చెందిన శ్రీకృతి, గల్లంతైన అనన్య

వర్షాల నేపథ్యంలో మట్టి గోడ కూలి ఓ బాలిక, వాగులో కొట్టుకుపోయి ఓ వృద్ధురాలు మృతి చెందగా.. మురికికాలువలో పడి రెండేళ్ల చిన్నారి గల్లంతైంది. గద్వాల జిల్లా అయిజ మునిసిపాలిటీ పరిధిలోని కొత్తపేట వీధిలో చాకలి నర్సింహులు, రేవతి దంపతులకు కూతురు శ్రీకృతి (8), ఇద్దరు కుమారులున్నారు. వీరు ఓ గుడిసెలో 25 ఏళ్లుగా నివాసముంటున్నారు. అయితే రెండ్రోజులుగా వర్షాలతో గుడిసె గోడలు తడిసిపోయాయి. రోజులాగే నర్సింహులు కుటుంబంతో నిద్రకు ఉపక్రమించగా మంగళవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో గోడ కూలింది. దీంతో రేవతి, శ్రీకృతికి గాయాలయ్యాయి. శ్రీకృతిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించింది. నారాయణపేట జిల్లా మాగనూరు మండలం అమ్మపల్లికి చెందిన గుడిసె పోశమోళ్ల నర్సమ్మ (60) మంగళవారం సాయంత్రం పెద్దవాగులో దుస్తులు ఉతికేందుకు వెళ్లింది. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతికారు. ఎక్కడా కనిపించకపోవడంతో బట్టలు ఉతికే ప్రాంతంలో వాగు ప్రవాహానికి కొట్టుకుపోయినట్లు అనుమానించారు. బుధవారం పర్మాన్‌దొడ్డి శివారులో గల వాగు ఒడ్డు వద్ద నర్సమ్మ శవమై కనిపించింది. ఇటు నిజామాబాద్‌లోని ఆనంద్‌నగర్‌లో అనన్య (2) ఆడుకుంటూ ఇంటిపక్కనే ఉన్న మురికి కాలువలో పడి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయింది. ఇది గమనించిన బాలిక తల్లి ఏడుపులు విని.. స్థానికులు అక్కడికి చేరుకొని పోలీసులు, మునిసిపల్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న వారు గాలింపు చర్యలు చేపట్టిన బాలిక ఆచూకీ లభ్యం కాలేదు. పొక్లెయినర్‌తో కాలువ నీటిని మళ్లిస్తూ బాలికను గుర్తించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. బాలిక తండ్రి మారుతి సేల్స్‌మన్‌గా పనిచేస్తున్నాడు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బద్లాపూర్ ఘాతుకం

మహారాష్ట్రలోని థానేజిల్లా బద్లాపూర్‌లో కిండర్‌గార్టెన్ స్కూల్లో ఇద్దరు చిన్నారులపై అటెండర్ అఘాయిత్యానికి పాల్పడిన ఘటన స్థానికంగా తీవ్ర ఉద్రిక్తతలకు కారణమైంది. మూడేళ్ళు, నాలుగేళ్ల వయసున్న ఈ పిల్లలపై లైంగికదాడి జరగడం దేశాన్ని నిర్ఘాంతపరచింది. ఆస్పత్రుల్లో మహిళా వైద్యులకు ఏమాత్రం భద్రతలేదని, ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తున్నవీరు, రక్షణకరువై నిస్సహాయంగా అత్యాచారాలకు, హత్యలకు గురికావాల్సి వస్తున్నదని పశ్చిమబెంగాల్ ఘటన చెబుతోంది. అభంశుభం తెలియని పిల్లలు చివరకు అక్షరాలు దిద్దేచోటకూడా రాక్షసుల చేతికిచిక్కి బలైపోతున్నారని బద్లాపూర్ ఘటన హెచ్చరిస్తోంది.

ఈ ఘటనను విపక్షాలు రాజకీయం చేయకూడదని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్‌శిండే అంటున్నారు. పశ్చిమబెంగాల్‌లో అదే జరుగుతున్నదని తృణమూల్ వాదిస్తోంది. వైద్యురాలిమీద అత్యాచారం కంటే పసికందుల మీద అఘాయిత్యం మరింత ఘోరమైనదని కొందరు తూకాలు వేస్తున్నారు. బద్లాపూర్ ఘోరం వెలుగుచూసిన తరువాత కూడా జాతీయ మీడియా తన దృష్టిని బెంగాల్ నుంచి మళ్ళించకపోవడంలో ఏదో దురుద్దేశం ఉన్నదని మరికొందరి వాదన. ఈ విమర్శలను, వ్యాఖ్యలను అటుంచితే, ఈ దేశంలో రాజకీయం కానిదేదీ లేదు. ఆయా పార్టీలు, అవి మోహరించివున్న కూటములు ఈ ఘటనల్లో తమతమ ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరించడం కనిపిస్తూనే ఉంది. బద్లాపూర్ ఉదంతం స్థానికులను తీవ్రంగా కుదిపేసింది. వందలాదిమంది వీధుల్లోకి వచ్చి ఆగ్రహావేశాలతో ఊగిపోయారు. పసికందులకు పాఠశాలల్లో సైతం రక్షణలేదన్న చేదునిజం వారిని నిలవనివ్వలేదు. రైళ్ళరాకపోకలను నిలిపివేశారు, స్కూలుమీద దాడులుచేశారు, విధ్వంసకాండకు పాల్పడ్డారు. తల్లిదండ్రులనుంచి ఫిర్యాదు స్వీకరించేందుకు పోలీసులు మొదట నిరాకరించారనీ, కేసు నమోదులో తీవ్రజాప్యంచేశారనీ, ఒక తల్లి పదిగంటలపాటు పోలీసుస్టేషన్‌లోనే నిరీక్షించవలసి వచ్చిందనీ వార్తలు వచ్చాయి. పాఠశాల యాజమాన్యంతో కుమ్మక్కై పోలీసులు ఈ ఘటనను తొక్కిపెట్టేందుకు ప్రయత్నించారని స్థానికుల వాదన. బాధిత చిన్నారులనుంచి సమాచారం సేకరించడం కష్టమైన పని కనుక కేసునమోదు ఆలస్యమైందనీ, తరువాత కొద్దిగంటల్లోనే స్కూల్ అటెండర్‌ను అరెస్టుచేశామని పోలీసులు సమర్థించుకుంటున్నారు. ప్రజాగ్రహాన్ని చల్లార్చేందుకు తక్షణ అరెస్టులు, సస్పెన్షన్లు, సిట్ ఏర్పాటు, ఫాస్ట్‌ట్రాక్ కోర్టు విచారణ ఇత్యాదివి ప్రభుత్వం చేపట్టింది. ప్రజలకు మరింత నమ్మకం కలగడానికి సీనియర్ న్యాయవాది ఉజ్వల్ నికమ్‌ను స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా రంగంలోకి దించింది. బీజేపీ తరఫున మొన్నటి ఎన్నికల్లో ఎంపీగా నిలబడిన ఈయనా, సదరు స్కూల్ యాజమాన్యం ఒకే పార్టీకి చెందిన విషయాన్ని కాంగ్రెస్ గుర్తుచేస్తోంది. న్యాయం చేయడం కంటే, ఘాతుకాలను కప్పిపుచ్చేందుకు రాష్ట్రంలో విశేషప్రయత్నం జరుగుతున్నదని ఆరోపిస్తున్న మహావికాస్ అగాడీ ఆగస్టు 24న రాష్ట్రబంద్‌కు పిలుపునిచ్చింది. అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న మహారాష్ట్రలో ఈ ఘటన ప్రభావం చూపకపోదు.

స్కూలు సిబ్బంది ఎంపిక, సీసీకెమెరాలతో సహా పిల్లల భద్రతకు సంబంధించిన సమస్త ఏర్పాట్ల విషయంలో యాజమాన్యాలు ఎంతో శ్రద్ధగా ఉండాలని బద్లాపూర్ ఘటన గుర్తుచేస్తోంది. చాలా స్కూళ్ళలో మూత్రశాలలు దూరంగా ఉండటం, పిల్లలను స్కూలుకు తీసుకువచ్చేవారు సైతం వాటిని వినియోగిస్తూండటం ప్రమాదాలకు ఎక్కువ అవకాశాన్నిస్తాయి. మరో రేప్, హత్య జరగనిదే మేలుకోమా? అని కోల్‌కతా వైద్యురాలి హత్యాచారంపై సుప్రీంకోర్టు చక్కని ప్రశ్న వేసింది. ఎఫ్ఐఆర్ దాఖలులో జాప్యంనుంచి ఈ దారుణాన్ని ఆత్మహత్యగా చిత్రించేందుకు చూసిన మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌వరకూ ప్రతీవారినీ, ప్రతీదశనూ తప్పుబడుతూ, మమత సర్కారుకు తలంటుతూ సుప్రీంకోర్టు ప్రశంసనీయమైన చొరవ ప్రదర్శించింది. వ్యవస్థలోని లోపాలను ఈ ఘటన తెరమీదకు తెచ్చిందనీ, వైద్యుల భద్రతకు దేశవ్యాప్త ప్రోటోకాల్ ఉండాలనీ అంటూ నివేదికల తయారీకోసం టాస్క్‌ఫోర్స్ ప్రకటించింది. అరుణా శాన్‌బాగ్ ఉదంతం జరిగిన యాభైఒక్క సంవత్సరాల తరువాత కూడా ఈ దేశంలోని మహిళా వైద్యులు, సిబ్బందికి రక్షణ దక్కడం లేదని కోల్‌కతా ఘటన నిరూపించింది. మహిళలు, బాలికలు, చిన్నారులపై లైంగికదాడులు పెరిగిపోతున్న నేపథ్యంలో, వారికి ప్రతీచోటా భద్రత కల్పించే ప్రయత్నం విశేషంగా జరగాలి, నిర్దిష్టమైన విధివిధానాల రూపకల్పనకు సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించాలి.

నిజామాబాద్ పల్లెలో జన్మించి, ఉస్మానియా విశ్వవిద్యాలయం మేధో పాదుల్లో పెరిగి, ఉత్తర భారతావనిలోని ప్రతిష్ఠాత్మక బెనారస్ వర్శిటీలో ఉత్తరాంధ్ర అరుణోదయం– చరిత్రాత్మక శ్రీకాకుళ గిరిజనుల తిరుగుబాటు– ప్రభావాలు తెలుగు సాహిత్యంలో ప్రతిఫలించిన తీరుతెన్నులను తరచి చూచిన తెలంగాణీయుడు డాక్టర్ కె. ముత్యం (1958–2024). ఉత్తరాంధ్ర ప్రజా పోరాటాలు, సాహిత్య సంస్కృతులపై ఆయన మొత్తం 11 పుస్తకాలు వెలువరించారు. ఆయన పరిశోధక కృషికి మరో ప్రగాఢ ప్రేరణ ఉత్తర తెలంగాణ.

పరిశోధక ఔత్తరాహికుడు

ప్రజా ఉద్యమాలు సృష్టించుకున్న, ప్రజలు మెచ్చిన సాహిత్య చరిత్రకారుడు డాక్టర్ కె.ముత్యం. నిజామాబాదు జిల్లాలోని బాచినపల్లిలో పుట్టి మధ్యలో ఉస్మానియా యూనివర్సిటీలో మెరిసి, ఆరోగ్యాన్ని సైతం పణంగా పెట్టి ఉత్తరాంధ్రలోని బారువా వరకు ప్రయాణించి నిరంతర సాహిత్య పరిశోధనతో భావితరాలకు ఎంతో మేధో సంపదను సమకూర్చిపెట్టిన అక్షర కృషీవలుడు ముత్యం. తనదైన సిద్ధాంత నిబద్ధత ఆయన్ను ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ తెలుగు పూర్తి చేసుకొని, పిహెచ్‌డి కోసం బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం వైపు నడిపించింది. అక్కడ ఆయన 'శ్రీకాకుళం ఉద్యమం–తెలుగు సాహిత్యంపై దాని ప్రభావం' అనే అంశంపై పరిశోధన చేసి 1990లో 'బెస్ట్ థీసీస్' అవార్డుతో పిహెచ్‌డి పట్టాను పొందారు. శాతవాహన యూనివర్సిటీలో తెలుగు అధ్యాపకులుగా చేరిన ముత్యం జీవిత పర్యంతం ఒక అవిరామ పరిశోధనా తపస్వి. ముత్యం పరిశోధనలు, రచనలు రెండు భాగాలుగా మనం చూడవచ్చును. 1) ఉత్తరాంధ్ర సాహిత్య పరిశోధనా–రచనలు; 2) తెలంగాణ ప్రాంత రచనలు, సేకరణలు, సంపాదకత్వ కృషి. ఈ కృషిలో తెలుగునాట ఆయన వెళ్లని గ్రంథాలయం లేదు అనడంలో అతిశయోక్తి లేదు. 'శ్రీకాకుళ ఉద్యమానికి మూలమైన ఉద్యమాలు, ప్రభావశీలుర జీవిత కథలు, గాథలు తవ్వి తీసే పరిశోధనలో సుదీర్ఘకాలం నిమగ్నమైనారు. ముఖ్యంగా ఆ ఉద్యమానికి పునాది వేసిన రైతు ఉద్యమకారులు మార్పు



పద్మనాభం, గానుగుల తరుణాచారి, జెండాలు గవరయ్య జీవితాల్లోకి వెళ్ళి 'ఈ ముగ్గురు ఒక్కరే' పేరుతో పుస్తకం రాశారు. అంతేకాదు, స్వాతంత్ర్య ఉద్యమంలో 'మాకొద్దీ తెల్ల దొరతనం' అంటూ గర్జించిన స్వాతంత్ర్య ఉద్యమ కవి గరిమెళ్ళ సత్యనారాయణ అముద్రిత రచనలు సైతం ఎంతో కష్టపడి సాధించి పుస్తకం రూపంలో వెలుగులోకి తెచ్చారు. శ్రీకాకుళం ఉద్యమానికి ప్రేరణగా నిలిచిన ఉత్తరాంధ్ర ప్రజా నాయకుల మరుగున పడ్డ చరిత్రలు వెలికితీయడానికి ఆయన పడ్డ శ్రమ అంతా ఇంతా కాదు. ఆ క్రమంలోనే జాతీయోద్యమనేత, శ్రీకాకుళం దళిత కవి 'సిల్లా రాజులురెడ్డి' జీవితం, కవిత్వం పుస్తకం తెచ్చారు. శ్రీకాకుళ ఉద్యమం సృష్టించిన సాహితీవేత్త, పాటకు ప్రాణం పోసిన త్యాగజీవి సుబ్బారావు పాణిగ్రాహి కుటుంబసభ్యులను వెతికి పట్టుకొని, ఇంటర్వ్యూలు చేసి ఆ విప్లవ కవి జీవిత కథ, సాహిత్య చరిత్రను అందించిన ఘనత ముత్యందే! అదే కోవలో శ్రీకాకుళం ఉద్యమానికి ముందు ప్రజా ఉద్యమ కెరటంగా వెలుగొందిన కళింగాంధ్ర తేజం 'పులిజాల శ్యామసుందర్‌రావు జీవిత చరిత్రనూ రాశారు. స్వాతంత్ర్యోద్యమ కాలంనాటి సంఘ సంస్కర్త బంకుపల్లె మల్లయ్యశాస్త్రి జీవిత గాథనూ రాశారు. 28 ఏళ్ళకే గొప్ప ప్రజానాయకుడుగా, రైతు ఉద్యమ నేతగా ఎదిగిన ఆదర్శ కమ్యూనిస్టు గంటి రాజేశ్వరరావు జీవితాన్ని శోధించి 'ప్రవహిస్తున్న జ్ఞాపకం' అనే ఒక గొప్ప గ్రంథాన్ని మనకు అందించారు. ఆయన తవ్వి తీసిన జీవిత గాథలు అన్నీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాటానికి ఊపిరిపోసిన వారివే కావడం విశేషం! మందస రైతాంగ పోరాటచరిత్రను 'సునాముది జీవధార'గా మనకందించారు. ఉత్తరాంధ్ర ప్రజా ఉద్యమాలపై ముత్యం మేధో కృషి 11 విలువైన గ్రంథాలుగా ఫలించి, సార్థకమయింది.

ముత్యం పరిశోధనా కృషిలో మరో కోణానికి ఆలంబన తెలంగాణ. శాతవాహన యూనివర్సిటీ ప్రచురించిన ఉత్తర తెలంగాణ చరిత్ర–సంస్కృతి, 'ఉత్తర తెలంగాణ పల్లె, సంస్కృతి', 'తెలంగాణ అలభ్య శాసనాలు, గ్రంథాలు' అనే పుస్తకాలు ముత్యం సంపాదకత్వంలో వెలువడ్డాయి. తెలంగాణ కళాకారిణి చిందుల ఎల్లమ్మను ఇంటర్వ్యూ చేసి ఆమె జీవిత వివరాలను 'నేను చిందు ఎల్లమ్మను', 'చిందుల ఎల్లమ్మ యాది'గా గ్రంథస్థం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంలో ఆయన రాసిన 'చిందుల ఎల్లమ్మ'ను తెలుగు అకాడమీ ప్రచురించింది. ఈ గ్రంథానికి 2007లో తెలుగు యూనివర్సిటీ పురస్కారం లభించింది. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, కష్టాల కొలిమిలో, త్యాగాలు చాళ్ళు పోసిన చిత్రకారుడు ఫణిహారం రంగాచారి జీవిత చరిత్రను 'మట్టి రంగును ఎంచుకొన్న కుంచె' పేరుతో వెలువరించారు. ఇక సొంత జిల్లా నిజామాబాదుపై స్వతస్సిద్ధ మమకారంతో ముత్యం జిల్లా అంతా తిరిగి పల్లె ప్రజల్లో నానుడిగా ఉన్న సామెతలను సేకరించి 'తెలంగాణ శాస్త్రాలు' అనే పేరుతో ఓ పుస్తకం ప్రచురించారు. స్వగ్రామానికి చెందిన రచయిత 'అగ్ని పూలు' పత్రికా సంపాదకులు స్వయం ప్రకాష్‌తో కలిసి 'బాచినపల్లి' పేరుతో తన కన్న ఊరు ఇతిహాసాన్ని వెలుగులోకి తెచ్చారు. చరిత్రాత్మక తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి, దానికి ఆయువుపట్టు అయిన ఆంధ్ర మహాసభకు నాయకత్వం వహించిన సర్వదేవభట్ల రామనాథం (ఈయన వందల ఎకరాల భూస్వామి. అయినప్పటికీ దున్నేవానికే భూమి అన్న కమ్యూనిస్టు పార్టీ పిలుపునకు స్పందించి తన భూమి ఆసాంతం సబ్బండ వర్గాలకు పంచిపెట్టిన త్యాగశీలి) చరిత్రను కమ్యూనిస్టు పార్టీలు సైతం విస్మరించినా ఎంతో శ్రమకోర్చి మిత్రుడు శివలింగంతో కలిసి 'కష్టాల కొలిమి, త్యాగాల పునాది, సర్వదేవభట్ల రామనాథం చరిత్ర'గా ఈ తరం వారికి ప్రజలకు అందించగలిగారు. అదే విధంగా ఖమ్మం జిల్లాలోని పిండిప్రోలు గ్రామం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి ఒక ప్రధాన స్థావరంగా ఉండేది. ఎందరో యోధులు ఆ గ్రామం కేంద్రంగా రజాకార్ల, యూనియన్ సైన్యంపై పోరాడి అసువులు బాసారు. ఆ గ్రామ చరిత్రను సైతం శోధించి రాయడం ముత్యం మాత్రమే చేయగలిగిన పని. అలాగే గిరిజన యోధుడు సోయం గంగులు జీవితాన్ని నవలీకరించారు. ముత్యం రచనా శైలి విశిష్టమైనది, విలక్షణమైనది. సరళతరంగా ఉండి సామాన్యుడికి సైతం చదవాలనే ఆసక్తి కలిగించేలా ఉంటుంది. వందేళ్ళ క్రితం జీవించిన ఓ వ్యక్తి జీవితం చిత్రించాలన్నా, లేక నాటి పోరాట గాథలు రాయాలన్నా చాలా పరిశోధన చేయవలసి ఉంటుంది. ముత్యం తన జీవిత కాలాన్ని ప్రజా ఉద్యమాల పరిశోధనకు, రచనా వ్యాసంగం కోసమే వినియోగించాడు.

ముత్యం తన నాలుగు దశాబ్దాల పరిశోధనా కృషిలో వందలాది వ్యక్తులతో నిర్వహించిన ఇంటర్వ్యూలు ఉన్నాయి. చరితార్థుల కుటుంబాలతో ఆయనకు ఏర్పడిన అనుబంధం చాలా గొప్పది. ఆయన పడ్డ శ్రమలో శ్రమైక జీవన సౌందర్యం నిండి ఉంది. మట్టిపరిమళం గుబాళిస్తుంది. ఒళ్ళు గగుర్పొడిచే చారిత్రక సన్నివేశాలకు ఆయన కల్పించిన అక్షర చిత్రాలు అద్భుతమైనవి. ఆ రచనా విధానం అనితరసాధ్యమైనది. ముత్యం సేకరించిన చారిత్రిక ఆనవాళ్లను, నిక్షిప్తం చేసిన జ్ఞాపకాలు ఛిద్రమైపోకుండా భద్రం చేసి భవిష్యత్తు తరాలకు అందించవలసిన బృహత్తర బాధ్యత విశ్వ విద్యాలయాలపై ఉన్నది. ఆ అసమాన పరిశోధనా కృషి వల్లే, డాక్టర్ కె. ముత్యం ఆగస్టు 20న మనకు శాశ్వతంగా దూరమయినా ఆయన పరిశోధనలు, పుస్తకాలు తెలుగు సమాజాలకు కలకాలం చైతన్య దివిటీలుగా వెలుగొందుతాయి.

• యన్. తిర్మల్

అవే తప్పులు మళ్లీ మళ్లీ చేస్తే, అదే ఫలితం!



> ఏ తప్పులు, ప్రగల్భాలు, అహంకారాలు బీఆరఎస్‌ను, కేసీఆర్‌ను గద్దె దించాయో, అవే అవలక్షణాలను కాంగ్రెస్, రేవంత్‌రెడ్డి పుణికి పుచ్చుకుంటే, ఇక ప్రజలకు దొరికిన 'మార్పు' ఏమిటి? ఊరూరా న్యూయార్క్‌ను, సింగపూర్‌ను, డల్లాస్‌ను ఏర్పాటు చేస్తామని గొప్పలు పోయిన కేసీఆర్ మాటలను కొందరు నిజమనుకున్నారు, చాలామంది హేళన చేశారు. మరి ఇప్పుడు, ఆ నగరాల నామస్మరణ కొత్తగా తిరిగి వినిపిస్తున్నది! చినుకు పడితే ఊరుచెరువయ్యే మహానగరానికి మోక్షం లేదు కానీ, నాలుగో నగరం పేరిట, గాలిమేడలు లేస్తున్నాయి! 30వేల కోట్ల రుణమాఫీయే ముక్కుతూ మూల్గుతూ చేస్తున్నప్పుడు, లక్షల కోట్ల ప్రాజెక్టులతో భారీ ప్రాజెక్టులు ఎట్లా సాధ్యం?



■ కె. శ్రీనివాస్

సందర్భం

ఓటమితో ఉన్న సమస్య ఏమిటంటే, అందులో జరిగే నష్టం కంటె అవమానం ఎక్కువ బాధిస్తుంది. ఓడిపోయినవారు తొందరగా సమాధానపడలేరు. నవీన్ పట్నాయక్ లాంటి గంభీరులు అరుదు. తమ తప్పేమీ లేదని, ప్రజలను ప్రత్యర్థులు మభ్యపెట్టారని కొందరు బుకాయిస్తారు. అంతా మంచే చేసినా ఇట్లా ఎందుకు జరిగిందో అర్థం కావడం లేదని మరి కొందరు అమాయకత్వాన్ని అభినయిస్తారు. సగం ఓటములతో మరో సమస్య. చావు తప్పి కన్ను లొట్టపోయిన తీరులో గెలుపులు దక్కుతాయి కొందరికి. తామేదో ఘనవిజయం సాధించినట్టు వారు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తుంటారు.

నష్టమో కష్టమో ఓటమో జరిగిపోయినప్పుడు, ఆ తరువాత అయినా వెనక్కి తిరిగి చూసుకోవాలి. అద్దం ముందు నిలబడి అంతరాత్మతో మాట్లాడాలి. పారిన నీటికి కరకట్ట కట్టలేము కానీ, రేపటి తప్పును నివారించుకోవచ్చు. గుణపాఠం అంటే అదే. అనుభవజ్ఞులు తక్కువ తప్పులు చేయడం, ఎదురుదెబ్బలను నిబ్బరంగా కాచుకోవడం అందువల్లనే.

కొందరు పాఠాలు నేర్చుకోవడంలోనూ తప్పులు చేస్తారు. ప్రజలను బాగా కష్టపెట్టి ఒక నాయకుడు పదవి పోగొట్టుకున్నాడనుకోండి. తగినంత కష్టపెట్టలేదు కాబట్టే, అలుసు తీసుకుని ఓడించారనీ, ఈ సారి అధికారం వస్తే, జనం అసలే కిక్కురుమనలేకుండా తొక్కిపెట్టాలనీ పాఠం నేర్చుకుంటే ఎట్లా ఉంటుంది? బొటాబొటి విజయంతో, అరువు బలంతో మూడోసారి కేంద్రంలో అధికారం దక్కించుకున్న జాతీయపార్టీ, పాపం, పాఠాలు నేర్చుకుందామనే చూస్తోందట, కానీ, ఆ పార్టీకి ఆశీస్సులు అందించే పీఠాధిపతులు, మతపెద్దలు కొందరు విలోమ పాఠాలు నేర్పుతున్నారట. "మునుపు మెత్తగా ఉన్నావు కాబట్టే, నిన్ను జనం మొత్తారు, ఇప్పుడు కఠినంగా ఉండు, జనం దారికి వస్తారు" అంటూ నాయకుడికి చెబుతున్నారట. ఆయన వింటాడో లేదో తెలియదు.

వాళ్లు చెప్పిన విలువలేమిటో తెలియదు కానీ, పోయిన రెండు దఫాలుగా అనుసరిస్తూ వస్తున్న కొన్ని పద్ధతులను మాత్రం జాతీయ అధికారపార్టీ మరింత ఉధృతంగా ముందుకు తీసుకువెడుతోంది. రెండు ప్రాంతీయ పార్టీల భుజాల మీద తాను నిలబడ్డానని మరచిపోయి, ప్రతిపక్ష, ప్రాంతీయ పార్టీల రాష్ట్ర ప్రభుత్వాల మీద ఆయుధాలు ఎక్కుపెడుతూ ఉన్నది. ప్రజల వాస్తవ, దైనందిన సమస్యలను పట్టించుకుని, ఆ దిశగా ఏవైనా దిద్దుబాటు చర్యలు తీసుకోవలసింది పోయి, పాత బాణీలోనే చాణక్య రాజకీయాలు నడుపుతోంది.

ముందున్న గండం, లేదా, అవకాశం, మహారాష్ట్ర ఎన్నికలు. వాటి తేదీలు ప్రకటించలేదు కానీ, ఈలోగా, హర్యానా, కశ్మీర్ ఎన్నికల ప్రక్రియ మొదలయింది. వీటిలో గణనీయమైన విజయాలు సాధిస్తే, ఎన్‌డీఏలో బీజేపీ వాటా పెరుగుతుంది. ఇతరుల మీద ఆధారపడే అవసరం తగ్గుతుంది. ఆ మేరకు, మద్దతు ఇస్తూ సాయపడుతున్న పార్టీల పలుకుబడి కూడా తగ్గుతుంది. అది బీజేపీకి చాలా అవసరం. పార్లమెంటు ఎన్నికలలో మహారాష్ట్రలో బాగా ఎదురు దెబ్బ తగిలింది. హర్యానాలో బాగానే బలహీనపడింది. పాఠం నేర్చుకుని పురోగమించాలనుకునే పార్టీ ఏమిచేయాలి? ప్రజల అసంతృప్తులను ఉద్దేశించి పనిచేయాలి. కానీ, వెనుకటి గుణం ప్రకారం, ఉద్వేగాలను ప్రయోగించడమనే అడ్డదారినే ఎంచుకుంటోంది.

ఆవేశరాజకీయాలను ఆశ్రయించాలన్నా అవకాశాలు రావాలి కదా, వస్తాయి, వచ్చాయి కూడా. ఒకటి, బంగ్లాదేశ్ పరిణామాలు. అక్కడ షేక్ హసీనా ప్రభుత్వం మీద వ్యతిరేకత తీవ్రమై, విద్యార్థుల ఆందోళనలు ఉధృతమై, కీలక రాజకీయ పరిణామాలు సంభవించాయి. షేక్ హసీనా భారత్‌కు పారిపోయి వచ్చిన తరువాత, జరిగిన సంఘటనలలో ఉద్యమకారులు, వారిపేరిట అరాచకశక్తులు విధ్వంసాలకు పాల్పడ్డారు. బంగ్లాదేశ్‌లోని మైనారిటీలైన హిందువుల మీద, వారి ఆస్తుల మీద, దైవస్థలాల మీద దాడులు జరిగాయి. వాటిలో అవామీలీగ్ మద్దతుదారులుగా జరిగిన దాడులు, మతపరమైన దాడులు కూడా ఉన్నాయి. సహజంగానే, అది భారత సమాజానికి ఆందోళన కలిగిస్తుంది. దౌత్యపరంగా ఒత్తిడి తేవడం, విజ్ఞప్తులు చేయడం మినహా భారత ప్రభుత్వం కూడా ఏమీ చేయలేకపోయింది. కానీ, తొందరలోనే బంగ్లాలో ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వం పరిస్థితిని చక్కదిద్దడానికి ప్రయత్నాలు మొదలుపెట్టింది. వెంటనే శాంతిభద్రతలు చక్కబడలేదు కానీ, భయపడినంత దీర్ఘకాలం పట్టలేదు. బంగ్లాదేశ్ పరిణామాల విషయంలో జాతీయ అధికారపార్టీ, దానికి పూర్తి మద్దతు ప్రకటించే ఆంగ్ల, హిందీ మీడియా, బాధ్యతాయుతంగా వ్యవహరించలేదు. భారతదేశంలోని హిందువులు బంగ్లాదేశ్‌లోని సాటి మతస్థుల భద్రత విషయంలో తీవ్ర భయాందోళనలకు గురిఅయ్యేట్టు మితిమీరిన ప్రచారం చేశాయి. వారి ప్రసారాల్లో వాస్తవం అసలే లేదని కాదు, కానీ, విపరీత వ్యాఖ్యానాలే ఎక్కువ. పోనీ, బంగ్లాలో రాజకీయ అస్థిరతను చక్కబరచడంలో భారత్‌కు ఏదైనా అవకాశం దొరికిందా, బంగ్లా హిందువులకు భద్రత కల్పించడంలో ఏదైనా సొంత చొరవ సాధ్యపడిందా అంటే అదీ లేదు. జాతీయ మీడియా ప్రచారం చేసినట్టు, అమెరికా ప్రాబల్యమో, చైనా తెరవెనుక మంత్రాంగమో పనిచేశాయి, సాధారణ స్థితివైపు బంగ్లాదేశ్ నెమ్మదిగా నడుస్తున్నది.

బంగ్లాదేశ్ గిట్టుబాటు కాకపోయినా, బెంగాల్ ద్వారా రాజకీయ లాభం బాగానే సాధ్యపడేట్టు ఉంది. మహిళా డాక్టర్, ఆస్పత్రి ఆవరణలోనే ఎదుర్కొన్న చిత్రహింస దారుణమైనది, అమానుషమైనది. ఆ దుర్మార్గాన్ని చెప్పడానికి భాష సరిపోదు. నిర్భయ సంఘటన తరువాత మగోన్మాదం తగ్గిందీ లేదు, స్త్రీల భద్రత విషయంలో యంత్రాంగాల సున్నితత్వం పెరిగిందీ లేదు. కోల్‌కతా సంఘటన తరువాత దేశవ్యాప్తంగా వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలు భయభ్రాంతులయ్యారు. మహిళాసంఘాలతో సహా పౌరసమాజం అంతా ఆగ్రహావేశాలు వ్యక్తం చేసింది. హైకోర్టు కల్పించుకుని కేసును సీబీఐకి ఇచ్చింది. సుప్రీంకోర్టు సొంతంగా ఈ దురంతం మీద విచారణ జరుపుతోంది. నేరాన్ని కప్పిపుచ్చడానికి, నేరం మీద నిరసనను అణచివేయడానికి మమతాబెనర్జీ ఎందుకంత క్రూరమైన చర్యలు చేపట్టారో తెలియదు. సందేశ్ కాళీ ఘోరాలను క్షమించి గెలిపించారు కానీ, ఈ నేరపూరిత నిర్లక్ష్యానికి మమత మూల్యం చెల్లించుకోవలసి వస్తుంది. అయితే, బీజేపీ, దాని అనుచర సమాచార సాధనాలు కోల్‌కతా సంఘటన మీద మోగిస్తున్న రణభేరిలో నిజాయితీ ఉన్నదా అన్న సందేహం కలిగితీరుతుంది. ప్రతిపక్ష రాష్ట్రం కాకపోతే, ఇంత గగ్గోలు చేసేవారా? కట్టెదుట నేరాలు జరుగుతుంటే కళ్లు మూసుకోవడం బీజేపీకి మాత్రం కొత్తదా? మణిపూర్ విషయంలో ఏమి జరిగింది? వినేశ్ ఫోగాట్ విషయంలో ఏమి చేశారు? మరి మహారాష్ట్రలో థానే జిల్లా బద్లాపూర్‌లో చిన్నారులపై జరిగిన లైంగిక హింస మీద కవరేజ్ ఎక్కడ? దాని మీద కేంద్రప్రభుత్వం కలవరపడదేమి? అక్కడ అస్మదీయ ప్రభుత్వం ఉన్నందుకే గొంతు లేవడం లేదా?

సిద్దరామయ్య మీద కేసు సంధించారు. గవర్నర్లను ఎడాపెడా వాడుకోవడంలో కేంద్రప్రభుత్వం ఆరితేరిపోయింది. కర్ణాటక ముఖ్యమంత్రి కడిగిన ముత్యమనీ, సుద్దపూసని అనుకోనక్కరలేదు, కానీ, దేశంలోని బీజేపీ ముఖ్యమంత్రులనేకుల కంటె మెరుగైన నాయకుడే. రాజకీయ నేతల మీద కేసులు పెట్టడానికి అవినీతి తీవ్రతో, విస్తృతో కారణం కానక్కరలేదు, ప్రతిపక్ష రాష్ట్రం అయితే చాలు. కేరళలో కూడా 2015 నాటి ఒక పాత కేసు ప్రాణం పోసుకుంటున్నది. రాష్ట్రాలను వేటాడే ఈ ధోరణి విషయంలో చంద్రబాబు, నితిశ్ కుమార్ నిరసన తెలిపినా తెలపకున్నా, తమ జాగ్రత్తలలో తాముండడం మాత్రం అవసరం. అవసరార్థం ఇప్పుడు అణకువ చూపిస్తున్నా, బలం పుంజుకున్నాక, బీజేపీ పెద్దన్న హజం చూపించదని ఏమీ లేదు. తన బలహీన విజయం గురించి పొరపాటు పాఠాలు తీసుకుంటే దాని ఫలితం బీజేపీయే అనుభవిస్తుంది. తమ ఘన విజయంలో ఇమిడి ఉన్న బాధ్యతను, అవకాశాలను, ప్రమాదాలను చంద్రబాబు గ్రహించి, మెళకువతో ఉండాలి.

గెలిచిన పార్టీ కూడా ఓడిన పార్టీ అనుభవం నుంచి నేర్చుకోవాలి. తెలంగాణలో బీఆరఎస్ స్వయంకృతాపరాధాన్ని తెలుసుకోకుండా, ప్రజలదే తప్పు అని హుంకరిస్తున్నది. మరి బీఆరఎస్ ఓటమి నుంచి కాంగ్రెస్ ఏమి నేర్చుకున్నది? ఏ తప్పులు, ప్రగల్భాలు, అహంకారాలు బీఆరఎస్‌ను, కేసీఆర్‌ను గద్దె దించాయో, అవే అవలక్షణాలను కాంగ్రెస్, రేవంత్‌రెడ్డి పుణికి పుచ్చుకుంటే, ఇక ప్రజలకు దొరికిన 'మార్పు' ఏమిటి? ఊరూరా న్యూయార్క్‌ను, సింగపూర్‌ను, డల్లాస్‌ను ఏర్పాటు చేస్తామని గొప్పలు పోయిన కేసీఆర్ మాటలను కొందరు నిజమనుకున్నారు, చాలామంది హేళన చేశారు. మరి ఇప్పుడు, ఆ నగరాల నామస్మరణ కొత్తగా తిరిగి వినిపిస్తున్నది! చినుకు పడితే ఊరుచెరువయ్యే మహానగరానికి మోక్షం లేదు కానీ, నాలుగో నగరం పేరిట, గాలిమేడలు లేస్తున్నాయి! 30వేల కోట్ల రుణమాఫీయే ముక్కుతూ మూల్గుతూ చేస్తున్నప్పుడు, లక్షల కోట్ల ప్రాజెక్టులతో భారీ ప్రాజెక్టులు ఎట్లా సాధ్యం?

> బీజేపీతో కలిసి బీఆరఎస్‌ను చెడుగుడు ఆడుకోవాలని కాంగ్రెస్ అనుకోవడం బాగానే ఉంది. కానీ, ఒకవేళ, బీఆరఎస్ అణగారిపోయిందా, తరువాతి కబళం తానేనని, బీజేపీ తలచుకుంటే కాలం చెల్లిన కేసులు కూడా నిద్రలేస్తాయని రేవంత్‌రెడ్డి గుర్తించి, జాగ్రత్తపడాలి.

ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇంకా మూడు నెలలు కూడా కాలేదు. ఎన్నికల వాగ్దానాలకు సంబంధించి, అక్కడ కూడా ఎన్నో సందేహాలు, ప్రశ్నలు ఉన్నాయి కానీ, ప్రజలు వేచి చూసే ధోరణిలోనే ఉన్నారు. కొత్త ప్రభుత్వాల మీద ప్రజలకు ఎంతకాలానికి అసంతృప్తి మొదలవుతుంది అంటే ఒకే సమాధానం రావడం కష్టం. ఎటువంటి పాలన మీద విరక్తి చెంది కొత్త ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారు అన్నదాని మీద కొంత, కొత్త పాలనలో కనిపించే సానుకూల సూచనల మీద మరికొంత ప్రజలు పెట్టే గడువు ఆధారపడి ఉంటుంది. జగన్ ప్రభుత్వమంత కాకపోయినా, రెండు దఫాల పాలనలో కేసీఆర్ ఏలుబడి కూడా తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుంది. దాన్ని తొలగించాక వచ్చిన కొత్త పాలనకు ప్రజలు గడువు ఇస్తున్నారు కానీ, తొమ్మిదినెలలు దాటింది కదా, కొంత పెదవి విరుపు మొదలయింది. కరెంటు పోయి వచ్చినప్పుడల్లా కేసీఆర్‌ను జనం తలచుకుంటున్నారని చెబుతున్నారు! ఆ సందర్భాలు రోజుకు పది పదిహేను సార్లు వస్తున్నట్టున్నాయి! అవినీతి అనో, అక్రమాలనో ఆరోపణలు పెద్ద ఎత్తున రావడం లేదు, కాకపోతే, పాలన మీద ఇంకా పట్టురాలేదని మాత్రం జనం బాగానే చెప్పుకుంటున్నారు!

బీజేపీతో కలిసి బీఆరఎస్‌ను చెడుగుడు ఆడుకోవాలని కాంగ్రెస్ అనుకోవడం బాగానే ఉంది. కానీ, ఒకవేళ, బీఆరఎస్ అణగారిపోయిందా, తరువాతి కబళం తానేనని, బీజేపీ తలచుకుంటే కాలం చెల్లిన కేసులు కూడా నిద్రలేస్తాయని రేవంత్‌రెడ్డి గుర్తించి, జాగ్రత్తపడాలి.

టీజీపీఎస్సీ నిర్ణయం సరికాదు

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అక్టోబర్‌లో నిర్వహించే గ్రూప్–1 మేయిన్స్ పరీక్షలను ఒక్క హెచ్ఎండీఏ పరిధిలోనే నిర్వహించాలని నిర్ణయించడం సరికాదు. ఈ పరీక్షలకు హాజరయ్యే 32 వేల అభ్యర్థులు హాస్టళ్లలో, హోటళ్లలో వారం రోజులు ఉంటూ పరీక్షలు రాయడం అనేది ఆర్థికంగానే కాక మానసికంగా, శారీరకంగా కూడా ఇబ్బందులు కలిగించేదే. దీనివల్ల అందరి అభ్యర్థుల సమాన అవకాశాలు అనేవి దెబ్బతింటాయి. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ మేయిన్స్ పరీక్షలను కేవలం పదమూడు వేల మందికి దేశవ్యాప్తంగా పరీక్ష నిర్వహించు చుండగా టీజీపీఎస్సీ కేవలం హైదరాబాద్‌లో మాత్రమే పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసం? ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా గ్రూప్–1 మేయిన్స్ పరీక్షలను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించేవారు. వికేంద్రీకరణ యుగంలో కూడా టీజీపీఎస్సీ తన సౌలభ్యం దృష్ట్యా గాక అభ్యర్థుల సౌకర్యార్థం దృష్ట్యా తెలంగాణ వ్యాప్తంగా ప్రముఖ నగరాల్లో అయినా నిర్వహించాలి.

– శాగ శ్రీనివాస్

'ఫార్మాసిటీ' చుట్టూ కొత్త మాయ!

రాజకీయ నాయకుల రంగులు మారుతుంటాయి. అది తెలియక, వెర్రి జనం నమ్ముతుంటారు. నాలిక చివర నుంచి వచ్చిన వాగ్దానాలు నిజం అనుకుని నమ్మి ఓట్లు వేస్తుంటారు. అయితే మా రంగారెడ్డి జిల్లాలో మాత్రం జరిగినది మామూలు మోసం కాదు, తడి గుడ్డతో గొంతు కోసినట్టయ్యింది. "ఫార్మా సిటీ వద్దురా, వ్యవసాయం ముద్దురా", అని నినదించి, ఒక్క తాటిపైకి వచ్చి, అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న రైతులకి "మేమున్నాం మీకు, మీ భూములని మేము కాపాడుతాం" అని వత్తాసు పలికిన కాంగ్రెస్ నాయకులందరూ ఈ రోజు మడమ తిప్పి మాట మార్చారు.

ఆనాడు స్వయానా ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ధర్నా చౌక్ సభలో, మా కుర్మిద్ద అనసూయమ్మ చేతిలో చెయ్యేసి, "నువ్వు చాకలి అయిలమ్మ లెక్క పోరాటం చేస్తున్నావ్ అక్క, నీ భూమి పోకుండా నేను కాపాడుతా" అని మాట ఇచ్చారు. ఇంక పాదయాత్ర చేస్తున్నప్పుడు, కల్వకుర్తి వద్ద కలవటానికి వచ్చిన రైతుల్లో, తాటిపర్తి రైతు కుందారపు నారాయణ, తన ఉద్వేగాన్ని ఆపుకోలేక, "మమ్మల్ని కాపాడే దేవుడవు నీవే, అహో రేవంత్‌రెడ్డి" అని పద్యం అందుకుని, అతన్ని కౌగిలించుకుని ఏడ్చాడు. ఆ రోజు తీసిన ఫోటో రేవంత్‌రెడ్డి ప్రచారానికి బాగా పనికివచ్చింది. ఆ తర్వాత జరిగిన ప్రతి మీటింగ్‌లో ఆ ఫోటోతో హోర్డింగులు పెట్టారు. కుర్మిద్ద, మేడిపల్లి గ్రామాల్లో మీటింగులు పెట్టినప్పుడు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, "కాంగ్రెస్ పార్టీ పేదలకిచ్చిన అసైన్డ్ భూములు కేసీఆర్ బలవంతంగా గుంజుకున్నాడు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఫార్మా సిటీ రద్దు చేసి, రైతుల భూములు తిరిగి ఇచ్చేస్తాం" అన్నారు. తీసుకున్న భూమి సంగతి దేవుడెరుగు, ఇప్పుడు భూములు ఇవ్వమని కోర్టు నుంచి స్టే తెచ్చుకున్న రైతుల భూములకే ఎసరు పెడుతున్నారు. సీతక్క కూడా కుర్మిద్ద భూములలో "ఫార్మా సిటీ వద్దురా, వ్యవసాయం ముద్దురా" అంటూ రైతులతో కలిసి పాదయాత్ర చేశారు. ఇక ఇక్కడి మాజీ ఎమ్మెల్యే వంశీచంద్ రెడ్డి అయితే, తన నియోజకవర్గంలో ఉన్న కడ్తాల్ మండలంలో ఒక్క ఎకరా భూమి కూడా తీస్కోనియ్యలేదు. మరి ఇప్పుడు మెగాసిటీ కోసం కడ్తాల్ మండలంలో కూడా భూమి తీస్కుంటాం అంటున్నారు. కాని అయన నుంచి ఎటువంటి స్పందనా లేదు.

శాసనసభ ఎన్నికల ముందు, ఎందుకైనా మంచిదని, "నేను ఎమ్మెల్యేగా గెలిస్తే, ఫార్మా సిటీ రద్దు చేయిస్తాను, ఫార్మా సిటీ కోసం జరుగుతున్న భూసేకరణ రద్దు చేయిస్తాను" అని హామీ పత్రం మాకు ఇవ్వండి అని రైతులు ఒక హామీ పత్రం పైన సంతకం చెయ్యండని ఎమ్మెల్యే అభ్యర్థి మల్రెడ్డి రంగారెడ్డి గారిని కోరారు. "నేను పార్టీ అధిష్ఠానాన్ని అడగాలి" అని ఆయన అన్నారు. ఆ పత్రం పైన సంతకం కాలేదు. మాకు ఫార్మా సిటీ రద్దు, భూసేకరణ రద్దు చేస్తాం అని మేనిఫెస్టోలో పెట్టాలి అని రైతులు డిమాండ్ చేసారు. అతి కష్టం మీద, "ఇబ్బందికర ఫార్మా సిటీని రద్దు చేస్తాం" అని మాత్రం మేనిఫెస్టోలో పెట్టారు. భూసేకరణ విషయం పెట్టలేదు. అప్పుడే అనుమానం రావాల్సి ఉంది. కానీ భూములు నిలుస్తాయన్న నమ్మకంతో రైతులే ఇల్లిల్లు తిరిగి, కాంగ్రెస్ గెలిస్తే మన భూములు కాపాడతారు అని చెప్పి, ఓట్లు వేయించి కాంగ్రెస్‌ని గెలిపించారు. గెలిచిన వెంటనే రేవంత్‌రెడ్డి "ఫార్మా సిటీని రద్దు చేస్తున్నాం" అని ప్రకటించారు. జనం అయన ఫోటోకి పాలాభిషేకం చేసారు. ఇంకేముంది అన్ని బాధలు తీరినట్టే అనుకున్నారు.

> ఎందుకు మార్పు జరగటం లేదో, ఇప్పుడిప్పుడే రైతులకి అర్థం అవుతోంది: కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి, ఇచ్చిన మాట ప్రకారం భూసేకరణ రద్దు చెయ్యాలన్న ఉద్దేశం ఎప్పుడూ లేదు. అందుకే పార్టీ మేనిఫెస్టోలో ఆ విషయం రాయలేదు. చెప్పేది ఒకటి, చేసేది మరొకటి. అదే రాజకీయం. రైతు రాజ్యం అని చెప్పే నాయకులందరూ రైతులే భూములని త్యాగాలు చెయ్యాలని అంటారు. నేత ఎవరైనా పాలసీ మాత్రం ఒక్కటే!



గత ప్రభుత్వం కోర్టు స్టేకి వ్యతిరేకంగా, ఆన్‌లైన్‌లోంచి రైతుల పేర్లు తీసేసి, రైతులకి రైతు బంధు, క్రాప్ లోన్లు రాకుండా వారి భూములని నిషేధిత జాబితాలో పెట్టింది. కాంగ్రెస్ నాయకులందరూ అప్పట్లో "ఇది అన్యాయం, మేం అధికారంలోకి రాగానే, మీ పేర్లు ఆన్‌లైన్‌కి ఎక్కించి మీకు అన్ని హక్కులూ వచ్చేలా చేస్తాం," అన్నారు. డిసెంబర్‌లో ఫార్మా సిటీ రద్దు అయినప్పటి నుంచి ఇప్పటి వరకు రైతులు ఎన్నిసార్లు అడిగినా, "ఏవో సాంకేతిక కారణాలు ఉన్నాయి" అని కొన్ని నెలలు చెప్పుకుంటూ వచ్చి, ఆ తర్వాత "ఎలక్షన్ కోడ్ ఉంది, ఎంపీ ఎలక్షన్ అవ్వగానే మీకు రైతుబంధు పడుతుంది, మీ భూములను నిషేధిత జాబితా నుంచి తీసివేస్తాం" అన్నారు. జూన్ నెలలో ఎలక్షన్ కోడ్ అయిపోయింది. "సీఎం గారు మంచి ప్రాజెక్ట్ అనౌన్స్ చేసారు, ఈ ప్రాంతం రూపు రేఖలు మారిపోతాయి, బోల్డంత అభివృద్ధి జరుగుతుంది. కాకపోతే, మధ్యలో ఉన్న రైతులు నష్టపోవాల్సి ఉంటుంది, మీకు మంచి పరిహారం ఇప్పిస్తాము" అంటూ స్థానిక నాయకులు, కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ముదిరెడ్డి కోదండరెడ్డి రైతులతో చర్చలు మొదలుపెట్టారు. "అదేంటి, ఇన్ని ఏండ్లు మీరు మా భూములు కాపాడతామని చెప్పి ఇప్పుడు ఇలా అంటారేమిటి?" అని అడిగితే, "మీకు ఫార్మా సిటీ రద్దు చేసాం కదా, ఇంకేం కావాలి?" అని జవాబు. "మా భూములు పోయాక, ఏమొస్తే, మాకేంటి? అప్పుడేమో భూములు కాపాడతాం అన్నారు, ఇప్పుడు ఇదేంటి?" అని అడిగితే, నయా నగరికి రైతులు సహకరించాలి, మేము మీకు అండగా ఉంటాం, మీ విషయాలు ముఖ్యమంత్రి గారికి తెలియచేస్తాం అంటున్నారు. కాని పరిస్థితిలో మార్పు లేదు.

ఎందుకు మార్పు జరగటం లేదో, ఇప్పుడిప్పుడే రైతులకి అర్థం అవుతోంది: కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి, ఇచ్చిన మాట ప్రకారం భూసేకరణ రద్దు చెయ్యాలన్న ఉద్దేశం ఎప్పుడూ లేదు. అందుకే పార్టీ మేనిఫెస్టోలో ఆ విషయం రాయలేదు. ఒక పక్కన ఎలక్షన్ కోడ్ ఉంది, టెక్నికల్ సమస్యలు ఉన్నాయి అంటూ స్థానిక నాయకులు కోదండరెడ్డి ద్వారా రైతులు మళ్ళీ ఉద్యమబాట పట్టకుండా జాగ్రత్తపడుతూ, ఫార్మా సిటీ భూసేకరణ చట్ట ప్రకారం చెల్లదని, భూసేకరణలో ఇచ్చిన అవార్డులని రద్దు చేస్తూ గౌరవ హైకోర్టు ఇచ్చిన తీర్పు సరైనది కాదని, ఏప్రిల్ 2024 లోనే ఆ తీర్పుపై అప్పీల్ వేయడానికి చర్యలు చేపట్టారు. అంటే, బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన ఏ భూసేకరణ అన్యాయం అన్నారో, హైకోర్టు కూడా తప్పు పట్టిందో, ఈ రోజు అదే భూసేకరణను సమర్థిస్తూ రైతుల భూములని తీసుకునేందుకు మాకు తీర్పు ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం కోర్టుని కోరుతోంది.

ఫార్మా సిటీ రద్దు డిమాండ్, కాంగ్రెస్ వాళ్లకి తంతే బూరెల గంపలో పడినట్టు అయ్యింది. ఫార్మా సిటీ రద్దు అనగానే, కొన్ని విమర్శలు వెల్లువెత్తాయి. దానికి రేవంత్‌రెడ్డి గారు వివరణ ఇస్తూ, "నేను ఫార్మా సిటీ రద్దు అన్నా, కాని దానికి బదులు ఫార్మా విలేజ్‌లు అంటున్నా. హైదరాబాద్‌కి కూతవేటు దూరంలో ఇన్ని ఫార్మా కంపెనీలు ఉంటే, ఆ కాలుష్యం భరించలేం, కాబట్టి ఔటర్ రింగ్ రోడ్‌కి దగ్గరగా పది చోట్ల ఫార్మా విలేజ్‌లు పెడతాం" అని చెప్పి, ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ, పది జిల్లాల్లో కలిపి ఇంకో 20,000 ఎకరాలు భూసేకరణ చెయ్యటానికి రంగం సిద్ధం చేసారు. అంటే ఇక్కడ ఫార్మా సిటీ కోసం సేకరించిన భూమితో పాటు ఇంకో 20,000 ఎకరాలకి ఎసరు పెడుతున్నారు.

ఇప్పటికే వికారాబాద్ జిల్లా దుద్యాల గ్రామంలో ఈ భూసేకరణకి 2017 భూసేకరణ చట్టం ప్రకారం నోటిఫికేషన్ జారీ చేసారు. తమ యూపీఏ–2 ప్రభుత్వం చేసిన 2013 భూసేకరణ చట్టానికి బీఆర్ఎస్ – బీజేపీ ప్రభుత్వాలు కలిసి తెచ్చిన సవరణలను ఆ రోజు వ్యతిరేకించి, నేడు అధికారంలోకి వచ్చిన తరువాత ఆ సవరణ చట్టమే వారికి ముద్దవ్వడం ప్రజలను వంచించడమే! అప్పుడు హైకోర్టు ఇచ్చిన తీర్పుని హర్షించిన కాంగ్రెస్ నాయకత్వం, నేడు ఆ తీర్పునే ప్రశ్నిస్తూ రైతులకి వ్యతిరేకంగా అప్పీల్ చేసింది. ఇంకో విషయం, అప్పుడు పేదల భూములు కంపెనీలకి ఇస్తే అది భూ దందా అవుతుంది, "రాష్ట్ర ముఖ్యమంత్రివా, రియల్ ఎస్టేట్ బ్రోకర్‌వా" అని తిట్టినవాళ్లు ఈ రోజు రైతులు సహకరించాలి, మంచి కంపెనీలు వస్తున్నాయి, రైతుల త్యాగాలతోనే అభివృద్ధి జరుగుతుంది" అంటున్నారు! చెప్పేది ఒకటి, చేసేది మరొకటి. అదే రాజకీయం. రైతు రాజ్యం అని చెప్పే నాయకులందరూ రైతులే భూములని త్యాగాలు చెయ్యాలని అంటారు. నేత ఎవరైనా పాలసీ మాత్రం ఒక్కటే!

■ కవుల సరస్వతి



హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో..



భూపాలపల్లి జిల్లా ఆస్పత్రిలో..



ములుగు జిల్లా ఆస్పత్రిలో..



మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో..



ఎంజీఎం ఆస్పత్రిలోని జ్వరాల వార్డులో చికిత్స పొందుతున్న చిన్నారులు



జనగామ జిల్లా ఆస్పత్రిలో..

ఆంధ్రజ్యోతి ఫోకస్

జ్వర పంజా

ఉమ్మడి జిల్లాలో సీజనల్ వ్యాధుల విజృంభణ

- డెంగీ, మలేరియా, తదితర జ్వరాలతో మంచం పడుతున్న జనం
- వైద్యం కోసం ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు క్యూ

వివరాలు : 7లో..

జ్వరాలు పంజా విసురుతున్నాయి. అసలే వర్షాకాలం.. మరోవైపు పారిశుధ్య నిర్వహణ లోపంతో అపరిశుభ్రంగా మారుతున్న పరిసరాలు, దోమల వ్యాప్తి ఇందుకు కారణమవుతోంది. సీజనల్ వ్యాధుల నియంత్రణకు యంత్రాంగం చర్యలు చేపడుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం జటిలంగా మారుతోంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లాంటి జ్వరాలు వ్యాప్తి చెందుతుండటం జనాలను కలవర పెడుతోంది. ఓ వైపు ప్రతీ ఇంట్లో ఒకరిద్దరు జ్వరబాధితులు ఉంటుండగా.. మరోవైపు చికిత్స కోసం వస్తున్న బాధితులతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. హనుమకొండ ఎంజీఎం, వరంగల్, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి, జనగామ జిల్లా ఆసుపత్రులతో పాటు పీహెచ్‌సీల్లోని వార్డులు నిండిపోతున్నాయి. ఉమ్మడి జిల్లాకు ఎంతో కీలకమైన ఎంజీఎం ఆస్పత్రిలో పిల్లల వార్డుతోపాటు జనరల్ మెడిసిన్ విభాగంలో మంచానికి ఇద్దరు చొప్పున రోగులు చికిత్స పొందుతుండగా మిగిలిన వార్డులు కూడా కిటకిటలాడుతున్నాయి. ఈ క్రమంలోనే మరణాలు కూడా సంభవిస్తుండటంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఇక ఈ జటిల పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకుంటున్న ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు దందాకు తెరలేపుతున్నారు. చికిత్సలు, నిర్ధారణ పరీక్షల పేరుతో ఎక్కువ మొత్తంలో గుంజుతున్నారని, ప్లేట్‌లెట్స్ ఎక్కించేందుకు ఆస్పత్రి స్థాయిని బట్టి రూ.11వేల నుంచి రూ.15వేల వరకు చార్జ్ చేస్తున్నట్టు తెలుస్తోంది.



- రెండేళ్లుగా మంజూరు కాని వైనం
- ఇంకా వెలువడని రాష్ట్ర ప్రభుత్వ ప్రకటన
- ఎదురుచూస్తున్న లబ్ధిదారులు

కొత్త పింఛన్లకు మోక్షమెప్పుడో?

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు21: కొత్త పింఛన్లకు మోక్షం కలగడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడు మంజూరు చేస్తుందా? అని జిల్లావ్యాప్తంగా వేలాది మంది లబ్ధిదారులు కొండంత ఆశతో ఎదురుచూస్తున్నారు. వివిధ రకాల పింఛన్లు పొందడానికి అన్ని అర్హతలున్న లబ్ధిదారులు తమకు పెన్షన్ ఎప్పుడు వస్తుందో? అని మథన పడుతున్నారు.

2022 నుంచి రాని పింఛన్లు

2022 సంవత్సరం ఆగస్టు నెలలో మంజూరైన పింఛన్లు.. ఇప్పటికీ రెండేళ్లు దాటినా ఒక్క కొత్త పింఛన్ కూడా మంజూరు కాలేదు. కొత్త పింఛన్‌ల కోసం లబ్ధిదారులు వేల సంఖ్యలో దరఖాస్తు చేసుకుంటున్నారు. ప్రతీ నెల పింఛన్ల కోసం దరఖాస్తులు వెల్లువెత్తుతున్నప్పటికీ మంజూరుకు మాత్రం నోచుకోవడం లేదు. పింఛన్ల కోసం లబ్ధిదారులు స్థానిక ఎంపీడీవో కార్యాలయాలు, మునిసిపల్ కార్యాలయాలు, ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి వచ్చి దరఖాస్తులు సమర్పిస్తున్నా.. మోక్షం కలగడం లేదు.

ప్రజావాణికి లబ్ధిదారుల క్యూ

ప్రతీ సోమవారం హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి పింఛన్ల దరఖాస్తులే ఎక్కువగా వస్తున్నాయి. గ్రీవెన్స్‌లో పదుల సంఖ్యలో లబ్ధిదారులు దరఖాస్తులు అధికారులకు ఇస్తున్నారు. ఒక్కో లబ్ధిదారుడు సుమారు 7, 8 వారాలుగా తిరుగుతున్నా మంజూరు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజావాణిలో పింఛన్ల కోసం వచ్చే దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నాయి.

పట్టించుకోని ప్రభుత్వం

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఆగస్టులో కొత్త పింఛన్లను మంజూరు చేస్తామని ప్రభుత్వ ముఖ్యులు ప్రకటించారు అయితే ఆగస్టు నెల పూర్తవుతున్నా.. మంజూరు చేయకపోవడంతో లబ్ధిదారుల్లో అయోమయం నెలకొంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పెట్టిన ఆసరా పింఛన్లను కాంగ్రెస్ ప్రభుత్వం చేయూత పథకంగా మార్చింది తప్ప.. అధికారంలోకి వచ్చి 8నెలలు కావొస్తున్నా ఇప్పటివరకు ఒక్క కొత్త పెన్షన్ మంజూరు చేయలేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పింఛన్ల మంజూరుపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రావడం లేదు. దీంతో దరఖాస్తులను అధికారులు పక్కన పెడుతున్నారనేది స్పష్టంగా తెలుస్తోంది.

నాలుగేళ్ల నుంచి ఎదురుచూస్తున్నా..

\- పి.విజయ వితంతువు, ఆత్మకూరు



"నాలుగేళ్ల నుంచి వితంతు పింఛన్ రావడం లేదు. ఆత్మకూరు ఎంపీడీవో కార్యాలయంలో చాలాసార్లు దరఖాస్తు చేసుకున్నాను. రెండు, మూడుసార్లు కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి వచ్చి దరఖాస్తు ఇచ్చాను. ప్రభుత్వం, అధికారులు స్పందించి వెంటనే నాకు పింఛన్ మంజూరు చేయాలి."

జిల్లాలో పింఛన్‌దారులు	
వృద్ధులు	39,235
వితంతువులు	36,949
వికలాంగులు	13,857
కల్లుగీత కార్మికులు	2,913
చేనేత కార్మికులు	1,947
బీడీ కార్మికులు	3,486
ఒంటరి మహిళలు	2,594
ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు	2,878
ఫైలేరియా బాధితులు	528
డయాలసిస్ బాధితులు	61



విలువిద్యలో అంతర్జాతీయ గుర్తింపు

- గ్రామీణ విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తున్న ఆర్డీఎఫ్
- త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి
- కల్లెడ కళాశాలలో సిబ్బంది క్వార్టర్లు ప్రారంభం

6



సమావేశంలో మాట్లాడుతున్న వినయభాస్కర్

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్
- నేడు ఏకశిలాపార్కు వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా

రాంనగర్, ఆగష్టు 21: రైతులందరికీ పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం హనమకొండలోని ఏకశిలా పార్కు వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన పార్టీ ముఖ్యుల సమావేశంలో మాట్లాడారు. గత కేసీఆర్ ప్రభుత్వం రైతులను రాజులను చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్లపాలు చేస్తోందని ఆరోపించారు. రుణమాఫీ చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి లబ్ధిపొందిన కాంగ్రెస్ కొందరి రుణాలను మాత్రమే మాఫీ చేసి, మిగతావారిని మోసం చేసిందని ధ్వజమెత్తారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ అయ్యేవరకు రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని తెలిపారు. సమావేశంలో మాజీ జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, కార్పొరేటర్లు అశోక్ యాదవ్, చెన్నం మధు, లోహిత రాజు, సోదా కిరణ్, నర్సింగ్, నేతలు జోరిక రమేశ్, వేణు, యాదగిరి, జనార్ధన్‌గౌడ్, పులి రజనీకాంత్, నరెడ్ల శ్రీధర్, బండి రజనీకుమార్, రవీందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా రాజశేఖర్‌రెడ్డి



వరంగల్ లీగల్, ఆగస్టు 21: రైల్వే కేసుల పరిష్కారం కోసం ప్రత్యేక జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా కె.రాజశేఖర్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు బుధవారం ప్రకటన వెలువరించారు. ఆయన ఈ పోస్టులో యేడాదిపాటు కొనసాగుతారు. రైల్వేకు సంబంధించిన కేసులు కాజీపేటలోని రైల్వే కోర్టులో పరిష్కరిస్తారు.

నగరంలో సీపీఐ జాతీయ సమావేశాలు

- నేటి నుంచి 24 వరకు నిర్వహణ
- హనుమకొండలో ఎర్రజెండాలతో స్వాగత ఏర్పాట్లు పూర్తి



బాలసముద్రం, ఆగస్టు 21: సీపీఐ జాతీయ సమావేశాలకు హనుమకొండ వేదికగా మారింది. తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ నిర్మాణ సమావేశాల కోసం హనుమకొండలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ఆధ్వర్యంలో నగరంలో ఎర్రజెండాలతో స్వాగత ఏర్పాట్లు బుధవారం పూర్తి చేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్క ళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. హనుమకొండలోని హరి త కాకతీయ హోటల్ వేదికగా గురువారం నుంచి 24 వతేదీ వరకు మూడు రోజుల పాటు సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా సీపీఐ జాతీయ ప్రధాన కార్య దర్శి, మాజీ ఎంపీ డి.రాజా జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, మాజీ ఎంపీ అజీజ్‌పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మె ల్యే కూనంనేని సాంబశివరావు హాజరుకానున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహంతో పాటు భవిష్యత్ కార్యాచరణను రూపొందించ డంపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నగరంలో ప్రధాన కూడళ్లలో వాల్‌రైటింగ్, సీపీఐ జెండాలను ఏర్పాటు చేసినట్లు శ్రీనివాసరావు, కర్రె భిక్షపతి తెలిపారు.

ప్రభుత్వాస్పత్రుల్లో నాణ్యమైన వైద్యం అందించాలి

- బయోమెట్రిక్ ద్వారా డాక్టర్లు హాజరు నమోదు చేసుకోవాలి
- సూపరింటెండెంట్లకు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 21: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు వైద్యులు నాణ్యమైన వైద్యం అందించాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం ఆస్పత్రుల నిర్వహణపై కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది బయోమెట్రిక్ యంత్రాల ద్వారా హాజరు నమోదు చేసుకోవాలన్నారు. ప్రతీ ఆస్పత్రిలో బెడ్లకు, వార్డులకు నెంబర్లు వేసి రోగుల వివరాలను బోర్డులపై ప్రదర్శించాలన్నారు. ప్రతీ ఆస్పత్రిలో తాగునీరు, శానిటేషన్, విద్యుత్, జనరేటర్, ప్లంబింగ్, డీజిల్ వాడకం, శివరేజికి సంబంధించిన రిజిస్టర్‌లను నిర్వహించాలన్నారు. వాటిని సూపరింటెండెంట్‌లు ప్రతీ రోజు లేదా రెండు రోజులకోసారి తనిఖీ చేయాలన్నారు. ఆస్పత్రుల్లోని వార్డులలో ఉన్న లైట్లు, ఫ్యాన్ల మరమ్మతుల వివరాలను నమోదు చేయాలని తెలిపారు. ఆస్పత్రులకు వచ్చే నిధులను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. ప్రతీ ఆస్పత్రిలో రాజీవ్ ఆరోగ్యశ్రీలో నమోదైన జబ్బుల వివరాల జాబితా ఉంచాలని అధికారులను ఆదేశించారు. టీబీ ఆస్పత్రికి అంబులెన్స్ కోసం ప్రతిపాదనలు పంపించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఆర్డీవోలు నారాయణ, వెంకటేష్, డీఎంహెచ్‌వో డాక్టర్ లలిత, వివిధ ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, అధికారులు పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ సేకరణలో వేగం పెంచాలి

నేషనల్ హైవే భూసేకరణలో వేగం పెంచాలని ఆర్అండ్‌బీ సెక్రెటరీ దాసరి హరిచందన కోరారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణ పనులకు సంబంధించి భూ సేకరణ పనుల పురోగతిపై అటవీ, పర్యావరణ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వికాస్‌రాజ్‌తో కలిసి సంబంధిత జిల్లాల కలెక్టర్‌లతో బుధవారం రాత్రి హరిచందన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా హరిచందన మాట్లాడుతూ.. గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, రైతులతో మాట్లాడి వారి న్యాయమైన సమస్యలను నెరవేర్చాలన్నారు.

కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే భూసేకరణకు 1,195 మంది రైతుల నుంచి 141 హెక్టార్ల భూమిని గుర్తించామని, దీనిలో 118 హెక్టార్ల భూమి సేకరించి జాతీయ రహదారుల అథారిటీకి ఇచ్చామన్నారు. 23 హెక్టార్ల భూమికి సంబంధించి కోర్టులో రెండు కేసులు ఉన్నా యని, 38 మంది రైతులకు ఆర్బిట్రేషన్ ఆర్డర్స్ జారీ చేశామన్నారు. ఇప్పటివరకు భూసేకరణకు సంబంధించి రైతులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించామని, నిర్ణయించిన ధరకు రైతులు ఒప్పుకోలేదన్నారు. రైతులతో మరొకసారి సమావేశం ఏర్పాటు చేసి భూ సేకరణ పనులను పూర్తి చేస్తామని కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఆర్డీవోలు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణను పారదర్శకంగా నిర్వహించాలి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- చింతగట్టులో భూముల పరిశీలన



చింతగట్టులో ఎల్ఆర్ఎస్ దరఖాస్తు భూములను పరిశీలిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 21: భూ క్రమబద్ధీకరణ పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. గ్రేటర్ పరిధిలోని భీమారం, చింతగట్టు ప్రాంతాల్లో ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తుదారుల భూములను బుధవారం సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో సందర్శించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో క్రమబద్ధీకరణ చేసే భూములు, ప్లాట్ల వివరాలను నిబంధనల మేరకు పకడ్బందీగా నమోదు చేయాలన్నారు. ఎఆర్ఎస్ నమోదు చేసే సమయంలో ప్రభుత్వ భూములకు నష్టం కలుగకుండా, నీటి వనరులు, కాలువలు, చెరువులు ఆక్రమణలు జరుగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల స్క్రూటినీ కట్టుదిట్టంగా నిర్వహించి సకాలంలో క్రమబద్ధీకరణ పూర్తి చేయాలన్నారు. అసంపూర్తిగా ఉన్న దరఖాస్తులను పరిశీలించి దరఖాస్తుదారుడికి సమాచారం అందించి పూర్తి వివరాలను సేకరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ సిటీ ప్లానర్ రవీంద్ర రడేకర్, ఏసీపీలు శ్రీనివాస్‌రెడ్డి, రజిత, ఈర్షద్, టీపీఎస్‌లు పాల్గొన్నారు.

పన్నులు వసూళ్లలో పురోగతి అవసరం

పన్నుల వసూళ్లలో బల్దియా సిబ్బంది పురోగతి సాధించాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. బుధవారం బల్దియా కార్యాలయంలో వార్డు ఆఫీసర్‌లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. ఈ యేడు ఆర్థిక సంవత్సరం మొదలై ఐదు మాసాలు గడుస్తున్నా 32.12 శాతం మాత్రమే పన్నుల వసూళ్లు జరిగాయని, ఇంకా వేగంగా ముందుకు వెళ్లాలని అన్నారు. ఆశించిన విధంగా పురోగతి లేదని, డిమాండ్‌కు తగిన వసూళ్లు జరగలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంకా వార్డు అధికారులకు కేటాయించిన ప్రాంతంపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. వార్డు ఆఫీసర్‌లకు ఇచ్చిన లక్ష్యం ప్రకారం ప్రతీ నెల 5 నుంచి10 లక్షలు వసూలు చేయాలని ఆదేశించినా కొన్ని రోజులుగా ఎలాంటి పన్ను వసూళ్లు జరగలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యటు ఉంటాయని హెచ్చరించారు. ఆర్ఐలు, ఆర్‌వోలు పన్ను వసూళ్లపై పర్యవేక్షించాలని చెప్పారు. అదనపు కమిషనర్ చింతకుంట్ల రవీందర్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి, పన్నుల విభాగం అధికారి బిర్రు శ్రీనివాస్, ఆర్ఐలు, ఆర్‌వోలు పాల్గొన్నారు.

అర్హులకు ఉపాధి యూనిట్లు కేటాయించండి

అర్హులైన స్వయం సహాయక మహిళా సంఘాలకు యుద్ధ ప్రాతిపదికన ఉపాధి యూనిట్లను కేటాయించాలని బల్దియా కమిషనర్

మిగతా 8వ పేజీలో..

విలువిద్యలో అంతర్జాతీయ గుర్తింపు

● గ్రామీణ విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తున్న ఆర్డీఎఫ్ ● త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి



పర్వతగిరి, ఆగస్టు 21: ఆర్చరీ అకాడమీ ఏర్పాటు చేసి విలువిద్యలో విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసి ఎన్నో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పతకాలు సాధించిన ఘనత రూరల్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ (ఆర్డీఎఫ్)దేనని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడలో ఆర్డీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వనితా అచ్యుతాపాయ్ జూనియర్ కళాశాలలో అధ్యాపకులకు నిర్మించిన క్వార్టర్లు, ఒకేషనల్ కోర్సులు, ల్యాబ్‌లను నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితో కలిసి బుధవారం ప్రారంభించారు. తొలుత పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఆర్డీఎఫ్ ఆర్చరీ అకాడమీలో విలు విద్యకారులతో మాట్లాడి విల్లు ఎక్కుపెట్టారు. పొలంలో పురుగుల మందును పిచికారీ చేసే డ్రోన్ పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గవర్నర్ మాట్లాడుతూ 26ఏళ్ల క్రితం ఆర్డీఎఫ్‌ను స్థాపించి విద్యాలయాలను ఏర్పాటు చేయడమే గాకుండా, వివిధ ప్రాంతాలకు బ్రాంచ్‌లను విస్తరించడం ఆనందంగా ఉందన్నారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా గ్రామీణ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందిస్తున్న ఆర్డీఎఫ్ సేవలు అభినందనీయమన్నారు. గ్రామంలో గతంలోనే కమ్యూనిటీ టాయిలెట్లను నిర్మించారని, కాలేజీ స్టాఫ్ కోసం డబుల్‌బెడ్రూం క్వార్టర్లు నిర్మించడంపై రామ్మోహన్‌రావుకు విద్యపై ఉన్న ఆసక్తిని తెలియజేస్తుందన్నారు. సంస్థకు విరాళాలు అందించే దాతలకు సైతం సంస్థలో విద్యనభ్యసించే విద్యార్థుల ఫలితాలు కూడా ఉత్తేజపరుస్తున్నాయన్నారు. బాలికల విద్యను పెంపొందించాలనే ఉద్దేశంతో పాఠశాల, కళాశాలలో బాలికలకు 50శాతం సీట్లు కేటాయిస్తూ, తల్లిదండ్రులు లేని విద్యార్థులకు ఉచిత విద్య, వసతి కల్పిస్తున్నారని అన్నారు.

నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నో ఒడిదుడుకులు వచ్చినా అంకితభావంతో పనిచేస్తున్న ఆర్డీఎఫ్ ఫౌండర్ మెంబర్ ఎర్రబెల్లి రామ్మోహన్‌రావును అభినందించారు. ఆయన తండ్రి వెంకట్రామనర్సయ్య సైతం గతంలో సేవాభావంతో ఎన్నో పనులను చేశారని, జిల్లా పరిషత్ తొలి చైర్మన్‌గా, సొసైటీ అధ్యక్షుడిగా సేవలందించారని గుర్తు చేశారు. ఆర్డీఎఫ్ ఫౌండర్ మెంబర్ ఎర్రబెల్లి రామ్మోహన్‌రావు మాట్లాడుతూ దాతల సహకారంతోనే పేద విద్యార్థులకు విద్యను అందించగలుగుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఆర్డీఎఫ్ సెక్రటరీ కిరణ్ అడ్డాల, అనంతపాయ్, ప్రిన్సిపాల్ ఆడెపు జనార్దన్, పాఠశాల హెచ్‌ఎంలు అశోకాచారి, విష్ణు, నాయకులు విజయ్‌చందర్‌రెడ్డి, రావు పద్మ, కొండేటి శ్రీధర్, బొంపెల్లి దేవేందర్‌రావు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన బీజేపీ నేతలు

మండలంలోని కల్లెడ గ్రామంలో ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని బుధవారం పలువురు బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్, వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, ఎస్సీ సెల్ రాష్ట్ర సభ్యుడు కొండేటి శ్రీధర్, జిల్లా నాయకుడు పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పట్టాపురం ఏకాంతంగౌడ్, బొట్ల మధు, సంతోష్ పాల్గొన్నారు.



ల్యాబ్‌లో పరికరాలను పరిశీలిస్తున్న ఇంద్రసేనారెడ్డి



వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వద్ద కిటకిటలాడుతున్న రోగులు


వరంగల్ జిల్లాలో 27 డెంగీ కేసులు

మలేరియా ప్రబలుతున్నా లెక్కల్లో లేని వైనం

పోచమ్మమైదాన్, ఆగస్టు 21: వరంగల్ జిల్లా వాసులను జ్వరాల తీవ్రత కలవరానికి గురిచేస్తోంది. జలుబు, దగ్గు, వైరల్ ఫీవర్లతో బాధపడుతున్న వారు ఇంటికొకరు ఉంటున్నారు. డెంగీ, మలేరియా లాంటి కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దాంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. డెంగీ లక్షణాలతో అనేక మంది ఆస్పత్రుల్లో చేరుతున్నారు. 20రోజుల వ్యవధిలోనే వరంగల్ జిల్లాలో 27 డెంగీ కేసులు నమోదైనట్లు వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. గ్రామాలు, పట్టణాలు తేడా లేకుండా జ్వర పీడితులు రోజురోజుకు పెరుగుతున్నారు. వివిధ రకాల వైద్యపరీక్షల కోసం వచ్చినవారితో ల్యాబ్‌లు, డయగ్నొస్టిక్ సెంటర్లు, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు, మెడికల్ షాపులు రోగులతో నిండిపోతున్నాయి. నగరంతోపాటు శివారు ప్రాంతాలలోనూ డెంగీ కేసులు పెరుగుతున్నాయని వైద్యాధికారులు పేర్కొంటున్నారు. చిన్నారుల సైతం జ్వరంతో బాధపడుతుండగా పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో వ్యాధుల వివరాలను యాజమాన్యాలు బయటకు రానివ్వడం లేదని, దీంతో నమోదైయ్యే కేసుల వివరాలు ప్రభుత్వ అధికారుల లెక్కలోకి రావడం లేదని తెలుస్తోంది. 2022లో 161, 2023లో 160 డెంగీ కేసులు నమోదవగా ఈ ఏడాది ఎనిమిది నెలల్లో జిల్లాలో మొత్తం 82డెంగీ పాజిటివ్ కేసులు నమోదైనట్లు వైద్యాధికారులు చెబుతున్నారు.

అలాగే అనేక మంది మలేరియా, చికున్‌గున్యాతో బాధపడుతున్నప్పటికీ వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు మాత్రం మలేరియా, చికున్‌గున్యా కేసులు నమోదవడం లేదని చెబుతుండటం గమనార్హం. ఈ ఏడాది ఇప్పటి వరకు ఏప్రిల్‌లో 3, జూలైలో 3, ఆగస్టులో 2 మలేరియా కేసులు మొత్తం 8 కేసులు మాత్రమే మలేరియా కేసులు నమోదయ్యాయని చెబుతున్నారు. కానీ బయట పరిస్థితి చూస్తే అనేకమంది మలేరియా, చికున్‌గున్యాతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. 2022లో 45, 2023లో 7 మలేరియా కేసులు నమోదవగా, ఈ ఏడాది ఆగస్టు 20 వరకు ఎనిమిది కేసులు నమోదయ్యాయి.

'జ్వర' పంజా



- డెంగీ, మలేరియా, తదితర జ్వరాలతో మంచం పడుతున్న జనం
- ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు క్యూ

ఉమ్మడి జిల్లాలో సీజనల్ వ్యాధుల విజృంభణ

ఉమ్మడి వరంగల్ జిల్లాపై జ్వరాలు పంజా విసురుతున్నాయి. వర్షాలు విస్తారంగా పడుతుండటంతో పాటు వాతావరణ మార్పులతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లాంటి జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. పల్లెలు, పట్టణాలు తేడా లేకుండా ప్రతీ ఇంట్లో జ్వరబాధితులు మంచాలు పడుతున్నారు. ఈ క్రమంలో చికిత్స కోసం ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో అయితే మరణాలు కూడా సంభవిస్తుండటంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలో జ్వరాలు ప్రబలుతున్న తీరుపై 'ఆంధ్రజ్యోతి' ఫోకస్

డెంగీ డేంజర్ బెల్స్

భూపాలపల్లి జిల్లాలో 23 కేసులు

భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 21: భూపాలపల్లి జిల్లాలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. మలేరియా, డెంగీ పాజిటివ్ కేసులు అధికంగా నమోదవుతున్నాయి. ముఖ్యంగా డెంగీ డేంజర్ బెల్స్ మోగిస్తోంది. గత రెండు రోజుల్లో మూడు పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. జనవరి నుంచి ఇప్పటి వరకు 23 మంది ఈ మహమ్మారి బారిన పడ్డారు. అలాగే ఐదు మలేరియా కేసులు నమోదయ్యాయి. ఇవి అధికారిక లెక్కలు మాత్రమే. వైద్యాధికారుల దృష్టికి రాని కేసులో జిల్లాలో అధికంగానే ఉన్నాయని తెలుస్తోంది. విషజ్వరాలు విజృంభిస్తుండటంతో ప్రజలు ఆస్పత్రుల బాట పడుతున్నారు. పల్లెల్లో పారిశుధ్యం లోపించడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. విషజ్వరాలు వ్యాపిస్తున్న గ్రామాల్లో అధికారులు నామమాత్రంగా వైద్య శిబిరాలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. ప్రతీ ఏడాది జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో దోమల వల్ల ప్రజలు రోగాల బారినపడకుండా దోమతెరలను పంపిణీ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు అదెక్కడా కానరావడం లేదు.

ఏటా పెరుగుతున్న విషజ్వరాలు

జిల్లాలో విషజ్వరాలు ఏటా పెరుగుతున్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. గతేడాది 83కుపైగా డెంగీ కేసులు నమోదయ్యాయి. 2022లో ఏడు, 2021లో 11, 2022లో 42, 2023లో 85 నమోదయ్యాయి. ఈ 8నెలల్లోనే 23 కేసులు నమోదవగా మరో నాలుగు నెలల్లో ఇంకా పెరిగే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. మరోవైపు మలేరియా కేసులు కూడా జిల్లాలో అక్కడక్కడ నమోదవుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు ఐదుగురు దీని బారిన పడ్డారు. చికున్‌గున్యా కేసులు మాత్రం నాలుగేళ్లలో కానరాలేదు. 2020 నుంచి నేటివరకు నమోదవలేదని వైద్యవర్గాలు పేర్కొంటున్నాయి. గత 24 గంటల్లో మూడు పాజిటివ్ కేసులు నమోదవగా భూపాలపల్లి, రేగొండ, కాటారం పీహెచ్‌సీల పరిధిల్లో ఒకొక్కరు చొప్పున జ్వరాల బారిన పడ్డారు. ఇక జిల్లాలో నమోదైన 23 కేసుల్లో అత్యధికంగా భూపాలపల్లి పరిధిలోనే ఉన్నాయి.

ఆస్పత్రులకు క్యూకడుతున్న ప్రజలు

జ్వరాలతో ప్రజలు ఆస్పత్రుల బాటపడుతున్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్) రోగుల తాకిడి విపరీతంగా ఉంది. రోజూ 650మంది ఓపీ పరీక్షలు చేయించుకుంటున్నారని, వీరిలో 500కు పైగా మంది జ్వరాలతో బాధపడే వారే ఉన్నారని తెలుస్తోంది. దీంతో ఈ ఆస్పత్రిలో ప్రత్యేకంగా ఆరు పడకల మెడికల్ ఐసీయూను ఏర్పాటు చేశారు. టీ-హబ్‌లో రోజూ జిల్లాలోని 13 పీహెచ్‌సీలు, రెండు సీహెచ్‌సీల నుంచి వచ్చిన 80-100 శ్యాంపిళ్ల పరీక్షలు నిర్వహిస్తున్నారు. మంగళవారం వచ్చిన 80శాంపిల్స్‌లో మూడు పాజిటివ్‌గా నిర్ధారణైంది.



భూపాలపల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కిటకిటలాడుతున్న వార్డులు

మంచానికి ఇద్దరు..

జ్వరబాధితులతో ఎంజీఎం కిటకిట

హనుమకొండ జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న బాధితులు

పీహెచ్‌సీలకు క్యూ కడుతున్న జనం



ఎంజీఎం ఓపీలో బారులు తీరిన రోగులు

వరంగల్ మెడికల్, ఆగస్టు 20: ఉమ్మడి జిల్లాలో జ్వరాలు పంజా విసురుతున్నాయి. డెంగీ, మలేరియా, ఇతర వైరల్ ఫీవర్లతో జనం సతమతమవుతున్నారు. ప్రస్తుతం ప్రతీ ఇంట్లో ఒక్కరైనా జ్వరపీడితులు కనిపిస్తున్నారు. ఏ ప్రైవేటు ఆస్పత్రి చూసినా రోగులతో కిటకిటలాడుతోంది. ఇక ప్రభుత్వ ఆస్పత్రుల్లో అయితే మంచానికి ఇద్దరు చొప్పున చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యశాఖ అప్రమత్తంగా ఉన్నా అంతకంటే వేగంగా వైరస్ విస్తరించడం పట్ల వైద్యులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎంజీఎం ఆస్పత్రిలో పిల్లల వార్డుతోపాటు జనరల్ మెడిసిన్ విభాగంలో మంచానికి ఇద్దరు చొప్పున చికిత్స పొందుతున్నారు. వార్డులన్నీ కిటకిటలాడుతున్నాయి. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కూడా జ్వర బాధితులు క్యూ కడుతున్నారు.



వైద్య పరీక్షలు కీలకం

డెంగీ వ్యాధి నిర్ధారణలో వైద్య పరీక్షలు కీలకంగా మారా యి. ఐజీఎం పరీక్షలతోనే కచ్చితత్వం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఆర్‌డీటీ ప్లేట్‌లెట్ కౌంట్, సీరం టెస్ట్ విధా నంలో పరీక్షలు నిర్వహించడం సరికాదని సీనియర్ వైద్య లు చెబుతున్నారు. ర్యాపిడ్ డయాగ్నోస్టిక్ పరీక్షలు 100 శాతం నమ్మశక్యం కాదని అంటున్నారు. యాంటిజెన్ పాజి టివ్ ఉంటేనే 100శాతం వ్యాధి ఉన్నట్లు నిర్ధారించుకోవాల్సి ఉంటుందని చెబుతున్నారు.



ఎంజీఎంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఎంజీఎంలో డెంగీ, మలేరియా కేసులు

సంవత్సరం	మలేరియా	డెంగీ	చికున్‌గున్యా
2020	194	73	0
2021	310	128	0
2022	229	615	0
2023	93	821	0
2024	23	234	0

దండుకుంటున్న ప్రైవేటు ఆస్పత్రులు

హనుమకొండ, వరంగల్ నగరాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులన్నీ వైరల్ ఫీవర్ బాధితులతో కిటకిటలాడుతున్నాయి. కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు.. పరిస్థితులను ఆసరా చేసుకుని దండుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. దీంతో జ్వరానికి చికిత్సకు రూ.50వేల నుంచి లక్షకు పైగానే ఖర్చు చేయాల్సిన దుస్థితి ఎదురవుతోంది. ములుగురోడ్డులోని ఓ కార్పొరేట్ ప్రైవేట్ ఆస్పత్రి తమ ఐదు అంతస్థులను ఫీవర్ వార్డులుగా మార్చి సొమ్ము చేసుకుంటున్నట్టు తెలుస్తోంది. అదే విధంగా బాలసముద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి జ్వరం వచ్చారంటే చాలు.. అడ్మిట్ అయితేనే చికిత్స అంటూ రోగులను భయభ్రాంతులకు గురిచేస్తూ కరోనా కాలం కంటే ఎక్కువ సొమ్మును కాజేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

అధిక ధరలకు 'ప్లేట్‌లెట్స్'

ప్లేట్‌లెట్స్ పడిపోయినప్పుడు అందించే సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్‌లను ఈ సీజన్ అదనుగా చూసుకొని అధిక ధరలకు ఇస్తున్నట్టు రోగులు వాపోతున్నారు. ఆస్పత్రి స్థాయిని బట్టి ఈ ప్లేట్‌లెట్లను రూ.11వేల నుంచి రూ.15వేల వరకు విక్రయిస్తున్నారని, పేదల ఆస్పత్రి అయిన ఎంజీఎంలో ఈ యంత్రం లేకపోవడంవల్ల ప్రైవేట్ వైపు మొగ్గు చూపాల్సి వస్తోందని ఆవేదన చెందుతుఉన్నారు.

ముందు జాగ్రత్తలు

డెంగీ జ్వరం వస్తే తీవ్రత తగ్గించేందుకు చల్లని నీటితో మొత్తని వస్త్రం లేదంటే స్పాంజీని ముంచి శరీరాన్ని తుడవాలి. తక్షణశక్తినిచ్చే పౌడర్లు, పండ్ల రసాలు తాగించాలి. దీనివల్ల జ్వర తీవ్రత తగ్గి ప్లేట్‌లెట్స్ అదుపులోకి వస్తాయి. ప్రతి ఒక్కరూ ఫ్రైడేను డ్రైడేగా పాటించి పరిసరాల పరిశుభ్రత పాటించాల్సి ఉంటుంది. డెంగీని గుర్తిస్తే 20 శాతం వరకు ఎలాంటి ప్రమాదం లేకుండా చికిత్స పొందవచ్చునని వైద్యులు చెబుతున్నారు.

ప్లేట్స్‌లెట్స్ తగ్గితే సొంత వైద్యం వద్దు..

డాక్టర్ దుర్గం వెంకటేశ్, ఫిజిషియన్, ఎంజీఎం



ప్లేట్‌లెట్ సంఖ్య తగ్గితే సొంత వైద్యం చేయిం చుకోవద్దు. వైద్యుల పర్యవేక్షణలోనే చికిత్స పొం దాలి. వైరల్ జ్వరం వచ్చిన వారు హెపటైటిస్ పరీక్ష చేయించుకోవడం ఉత్తమం. చాలా మంది డెంగీ బాధితులకు బొప్పాయి పండు తినడం వల్ల కడుపునొప్పి, వాంతులు లాంటివి ఉంటాయి. తీవ్రమైన జ్వరం, శరీరంపై దద్దుర్లు, తలనొప్పి, వాంతులు లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.



మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఓపీ కోసం బారులు తీరిన రోగులు, బంధువులు

మానుకోట జిల్లాలో మరింత విజృంభణ

● ఇప్పటికే ఇద్దరు మృతి ● 250 డెంగీ, 12 మలేరియా కేసులు నమోదు

మహబూబాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణాలు, గ్రామాలు, తండాలు.. ఇలా మహబూబాబాద్ జిల్లాలో జ్వరాలు మరింత విజృంభిస్తున్నాయి. ప్రతీ ఇంట్లో ఒకరిద్దరు చొప్పున జ్వరబాధితులు మంచం పట్టారు. దీంతో జనం జ్వర భయంతో బిక్కుబిక్కుమంటున్నారు. ఇప్పటికే జిల్లాలో జ్వరాలతో ఇద్దరు మృతి చెందడంతో ప్రజలు మరింత ఆందోళన చెందుతున్నారు. డెంగీ, మలేరియా, జ్వరాలు వ్యాప్తి పెరగడంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులన్నీ రోగులతో కిటకిటలాడుతున్నాయి. జిల్లాలోని కేసముద్రం మండలం బేరువాడకు చెందిన ఒకరు, తొర్రూరు మండల కేంద్రానికి చెందిన నాలుగేళ్ల చిన్నారి మృతి చెందారు. జిల్లాలో సాధారణం కంటే ఎక్కువగా కేసులు నమోదవుతున్నాయి. ఇప్పటికే జిల్లాలో 250 డెంగీ, 12మలేరియా కేసులు, 48,664 మంది ఇతర జ్వరాలతో బాధపడుతున్నట్టు వైద్యాధికారులు గుర్తించారు. జిల్లా జనరల్ ఆస్పత్రిలో రోజూ 1600 నుంచి సుమారు 2 వేల మంది వరకు ఓపీ పేషెంట్లు వస్తుండగా, అందులో సగానికి పైగా జ్వర లక్షణాలున్నవారేనని వైద్యులు చెబుతున్నారు. జిల్లాలోని కొత్తగూడ, అయోధ్యపురం, తీగలవేణి, ముల్కనూరు, కురవి, డోర్నకల్ మల్యాల, మహబూబాబాద్ అర్బన్, కేసముద్రం, నెల్లికుదురు, మరిపెడ ప్రాంతాల్లో అధికంగా డెంగీ, మలేరియా జ్వరాలు విజృంభిస్తున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల పరిధిలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

మానుకోట జిల్లాలోని 21 పీహెచ్‌సీల్లో కేసులు నమోదయ్యాయిలా..

సంవత్సరం	డెంగీ	మలేరియా	ఇతర వ్యాధి
2022	125	20	--
2023	40	06	--
2024	250	12	48,664



మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఓపీ వద్ద భారీగా ఉన్న రోగులు

నామమాత్రంగా వైద్య శిబిరాలు

విస్తారంగా వర్షాలు కురవడం, వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ఈ క్రమంలో గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాల్సిన వైద్యాధికారులు.. నామ్‌కేవాస్తేగా పల్లెల్లో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇప్పటికైనా గ్రామాల్లో పూర్తిస్థాయిలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి, ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉంది. దీనికి తోడు గ్రామపంచాయతీ పాలక మండలి పారిశుద్యంపై ప్రత్యేక దృష్టిసారించి వ్యాధుల నియంత్రణకు కృషి చేయాల్సిన అవసరం ఉంది.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి..

గుండాల మురళీధర్, ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో, మహబూబాబాద్



సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర జ్వరాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఇతర ఆరోగ్య సూత్రాలు పాటించాలి. ఏ మాత్రం అలసట అనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి.

దోమలమందు పిచికారీ చేయాలి

బానోత్ విష్ణు, సీరోలు, మహబూబాబాద్ జిల్లా



వరుసగా కురుస్తున్న వర్షాలతో గ్రామాల్లోని మురుగుకాల్వలు, కుంటల్లో నీరు నిలిచిపోయింది. దీంతో ఆయా ప్రాంతాల్లో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. అధికారులు గ్రామాల్లో దోమల నివారణ మందును పిచికారీ చేయాలి. దీంతో పాటు గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రతీ ఒక్కరికి వైద్య పరీక్షలు నిర్వహించాలి.

వణుకుతున్న ఏజెన్సీ గ్రామాలు

● ప్రబలుతున్న జ్వరాలతో గిరిబిడ్డల బెంబేలు ● కొనసాగుతున్న ఫీవర్ సర్వే

ములుగు, ఆగస్టు 21: ఏజెన్సీ పల్లెల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయి. వానాకాలం ప్రారంభమైన తర్వాత ఊళ్లకుఊళ్లు మంచం పడుతున్నాయి. ఏ ఇల్లు చూసినా ఒకరిద్దరు జ్వర పీడితులు కనిపిస్తున్నారు. వ్యాధుల నివారణ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నప్పటికీ పారిశుధ్య నిర్వహణలో లోపం, కలుషితతాగునీరు, వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులకు అడ్డుకట్ట పడడంలేదు. ఈ క్రమంలోఆస్పత్రులు జ్వరబాధితులతో నిండుతున్నాయి. ములుగు ఏరియా వైద్యశాల, ఏటూరునాగారం, వెంకటాపురం(నూగూరు) సామాజిక వైద్యశాలలతోపాటు 15 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు నిత్యం వందలాది మంది జ్వరపీడితులు వస్తున్నారు. ఏరియా ఆస్పత్రి, సామాజిక వైద్యశాలల్లో బెడ్లన్నీ నిండిపోతుండగా పీహెచ్‌సీలలో అందుబాటులో ఉన్న బెడ్లపై చికిత్స అందిస్తున్నారు.

రెండునెలల్లో 67 డెంగీ, మలేరియా కేసులు

వైద్య ఆరోగ్యశాఖ ప్రతిఏటా ఇంటింటా ఫీవర్ సర్వేలు నిర్వహిస్తోంది. సమస్యాత్మక గ్రామాలను ముందే గుర్తించి క్లోరినేషన్, దోమల నివారణ మందును పిచికారీ చేయిస్తోంది. ములుగు జిల్లాలో ఈసారి 123 సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ముందస్తు వ్యాధుల నివారణ చర్యలు చేపట్టారు. అయినప్పటికీ పరిస్థితి అదుపులోకి రాలేదు. జూన్, జూలై, ఆగస్టు 20 వరకు నిర్వహించిన జ్వర సర్వేలో 60,136 మందికి జ్వరం సోకినట్లు తేలింది. వీరందరి రక్త నమూనాలు సేకరించి పరీక్షించగా 34 మందికి మలేరియా, 33 మందికి డెంగీ నిర్ధారణ అయింది. అత్యధికంగా ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి వచ్చిన రోగుల్లో 21 మందికి డెంగీ, 13 మందికి మలేరియా నిర్ధారణ అయింది.

ఆందోళన కలిగిస్తున్న మరణాలు

జ్వరంతో బాధపడుతున్న పలువురు ప్రాణాలు కోల్పోవడం ఆందోళన కలిగిస్తోంది. అయితే... ఈ మరణాలను వైద్య ఆరోగ్యశాఖ నమోదు చేయలేదు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ మృతిచెందినట్లు పేర్కొంటున్నారు. ములుగు మండలం జాకారంలో ఇటీవల ఓ నిండు గర్భిణి, వాజేడు మండలానికి చెందిన మరో గర్భిణి జ్వరంతో బాధపడుతూ మరణించారు. వాజేడు మండలానికి చెందిన మరో మహిళ కూడా డెంగీ లక్షణాలతో మృతిచెందింది. మంగపేట మండలంలో మూడునెలల కాలంలో తొమ్మిది మంది జ్వరంతో మరణించినట్టు తెలుస్తోంది.



కన్నాయిగూడెం పీహెచ్‌సీకి వచ్చిన బాలింత

పీహెచ్‌సీలకు ప్రత్యేక నిధులు

జ్వరాలు విజృంభిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో పీహెచ్‌సీలకు కలెక్టర్ ప్రత్యేక నిధులను కేటాయించారు. మంత్రి సీతక్క ఆదేశాలతో ఒక్కో పీహెచ్‌సీకి రూ.50వేల చొప్పున మంజూరు చేశారు. వీటితో అవసరమైన మలేరియా, డెంగీ టెస్టింగ్ కిట్లను సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అదేవిధంగా ములుగులోని ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేసి వైద్యులతో సమీక్ష జరిపిన కలెక్టర్ మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. టీ-డయాగ్నోహబ్‌లో లోపాలను గుర్తించి సాంకేతిక సమస్యలను పరిష్కరించి వ్యాధి నిర్ధారణ పరీక్షలను పునరుద్ధరించేందుకు ప్రత్యేక నిధులు కేటాయించేలా చర్యలు చేపడుతున్నారు.



మంగపేట పీహెచ్‌సీకి వచ్చిన జ్వరపీడితులు



ములుగు ఏరియా ఆస్పత్రిలో మందులు తీసుకుంటున్న దృశ్యం

జనగామలో హైఫీవర్

జిల్లాలో పెరుగుతున్న 53 డెంగీ కేసులు

జనగామ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జనగామ జిల్లాను హైఫీవర్ వెంటాడుతోంది. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లాంటి విషజ్వరాలతో ప్రజలు ఆసుపత్రుల పాలవుతున్నారు. జ్వరాలతో వచ్చే బాధితులతో జిల్లాకేంద్రంలోని ప్రధాన ఆసుపత్రితో పాటు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. పట్టణం, పల్లె అనే తేడా లేకుండా పారిశుధ్య నిర్వహణ లోపం కారణంగా జిల్లాలో దోమలు, ఈగలు బెడద తీవ్రంగా ఉండటంతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. ఇటీవల 'స్వచ్ఛదనం-పచ్చదనం' పేరుతో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టినా అవి తూతూమంత్రంగానే సాగాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో సీజనల్ కేసులు పెద్దసంఖ్యలో నమోదవుతున్నా అవన్నీ లెక్కలోకి రావడం లేదు. అయితే జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రితో పాటు పీహెచ్‌సీల్లో నిర్ధారణైన కేసులు మాత్రమే అధికారికంగా నమోదవుతున్నాయి. జిల్లాలోని 12 గ్రామాల పరిధిలో ఒక జిల్లా ఆసుపత్రి, 4 సీహెచ్‌సీలు, 13 పీహెచ్‌సీలు ఉన్నాయి. వీటితో పాటు గ్రామాల్లో ఆర్ఎంపీలు, జిల్లాకేంద్రంతో పాటు స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి లాంటి నియోజకవర్గ కేంద్రాల్లో పదుల సంఖ్యలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ రోగులు చికిత్స తీసుకుంటున్నారు. ప్రైవేటుగా చికిత్స తీసుకుంటున్న వారి వివరాలు రికార్డ్ కావడం లేదు. దీంతో జిల్లాలో ప్రభుత్వ లెక్కల కంటే రెట్టింపు కేసులు నమోదవుతున్నట్లు తెలుస్తోంది. జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 53 డెంగీ, 6 మలేరియా కేసులు నమోదయ్యాయని, మరో 2వేలకుపైగా సాధారణ జ్వరాలు నమోదైనట్టు అధికారులు చెబుతున్నారు.



జనగామ జిల్లా ఆస్పత్రిలో ఓపీ కోసం వచ్చిన రోగులు

రూ.వేలల్లో ఆసుపత్రి బిల్లులు

ప్రస్తుత పరిస్థితులు ప్రైవేటు ఆసుపత్రులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. జ్వరాలతో అడ్మిట్ అయిన రోగుల నుంచి వైద్యం, నిర్ధారణ పరీక్షలు, స్కానింగుల పేరుతో రూ.వేలకు వేలు బిల్లులు వేస్తున్నారు. చిన్నపాటి జ్వరానికే హడావిడి చేస్తున్నారని, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లాంటి జ్వరాలైతే ఇక వారి ఇష్టారాజ్యమన్నట్టుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఈ క్రమంలో ఓపీకి వచ్చిన పేషెంట్లకు టెస్టులు, మందులతో కలిపి రూ.5వేలకు పైనే అవుతుండగా అడ్మిట్ వారికైతే రూ.30వేలు, ప్లేట్స్‌లెట్స్ తగ్గడంలాంటి సమస్య వస్తే రూ.50వేలపైనే అవుతున్నాయి. అధికారుల నిఘా లేకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు, డాక్టర్లు 'తాము ఆడిందే ఆట' అన్నట్టుగా వసూలు చేస్తున్నారన్న అభిప్రాయాలున్నాయి.

ఐదేళ్లుగా జిల్లాలో నమోదైన కేసులు

వ్యాధి	2020	2021	2022	2023	2024
డెంగీ	6	15	34	45	53
మలేరియా	6	7	7	8	4
చికున్‌గున్యా	0	0	0	0	0
మొత్తం	12	22	41	53	57



ఫొటో జర్నలిస్టులకు సత్కారం



ఫొటో జర్నలిస్టులను సత్కరిస్తున్న ప్రెస్‌క్లబ్ బాధ్యులు

వడ్డేపల్లి, ఆగస్టు 21: రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫొటో జర్నలిస్టుల అవార్డులను అందుకున్న ఐదుగురు ఫొటో జర్నలిస్టులను హనుమకొండ బాలసముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన సన్మాన కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఫొటో జర్నలిస్టులు గోకారపు శ్యామ్‌కుమార్, వీరగోని హరీశ్‌గౌడ్, చేతి శ్రీనివాస్, కుడుతాల రమేష్, మేరుగు ప్రతాప్‌లకు శాలువా కప్పి ఘనంగా సత్కరించి మెమొంటోలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్, తదితరులు పాల్గొన్నారు.

వివాదంలో 'వరంగల్ క్లబ్'

▸▸ పెద్ద మొత్తంలో నిధుల దుర్వినియోగం ▸▸ ఓ ఉద్యోగి ఆత్మహత్యతో వెలుగులోకి.. ▸▸ విచారణకు ఆదేశించిన కలెక్టర్

హనుమకొండ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వరంగల్ క్లబ్ (ఆఫీసర్స్ క్లబ్) వ్యవహారం రచ్చకెక్కింది. చాలాకాలంగా ఇందులో జరుగుతున్న అక్రమాలు క్రమంగా వెలుగుచూస్తున్నాయి. క్లబ్ ఉద్యోగుల్లో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటనతో క్లబ్‌లో పెద్ద మొత్తంలో జరిగిన నిధుల దుర్వినియోగం బట్టబయలైంది. వరంగల్ క్లబ్ చైర్మన్ అయిన కలెక్టర్.. క్లబ్ కార్యకలాపాలపై విచారణకు కమిటీ వేయడంతో డొంక కదిలింది. విచారణ నివేదిక ఆధారంగా పాలకవర్గం 156మంది క్లబ్ సభ్యులకు నోటీసులు జారీ చేయడంతో క్లబ్ వ్యవహారంపై దుమారం రేగుతోంది.

ఆర్థిక అవకతవకలు

వరంగల్ క్లబ్‌లో పని చేసే ఉద్యోగుల్లో ఒకరు ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. పెద్ద ఎత్తున నిధుల దుర్వినియోగం జరిగిన నేపథ్యంలోనే ఒత్తిళ్లకు తట్టుకోలేక ఆయన ఆత్మహత్య చేసుకున్నట్టు ప్రచారం జరిగింది. ఈ సంఘటనపై సీరియస్ అయిన గత కలెక్టర్.. విచారణకు ఆదేశించారు. దీంతో క్లబ్ పాలకవర్గం ముగ్గురు సభ్యులతో ఒక కమిటీని వేసింది. ఈ కమిటీ విచారణ జరిపి నివేదికను సమర్పించింది. క్లబ్‌లో జరిగిన అక్రమాలను పేర్కొన్నది. ఈ నివేదిక ఆధారంగా పాలకవర్గం 156 మంది సభ్యులకు నోటీసులు జారీ చేసింది. ప్రవేశ రుసుము చెల్లించకుండానే క్లబ్‌లో సభ్యత్వం పొందారని, ప్రతీ ఏటా క్రమం తప్పకుండా సభ్యత్వ రుసుము చెల్లించడం లేదని, కొందరు సభ్యులు క్లబ్‌లో దొడ్డిదారిన ప్రవేశం పొందారని, పలుకుబడితో ఎలాంటి రుసుములు చెల్లించకుండానే క్లబ్‌ను వాడుకుంటున్నారని ఆ నోటీసుల్లో పేర్కొన్నది. వీరంతా తమ నిజాయితీని నిరూపించుకోవడానికి, సభ్యత్వం తీసుకున్న ప్రవేశ రుసుము రశీదులు, ఇతర ధ్రువపత్రాలను పదిహేను రోజుల్లో సమర్పించాలని ఆ నోటీసులో పేర్కొన్నది.

అన్యాయం

నోటీసులు అందుకున్నవారు ఇది అన్యాయమంటూ వాదిస్తున్నారు. విచారణ పేరుతో తమను దోషులుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని, ఇది అన్యాయమని వాపోతున్నారు. ఏళ్ల కిందట సభ్యత్వం తీసుకున్న రశీదులు ఇప్పుడు ఎక్కడ దొరుకుతాయని ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుత పాలకవర్గంలో నెల కొన్న అంతర్గత కలహాలను కప్పిపుచ్చుకునేందుకు అక్రమాలను సభ్యులపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని వారు విమర్శిస్తున్నారు. తాము క్లబ్ బైలాకు కట్టుబడి సభ్యులుగా కొనసాగుతున్నట్టు నిర్ధారించి గుర్తింపు కార్డులు కూడా ఇచ్చారని, గతంలో జరిగిన పాలకవర్గం ఎన్నికల్లో పాల్గొని ఓట్లు కూడా వేశామన్నారు. అప్పుడు లేని అభ్యంతరం ఇప్పుడెలా వచ్చిందని వారు వాదిస్తున్నారు. క్లబ్ పాలకవర్గం కావాలనే తమకు ఇష్టం లేని సభ్యులను, తమ మాట వినని, తమ అక్రమాలకు వత్తాసు పలకని సభ్యులను బయటకు పంపేందుకు ఇలాంటి నోటీసులు ఇవ్వడం ద్వారా వేధిస్తోందని వాపోతున్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

నోటీసు అందుకున్న సభ్యుల్లో ఒకరైన రావుల నరేష్ రెడ్డి బుధవారం కలెక్టర్ ప్రావీణ్యకు ఫిర్యాదు చేశారు. క్లబ్ వ్యవహారాల్లో జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు వరంగల్ క్లబ్ సెక్రెటరీకి కూడా ఒక లేఖ రాశారు. ఈ పరిణామాల నేపథ్యంలో కలెక్టర్ సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. ఒకటీ రెండు రోజుల్లో తగిన చర్యలు తీసుకోనున్నట్టు సమాచారం.



విశిష్ట నేపథ్యం

హనుమకొండ సుబేదారిలోని కలెక్టర్ బంగ్లాకు ఎదురుగా ఉన్న వరంగల్ క్లబ్‌కు ఎంతో విశిష్టత, చారిత్రక నేపథ్యం ఉంది. కలెక్టర్ చైర్మన్, పోలీసు కమిషనర్ వైస్‌చైర్మన్‌గా ఉండే ఈ క్లబ్‌లో ప్రభుత్వశాఖల ఉన్నతాధికారులు, సంపన్నులు, సమాజంలో పలుకుబడి కలిగిన బడా బాబులు, డాక్టర్లు, ఇంజనీర్లు, రాజకీయ నేతలు సభ్యులుగా ఉండే ఈ క్లబ్‌లో సభ్యుడిగా ఉండటాన్ని స్టేటస్ సింబల్‌గా భావిస్తారు. సుమారు మూడెకరాల విస్తీర్ణంలో సువిశాలమైన భవనంలో ఉన్న క్లబ్‌లో సభ్యత్వం పొందాలంటే అడ్మిషన్ ఫీజే సుమారు రూ.3 లక్షల వరకు ఉంటుంది. మొదట్లో దీనిని ఆఫీసర్స్ క్లబ్‌గా పిలిచేవారు. తర్వాత దీనిని వరంగల్ క్లబ్‌గా మార్చారు. ఇందులో స్విమ్మింగ్ పూల్, టెన్నిస్ కోర్టు, ఆధునాతనమైన జిమ్ సెంటర్, ఆడిటోరియం, ఇతర క్రీడలకు సంబంధించిన కోర్టులు ఉన్నాయి. ఈ క్లబ్ ఉన్న భవనం వందేళ్లనాటిది. నిజాం కాలంలో దీనిని పరిపాలనా భవనంగా వాడారు. తర్వాత కాలంలో దీనిని వరంగల్ క్లబ్‌కు కేటాయించారు.

రైల్వే లైన్ అలైన్‌మెంట్ మార్చండి

ఎమ్మెల్యే నాగరాజుకు భూబాధితుల వినతి

హసన్‌పర్తి, ఆగస్టు 21: నష్కల్ నుంచి హసన్‌పర్తి బైపాస్ రైల్వేలైన్ అలైన్‌మెంట్ మార్చాలని బుధవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజును భూబాధితులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పెద్దపెండ్యాల, నర్సింహులపల్లి, ఎల్కుర్తి, ధర్మసాగర్, ఉనికిచర్ల, దేవన్నపేట, మునిపల్లి, చింతగట్టు గ్రామాలకు చెందిన పలువురు రైతులు ఎమ్మెల్యేకు తమ గోడును వెల్లబోసుకున్నారు. నష్కల్-హసన్‌పర్తి బైపాస్ రైల్వేలైన్ అలైన్‌మెంట్ వల్ల విలువైన భూములను నష్టపోవడమే కాకుండా నగరాభివృద్ధి కుంటుపడుతుందని తెలిపారు. భూములను వదులుకోబోమని రైతులు చెప్పారు. పంట సాగు చేసుకునే భూములు కోల్పోయి అన్నదాతలకు వీధిన పడే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్.నాగరాజు ఈ విషయంపై సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్‌తో పాటు ఎంపీ కడియం కావ్యకు వివరించి బైపాస్ రైల్వేలైన్ మార్పు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించామని తెలిపారు. గతంలో సీఎం రేవంత్‌రెడ్డికి సమస్యను వివరించి రైతులకు నష్టం జరగకుండా చూడాలని సూచించినట్లు ఎమ్మెల్యేలు వివరించారు. అసెంబ్లీ సమావేశంలో కూడా ఈ ప్రస్తావనపై చర్చించి బైపాస్ రైల్వేలైన్ అలైన్‌మెంట్ మార్పు కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలను కలిసిన వారిలో ఆయా గ్రామాల రైతులున్నారు.

న్యాయవాది సంజీవరెడ్డి మృతికి బార్ నివాళి

వరంగల్ లీగల్, ఆగస్టు 21: సీనియర్ న్యాయవాది గంటా సంజీవరెడ్డి మృతికి వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్ల ప్రతినిధులు, న్యాయవాదులు ఘనంగా నివాళులర్పించారు. బుధవారం హనుమకొండ నూతన బార్ అసోసియేషన్ హాలులో సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ.. ములుగు ప్రాంతానికి చెందిన సంజీవరెడ్డి.. 1982 నుంచి న్యాయవాదిగా పనిచేస్తున్నారని, ఆయన మృతి న్యాయవాద వృత్తికి తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల బార్ అసోసియేషన్ల అధ్యక్షులు నాతంగి రమేష్‌బాబు, తీగల జీవన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి లాదె రమేష్, ఉపాధ్యక్షుడు పోషిని రవీందర్, బార్ కౌన్సిల్ సభ్యుడు బైరపాక జయాకర్, సీనియర్ న్యాయవాదులు ఎం.సహోదర్‌రెడ్డి, టి.మహేంద్రప్రసాద్, వద్దిరాజు వెంకటేశ్వర్‌రావు, గణేష్, కె.అంబరీష్‌రావు, కె.నర్సింహరావు, బత్తిని రమేష్‌గౌడ్, వైవీ విశ్వేశ్వర్‌రావు, జూనియర్ మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు. అంతకు ముందు హనుమకొండ జిల్లా జడ్జి కోర్టు హాల్‌లో ఏర్పాటు చేసిన సంతాప కార్యక్రమంలో ఉభయ జిల్లాల అదనపు జిల్లా జడ్జిలు, సీనియర్ సివిల్ జడ్జిలు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు , ప్రభుత్వ ప్లీడర్ కె.నర్సింహరావు, సీనియర్, జూనియర్ మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

పిల్లలను క్రీడల్లోనూ ప్రోత్సహించాలి : సీపీ

వరంగల్ క్రైం, ఆగస్టు 21: పిల్లలను చదువులతోపాటు క్రీడల్లో తల్లిదండ్రులు ప్రోత్సహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కోరారు. వాటర్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో జూలై 19 నుంచి 21వరకు రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయ్‌పూర్‌లో నిర్వహించిన 7వ జాతీయ స్థాయి స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో వరంగల్‌కు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ కట్ల బిక్షపతి కుమారులు కట్ల ధీరజ్‌సాయి, కట్ల వేదాంశ్‌లు పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి స్వర్ణ, రజత పతకాలు సాధించారు. ఇందులో వేదాంశ్ ఫ్రీస్టైల్ విభాగంలో స్వర్ణ పతకం సాధించగా, ధీరజ్‌సాయి మిక్స్‌డ్ విభాగంలో రజత పతకాన్ని కొల్లగొట్టాడు. త్వరలో థాయిలాండ్‌లో నిర్వహించనున్న అంతర్జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు వీరిని బుధవారం సీపీ కార్యాలయంలో అంబర్ కిషోర్‌ఝా అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ సురేష్‌కుమార్, ఆర్‌ఐ స్పర్జన్‌రాజ్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు శోభన్ తదితరులు పాల్గొన్నారు.

పెద్ద చెరువులో గుర్తు తెలియని మృతదేహం

హసన్‌పర్తి, ఆగస్టు 21: మండల కేంద్రం హసన్‌పర్తి పెద్ద చెరువులో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు. సుమారు 50 ఏళ్ల వయస్సు కలిగి బట్టతల, తెలుపు గడ్డం, శరీరంపై ఫుల్ తెలుపు రంగు బనియాన్, కుడివైపున చినిగి ఉన్న నలుపు కలర్ షార్ట్ ఉందని తెలిపారు. సుమారు రెండు రోజుల కిందట చెరువులో పడి మృతి చెంది ఉండొచ్చని అనుమానిస్తున్నట్లు తెలిపారు. హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ సెల్ నెంబర్ 87126 85124, ఎస్సై సెల్ నెంబర్ 87126 85097, పోలీసు స్టేషన్ సెల్ నెంబర్ 87126 85015 సమాచారం అందించాలని ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు.

నేడు సుమతిరెడ్డిలో ఓరియంటేషన్ ప్రోగ్రామ్

హసన్‌పర్తి, ఆగస్టు 21 : మండలంలోని అనంత సాగర్ సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఐ.రాజశ్రీరెడ్డి తెలిపారు. కళాశాల ఆవరణలో జరిగే సమావేశానికి విద్యార్థులు తమ తల్లిదండ్రులతో సకాలంలో హాజరుకావాలని కోరారు. ముఖ్య అతిథిగా ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి, గౌరవ అతిథి గా ఇండియా క్యాంపస్ లీడ్ హెచ్‌ఆర్ అభిషేక్ జోయ్ జోడె హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ అండ్ ఎస్సీ డిపార్టుమెంట్ హెడ్ డాక్టర్ ఎన్.శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

కిట్స్‌లో స్టూడెంట్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్ నేడు

హసన్‌పర్తి, ఆగస్టు 21: మండలంలోని ఎర్రగట్టు గుట్ట కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం గురువారం స్టూడెంట్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కె.అశోక్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులు తమ తల్లిదండ్రులతో హాజరుకావాలని తెలిపారు. కళాశాల చైర్మన్ కెప్టెన్ వొడితల లక్ష్మీకాంత రావు, కోశాధికారి పి.నారాయణరెడ్డి, అడిషనల్ సెక్రటరీ వొడితల సతీష్‌కుమార్‌తో పాటు ఇతర మేనేజ్‌మెంట్ సభ్యులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కిట్స్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.కోమల్‌రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రొఫెసర్ పి.రమేష్‌రెడ్డి, పీఆర్‌వో డాక్టర్ డి.ప్రభాకరాచారి, విభాగాధిపతులు, వివిధ విభాగాల డీన్‌లు ప్రొఫెసర్ వేణుమాధవ్, ఎల్.సుధీర్‌రెడ్డి, వి.రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణపై ప్రధాని మోదీ తీర్పే సుప్రీంకోర్టు తీర్పు

వడ్డేపల్లి, ఆగస్టు 21: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రధాని నరేంద్ర మోదీ తీర్పేనని మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు మన్నె బాబురావు, మాల మహానాడు జాతీయ నేత అంకేశ్వరపు రాంచందర్‌రావు అన్నారు. భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఎస్సీల రిజర్వేషన్ రాష్ట్రాలకు అనుగుణంగా వర్గీకరించుకోవచ్చని తీర్పు చెప్పడాన్ని నిరసిస్తూ బుధవారం బహుజన్ సమాజ్‌పార్టీ (బీఎస్‌పీ), అంబేద్కర్ యువజన సంఘం, మాల మహానాడుతోపాటు ఇతర దళిత సంఘాల ఆధ్వర్యంలో భారత్ బంద్ కార్యక్రమాన్ని గ్రేటర్ వరంగల్‌లో నిర్వహించారు. ఇందులో భాగంగా హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో వారు మాట్లాడారు. జనాభా లెక్కలు తీసిన తర్వాత వర్గీకరణ అంశాన్ని పాటించాల్సిందిగా సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిందని అన్నారు. కానీ కొన్ని రాష్ట్రాలు అత్యుత్సాహంతో తమకు తోచిన విధంగా చేస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి శనిగరపు రాజు, దళిత ప్రజా సంఘాల నాయకులు అశోక్, బండి రజినీకుమార్, గాజుల గోవర్ధన్, సింగారపు రవిప్రసాద్, జోరిక రమేష్, దావ రవి, గొర్రె రమేష్, బొల్లం రాంకుమార్, పరికర శ్రీనివాస్, సమ్మయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గంజాయి పట్టుకున్న పోలీసులు

వరంగల్ క్రైం, ఆగస్టు 21: కాకతీయ యూనివర్సిటీ పోలీసులు రూ.1లక్ష 16వేల విలువైన 4.6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేశారు. బుధవారం సీఐ సంజీవ్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి చింతగట్టు క్యాంపు ప్రాంతంలోని కెనాల్ వద్ద ఎస్‌ఐ రవీందర్ పెట్రోలింగ్ చేస్తుండగా ఒక యువకుడు అనుమానాస్పదంగా కనిపించగా విచారణ చేశారు. అతడు జగిత్యాలకు చెందిన కాసాల మణికంఠగా తేలగా, అతడి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మణికంఠ, తన స్నేహితుడు మారంపల్లి జాక్ ఇద్దరు భద్రాచలంలో గంజాయి కొనుగోలు చేసి తీసుకువచ్చినట్లు తెలిపాడు. గంజాయిని విక్రయించేందుకు నగరానికి వచ్చినట్లు విచారణలో తేలడంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ సంజీవ్ తెలిపారు.

పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 21: గ్రేటర్ వరంగల్ పరిధిలోని పలు డివిజన్‌లలో చాలా వరకు అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని, నిలిచి పోయిన పనులను వెంటనే పూర్తి చేయడంతో పాటు కొత్త అభివృద్ధి పనులకు టెండర్లు పిలవాలని వరంగల్ తూర్పు కార్పొరేటర్లు బుధవారం బల్దియా కమిషనర్‌ను కలిశారు. కమిషనర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. వెంటనే స్పందించిన కమిషనర్ పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

భూ క్రమబద్ధీకరణ పారదర్శకంగా నిర్వహించాలి

5వ పేజీ తరువాయి

అశ్విని తానాజీ వాకడే కోరారు. బుధవాం బల్దియా కార్యాలయంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ల (సీవో)లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఇందిరా మహిళా శక్తి క్యాం టీన్ల కేటాయింపుపై కమిషనర్ మాట్లాడి పలు సూచనలు చేశారు. ప్రతీ సీవో వారంలో 10 యూనిట్ల ఏర్పాటు లక్ష్యంగా పని చేయాలని అన్నారు. ఎస్‌ఎస్‌జీ బృందాలకు బ్యాంకు లింకేజీలు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా సీవోలు సహకరించాలని అన్నారు. ఉపాధి యూనిట్లలో ప్రధానంగా క్యాంటీన్, ఫుడ్ ప్రాసెసింగ్, క్యాటరింగ్, గృహసేవిక నిర్మాణరంగ సేవలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. యూనిట్లతో తయారు చేసిన ఆహారాన్ని ఆన్‌లైన్ పద్ధతిలో స్విగ్గీ, జొమాటో వంటి సంస్థలను అనుసంధానం చేసుకుని వ్యాపారాన్ని విస్తృతం చేయాలని సూచించారు. ఇంకా ఎంబ్రాయిడరీ నేర్చుకున్న బృందాలకు అమేజాన్ ద్వారా ప్రజలు కొనుగోలు చేసే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీఆర్‌వో కోల రాజేశ్‌కుమార్, టీఎంసీ రమేష్, సీవోలు సకినాల రమేష్, శ్రీలత, రాజ్‌కుమార్, స్వాతి, సునీల్, రజిత, ఆలీ పాల్గొన్నారు.

గిరిజన కళాశాల వసతి గృహం ప్రారంభం

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు21: హనుమకొండలోని అశోకాకాలనీలో నూతనంగా నిర్మించిన గిరిజన కళాశాల బాలుర వసతి గృహాన్ని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ఈ వసతి గృహంలో 250 మంది గిరిజన బాలురకు వసతి కల్పించబడుతుందన్నారు. రూ.2.15కోట్లతో వసతి గృహాన్ని నిర్మించామన్నారు. ఈ వసతి గృహంతో కలిపి హనుమకొండలో 6 వసతి గృహాలు ఉన్నాయని, ఇందులో నాలుగు బాలురకు ఉండగా, రెండు బాలికలకు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన శాఖ అధికారి ప్రేమలత, స్థానిక కార్పొరేటర్ నల్ల స్వరూపరాణితోపాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



వడ్డేపల్లి టీచర్స్ కాలనీలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వడ్డేపల్లి, ఆగస్టు 21 : ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం గ్రేటర్ వరంగల్ 60వ డివిజన్ వడ్డేపల్లి టీచర్స్ కాలనీ ఫేస్-1లో రూ.30లక్షలతో నిర్మించే అంతర్గత (సీసీ) రోడ్ల నిర్మాణం పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కాలనీలోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి స్వామివారిని దర్శించుకొని కొలిచారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎనుకొంటి నాగరాజు, 60వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎనుకొంటి పున్నం చందర్, టీచర్స్ కాలనీ ఫేస్ -1 అధ్యక్షుడు పింగిళి రాంరెడ్డి, శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ అధ్యక్షుడు చిర్ర రఘుపతిరెడ్డి, ఎస్‌బీహెచ్ కాలనీ అధ్యక్షుడు టి. రాజేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి రాంచంద్రం తో పాటు కాంగ్రెస్ శ్రేణులు బుస్స నవీన్‌కుమార్, ఎమ్డీ అక్మల్, యుగంధర్, సాజిద్, సాదిక్, ప్రసాద్, కమల్, ఎర్ర విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో కృషి చేయాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కోరారు. బుధవారం గ్రేటర్ వరంగల్ 57వ డివిజన్ టీవీ టవర్ రోడ్డులోని కృష్ణాకాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన లాంచనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయిని రాజేందర్‌రెడ్డి సతీమణి నీలిమా రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళయాదవ్, హనుమకొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంక సంపత్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పులి వీరారెడ్డి, అశోక్‌రెడ్డి, నాయిని లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, నెహాల్, జయపాల్‌రెడ్డి, వెంకటమల్లు, లక్ష్మణ్, బంక సతీష్, బంక చంద్రశేఖర్, యాదగిరి, లలిత, భాగ్యలక్ష్మి, ఝాన్సీ, సుజిత, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల శ్మశాన వాటికకు నిధులు

గ్రేటర్ వరంగల్ 58వ డివిజన్ ఎన్జీవోస్ కాలనీలోని ముదిరాజ్ కులస్థుల శ్మశాన వాటిక అభివృద్ధికి రూ.5లక్షలు కేటాయిస్తున్నట్లు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. వడ్డేపల్లి ముదిరాజ్ సంఘం నాయకులు మట్టెపల్లి సమ్మయ్య, కేశబోయిన కోటేశ్వర్‌రావు తదితరులు ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. అలాగే టీచర్ కాలనీ ఫేస్-1లో వివిధ అభివృద్ధి పనులకు రూ. 20 లక్షలు సీడీఎఫ్ నుంచి మంజూరు చేస్తున్నట్లు నాయిని రాజేందర్‌రెడ్డి ప్రకటించారు.

ఉత్సాహంగా తీజ్



సురేంద్రపురి కాలనీలో తీజ్ వేడుకల్లో మహిళల ఆట పాట

వడ్డేపల్లి, ఆగస్టు 21 : తీజ్ ఉత్సవాల్లో భాగంగా బుధవారం 56వ డివిజన్ బాలాజీ కాలనీలో సంత్‌సేవాలాల్ బంజారా సంక్షేమ సంఘం అధ్యక్షుడు భానోతు జవహర్‌లాల్, ప్రధాన కార్యదర్శి ధారవత్ రాంచందర్ నాయక్, సురేంద్రపురి కాలనీ, విష్ణుపురికాలనీ, పూరిగుట్ట తండాతో పాటు హనుమకొండలోని గిరిజన భవన్‌లో తీజ్ ఉత్సవాలు నేత్రపర్వంగా కొనసాగాయి. ఇందులో భాగం గా సురేంద్రపురి కాలనీలో శ్రీసంత్‌సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠ కు మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్, కాకతీయ యూనివర్సిటీ ప్రిన్సిపాల్ సురేష్‌లాల్, 56వ డివిజన్ కార్పొరేటర్ సిరంగి సునిల్‌కుమా ర్, లంబాడా లైవ్ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు లావుడ్య రాజు నాయక్, సేవాలాల్ బంజారా సంక్షేమ సంఘం కమిటీ చైర్మన్ పోరిక అనసూ య, విద్యార్థి సంఘం నేత రాజు నాయక్ తదితరులు భూమి పూజ చేశారు. గోపాల్‌పూర్‌లోని బంజారా కాలనీలో డమోలీ, గన్‌గోర్ కార్యక్ర మాన్ని నిర్వహించారు. గిరిజన భవన్‌లో మహిళలు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సంత్ సేవాలాల్ మహారాజ్, మేరామాయాడీలను కొలుస్తూ బంజారా గీతాలను, గేయాలను లయబద్ధంగా ఆలపించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు భానోతు వెంకన్న నాయక్, వీఎన్ నాయక్, నందా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ శరణ్య హాస్పిటల్‌లో అరుదైన శస్త్ర చికిత్స

వరంగల్ మెడికల్, ఆగస్టు 21: శ్రీ శరణ్య హాస్పిటల్‌లో అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు యాజమాన్యం తెలిపింది. లక్ష్మీ అనే మహిళ కుడిచేయి గ్రైండర్‌లో ఇరుక్కుపోయి మణికట్టు కింద చేయిభాగం మొత్తం విరిగి రక్తనాళాలు తెగిపోయాయి. దీంతో చేయి తీసేయాల్సిన పరిస్థితిలో శ్రీ శరణ్య ఆస్పత్రి వైద్యులు డాక్టర్ ప్రశాంత, డాక్టర్ నాగార్జునరెడ్డి, ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ మఠం ఉపేందర్, డాక్టర్ తిరుపతిరెడ్డి, ఆర్థోపెడిక్ డాక్టర్ రాజేందర్‌లు సుమారు 7గంటలకు శ్రమించి శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. అతి తక్కువ ఖర్చుతో శస్త్రచికిత్స పూర్తి చేయడంతో బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

బ్యూటీషియన్ కోర్సును సద్వినియోగం చేసుకోవాలి

జూలైవాడ, ఆగస్టు 21: బ్యూటీషియన్ కోర్సును మహిళలు సద్వినియోగం చేసుకోవాలని గ్రేటర్ 59వ డివిజన్ కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్‌రెడ్డి అన్నారు. జన శిక్షణ సంస్థాన్ ఆధ్వ ర్యంలో కనకదుర్గా కాలనీలోని పార్కులో ఏర్పాటు చేసిన బ్యూటీషియన్ శిక్షణ కేంద్రాన్ని బుధవారం కార్పొరేటర్ ప్రారంభించి మాట్లాడారు. శిక్షణ పొందాలనుకునే మహిళలు ఆధార్‌కార్డు, పాస్‌ఫొటోతో పేరును రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. ఉచితంగా శిక్షణ ఇచ్చి అనంతరం సర్టిఫికెట్ అందజేయనున్నట్లు కార్పొరేటర్ తెలిపారు.

పిల్లలకు బాధ్యతలను గుర్తుచేస్తూ పెంచాలి

కాజీపేట, ఆగస్టు 21: పిల్లలకు బాధ్యతలు గుర్తుచేస్తూ పెంచాలని, అందుకు తల్లిదండ్రులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా అన్నారు. కాజీపేట సోమిడి తాళ్లపద్మావతి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం బీటెక్ విద్యార్థులకు ఓరియెంటేషన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా షేక్ సలీమా హాజరై ప్రసంగించారు. తల్లిదండ్రులు ఆడపిల్లలను ప్రేమగా, మగపిల్లలను బాధ్యతగా పెంచాలన్నారు. బాలికల భద్రతపై పోలీసు శాఖ అందిస్తున్న సౌకర్యాలను వినియోగించు కోవాలన్నారు. యువత సోషల్ మీడియాకు, డ్రగ్స్‌కు బానిస కావొద్దని సూచించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ తాళ్ల మల్లేశం, డైరెక్టర్‌లు తాళ్ల వంశీ చైతన్య తాళ్ల తరుణ్, ప్రిన్సిపాల్ వేలు, మడికొండ ఇన్‌స్పెక్టర్ పి.కిషన్‌తో పాటు విద్యార్థులు, పేరెంట్స్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడి మృతిపై సంతాపం

మడికొండ, ఆగస్టు 21: మడికొండ నెహ్రూనగర్‌కు చెందిన బీజేపీ నాయకుడు ధరావత్ సునిల్ బుధవారం గుండెపోటుతో మృతిచెందారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ మడికొండకు చేరుకొని సునిల్ భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. రావు పద్మ వెంట పార్టీ జిల్లా నాయకులు పొనగోటి వెంకట్రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం మహేందర్, నాయకులు ఆకుల శ్రీకాంత్, దువ్వ నవీన్, మాచర్ల రంజిత్, ఎలగొండ శివ, కిరణ్ ఉన్నారు.

పాఠశాల పనులను పరిశీలించిన ఎంపీడీవో

వేలేరు, ఆగస్టు 21: వేలేరు మండలంలోని మల్లికుదుర్ల ప్రభుత్వ హైస్కూల్, ప్రైమరీ పాఠశాలను ఎంపీడీవో లక్ష్మీప్రసన్న బుధవారం సందర్శించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న అమ్మ ఆదర్శ పాఠశాలకు ఈ రెండు పాఠశాలలకు ఎంపికయ్యారు. దీంతో పనుల పురోగతిని తనిఖీ చేసేందుకు ఆమె పాఠశాలను సందర్శించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రధానోపాధ్యాయులను ఎంపీడీవో లక్ష్మీప్రసన్న ఆదేశించింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీను, విద్యానంద్, ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మజ్దూర్ యూనియన్‌లో చేరికలు

కాజీపేట, ఆగస్టు 21: కాజీపేట రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ నుంచి బుధవారం పలువురు సికింద్రాబాద్ కార్యాలయంలో మజ్దూర్ యూనియన్‌లో చేరారు. మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ శంకర్‌రావు సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. యూనియన్‌లో చేరిన వారిలో ఈ ఎల్‌ఎస్ బ్రాంచ్ నాయకురాలు స్వర్ణ కుమారి, నాగమణి తదితరులు ఉన్నారు. మజ్దూర్ యూనియన్ డివిజన్ అధ్యక్షులు ఖాజాబాబు, సెక్రటరీ సదానందం, నాయకులు సమ్మయ్య రాజేందర్ ఉన్నారు

రోడ్డుపై మహిళ హల్‌చల్

హనుమకొండ టౌన్, ఆగస్టు 21: తనకు అన్యాయం జరిగిందంటూ రోడ్డుకు అడ్డంగా నిలబడి ఓ మహిళ హల్‌చల్ చేసింది. ఈ సంఘటన బుధవారం రాత్రి హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని యాదవ్ నగర్ నుంచి అమృత థియేటర్‌కు వెళ్లే దారిలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. ఇంట్లోని బీరువాలో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు బంగారం చోరీ చేశారని డయల్ 100కు కాల్‌చేయగా సంఘటన స్థలానికి పోలీసులు చేరుకున్నారు. ఈ క్రమంలో ఆ మహిళ రోడ్డుకు అడ్డంగా నిలబడి హల్‌చల్ చేస్తుండటంతో పోలీసులు ఆరా తీశారు. దీంతో ఆమె పొంతనలేని సమాధానాలు చెప్పారు. ఆరు నెలల కిందట తన ఇంట్లో చోరీ జరిగిందని ఒకసారి, అడ్వకేట్ వేణుగోపాల్ అనే వ్యక్తికి రూ.ఐదు లక్షలు ఇచ్చానని, దాని కింద ఇల్లు రాసిచ్చాడని చెబుతూ గేటుకు తాళం వేసి ఉన్న ఒక ఖాళీ స్థలాన్ని చూపించి ఆ ఇల్లు ఇదేనని చూపించింది. అయితే ఇన్ని రోజులు ఏమి చేశావని స్థానికులు ప్రశ్నించగా, హైదరాబాద్‌లో తన కుమార్తెలను చదువించుకోవడానికి ఉన్నానని చెప్పింది. అయితే ఏదైనా ఆధారాలుంటే పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు.

కేజీబీవీల్లో పరస్పర బదిలీలకు దరఖాస్తులు ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 21: జిల్లాలోని కస్తూర్బా గాంధీ బా లికల విద్యాలయాల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది పరస్ప ర బదిలీలకు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా డీఈవో డి.వాసంతి బు ధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులకు గురు, శుక్రవారాల్లో అవకాశం కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు. http://schooledu.telangana.gov.in/ISMS అనే వెబ్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆమె సూచించారు.

కౌన్సెలింగ్

Q A

డాక్టర్! నా వయసు 20 ఏళ్లు! ప్రతి నెలసరిలో విపరీతమైన కడుపు నొప్పి, నడుము నొప్పితో ఇబ్బంది పడుతున్నాను. ఎన్నో మందులు వాడాను. కానీ నొప్పి అదుపులోకి రావడం లేదు. ఈ సమస్య నుంచి ఉపశమనం పొందే సులువైన చికిత్సను సూచించగలరు?

- ఓ సోదరి, కర్నూలు

నెలసరి నలత

స్త్రీల జీవితంలో కీలకమైన దశ ఇది. మహిళగా మారే క్రమంలో ఈ దశలోనే పునరుత్పత్తి వ్యవస్థ పూర్తి ఎదుగుదలకు చేరుకుంటుంది. అయితే కొందరు టీనేజీ అమ్మాయిలకు నెలసరి సమయంలో శారీరక అసౌకర్యం కలగడం సహజం. అయితే భావోద్వేగాలు అదుపు తప్పడం, నడుము, కాళ్లలో నొప్పులు, తలనొప్పి, అలసట మొదలైన అసౌకర్యాలు శరీర తత్వాలనుబట్టి మారుతూ ఉంటాయి.

నెలసరి నొప్పులు తగ్గాలంటే?

మానసిక, శారీరక అసౌకర్యాలు భరించలేనంతగా ఉంటే, ఉపశమనం కోసం ఆయుర్వేద చిట్కాలను పాటించవచ్చు. అవేంటంటే....

- **నువ్వుల నూనె మర్దన:** ఆయుర్వేద అభ్యంగన స్నానం కోసం ఈ నూనె వాడతారు. దీన్లోని లినోలిక్ యాసిడ్‌కు, శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించే గుణం కలిగి ఉంటుంది. విషాలను హరించే తత్వం కూడా ఈ నూనెకు ఉంటుంది. కాబట్టి నెలసరి సమయంలో ఈ నూనెతో పొత్తికడుపు మీద సున్నితంగా మర్దన చేయాలి. ఇలా చేస్తే కడుపు నొప్పి తగ్గుతుంది.
- **మెంతుల మహిమ:** కాలేయం, మూత్రపిండాలు, మెటబాలిజంకు మెరుగైన ఔషధం మెంతులు. వీటితో నెలసరి నొప్పులు కూడా తగ్గుతాయి. కాబట్టి 2 టీస్పూన్ల మెంతులను 12 గంటలపాటు నీళ్లలో నానబెట్టి తాగాలి.
- **వేడి కాపడం:** పొత్తికడుపు మీద వేడి కాపడం పెడితే గర్భాశయ కండరాలు ఉపశమనం పొంది నొప్పులు తగ్గుతాయి. కాబట్టి వేడి నీళ్ల నింపిన బాటిల్‌ను పొత్తికడుపు మీద ఉంచి కాపడం పెట్టాలి. వేడి జావ తాగినా, వేడి నీళ్ల స్నానం చేసినా కూడా ఫలితం దక్కుతుంది.
- **వ్యాయామంతో ఉపశమనం:** నొప్పితో మంచానికే అతుక్కుపోయే బదులు, వ్యాయామంతో ఒళ్లు కదిలిస్తే కటి ప్రదేశానికి రక్తప్రసరణ పెరిగి నొప్పులు తగ్గుతాయి. నెలసరి సమయంలో మూత్రాశయ కండరాలు కుంచించుకుపోయేలా చేసే హార్మోన్లను నెమ్మదించేలా చేసే ఎండార్ఫిన్లు వ్యాయామం చేస్తే విడుదలవుతాయి. కాబట్టి ఈ సమయంలో తేలికపాటి వ్యాయామం చేయడం ఎంతో అవసరం. ఆ మూడు రోజులే కాకుండా దైనందిన జీవితంలో వ్యాయామానికి చోటు కల్పిస్తే క్రమేపీ నెలసరి నొప్పులు అదుపులోకి వస్తాయి.
- **శొంఠి, మిరియాల టీ:** శొంఠి, మిరియాల పొడి కలిపిన నీళ్లను వేడి చేస్తే హెర్బల్ టీ తయారవుతుంది. దీన్లో పాలు కలపకుండా తాగితే, నొప్పులకు కారణమయ్యే హార్మోన్ల పరిమాణం తగ్గి నొప్పులు తగ్గుతాయి. ఈ టీ వల్ల నెలసరి సమస్యలు కూడా సరి అవుతాయి. అలసట కూడా వదులుతుంది.
- **జీలకర్ర వైద్యం:** జీలకర్ర వేసి మరిగించిన నీళ్లు తాగినా ఫలితం ఉంటుంది.
- **ఛామొమైల్ టీ:** ఈ పువ్వులు వేసి కాచిన నీళ్లు తాగితే పొత్తికడుపు, నడుము నొప్పులు తగ్గుతాయి. ఈ పూలలోని ఔషధ గుణాలు కూడా గర్భాశయాన్ని కుంచించుకుపోయేలా చేసే హార్మోన్ల ఉత్పత్తిని తగ్గిస్తాయి.
- కప్పు పాలలో, దంచిన మూడు వెల్లుల్లి రెబ్బలు, పసుపు, తేనె, మిరియాల పొడి వేసి వెల్లుల్లి రెబ్బలు ఉడికేవరకూ కాచాలి. ఈ పాలను తాగి, వెల్లుల్లి రెబ్బలను నమిలేయాలి. ఇలా క్రమంతప్పకుండా 3 రోజులు చేసినా నెలసరి నొప్పులు తగ్గుతాయి.



ఈ జాగ్రత్తలు పాటించాలి!

- చక్కెర, మైదా, శుద్ధిచేసిన పదార్థాలు, కృత్రిమ రంగులు ఉన్న పదార్థాలు మానేయాలి.
- బియ్యం, పాస్తా, బ్రెడ్ వాడకం మానేయాలి.
- ఉప్పు వాడకం బాగా తగ్గించాలి. ఉప్పు శరీరంలో నీరు నిల్వ ఉండేలా చేస్తుంది. దాంతో నెలసరి సమయంలో ఒళ్లు మరింత బరువై బద్ధకం ఆవరిస్తుంది.
- కాఫీ కూడా బాగా తగ్గించాలి. కెఫీన్ వల్ల నెలసరి నొప్పులు ఎక్కువవుతాయి.
- ప్రతి రోజూ పరగడుపున నిమ్మరసం తాగడం అలవాటు చేసుకోవాలి.
- నెలసరి ద్వారా పోయే రక్తం ద్వారా క్యాల్షియం శరీరం నుంచి వెళ్లిపోతూ ఉంటుంది. కాబట్టి పాలు, పెరుగు, నువ్వులు, ఆకుకూరలు తప్పక తీసుకోవాలి.
- రోజుకి కనీసం 8 గంటల నిద్ర తప్పనసరి. నిద్రతో శరీరం ఉపశమనం పొందుతుంది. ఫలితంగా నొప్పులూ అదుపులోకి వస్తాయి.
- నట్స్, సీడ్స్ తిని, ఏరోబిక్ వ్యాయామం చేయడం వల్ల ఎండార్ఫిన్లు విడుదలై నొప్పులు తగ్గుతాయి.

- డాక్టర్ రాంప్రకాశ్
ఆయుర్వేద వైద్యులు,
హైదరాబాద్.



"కొద్దిసేపటి క్రితమే- గంటా ఐదు నిమిషాల్లో 80 ల్యాప్స్ (రెండు కిలోమీటర్లు) ఈదాను. వచ్చే నెల రోజుల్లో మరింత మెరుగుపడాలి" అంటారు **విద్యా గజపతి రాజు సింగ్**. విజయనగరం రాజకుటుంబానికి చెందిన ఈ 71 ఏళ్ల రాజకుమారి సామాన్యమైన వ్యక్తి కాదు... గత కొన్నేళ్లుగా జాతీయ స్విమ్మింగ్ పోటీల్లో అనేక గోల్డ్ మెడల్స్ గెలుచుకున్న ఛాంపియన్. 'నవ్య' ఆమెను పలకరించినప్పుడు అనేక విశేషాలను వివరించారు.

ఆ క్రమశిక్షణే నడిపిస్తోంది

మీ బాల్యం ఎలా గడిచింది?

మా పెదనాన్నగారు విజయనగర సంస్థానానికి చెందిన ప్రముఖుడు పి.వి.జి.రాజు. మా నాన్నగారు ఆయన సోదరుడు విశ్వేశ్వర గజపతి రాజు. పెదనాన్నగారు విజయనగరం, హైదరాబాద్‌లలో ఉంటే- మేము మద్రాసు (చెన్నై)లో ఉండేవాళ్లం. నేను పుట్టింది, పెరిగింది అక్కడే. నేను, మా చెల్లి మద్రాసులో చర్చ్ పార్క్ స్కూల్లో చదువుకున్నాం. ఇక్కడ ఒక విషయం చెప్పాలి. మద్రాసు ప్రెసిడెన్సీకి మద్రాసు రాజధాని. బ్రిటిష్ వారు అక్కడి నుంచే పాలించేవారు. ప్రెసిడెన్సీకి అది ప్రధాన కేంద్రం కావడంతో... తెలుగు ప్రాంతాలకు చెందిన జమీందారీ కుటుంబాలకు అక్కడ ఎస్టేట్లు ఉండేవి. పిఠాపురం, విజయనగరం, కపిలేశ్వరపురం, బొబ్బిలి, చుక్కవరం, సురవరం- ఇలా అందరూ రాజకుటుంబీకులు మద్రాసులో ఉండేవారు. అందరం తరచూ కలుసుకుంటూ ఉండేవాళ్లం.

మీరు మంచి స్విమ్మర్. సైక్లింగ్ చేస్తారు.. ఇవన్నీ ఎప్పటి నుంచి అలవాటు అయ్యాయి?



మమ్మల్ని మా నాన్నగారు చాలా క్రమశిక్షణతో పెంచారు. నేను పుట్టిన తర్వాత ఒక రోజు హఠాత్తుగా ఆయన వేట, మద్యపానం, ధూమపానం, మాంసాహారం, పేకాట- ఇవన్నీ మానేశారు. శుద్ధ శాకాహారిగా మారిపోయారు. స్కూలుకు వెళ్లి బాగా చదువుకోవటం, ఆ తర్వాత వ్యాయామం.... ఇదే మా రొటీన్. టెన్నిస్, హార్స్ రైడింగ్- ఇలా అనేక అంశాల్లో శిక్షణ ఇప్పించారు. నేను కాలేజీలో చదువుకొనే రోజుల్లో మూడేళ్ల పాటు నేనే టెన్నిస్ టీమ్ కెప్టెన్‌ని. దేశంలోని అనేక ప్రాంతాల్లో జరిగే ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొనేవాళ్లం. బహుశా ఆ క్రమశిక్షణే ఇప్పటికీ కొనసాగుతోంది.

మీరు చిన్నప్పుడు విజయనగరం వెళ్లేవారా? ఆ జ్ఞాపకాలేమిటి?

సెలవుల్లో విజయనగరం వెళ్తూ ఉండేవాళ్లం. మా చిన్నప్పుడు పెదనాన్న ఫూల్‌బాగ్ ప్యాలెస్‌లో ఉండేవారు. మా కజిన్స్ ఆనంద్ గజపతిరాజు, అశోక్ గజపతిరాజు, సునీతలతో ఆడుకుంటూ ఉండేవాళ్లం. నాకు విజయనగరం కోట, ఆ పట్టణం అంటే చాలా ఇష్టం. సింహాచలం తరచూ వెళ్తూ ఉండేవాళ్లం. కొవిడ్ వచ్చిన తర్వాత విజయనగరం వెళ్లలేదు. కానీ అంతకుముందు ప్రతి ఏడాది వెళ్లేవాళ్లం. ఆనంద్ కూతురు పెళ్లికి, అశోక్ కూతుర్ల పెళ్లిళ్లకు విజయనగరం వెళ్లాను. అవన్నీ చాలా తీపి జ్ఞాపకాలు. ఇప్పటికీ గుర్తున్నాయి. విజయనగరంతో పాటుగా ఊటీ గురించి కూడా చెప్పాలి. ఊటీలో 'ఎస్కిల్ ఎస్టేట్' అని ఉంది. అది మాదే. ప్రస్తుతం ఊటీలో ఉన్న సెంటినరీ రోజ్ గార్డెన్- మా అమ్మమ్మ తన కోసం పెంచుకున్నదే! ఆవిడ నివసించిన దిల్‌కుష్ మహల్‌ను ఇప్పుడు స్కూలుగా మార్చారు. మా చిన్నప్పుడు- కజిన్స్ అందరం కలిసి ఊటీ వెళ్లేవాళ్లం. ఈ మధ్యకాలంలో ఊటీ బాగా కమర్షియల్‌గా మారిపోయింది. అందుకే వెళ్లటం మానేశాను.

లండన్‌లో విజయనగరం షీల్డ్స్

ఇంగ్లాండ్‌లో సుమారు 150 ఏళ్ల నుంచి 'నేషనల్ రైఫిల్ డే' (జూలై 26) రోజున 'విజయనగరం రోలింగ్ షీల్డ్స్' బహూకరిస్తారు. ఈ ఏడాది వాటిని అందజేయడం కోసం నన్ను లండన్ ఆహ్వానించారు. ఆ షీల్డ్స్ వెనుక ఒక కథ ఉంది. 1867లో మా ముత్తాత విజయరామ గజపతి- ఇంగ్లాండ్‌కు వెళ్లారు. ఆయన చాలా మంచి వేటగాడు. మంచి షూటర్. ఆ సమయంలో బ్రిటన్ పార్లమెంట్ సభ్యులకు మూడు అడుగులు ఉన్న రెండు వెండి రోలింగ్ షీల్డ్స్ ఆయన బహుమతిగా ఇచ్చారు. బ్రిటన్ పార్లమెంట్‌లో 'హౌస్ ఆఫ్ లార్డ్స్', 'హౌస్ ఆఫ్ కామన్స్' అని రెండు సభలు ఉంటాయి. ఈ సభల సభ్యులతో షూటింగ్ టీమ్‌లు ఏర్పాటు చేస్తారు. ప్రతి ఏడాది జూలై 26వ తేదీన ఈ టీమ్‌ల మధ్య పోటీ జరుగుతుంది. గెలిచిన వారికి ఈ 'విజయనగరం షీల్డ్స్' బహూకరిస్తారు. ఆశ్చర్యమేమిటంటే సుమారు 150 సంవత్సరాల నుంచి ఈ సంప్రదాయం కొనసాగుతూనే ఉంది. ఈ ఏడాది కమిటీ వారు నన్ను ఈ పోటీలకు ఆహ్వానించారు. అంతేకాదు, 'లార్డ్స్ టీమ్'లో నన్ను ఒక సభ్యురాలుగా చేశారు. నాకు షూటింగ్ రాదంటే- కోచ్‌ను పెట్టి నేర్పారు. 300, 400, 700 మీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలను షూట్ చేయాలి. ఇది చాలా కష్టం. ఈసారి గెలిచిన టీమ్‌కు నేను ట్రోఫీలు అందించాను. ఇది చాలా గొప్ప అనుభవం. నాకు దక్కిన గౌరవం.

రాజకీయాల్లోకి ప్రవేశించాలని మీకు ఎప్పుడూ అనిపించలేదా?

లేదు. ఎందుకంటే నాకు విజయనగరంలో బేస్ లేదు. పెదనాన్నగారు ఫుల్‌టైమ్ పొలిటీషియన్. ఆనంద్, అశోక్‌లు- ఆయన వారసత్వం నిలబెట్టారు. ప్రస్తుతం అశోక్ కుమార్తె కూడా గెలిచింది. ఉత్తరాఖండ్‌లోని తెరీ గర్వాల్ ఎంపీ మాలా రాజ్యలక్ష్మీ షా మాకు దగ్గర బంధువు. ఆమె ఒకప్పుడు నేపాల్ యువరాణి. 2014లో ఆమె బీజేపీ తరుపున రాజకీయాల్లోకి ప్రవేశించినప్పుడు కాంగ్రెస్ పార్టీ ఆమెను 'గుంగీ గుడియా' అని ఎగతాళి చేసింది. కానీ ఆమె ఎన్నికల్లో గెలిచింది. 2019, 2024 ఎన్నికల్లో రెండు లక్షలపైగా మెజారిటీతో విజయం సాధించింది. అక్కడ ప్రజలు ఆమెను గెలిపించారంటేనే- మంచి పనులు చేస్తున్నట్లు లెక్క కదా! మా కుటుంబంలోని వారందరూ ప్రజలకు మేలు చేయటానికే రాజకీయాల్లోకి వచ్చారు.



మీ రాజ కుటుంబాలలో మహిళలపై ఆంక్షలు ఉండేవా?

మేమందరం 1950ల తర్వాత పుట్టిన వాళ్లం. మా సమయంలో- మా కుటుంబాలలో అమ్మాయిల మీద ఆంక్షలు ఉండేవి కాదు. బొబ్బిలి, పిఠాపురం, విజయనగరం జమీందారీ కుటుంబాలలో అమ్మాయిలను చదివించేవారు. వెంకటగిరి సంస్థానంలోని మహిళలు మాత్రం చాలా కాలం పరదాలోనే ఉన్నారు.

ఈ కాలం మహిళలకు మీరు ఇచ్చే సలహా ఏవిటి?

వ్యాయామాన్ని ఒక అలవాటుగా చేసుకోండి. మనకు జీవితాంతం తోడుండేది వ్యాయామమే! అదే మనకు క్రమశిక్షణ నేర్పుతుంది, అవసరమైన శక్తిని ఇస్తుంది.

నా ఆరోగ్య రహస్యం అదే!

నేను కిందటి వారం తమిళనాడు రాష్ట్ర మాస్టర్ స్విమ్మింగ్ పోటీల్లో ఐదు గోల్డ్‌మెడల్స్ గెలిచాను. ప్రతి ఏడాది నేషనల్ స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొంటూ ఉంటా. ప్రతిసారి కనీసం మూడు గోల్డ్ మెడల్స్ వస్తూ ఉంటాయి. ప్రస్తుతం నాకు 71 ఏళ్లు. ప్రతి ఏడాది కనీసం రెండుసార్లు ట్రెక్కింగ్‌కు వెళ్తా. మే నెలలో నేపాల్‌లోని లాంగ్‌టాంగ్ వ్యాలీకి వెళ్లాను. అది 16 వేల అడుగుల ఎత్తు ఉంటుంది. తరువాత లద్దాఖ్‌లో 'మెంగ్‌టాక్ డాంగ్రీ' అనే సమ్మిట్‌కు వెళ్తున్నా. దాని ఎత్తు 20,750 వేల అడుగులు. ప్రతి శనివారం 50 కిలోమీటర్లు సైకిలు తొక్కుతా! నేను వెజిటేరియన్‌ని. అయితే ఎగ్స్ తీసుకుంటా. సలాడ్స్ ఫ్రూట్స్ చీజ్ తింటూ ఉంటా. అదే నా ఆరోగ్య రహస్యం.

• సీవీఎల్ఎన్ ప్రసాద్



ఈ వ్యవసాయం వినూత్నం

ప్రశాంతంగా విశ్రాంతి తీసుకోవలసిన వయసులో సవాళ్లతో కూడిన కుంకుమ పువ్వు సాగులోకి అడుగు పెట్టింది 64 ఏళ్ల శుభాన్వి. కశ్మీరుకు పూర్తి భిన్నమైన ఉత్తర్‌ప్రదేశ్‌లో వాతావరణ సవాళ్లను సమర్థంగా అధిగమించి వాణిజ్యవేత్తగా ఎదిగింది.. అనేక మందికి ఉపాధి కల్పిస్తోంది.

వ్యవసాయం పట్ల మక్కువ, గ్రామీణ మహిళల జీవితాలను ప్రభావితం చేయాలనే తపన, 64 ఏళ్ల శుభాన్విని కుదురుగా కూర్చోనివ్వలేదు. పిల్లలతో పాటు మనవలు, మనవరాళ్లు కూడా ఎదిగిపోవడంతో ఆవిడకు చేతి నిండా తీరిక చిక్కింది. ఆ తీరిక సమయాన్ని ఉత్పాదకమైన పని కోసం ఉపయోగించాలనే ఆలోచన ఆవిడకు తట్టింది. దాంతో తనకెంతో ఇష్టమైన వ్యవసాయాన్నే వ్యాపకంగా చేసుకుందామని పరిశోధన మొదలుపెట్టింది. ఆ క్రమంలో ఆమె దృష్టి కుంకుమ సాగు వైపు మళ్లింది. అయితే కుంకుమపువ్వుకు పుట్టినిల్లైన కశ్మీరులా ఉత్తర్ ప్రదేశ్ చల్లని ప్రదేశం కాదు. కానీ ఇంట్లోనే చల్లటి వాతావరణాన్ని సృష్టించగలిగితే? ఈ ఆలోచన ఆమెలో కొత్త ఉత్సాహాన్ని రేకెత్తించింది.

కిలోకు కిలో రాబడి

"2023లో శుభాన్విని స్మార్ట్‌ఫామ్స్‌ను స్థాపించాను. ముందుగా 560 చదరపు అడుగుల విస్తీర్ణంలో కోల్డ్ స్టోరేజీని ఏర్పాటు చేసుకుంది. అయితే కోల్డ్ స్టోరేజీలో సరైన వెలుతురు ఉండదు. అందువల్ల పంటకు తగిన వెలుతురును ఏర్పాటు చేసుకున్నా. ఇదంతా మనకు మార్కెట్లో లభించే పరికరాలతోనే ఏర్పాటు చేసుకోవచ్చు" అంటారామె! శుభాన్వికి తొలి రోజుల్లో దిగుబడి ఎంత వస్తుందనే బెంగ ఉండేది. కానీ నాణ్యమైన విత్తన దుంపలను ఉపయోగించటం వల్ల దిగుబడి కూడా బాగా పెరిగింది. ఒక కిలో పువ్వుల నుంచి 800 గ్రాముల నుంచి కిలో దాకా కుంకుమ పువ్వు లభిస్తోంది. ఇది చాలా అరుదైన విషయంగా చెప్పుకోవాలి.

త్వరలో విదేశాలకు కూడా..

ప్రస్తుతం శుభాన్విని ముంబయి, ఢిల్లీ, బెంగుళూరు నగరాలకు కుంకుమ పువ్వును ఎగుమతి చేస్తోంది. అతి త్వరలోనే విదేశాలకు కూడా కుంకుమ పువ్వును ఎగుమతి చేయటానికి ప్రయత్నాలు మొదలుపెట్టింది. "మొదట్లో ఉత్తరప్రదేశ్‌లో కుంకుమ పువ్వును పండిస్తున్నానంటే ఎవరు నమ్మలేదు. ఈ రోజు నా దగ్గర దొరికే కుంకుమ పువ్వు- ఇతర దేశాలలో దొరికే అత్యుత్తమ కుంకుమ పువ్వుకు ఏ మాత్రం తీసిపోదు" అంటారామె!

కేరళలో లంచ్‌బెల్

ముంబైలో 'డబ్బావాలా' మస్తు ఫేమస్. వేలమంది కార్మికులు సరైన సమయానికి ఇళ్లనుంచి హోటళ్ల నుంచి ఆఫీసులకు డబ్బాల్లో ఆహారాన్ని అందచేస్తారు. ఇదే మాదిరిగా కేరళలో మహిళలతో 'లంచ్‌బెల్' పేరుతో ఆహారాన్ని ఆఫీసులకు అందచేసే పని కొనసాగుతోంది. ఈ 'లంచ్‌బెల్' విశేషాలను తెలుసుకుందాం.



డబ్బావాలా జీవితంపై ఏకంగా బాలీవుడ్‌లో ఏకంగా 'లంచ్‌బాక్స్' అనే సినిమా వచ్చింది. డబ్బావాలా పేరుతో డాక్యుమెంటరీలు వచ్చాయి. ఇక మరాఠీలో అయితే 'ముంబై కా డబ్బావాలా' అంటూ పదిహేడేళ్ల కితమే ఓ చిత్రం విడుదలైంది. అయితే కేరళలో మాత్రం విచిత్రంగా మహిళలతో ఈ 'లంచ్‌బెల్' ప్రాజెక్టు నడుస్తోంది. దీనికి కారణం.. మహిళలంతా కలసి కట్టుగా ఈ పని చేయాలనుకోవటమే.

అలా మహిళలతో...

ముంబైలో డబ్బావాలాలు తెల్లక్యాప్‌తో కనిపిస్తారు. అయితే కేరళలోని తిరువనంతపురంలోని 'కుడుంబశ్రీ' అనే మహిళల సమూహం ఆకుపచ్చ టీషర్టు, పింక్ క్యాప్‌తో దర్శనమిస్తారు. 'హోటల్స్‌లోని జంక్‌ఫుడ్ కాకుండా మేం కేరళలో తినే మంచి ఆహారాన్ని సరఫరా చేస్తాం. సాంబార్, ఊరగాయ ఖచ్చితంగా ఉంటాయి. ఆఫీసులు, బ్యాంకులు, సాఫ్ట్‌వేర్ కార్యాలయాలకు లంచ్‌బాక్సులను అందచేస్తారు. 'పాకెట్‌మార్ట్' అనే యాప్‌ను ఆహారం ఆర్డర్ చేసుకోవాలనుకునే వాళ్లు ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలి. వాస్తవానికి ఉదయం ఏడు గంటలలోపు మాత్రమే బుకింగ్ ఆర్డర్స్‌ను పరిగణలోకి తీసుకుంటారు. మధ్యాహ్నం పన్నెండు లోపలే బాక్సులను కార్యాలయాలకు అందచేస్తారు. శాకాహారం అయితే అరవై రూపాయలు తీసుకుంటారు. మాంసాహారం, చేపల కూర లాంటివి అయితే 99 రూపాయలు తీసుకుంటారు. వెజ్‌థాలీ, బిర్యానీ లాంటి ఆహారాన్ని మెనూలోకి చేర్చారు. మళ్లీ రెండున్నర గంటలనుంచి సాయంత్రం మూడు లోపే ఆబాక్సులను తిరిగి కలెక్ట్ చేసుకుంటారు.



పలుమార్లు కొందరే...

తిరువనంతపురం కుడుంబశ్రీ యూనిట్‌లోనే సెంట్రల్ కిచెన్ ఉంది. హైజీన్ ఫుడ్ తయారు చేస్తారిక్కడ. తాజా ఆహారం, విటమిన్లు, న్యూట్రిన్లు ఉండే పోషకాహారాన్ని డెలివరీ చేస్తారు. ఎకో ఫ్రెండీకోసమే క్యారీ బాక్స్‌లను వాడుతున్నారు. 'ప్రతి రోజూ పదివేల ఆర్డర్లు వస్తాయి. రుచిగా ఉండటం వల్లనే ఈ స్పందన వస్తోంది. ముఖ్యంగా డబ్బాలు చేరవేశాక.. వాటికి కడిగి ఇస్తారు. వాస్తవానికి మేం అలా చెప్పం. అయినా కస్టమర్లు క్లీన్ చేస్తారు. ఇదో ఉద్యమం లాంటిదే. మాకు రిపీట్ కస్టమర్లే ఉంటారు' అంటారు లోకల్ కో ఆర్డినేటర్ రమేష్. భవిష్యత్‌లో కాలుష్యం చేయకుండా ఉండటానికి ఈ- స్కూటర్లు వాడనున్నారు. అంతేనా కొచ్చి లాంటి ఇతర ప్రాంతాల్లో కూడా లంచ్‌బెల్ మోగించటానికి రెడీ అవుతున్నారు.

మీరు మారాలి!

"అన్నీ సరిగ్గానే అనిపిస్తున్నాయి.. కానీ జీవితంలో ఆనందం ఉండటం లేదు.. "- ఇలాంటి డైలాగ్స్ మనకు వినిపిస్తూ ఉంటాయి. ముఖ్యంగా మధ్యవయస్కులైన మహిళలు తమ ప్రాధమ్యాలు తెలియక రకరకాల మానసిక ఇబ్బందులకు గురి అవుతూ ఉంటారు. అలాంటి వారు తమను తాము మార్చుకోవటం తప్ప వేరే మార్గం లేదంటున్నారు మానసిక నిపుణులు.

కొత్త దృష్టి కోణం

చాలా మంది మహిళలకు తమ కుటుంబమే జీవితం. తమ గురించి తాము అస్సలు పట్టించుకోరు. అలాంటి వారు చేయాల్సిన మొదటి పని- ఉరుకుల పరుగుల జీవితం నుంచి కొద్ది సేపు ఆగి- తమ జీవితాన్ని గురించి ఆలోచించుకోవటం. తమను తాము ప్రేమించుకోవటం మొదలుపెట్టినప్పుడు జీవితాన్ని కొత్త దృష్టికోణం బయటకు వస్తుంది.

మానసిక ఆరోగ్యం ముఖ్యం..

చాలా మంది ఒక రొటీన్‌లో పడిపోయి రకరకాల మానసిక సమస్యలకు గురి అవుతూ ఉంటారు. వారికి తాము మానసిక సమస్యలతో బాధపడుతున్నామనే విషయం కూడా తెలియదు. అందువల్ల ఎప్పుడైనా బాగా ఒత్తిడి పెరిగిపోయినప్పుడు- యోగా, ధ్యానం వంటి వాటిపై దృష్టి పెట్టాలి. మానసిక ఆరోగ్యంపై దృష్టిని కేంద్రీకరించాలి.

ఆత్మవిశ్వాసం ముఖ్యం

చాలా సార్లు జీవితం మనకు కొత్త పాఠాలు నేర్పుతూ ఉంటుంది. ఆ సమయంలో ఆత్మ విశ్వాసం లేకపోతే డీలా పడిపోతారు. అలా డీలా పడకుండా ఉండాలంటే- ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలి. ఆత్మవిశ్వాసం ఒక రోజులో వచ్చేది కాదు. చిన్న లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని.. వాటిని సాధించినప్పుడు ఆత్మవిశ్వాసం కలుగుతుంది. అది నెమ్మదిగా పెరుగుతుంది.

'నో' చెప్పటం నేర్చుకోండి..

కొన్ని సార్లు 'నో' చెప్పటం కూడా ముఖ్యమే! 'వద్దు' అని చెప్పటం రాకపోతే- వచ్చే సమస్యలు అనేకం. ఆ సమస్యలకు ఇతరులు బాధ్యులు కూడా కారు. అందువల్ల 'నో' చెప్పటం కూడా నేర్చుకోవాలి. మన చుట్టు సరిహద్దులు నిర్మించుకోవాలి.

ఆరోగ్యకరమైన జీవనశైలి..

ఆరోగ్యకరమైన ఆలోచనలతో పాటుగా.. ఆరోగ్యకరమైన జీవనశైలికి కూడా చాలా ముఖ్యం. ఉదయాన్నే లేచి వ్యాయామం లేదా యోగా లేదా ధ్యానం ఏదో ఒకటి చేయాలి. దాని వల్ల రోజంతా ప్రతికూల ఆలోచనలు రాకుండా ఉంటాయి. కొత్త శక్తి వచ్చినట్లు అనిపిస్తుంది.





తిరుమలలో చిరంజీవి

● కుటుంబ సభ్యులతో కలసి నేడు శ్రీవారి దర్శనం

మెగాస్టార్ చిరంజీవి శ్రీవారి దర్శనార్థం బుధవారం తిరుమలకు చేరుకున్నారు. రాత్రి 8గంటలకు తిరుమలలోని ఫీనిక్స్ అతిథిగృహానికి చేరుకున్న ఆయనకు టీటీడీ రిసెప్షన్ అధికారులతో పాటు అభిమానులు స్వాగతం పలికారు. చిరంజీవితో పాటు ఆయన సతీమణి సురేఖ, తల్లి అంజనా దేవి కూడా తిరుమలకు చేరుకున్నారు. అంతకుముందు సాయంత్రం కుమార్తె శ్రీజ కాలినడకన తిరుమలకు చేరుకున్నారు. గురువారం చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఆలయంలో వేకువజామున జరిగే సుప్రభాతసేవలో పాల్గొని శ్రీవారిని దర్శించుకోనున్నారు.


తిరుమల, (ఆంధ్రజ్యోతి)

బ్లాక్‌బస్టర్ పక్కా



నాని, ప్రియాంక మోహన్ జంటగా నటించిన పాన్ ఇండియా చిత్రం 'సరిపోదా శనివారం'. ఎస్.జే సూర్య, సాయికుమార్ కీలక పాత్రలు పోషించారు. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో డివివి దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మించారు. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలు, ట్రైలర్ అందరినీ ఆకట్టుకుని సినిమాపై అంచనాలను పెంచేశాయి. ఈ నెల 29న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో నాని మాట్లాడుతూ "ఈ సినిమా కోసం చిత్రబృందం ఎంతో కష్టపడింది. ఆ కష్టం తెరపై కనపడుతుంది. వారి కోసం ఈ సినిమా పెద్ద హిట్టవ్వాలి. ఈ సినిమాకు వివేక్ రైటింగ్, జేక్స్ బిజోయ్ సంగీతం స్పెషల్ అట్రాక్షన్. నాకు కోపం వచ్చింది. అలా కోపం వచ్చిందంటే బ్లాక్‌బస్టర్ పక్కా" అని చెప్పారు. "ఈ సినిమాలో ఎస్.జే. సూర్య, నాని పోటాపోటీగా నటించారు. వివేక్ నుంచి ఇటువంటి కమర్షియల్ సినిమా అస్సలు ఊహించలేదు. సినిమాను డైరెక్టర్ ఓ రేంజ్‌లో తీశారు" అని దిల్‌రాజు అన్నారు. "ఈ సినిమాకు కథే బలం. సినిమా అద్భుతంగా వచ్చింది" అని చిత్ర నిర్మాత డి.వి.వి.దానయ్య తెలిపారు.

ముఫాసాకు మహేశ్ వాయిస్



ప్రపంచవ్యాప్తంగా అందరినీ ఆకట్టుకున్న 'ది లయన్ కింగ్' చిత్రానికి ఇప్పుడు సీక్వెల్ వస్తోంది. 'ముఫాసా ది లయన్ కింగ్' పేరుతో వస్తున్న ఈ చిత్రం తెలుగు వెర్షన్‌లో ముఫాసాకు మహేశ్‌బాబు వాయిస్ అందిస్తుండడం ఆసక్తికరం. ఈ సినిమా హిందీ వెర్షన్‌కు షారుఖ్ ఖాన్ డబ్బింగ్ చెప్పారు. తెలుగు వెర్షన్‌లో పుంబా పాత్రకు బ్రహ్మానందం, టిమోన్ పాత్రకు అలీ డబ్బింగ్ చెప్పారు. తెలుగు వెర్షన్ ట్రైలర్‌ను ఈ నెల 26న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ 'డిస్నీతో అనుబంధం నాకు ప్రత్యేకమైంది. తన కొడుకు అంటే అభిమానం కలిగిన పాత్ర ముఫాసా. అంతేకాదు అడవికి రారాజు. ఆ పాత్రకు నేను వాయిస్ అందించడం నా పిల్లలతో ఎంతో ఆనందంగా సెలబ్రేట్ చేసుకునే సందర్భం ఇది' అన్నారు. డిసెంబర్ 24న 'ముఫాసా ది లయన్ కింగ్' విడుదలవుతుంది.

సిద్ధు కోసం శ్రీనిధి



సిద్ధు జొన్నలగడ్డ తాజా చిత్రం 'తెలుసు కదా' చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో కొనసాగుతోంది. స్టైలిస్ట్ నీరజ కోన ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయమవుతున్నారు. ఇందులో రాశీ ఖన్నా శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నటిస్తుండగా, తాజా షెడ్యూల్‌లో శ్రీనిధి జాయిన్ అయ్యారు. కీలకమైన సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. ఈ చిత్రానికి సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, నిర్మాత: టీజీ విశ్వప్రసాద్.

తెలుగులోనూ ఆదరిస్తారు



హారర్ థ్రిల్లర్‌గా ప్రేక్షకులను భయపెట్టిన 'డీమాంటి కాలనీ'కి సీక్వెల్‌గా తెరకెక్కిన తమిళ చిత్రం 'డీమాంటీ కాలనీ 2'. అజయ్.ఆర్.జ్ఞానముత్తు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాను బి.సురేశ్ రెడ్డి, బి.మానస రెడ్డి నిర్మించారు. అరుల్‌నిధి, ప్రియా భవానీశంకర్ ముఖ్య పాత్రల్లో నటించారు. సినిమా ఈ శుక్రవారం విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథి రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ "మంచి కంటెంట్ ఉన్న ఇలాంటి సినిమాను తెలుగులోను ఆదరిస్తారు" అని చెప్పారు. "ఈ సినిమాకు కొనసాగింపుగా మరో రెండు భాగాలు ఉంటాయి" అని దర్శకుడు అజయ్.ఆర్.జ్ఞానముత్తు అన్నారు.

అద్భుతమైన కంటెంట్‌తో 'రేవు'



వంశీ రామ్ పెండ్యాల, అజయ్, స్వాతి భీమిరెడ్డి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రేవు'. హరినాథ్ పులి దర్శకత్వంలో డా.మురళి గింజుపల్లి, నవీన్ పారుపల్లి నిర్మించారు. సీనియర్ జర్నలిస్టులు ప్రభు దర్శకత్వ పర్యవేక్షణ చేపట్టగా, పి.రాంబాబు ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు హరినాథ్ మాట్లాడుతూ "ఈ సినిమా కంటెంట్ అద్భుతంగా ఉంటుంది. అందరూ మెచ్చే చిత్రమిది" అని అన్నారు. "ఈ సినిమాను థియేటర్‌లో చూసి ఎగ్జైట్ అవుతారు" అని నిర్మాత డా.మురళి గింజుపల్లి అన్నారు.

SCHOLARSHIP ALERT

Reliance Foundation Undergraduate

Description: The Reliance Foundation Under graduate Scholarships aim to support meritorious students from all corners of the country in pursuing their undergraduate education. This empowers them to continue their studies, be come successful professionals, and realize their dreams, unlocking their potential to uplift themselves and their communities and contribute towards India's future socio-economic development.

Eligibility: Students must be enrolled in the first year of a full-time regular undergraduate (UG) de gree in any stream at a recognised Indian institute.
- Must have passed Class 12 with a minimum of 60% marks.
- The annual household income should be up to INR 15,00,000 per year (preference will be given to those students whose family income is less than INR 2,50,000)
- Open for resident Indian citizens only. An aptitude test is mandatory.

Prizes & Rewards: Up to INR 2,00,000 over the duration of the degree

Last Date to Apply: 06-10-2024

Application mode: Online only

Short Url: ww.b4s.in/aj/RFS11

SBIF Asha

దిక్సూచి

Description: The SBIF Asha Scholarship Program 2024, one of India's largest scholarship programs, is an initiative of the SBI Foundation. This scholarship aims to provide financial assistance to meritorious students from low-income families across India, ensuring the continuity of their education.

Eligibility: Open to school students from Class 6 to 12 and undergraduate & postgraduate students from the top 100 NIRF universities/colleges, undergraduate students from IITs, and students pursuing MBA/PGDM courses from IIMs. Applicants must have scored a minimum of 75% marks in the previous academic year. Their gross annual family income must be up to INR 6 lakh (Up to INR 3 lakh for Class 6-12 students).

Prizes & Rewards: **Classes 6 to 12:** INR 15,000 each
- **UG Students:** Up to INR 50,000
- **PG Students:** Up to INR 70,000
- **UG Students from IITs:** Up to INR 2,00,000
- **MBA Students from IIMs:** Up to INR 7,50,000

buddy4study.com

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/flnCVrRలో చదవండి.

బిజినెస్

వరంగల్ ● గురువారం 22 ఆగస్టు 2024

ఐసీఐసీఐ లాంబార్డ్ నుంచి 'ఎలివేట్' పాలసీ


అపరిమిత కవరేజికి అవకాశం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : ఐసీఐసీఐ లాంబార్డ్ 'ఎలివేట్' పేరుతో సరికొత్త ఆరోగ్య బీమా పాలసీ ప్రారంభించింది. ఏ వయసు వారైనా ఈ పాలసీలో చేరవచ్చని కంపెనీ హెల్త్ ఏజెన్సీ హెడ్ వివేక్ శ్రీవాస్తవ్ తెలిపారు. పాలసీదారుల వయసు, ఎంచుకునే యాడ్ ఆన్‌ల ఆధారంగా ఈ కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత పాలసీ ప్రీమియం ఉంటుందన్నారు. ఆరోగ్య బీమా రంగంలో ఇలాంటి వినూత్న పాలసీని తీసుకు రావడం ఇదే మొదటిసారి అన్నారు. ఈ పాలసీ ద్వారా పాలసీదారులకు 20 రకాల తీవ్ర అనారోగ్యాలు, వ్యక్తిగత ప్రమాదాలు, ప్రసూతి, కొత్త శిశువులకూ ఆరోగ్య బీమా, వసతి, ప్రయాణ ప్రయోజనాలు లభిస్తాయి.

ఎలివేట్ పాలసీ ప్రధానాశాలు

- పాలసీదారులు తమ అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ఎంత కవరేజినైనా ఎంచుకోవచ్చు.
- యాడ్ ఆన్ ఆఫర్‌ను ఎంచుకోవడం ద్వారా పాలసీ గడువులో ఒకసారికి కవరేజికి మించి అయిన వైద్య ఖర్చుల మొత్తాన్ని క్లెయిమ్ చేసుకోవచ్చు.
- పవర్ బూస్టర్ యాడ్ ఆన్ ద్వారా క్లెయిమ్స్ ఉన్నా, లేక పోయినా కవరేజి మొత్తాన్ని ఏటా 100 శాతం పెంచుకోవచ్చు.
- జంప్ స్టార్ట్ యాడ్ ఆన్ ఆప్షన్ ద్వారా పాలసీ తీసుకునే నాటికి ఉన్న వ్యాధులకూ 31వ రోజు నుంచి కవరేజి.
- రీసెట్ బెనిఫిట్ కింద ఏడాది గడువులో ఎన్నిసార్లయినా అదనపు ప్రీమియం లేకుండా ఎన్నిసార్లు హాస్పిటల్‌లో చేరినా అన్నిసార్లు వైద్య ఖర్చుల క్లెయిమ్ అవకాశం.
- హైదరాబాద్, దాని చుట్టుపక్కల ఉన్న 300కు పైగా హాస్పిటల్స్‌లో చికిత్స చేయించుకునే అవకాశం.

ఆన్‌లైన్ షాపింగ్‌తో సోమరులవుతాం



అమెజాన్‌వి మార్కెట్‌ను కొల్లగొట్టే ధరలు

» ఆఫ్‌లైన్ వ్యాపారుల పొట్టగొడుతోంది

» ఆందోళన వ్యక్తం చేసిన కేంద్ర మంత్రి గోయల్

న్యూఢిల్లీ: దేశంలో ఈ-కామర్స్ రంగ వృద్ధి తీరుపై కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ఈ-కామర్స్ సేవల అసాధారణ వృద్ధి సామాజిక విధ్వంసానికి దారితీసే ప్రమాదం ఉందని.. ఇది ఆందోళకరమే తప్ప గర్వపడే విషయం కాదన్నారు. ఆన్‌లైన్ షాపింగ్ బూమ్‌తో భారత్ సోమరుల దేశంగా మారిపోయే ముప్పుపొంచి ఉందని హెచ్చరించారు. "మార్కెట్లో ఈ-కామర్స్ తన వంతు పాత్ర పోషించాలి. కానీ, ఎలాంటి పాత్ర పోషించాలి, దాన్ని ఎలా క్రమబద్ధీకరించాలనే విషయాన్ని చాలా జాగ్రత్తగా ఆలోచించాల్సిన అవసరం ఉంది" అన్నారు. ఆన్‌లైన్ కామర్స్ సేవలు సాంప్రదాయికంగా వ్యాపారాలు చేసుకునే చిన్న వ్యాపారుల పొట్ట గొడుతున్నాయని అన్నారు. క్రమంగా చిరు వ్యాపారులు మార్కెట్ నుంచి కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. దేశంలో ఆన్‌లైన్ కామర్స్ సేవల వృద్ధి, ఉపాధికల్పనకు సంబంధించి ఓ సంస్థ రూపొందించిన నివేదికను బుధవారం విడుదల చేసిన సందర్భంగా మంత్రి అదే రంగంపై విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టడం గమనార్హం. అంతర్జాతీయ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ వ్యాపార తీరు, అనుసరిస్తున్న ధరల విధానంపై ఆయన ప్రధానంగా విరుచుకుపడ్డారు. భారత్‌లో 100 కోట్ల డాలర్ల (ప్రస్తుత మారకం రేటు ప్రకారం రూ.8,390 కోట్లు) పెట్టుబడులు పెడుతున్నట్లు గతంలో చేసిన అమెజాన్ చేసిన ప్రకటనను గోయల్ విమర్శించారు. అమెజాన్ ఇండియా తన నష్టాలను పూడ్చుకునేందుకే ఈ పెట్టుబడులను ప్రకటించిందని.. కంపెనీ ఇన్వెస్ట్‌మెంట్‌తో మన ఆర్థిక వ్యవస్థకు ఒరిగేదేమీ లేదన్నారు. ఒక్క ఏడాదిలోనే రూ.6,000 కోట్ల నష్టం వచ్చిందంటే, కంపెనీ మార్కెట్‌ను కొల్లగొట్టేందుకు అనుసరిస్తున్న చౌక ధరల వ్యూహమే కారణం అయి ఉంటుందన్న అనుమానం వస్తోందన్నారు.

1.58 కోట్ల ఉద్యోగాలు సృష్టించిన ఆన్‌లైన్ విక్రేతలు

దేశంలో ఆన్‌లైన్ విక్రేతలు 1.58 కోట్ల ఉద్యోగాలు సృష్టించారని, అందులో 35 లక్షల ఉద్యోగులు మహిళలని తాజా నివేదిక వెల్లడించింది. దేశంలోని 17.6 రిటైల్ సంస్థలు ఈ-కామర్స్ కార్యకలాపాల్లో పాలుపంచుకుంటున్నట్లు తెలిపింది. దేశంలో ఉద్యోగాల కల్పన, వినియోగదారుల సంక్షేమంపై ఈ-కామర్స్ రంగ ప్రభావానికి సంబంధించి పహ్లే ఇండియా ఫౌండేషన్ (పీఐఎఫ్) రూపొందించిన సర్వే నివేదికను గోయల్ బుధవారం విడుదల చేశారు. ప్రతి ఈ-కామర్స్ విక్రేత సగటున 9 మందికి ఉపాధి కల్పిస్తుండగా.. అందులో ఇద్దరు మహిళలు. కాగా, ఆఫ్‌లైన్ వర్తకులు సగటున ఆరు మందికి ఉపాధి కల్పిస్తుండగా.. అందులో ఒకరు మహిళా ఉద్యోగి అని నివేదిక వెల్లడించింది. భారత్‌లో ఉద్యోగాల కల్పనకు కీలక రంగాల్లో ఈ-కామర్స్ ఒకటి. ఆఫ్‌లైన్ వర్తకులతో పోలిస్తే, ఆన్‌లైన్ విక్రేతలు సగటున 54 శాతం అధిక ఉద్యోగాలు కల్పిస్తున్నారు. దాదాపు రెట్టింపు మహిళా ఉద్యోగులను నియమించుకున్నారని నివేదిక తెలిపింది.

7 లక్షల కార్లు షోరూమ్‌ల్లోనే..



మొత్తం స్టాక్ విలువ రూ.73,000 కోట్లు

ఆటోమొబైల్ డీలర్ల గగ్గోలు

న్యూఢిల్లీ: ప్రయాణికుల వాహనాల అమ్మకాలు నీరసించాయి. దీంతో ప్రస్తుతం దేశ వ్యాప్తంగా డీలర్ల వద్ద ఏడు లక్షల కార్ల నిల్వలు పేరుకు పోయాయి. వీటి విలువ ఎంత లేదన్నా రూ.73,000 కోట్ల వరకు ఉంటుందని ఆటోమొబైల్ డీలర్ల సంఘాల సమాఖ్య (ఫాడా) తెలిపింది. గత నెల ప్రారంభంలో 65-67 రోజుల అమ్మకాలకు సరిపడా నిల్వలు ఉంటే, ఇప్పుడది 70-75 రోజులకు చేరింది. కంపెనీలు ఎడాపెడా ఉత్పత్తి పెంచేయడం, అధిక వడ్డీరేట్లు ఇందుకు ప్రధాన కారణమంటున్నారు.

డీలర్లు లబోదిబో: సాధారణంగా డీలర్ల వద్ద కార్ల నిల్వలు నెల రోజులకు సరిపడా ఉంటాయి. ఇప్పుడది 70-75 రోజులకు పెరిగి పోయింది. దీంతో డీలర్లు ఆర్థికంగా చితికి పోతున్నారు. వర్కింగ్ కాపిటల్ అవసరాలు పెరిగిపోయి వడ్డీల భారం పెరిగి పోతోంది. ఈ పరిణామంతో కొంత మంది డీలర్లు దివాలా తీసే ప్రమాదం పొంచి ఉందని ఫాడా ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. కార్ల కంపెనీలు రిటైల్ అమ్మకాలకు అనుగుణంగా తమ ఉత్పత్తి వ్యూహం మార్చుకుని సరఫరాలు తగ్గిస్తే, ఈ పరిస్థితి నుంచి కొంత వరకు బయట పడవచ్చని డీలర్లు చెబుతున్నారు.

కంపెనీలే ఆదుకోవాలి: ఈ పరిస్థితి నుంచి బయట పడేందుకు కార్ల కంపెనీలే తమను ఆదుకోవాలని డీలర్లు కోరుతున్నారు. నెల రోజులకు మించి ఉండే నిల్వల నిర్వహణకు అయ్యే వర్కింగ్ కాపిటల్ వడ్డీ ఖర్చులైనా కంపెనీలు భరించాలని కోరుతున్నారు. లేకపోతే ప్రస్తుత కష్టాల నుంచి బయట పడడం డీలర్లకు కష్టంగా కనిపిస్తోంది. దీనికి తోడు పేరుకుపోయిన వాహన నిల్వల అమ్మకాల కోసం కంపెనీలు ప్రత్యేక పథకాలు, డిస్కౌంట్లు, ఆఫర్లు ప్రవేశ పెట్టాలని డీలర్లు కోరుతున్నారు.

ఆటుపోట్లు మామూలే: డీలర్లు ఇన్ని కష్టాల్లో ఉన్నా కార్ల కంపెనీల నుంచి పెద్దగా స్పందన లేదు. నిల్వలు పేరుకుపోవడం పెద్దగా ఆందోళన చెందాల్సిన అంశం కాదని భారత ఆటోమొబైల్ తయారీదారుల సంఘం (సియామ్) తెలిపింది. ఇటువంటి ఆటోపోట్లు ఏర్పడుతూనే ఉంటాయని తేలికగా తీసిపారేసింది. అయితే డీలర్లు ఆర్థికంగా బాగుండడం, కంపెనీలకే మంచిదని మాత్రం అంగీకరించింది. డీలర్ల వద్ద పేరుకు పోయిన వాహనాల నిల్వలను వదిలించేందుకు ఆయా కంపెనీలే బాధ్యతాయుతమైన చర్యలు తీసుకోవడం మంచిదని సియామ్ తెలిపింది.

పేటీఎం టికెటింగ్ వ్యాపారం జొమాటో చేతికి

డీల్ విలువ రూ. 2,048 కోట్లు

న్యూఢిల్లీ: డిజిటల్ చెల్లింపు సేవల యాప్ పేటీఎం యాజమాన్య సంస్థ వన్97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్ భారీ డీల్ కుదుర్చుకుంది. ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటోకు తన ఎంటర్‌టైన్‌మెంట్ టికెటింగ్ వ్యాపారాన్ని రూ.2,048 కోట్లకు విక్రయిస్తున్నట్లు వన్97 కమ్యూనికేషన్స్ బుధవారం ప్రకటించింది. అంటే, పేటీఎం యాప్‌లో అందుబాటులో ఉండే మూవీస్, స్పోర్ట్స్, ప్రముఖ ఈవెంట్ల టికెట్ బుకింగ్ సేవల వ్యాపారం త్వరలో జొమాటో చేతుల్లోకి వెళ్లనుంది. టికెటింగ్ సేవల బదిలీకి 12 నెలల వరకు సమయం పట్టవచ్చని వన్97 వెల్లడించింది. ఎంటర్‌టైన్‌మెంట్ టికెటింగ్ వ్యాపారం ద్వారా పేటీఎంకు గత ఆర్థిక సంవత్సరంలో రూ.297 కోట్ల ఆదాయం, రూ.29 కోట్ల స్థూల లాభం సమకూరింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73200 ▲	67,100 ▲	92,000 ▲
ముంబై	71,720 ▼	65,700 ▼	84,910 ▼

సెన్సెక్స్ 102 పాయింట్లు అప్

ముంబై: ఈక్విటీ సూచీలు బుధవారం స్వల్ప లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 102.44 పాయింట్ల పెరుగుదలతో 80,905.30 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 71.35 పాయింట్ల వృద్ధితో 24,770.20 వద్ద క్లోజైంది. విదేశీ సంస్థాగత పెట్టుబడుల ఉపసంహరణ కొనసాగడంతోపాటు గ్లోబల్ మార్కెట్లో అప్రమత్త ధోరణి మన మార్కెట్లో లాభాలను పరిమితం చేశాయి.

- డాలర్‌తో రూపాయి మారకం విలువ 13 పైసలు క్షీణించి 83.90 వద్ద ముగిసింది. ఈక్విటీ మార్కెట్లో ఒడుదుడుకులు, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ఉపసంహరణ ఇందుకు కారణం.
- నిర్మాణ పరిష్కారాలందించే ఇంటరార్క్ బిల్డింగ్ ప్రొడక్ట్స్ ఐపీఓకు భారీ స్పందన లభించింది. బుధవారంతో ముగిసిన ఈ రూ.600 కోట్ల ఇష్యూకు ఏకంగా 93.46 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది.

ఐసీఐసీఐ సెక్యూరిటీస్ షేర్ల డీలిస్టింగ్‌కు ఎన్‌సీఎల్‌టీ ఓకే: ఐసీఐసీఐ సెక్యూరిటీస్ షేర్ల డీలిస్టింగ్‌కు నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ముంబై బెంచ్ ఆమోదం తెలిపింది. స్టాక్ ఎక్స్ఛేంజీల నుంచి షేర్లను డీలిస్ట్ చేసి, అనంతరం ఐసీఐసీఐ బ్యాంక్‌కు పూర్తి అనుబంధ సంస్థగా మారనున్నట్లు ఐసీఐసీఐ సెక్యూరిటీస్ 2023 జూన్‌లో ప్రకటించింది. డీలిస్టింగ్‌లో భాగంగా ఐసీఐసీఐ సెక్యూరిటీస్ షేర్‌హోల్డర్లకు ప్రతి 100 షేర్లకుగాను 67 ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లను కేటాయించనున్నారు.


ఫ్రెషర్స్‌కు హ్యాపీడేస్!



72 శాతం యాజమాన్యాలు సై

టీమ్‌లీజ్ ఎడ్‌టెక్ నివేదిక

ముంబై: జాబ్ మార్కెట్ క్రమంగా మెరుగుపడుతోంది. అనుభజ్ఞులతో పాటు ఫ్రెషర్లకూ ఉద్యోగావకాశాలు పెరుగుతున్నాయి. ఈ ఏడాది ద్వితీయార్థంలో ఫ్రెషర్లను నియమించుకునే ఆలోచనలో ఉన్నట్లు ఓ సర్వేలో పాల్గొన్న 72 శాతం కంపెనీ యాజమాన్యాలు వెల్లడించాయి. ఈ ప్రథమార్థంతో పోలిస్తే ఫ్రెషర్ల హైరింగ్ యోచనలో ఉన్న కంపెనీల సంఖ్య మరో 4 శాతం పెరగగా.. గత ఏడాది ద్వితీయార్థంతో పోలిస్తే 7 శాతం పెరిగింది. టీమ్‌లీజ్ ఎడ్‌టెక్ బుధవారం విడుదల చేసిన 'కెరీర్ అవుట్‌లుక్ రిపోర్ట్ హెచ్‌2' లో ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ మధ్యకాలంలో దేశవ్యాప్తంగా 603 కంపెనీల ప్రతినిధులను సర్వే చేసినట్లు టీమ్‌లీజ్ తెలిపింది. ఫ్రెషర్ల నియామకాలు పెరగనుండటం మంచి సంకేతం. భవిష్యత్‌పై కంపెనీ యాజమాన్యాల్లో పెరుగుతున్న విశ్వాసానికిదే నిదర్శనం. గ్రాడ్యుయేట్లు అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఇది సరైన సమయమని టీమ్‌లీజ్ ఎడ్‌టెక్ వ్యవస్థాపకులు, సీఈఓ శంతను రూజ్ అన్నారు. ఉద్యోగాల్లో సాంకేతికత, డిజిటల్ నైపుణ్యాలు ముఖ్యభూమిక పోషిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. జాబ్ మార్కెట్లోకి అడుగుపెట్టనున్న గ్రాడ్యుయేట్లు అనుభవపూర్వకమైన విద్యాభ్యాసం ద్వారా అవకాశాలను మెరుగుపరుచుకోవాలని సర్వేలో పాల్గొన్న 70 శాతం యాజమాన్యాలు సూచించగా.. విద్యా సంస్థలు ఇండస్ట్రీతో భాగస్వామ్యం ద్వారా కంపెనీలకు అవసరమైన నైపుణ్యాల్లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని 62 శాతం యాజమాన్యాలు సలహా ఇచ్చాయి.



ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

22వ తేదీ

హైదరాబాద్	450	విజయవాడ	485
వరంగల్	452	గోదావరి	485
చిత్తూరు	508	విశాఖపట్నం	505
		దజను గుడ్లు రూ. 72	



ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	107	విజయవాడ	113
వరంగల్	107	గుంటూరు	113
కరీంనగర్	107	ఒంగోలు	113
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	114
కర్నూలు	107	నెల్లూరు	114
విశాఖపట్నం	109	అనంతపురం	113
గోదావరి	113		

వినేశ్.. పంట పండింది!




- ఒక్కసారిగా పెరిగిన బ్రాండ్ వాల్యూ
- క్యూ కడుతున్న కంపెనీలు
- నీరజ్, భాకర్‌కు కూడా భారీ డిమాండ్

న్యూఢిల్లీ: ఒలింపిక్ పతకం సాధించాలన్న రెజ్లర్ వినేశ్ ఫొగట్ కల చెదిరి ఉండొచ్చు. కానీ, ఆమె పాపులారిటీ అమాంతం పెరిగింది. దీంతో ఫొగట్‌ను తమ ఉత్పత్తుల ప్రచారకర్తగా నియమించుకోవడానికి పలు కంపెనీలు క్యూ కడుతున్నాయి. అలాగే పారిస్‌లో పతకాలు సాధించిన మరికొందరు అథ్లెట్ల బ్రాండ్ వ్యాల్యూ కూడా భారీగా పెరిగింది. ప్యాకేజింగ్ ఫుడ్, హెల్త్, న్యూట్రిషన్, జ్యువెలరీ, బ్యాంకింగ్, ఎడ్యుకేషన్ ఇలా పలు రంగాలకు చెందిన కంపెనీలు అథ్లెట్లతో ఒప్పందాలు చేసుకోవడానికి పోటీపడుతున్నాయి. పారిస్‌కు ముందు ఫొగట్ ఎండార్స్‌మెంట్ ఫీజు రూ. 25 లక్షలు ఉంటే.. ఇప్పుడు రూ. 75 లక్షల నుంచి కోటి రూపాయలకు పెరిగిందని ఓ ఎగ్జిక్యూటివ్ చెప్పాడు. పతకం నెగ్గకపోయినా.. ఆమె చూపిన ధైర్యం, హుందాతనం అందరి హృదయాలను గెలుచుకొందన్నాడు. విశ్వక్రీడల్లో 50 కిలోల విభాగం ఫైనల్ ముందు 100 గ్రాములు ఎక్కువ బరువు ఉందనే కారణంతో వినేశ్‌పై అనర్హత వేటు పడిన సంగతి తెలిసిందే. నైకీ, కంట్రీ డిలైట్‌తో ఫొగట్ ఒలింపిక్స్‌కు ముందే అగ్రిమెంట్ చేసుకొంది. ఇక, రజతం సాధించిన జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా, రెండు కాంస్యాలతో చరిత్ర సృష్టించిన షూటర్ మను భాకర్‌కు కూడా భారీ డిమాండ్ నెలకొంది. చోప్రా బ్రాండ్ వాల్యూ 30 నుంచి 40 శాతం దాకా పెరిగి.. సుమారు రూ. 330 కోట్లకు చేరుకొందని మార్కెట్ వర్గాలు తెలిపాయి. భారత్‌లో క్రికెటర్ల తర్వాత చోప్రాకే ఎక్కువ పాపులారిటీ అనడంలో సందేహం లేదు. నీరజ్ ఎండార్స్‌మెంట్ ఫీజు గతంలో రూ. 3 కోట్లు ఉంటే.. మెగా క్రీడల తర్వాత రూ. 4 నుంచి 4.5 కోట్లకు పెరిగిందట. మరోవైపు యూత్‌లో సూపర్ క్రేజ్ తెచ్చుకొన్న భాకర్‌ను తమ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకొనేందుకు కంపెనీలు పెద్ద మొత్తంలో ఒప్పందాలు చేసుకోవడానికి సిద్ధమయ్యాయి. గతంలో ప్రకటనల కోసం ఏడాదికి రూ. 25 లక్షలు మను తీసుకునేది. అయితే, అదిప్పుడు ఏకంగా ఆరు రెట్లు పెరిగి రూ. 1.5 కోట్లకు చేరిందని టాక్.

ఫేవరెట్ నీరజ్

● నదీమ్ దూరం ● డైమండ్ లీగ్ మీట్ నేడు

రాత్రి 12.20 నుంచి జియో సినిమా, స్పోర్ట్స్ 18లో



లాసన్నే: పారిస్ ఒలింపిక్స్‌లో రజతం సాధించిన జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా.. మరోసారి అలరించడానికి సిద్ధమయ్యాడు. ఒలింపిక్ చాంపియన్ అర్షద్ నదీమ్ దూరం కావడంతో.. గురువారం రాత్రి జరిగే డైమండ్ లీగ్ (డీఎల్) లాసన్నే మీట్‌లో చోప్రా ఫేవరెట్‌గా బరిలోకి దిగనున్నాడు. 2022లో నీరజ్ డైమండ్ లీగ్ చాంపియన్‌గా నిలిచాడు. కానీ, గతేడాది జాకబ్ వాల్డెజ్ (చెక్) విజేతగా నిలవగా.. చోప్రా రెండోస్థానానికే పరిమితమయ్యాడు. వచ్చే నెల 14న బెల్జియం రాజధాని బ్రస్సెల్స్‌లో సీజన్ ఫైనల్ డీఎల్ జరగనుంది. దీనికి అర్హత సాధించాలంటే డీఎల్ సిరీస్‌లో టాప్-6లో నిలవడం తప్పనిసరి. ప్రస్తుతం చోప్రా ఏడు పాయింట్లతో నాలుగో స్థానంలో ఉన్నాడు. గత మేలో దోహాలో జరిగిన మీట్‌లో రెండో స్థానంలో నిలిచాడు. ఇక, ఒలింపిక్స్‌లో తొలి ఆరుస్థానాల్లో నిలిచిన ఐదుగురు లాసన్నేలో కూడా పోటీ పడుతుండడంతో నీరజ్‌కు గట్టిసవాలే ఎదురుకానుంది. విశ్వక్రీడల్లో 92.97 మీటర్ల రికార్డు త్రోతో అందరినీ అవాక్కయ్యేలా చేసిన నదీమ్ ఒక్కడే ఈ మీట్‌కు గైర్హాజరు కానున్నాడు. మరోవైపు డిఫెండింగ్ చాంప్ వాల్డెజ్ టైటిల్ నిలబెట్టుకోవాలనే పట్టుదలతో ఉండగా.. రెండుసార్లు వరల్డ్ చాంపియన్ అండర్సన్ పీటర్స్ (గ్రెనడా) కూడా సత్తా చాటాలనుకొంటున్నాడు.

గుకేష్‌కు మరో డ్రా

సెయింట్ లూయిస్ (యూఎస్): భారత గ్రాండ్ మాస్టర్ గుకేష్ వరుసగా రెండో గేమ్‌ను డ్రా చేసుకొన్నాడు. సింక్యుఫీల్డ్ కప్ రెండో రౌండ్‌లో ఇయాన్ నెపోమినియాచి (రష్యా)తో జరిగిన గేమ్‌లో గుకేష్ 60 ఎత్తుల అనంతరం డ్రాకు అంగీకరించాడు. మాక్సిమ్ వషైర్ లగ్రావె (ఫ్రాన్స్)తో ప్రజ్ఞానంద పాయింట్ పంచుకొన్నాడు.

పారిస్ పారాలింపిక్స్ లక్ష్యం 12

అథ్లెటిక్స్‌లో పతకాలపై భారీ ఆశలు



సుమిత్ అంటిల్

న్యూఢిల్లీ: పారిస్ పారా ఒలింపిక్స్ అథ్లెటిక్స్ పోటీలలో ఐదు స్వర్ణాలు సహా మొత్తం 12 పతకాలు గెలవాలని మనోళ్లు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఈమేరకు స్టార్ జావెలిన్ త్రోయర్ సుమిత్ అంటిల్‌తో కూడిన 16 మంది భారత అథ్లెటిక్స్ తొలి బృందం బుధవారం పారిస్ పయనమైంది. ఈనెల 28న క్రీడలు ప్రారంభం కానున్నా..పారిస్‌లో పరిస్థితులకు అలవాటు పడేందుకు మన ఆటగాళ్లు ముందుగానే అక్కడకు బయల్దేరారు. పారాలింపిక్స్‌లో అథ్లెటిక్ పోటీలు ఈనెల 30 నుంచి వచ్చేనెల ఎనిమిది వరకు స్టేడ్ డి ఫ్రాన్స్ స్టేడియంలో నిర్వహిస్తారు. 'పారిస్‌లోని నెల్సన్ మండేలా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సుమిత్ తదితర అథ్లెట్లు సాధన చేస్తారు' అని పారా అథ్లెటిక్స్ జట్టు ప్రధాన కోచ్ సత్యనారాయణ తెలిపారు. 'అథ్లెటిక్స్‌లో కనీసం ఐదు స్వర్ణాలు సహా మొత్తం 12 పతకాలు గెలుపొందగలమని భావిస్తున్నాం. అదే జరిగితే పారాలింపిక్స్‌లో మనది అత్యుత్తమ ప్రదర్శన అవుతుంది' అని సత్యనారాయణ చెప్పారు. గత మేలో జపాన్‌లోని కోబెలో జరిగిన వరల్డ్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో భారత్ ఆరు స్వర్ణ, ఐదు రజత, ఆరు కాంస్యాలతో కలిసి మొత్తం 17 పతకాలతో పట్టికలో ఆరో స్థానంలో నిలవడం విశేషం. ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో అద్భుత ప్రదర్శన పారాలింపిక్స్‌లో మనోళ్ల ప్రదర్శనపై భారీ అంచనాలు పెంచింది. ఇక టోక్యో పారాలింపిక్స్‌లో రికార్డు స్థాయిలో భారత్ ఓవరాల్‌గా 19 పతకాలు (ఐదు స్వర్ణ, ఎనిమిది రజత, ఆరు కాంస్యాలు) సొంతం చేసుకుంది. ఈసారి పారాలింపిక్స్‌కు 84 మందితో కూడిన భారీ బృందాన్ని బరిలో దించుతోంది. 12 క్రీడాంశాల్లో మనోళ్లు తలపడుతున్నారు. అథ్లెటిక్స్‌లో 38 మంది అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. పారిస్‌లో ఓవరాల్‌గా కనీసం 25 పతకాలు సాధించగలమని భారత పారాలింపిక్స్ కమిటీ (పీసీఐ) అధ్యక్షుడు దేవేంద్ర ఝఝారియా అంచనా వేస్తున్నాడు.

టైటిల్‌పై గురి

ఈసారి పారాలింపిక్స్‌లో జావెలిన్ త్రోయర్, డిఫెండింగ్ చాంపియన్ సుమిత్ అంటిల్ టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతున్నాడు. కొన్నాళ్లుగా నిలకడైన ప్రదర్శనతో ఆకట్టుకుంటున్న 26 ఏళ్ల సుమిత్.. పారిస్‌లో కచ్చితంగా స్వర్ణం గెలవడన్న అంచనాలున్నాయి. జావెలిన్ త్రో ఎఫ్64 విభాగంలో పోటీపడుతున్న సుమిత్.. 2021 టోక్యో పారాలింపిక్స్‌లో జావెలిన్‌ను 68.55 మీటర్లు త్రో చేసి రికార్డు ప్రదర్శనతో స్వర్ణం సాధించాడు. ఆ మరుసటి ఏడాది హాంగ్జౌ వేదికగా జరిగిన ఆసియా పారాక్రీడల్లో జావెలిన్‌ను ఏకంగా 73.29 మీటర్లు విసిరి విజేతగా నిలిచిన సుమిత్.. సరికొత్త ప్రపంచ రికార్డుతో తనప్రదర్శనను మరింత మెరుగుపరచుకున్నాడు. నిరుడు పారిస్‌లో నిర్వహించిన ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లోనూ సత్తాచాటుతూ 70.83 మీటర్లతో సుమిత్ బంగారు పతకం కొల్లగొట్టాడు. ఇక.. ఈ ఏడాది జపాన్‌లోని కోబెలో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 69.50 మీటర్లకే పరిమితమైనా, టైటిల్ నిలబెట్టుకొని తనకు తిరుగులేదని నిరూపించుకున్నాడు. అయితే, పారిస్ పారాలింపిక్స్‌లో కచ్చితంగా 75 మీటర్ల ప్రదర్శనతో సరికొత్త రికార్డు నెలకొల్పగలడన్న ధీమాను సుమిత్ వ్యక్తం చేస్తున్నాడు.

పాక్ 158/4

బంగ్లాతో తొలి టెస్ట్

రావల్పిండి: సయిమ్ అయూబ్ (56), సౌద్ షకీల్ (57 బ్యాటింగ్) అర్ధ శతకాలతో ఆదుకోవడంతో.. బంగ్లాదేశ్‌తో బుధవారం మొదలైన తొలి టెస్ట్‌లో పాకిస్థాన్ కోలుకొంది. వర్షం కారణంగా ఆలస్యంగా ఆరంభమైన ఈ మ్యాచ్‌లో బంగ్లా బౌలర్ల దెబ్బకు ఒక దశలో పాక్ 16/3తో పీకల్లోతు కష్టాల్లో పడింది. అయితే, ఓపెనర్ అయూబ్, షకీల్ నాలుగో వికెట్‌కు 98 పరుగులు జోడించడంతో.. పాక్ తొలిరోజు ఆట ముగిసేసరికి మొదటి ఇన్నింగ్స్‌లో 158/4 స్కోరు చేసింది. షకీల్‌తోపాటు రిజ్వాన్ (24) క్రీజులో ఉన్నాడు. షోరిఫుల్, హసన్ మహమూద్ చెరో 2 వికెట్లు తీశారు.

స్పోర్ట్స్





రోహిత్, ద్రవిడ్‌లకు సియెట్ అవార్డులు



దీప్తి శర్మ

న్యూఢిల్లీ: టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, మాజీ కోచ్ రాహుల్ ద్రవిడ్ సియెట్ క్రికెట్ అవార్డులను అందుకున్నారు. 'ఉత్తమ అంతర్జాతీయ క్రికెటర్' పురస్కారం రోహిత్‌కు, 'జీవిత సాఫల్య' అవార్డును ద్రవిడ్‌కు ప్రదానం చేశారు. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ 'ఉత్తమ వన్డే క్రికెటర్'గా ఎంపికయ్యాడు. 'వన్డే ఉత్తమ బౌలర్' అవార్డు షమిని, 'ఉత్తమ టెస్ట్ బ్యాటర్' పురస్కారం యశస్వీ జైస్వాల్‌ను వరించాయి. అశ్విన్‌కు 'ఉత్తమ టెస్ట్ బౌలర్' అవార్డు దక్కింది. 'ఉత్తమ క్రీడా పరిపాలకుడి'గా జై షా ఎంపికయ్యాడు. భారత మహిళల జట్టు వైస్‌కెప్టెన్ మంధాన 'ఉత్తమ భారత బ్యాటర్'గా, దీప్తిశర్మ 'ఉత్తమ భారత బౌలర్'గా అవార్డులు స్వీకరించారు. టీ20లలో అత్యధిక మ్యాచ్‌ల్లో కెప్టెన్‌గా వ్యవహరించినందుకు హర్మన్‌ప్రీత్‌కు, టెస్ట్‌ల్లో అత్యంత వేగంగా డబుల్ సెంచరీ చేసిన షఫాలీ వర్మకు, కోల్‌కతా నైట్ రైడర్స్ సారథి శ్రేయాస్ 'అత్యుత్తమ కెప్టెన్'గా మెమెంటోలు అందజేశారు.

మైదానంలో మూత్ర విసర్జన!

ఫుట్‌బాలర్‌కు రెడ్‌కార్డ్

న్యూఢిల్లీ: ఫుట్‌బాల్ మ్యాచ్‌ల్లో ఉత్కంఠభరిత క్షణాల్లో ఆటగాళ్లు సహనం కోల్పోయి ప్రత్యర్థులపట్ల మొరటుగా ప్రవర్తించడం కద్దు. ఈక్రమంలో వారు రెడ్‌కార్డ్ శిక్షకు గురవుతారు. కానీ అందుకు భిన్నంగా జరిగింది ఓ సాకర్ మ్యాచ్‌లో. ఓ ఆటగాడు అనుచితంగా ప్రవర్తించి మైదానం వీడాడు. కోపా పెరూ కప్ డివిజన్ టోర్నీలో అట్లెటికో అవజున్-కంటోర్సిలో ఎఫ్‌సీ జట్ల మధ్య మ్యాచ్..ఇంజ్యూరీ టైమ్‌కోసం 71వ నిమిషంలో ఆగింది. ఆ సమయంలో అవజున్ స్ట్రయికర్ సెబాస్టియన్ మునోజ్.. ఫ్యాన్స్ ఎవరూ లేని ఓవైపు వెళ్లి మైదానంలో మూత్రవిసర్జన చేశాడు. దాంతో అతడికి రెఫరీ రెడ్‌కార్డు చూపి బయటకు పంపాడు.

సాయినాథ్‌కు కాంస్యం

అమ్మాన్ (జోర్డాన్): అండర్-17 ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత కుర్రాడు పర్దీ సాయినాథ్ (51 కిలోలు) కాంస్యం సాధించాడు. రెపిచేజ్ రౌండ్ ద్వారా పతక పోరులో నిలిచిన సాయినాథ్ 3-1తో యరాసిల్ ముస్సాన్ (కజకిస్తాన్)ను ఓడించాడు. అంతకుముందు రోనక్ దహియా (110 కి) కాంస్యం నెగ్గాడు. మహిళల్లో అదితి కుమారి (43 కి), నేహ (57 కి), పుల్కిత్ (65 కి) సెమీస్‌లో తమ ప్రత్యర్థులను ఓడించి ఫైనల్స్‌లో అడుగుపెట్టారు.



డిసెంబరులోపు కొత్త క్రీడా పాలసీ

- మాజీ ఎంపీ జితేందర్ అధ్యక్షతన కమిటీ ఏర్పాటు
- 30వ తేదీన తదుపరి భేటీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): అటకెక్కిన రాష్ట్ర నూతన క్రీడా పాలసీ రూపకల్పన ప్రక్రియకు సుదీర్ఘకాలం తర్వాత చలనం వచ్చింది. ముసాయిదా క్రీడా పాలసీ రూపకల్పన కమిటీ చైర్మన్‌గా రాష్ట్ర క్రీడాశాఖ సలహాదారుడు ఏపీ జితేందర్ రెడ్డిని ప్రభుత్వం నియమించింది. శాట్జ్ చైర్మన్ శివసేనారెడ్డి సహా 11 మంది ఇందులో సభ్యులుగా ఉన్నారు. జితేందర్ రెడ్డి ఆధ్వర్యంలోని ముసాయిదా క్రీడా పాలసీపై బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు క్రీడాశాఖ కార్యదర్శి వాణి ప్రసాద్, శాట్జ్ వీసీ ఎండీ సోనీబాలాదేవి, ఒలింపిక్ సంఘం మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ వేణుగోపాలచారి, జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ గోపీచంద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా శివసేనా రెడ్డి మాట్లాడుతూ.. నూతన క్రీడా పాలసీలో క్రీడాకారుల సంక్షేమం, కొత్త కోచ్‌ల నియామకం, క్రీడారంగం అభివృద్ధికి దశాదిశను నిర్దేశించేలా రూపొందిస్తామన్నారు. డిసెంబరులోపు క్రీడా పాలసీ రూపకల్పన పూర్తి చేస్తామని, ఈనెల 30వ తేదీన మరోసారి క్రీడారంగ నిపుణులతో భేటీ కానున్నామని చెప్పారు. త్వరలో శాట్జ్ కొత్త లోగోను సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించనున్నారని శివసేనారెడ్డి తెలిపారు.

కానిస్టేబుళ్ల సరెండర్ లీవ్స్ సొమ్మును వెంటనే చెల్లించాలి

» డిప్యూటీ సీఎం భట్టికి హరీశ్‌రావు లేఖ

హైదరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పోలీసు కానిస్టేబుళ్లకు రావాల్సిన సరెండర్ లీవ్స్, అడిషనల్ సరెండర్ లీవ్స్ సొమ్మును వెంటనే చెల్లించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కోరారు. ఈమేరకు బుధవారం ఆయన డిప్యూటీ సీఎంకు లేఖ రాశారు. ఈ సెలవులకు సంబంధించి కొన్ని జిల్లాల్లోని కానిస్టేబుళ్లకు మాత్రమే సొమ్మును చెల్లించారని.. కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లోని దాదాపు ఆరు వేల మంది కానిస్టేబుళ్లకు 8 నెలలుగా పెండింగ్ పెట్టారని తెలిపారు. పెట్రోల్, డీజిల్ బిల్లులు కూడా నెలల తరబడి రాకపోవడంతో పోలీసులు, పెట్రోల్ బంక్ నిర్వాహకులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. కానిస్టేబుళ్ల పట్ల ఎందుకింత వివక్ష, పక్షపాతం అని ఆయన ప్రశ్నించారు. ఈ పద్ధతి పోలీసుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడమే అవుతుందన్నారు. తక్షణమే పోలీసుల పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సర్కారు నిర్లక్ష్యం వల్లే విషజ్వరాలకు ప్రజలు బలి

కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్య వైఖరి కారణంగా రాష్ట్ర ప్రజలు విషజ్వరాలకు బలవుతున్నారని, డెంగీ బారిన పడి 24 గంటల్లోనే అయిదుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని హరీశ్ రావు అన్నారు. డెంగీ, మలేరియా, గున్యా వంటి విషజ్వరాలతో రాష్ట్రం వణుకుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లైనా లేకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం నిరక్ష్యం ప్రజలకు శాపంగా మారిందని ఎక్స్ వేదికగా ఆయన ఆరోపించారు.

రేవంత్ పాపపరిహారం కోసం యాదాద్రిలో పూజలు చేస్తా

ఆగస్టు 15లోపు రైతు రుణమాఫీ చేస్తానని యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామిపై సీఎం రేవంత్‌రెడ్డి ఒట్టుపెట్టి మాట తప్పిన నేపథ్యంలో రాష్ట్రానికి కీడు జరగకూడదని గురువారం యాదాద్రిలో పూజలు నిర్వహించనున్నట్లు హరీశ్ రావు తెలిపారు. రేవంత్‌రెడ్డి పాపపరిహారం కోసం.. తెలంగాణ ప్రజల శ్రేయస్సు కోసం తనతోపాటు పార్టీ ఎమ్మెల్యేలు ఈ ప్రత్యేక పూజల్లో పాల్గొంటారని బుధవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కవిత కేసు విచారణ ఈ నెల 28కు వాయిదా

న్యూఢిల్లీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టై తిహాడ్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై బుధవారం ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో విచారణ జరిగింది. విచారణకు తిహాడ్ జైలు నుంచి కవితను అధికారులు వర్చువల్ పద్ధతిలో న్యాయమూర్తి కావేరి భవేజా ఎదుట హాజరుపరిచారు. కవితతోపాటు మరో నలుగురిపై అభియోగాలు మోపుతూ సీబీఐ దాఖలు చేసిన అదనపు చార్జిషీట్‌పై విచారణ జరిగింది. చార్జిషీట్ స్క్రూట్నీ, పేజినేషన్, ఇతర డాక్యుమెంట్లపై కవిత తరపు న్యాయవాదులు వాదనలు వినిపించారు. తదుపరి విచారణ ఈ నెల 28వ తేదీకి వాయిదా పడింది.

ఆర్థిక శాఖలో పదోన్నతులు కల్పించండి

» రామకృష్ణారావుకు సచివాలయ ఉద్యోగుల సంఘం విజ్ఞప్తి

హైదరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక శాఖ సచివాలయ విభాగంలో పని చేసే అధికారులకు పదోన్నతులు కల్పించాలంటూ బుధవారం ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ ఆగస్టు 31తో ప్యానెల్ ఈయర్ ముగియనుందని ఈ నేపథ్యంలో పదోన్నతుల ఫైళ్లపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. అయితే... రెండు మూడు రోజుల్లో పదోన్నతుల ఫైళ్లను క్లియర్ చేస్తామని రామకృష్ణారావు వారికి హామీ ఇచ్చారు.

పని దొరక్క చేనేత కార్మికుడి బలవన్మరణం

చండూరు, ఆగస్టు 21: మగ్గంపై పనిలేక కుటుంబ పోషణ కోసం చేనేత కార్మికుడు కూలి పనికి వెళుతూ అప్పులు చేశాడు. ఆ అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. నల్లగొండ జిల్లా చండూరులో బుధవారం ఈ ఘటన జరిగింది. చండూరు మునిసిపాలిటీకి చెందిన పులిపాటి అంజయ్య(59) వృత్తిరీత్యా చేనేత కార్మికుడు. ఇద్దరు కుమార్తెలు ఉండగా ఇటీవలే చిన్న కుమార్తెకు వివాహం చేశాడు. మగ్గం పనులు లేక కుటుంబ పోషణ భారంగా మారడంతో వంట పనికి వెళ్లేవాడు. కూలి పనులకు కూడా వెళ్లేవాడు. కుటుంబపోషణ, ఇతర అవసరాల కోసం సుమారు రూ.4 లక్షల వరకు అప్పులు చేశాడు. మగ్గం నడవక, పనులు లేకపోవడంతో కొద్దికాలంగా తీవ్ర మనస్తాపంతో ఉన్నాడు. మంగళవారం రాత్రి భార్యాభర్తలు ఇంట్లో నిద్రించారు. తెల్లవారుజామున నిద్ర లేచిన భార్య లక్ష్మమ్మకు అంజయ్య కన్పించకపోవడంతో పక్క గదిలోకి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కన్పించాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకన్న తెలిపారు.

ఏసీబీకి చిక్కిన ఇద్దరు అధికారులు

ఆళ్లపల్లి, ఆగస్టు 21: ఏసీబీ వలకు మరో ఇద్దరు అధికారులు చిక్కారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలంలో బుధవారం ఇద్దరు ప్రభుత్వ అధికారులు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఖమ్మం ఏసీబీ డీఎస్పీ రమేష్ వివరాల ప్రకారం.. మర్కోడు మాజీ ఉప సర్పంచ్ కుర్ర కమల గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేయగా.. ఆయా పనుల బిల్లుల చెల్లింపులకు ఆళ్లపల్లి మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఎంపీవో బత్తిని శ్రీనివాస్, మర్కోడు పంచాయతీ కార్యదర్శి నాగరాజు డబ్బులు డిమాండ్ చేశారు. ఇకపై చేయబోయే పనుల తీర్మానాలకు కొంత కమీషన్ చెల్లించాలన్నారు. దీంతో కమల ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఈ క్రమంలో బుధవారం ఆళ్లపల్లి మండల పరిషత్ కార్యాలయంలో కమల నుంచి ఎంపీవో, కార్యదర్శి రూ.15వేల లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

జలమండలి మేనేజర్ ఇంట్లో రెండోరోజూ సోదాలు

నార్సింగ్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నల్లా కనెక్షన్ కోసం డబ్బులు తీసుకుంటూ మంగళవారం ఏసీబీకి పట్టుబడ్డ జలమండలి మణికొండ సెక్షన్ మేనేజర్ స్వాతిరెడ్డి ఇంట్లో సోదాలు కొనసాగుతున్నాయి. అధికారులు మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం రాత్రి వరకు సోదాలు కొనసాగించారు. ఆమె ఇంటితోపాటు బంధువుల ఇళ్లు, బ్యాంకు ఖాతాలు, ఇతర డాక్యుమెంట్లను పరిశీలిస్తున్నట్టు తెలిసింది.

మాతో ఆటలొద్దు!

(మొదటిపేజీ తరువాయి)

చంద్రబాబును నిందితుడిగా చేర్చాలని ఆళ్ల గతంలో ఏసీబీ కోర్టులో ప్రైవేటు కంప్లయింట్ దాఖలు చేశారు. కోర్టు దీనిపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఏసీబీని ఆదేశించింది. దీనిపై చంద్రబాబు ఉమ్మడి హైకోర్టును ఆశ్రయించారు. ఏసీబీ కోర్టు ఆదేశాలను కొట్టివేస్తూ హైకోర్టు 2016 డిసెంబరు 9న తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఆళ్ల సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేశారు. దాంతో పాటు ఈ కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని మరో పిటిషన్ వేశారు. ఈ రెండు వ్యాజ్యాలు బుధవారం విచారణకు రాగా.. ఈ కేసులో ఇప్పటికే రెండు చార్జిషీట్లు దాఖలయ్యాయని, జోక్యం చేసుకోవడానికి ఎలాంటి అంశాలూ లేవని సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా, న్యాయవాదులు గుంటూరు ప్రభాకర్, ప్రమోద్ కుమార్, ప్రేరణ విచారణకు హాజరయ్యారు. తొలుత ఆళ్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీకి ఓటేస్తే రూ.5 కోట్లు, ఓటు వేయకుండా గైర్హాజరైతే రూ.2 కోట్లు ఇస్తామని చంద్రబాబు తరఫున అప్పటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి బేరసారాలు జరిపారని.. దీనికి సంబంధించి కాల్ రికార్డింగులు ఉన్నాయని తెలిపారు. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టులో వేరే కేసులు కూడా ఉన్నాయని చెబుతూ ఆ జాబితాను ధర్మాసనానికి అందజేశారు. అయితే లూథ్రా అభ్యంతరం తెలిపారు. ఆ కేసులకు, ఇప్పుడు వాదనలు జరుగుతున్న వ్యాజ్యాలకు సంబంధం లేదన్నారు. కేసుల జాబితాను పరిశీలించిన తర్వాత పిటిషనర్ ఆళ్లపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. రాజకీయ కక్షలు తీర్చుకోవడానికి కోర్టులను వేదిక చేసుకోవద్దని హెచ్చరించింది. ఆధార రహిత అంశాలను తీసుకొచ్చి కోర్టుతో ఆటలాడుకోవద్దని తీవ్ర వాఖ్యలు చేసింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. ఈ కేసులో జోక్యం చేసుకోవడానికి ఎలాంటి అంశాలూ కనిపించడం లేదని పేర్కొంది. తెలంగాణ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఆళ్ల వేసిన ఎస్ఎల్‌పీని డిస్మిస్ చేసేందుకు ధర్మాసనం సంసిద్ధత వ్యక్తంచేయగా.. దానిని ఉపసంహరించుకుంటున్నట్లు ఆయన తరఫు న్యాయవాది తెలిపారు.

జన్వాడలో నాకు ఫాంహౌస్ లేదు



మిత్రుడి ఫాంహౌస్‌ను లీజుకు తీసుకున్నా

అది బఫర్‌జోన్‌లో ఉంటే నేనే కూల్చివేయిస్తా

హైడ్రా పేరుతో హైడ్రామా: కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జన్వాడలో తనకు సొంతంగా ఫాంహౌస్ ఏదీ లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తన మిత్రుడి ఫాంహౌస్‌ను తాను లీజుకు తీసుకున్నానని తెలిపారు. ఒకవేళ ఆ ఫాంహౌస్ బఫర్ జోన్‌లో ఉంటే.. తానే దగ్గరుండి దానిని కూల్చివేయిస్తానని చెప్పారు. అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటే తనకు అభ్యంతరం లేదని, తాను తప్పు చేసినా, కాంగ్రెస్ వాళ్లు తప్పు చేసినా చర్యలు తీసుకోవాల్సిందేనన్నారు. మంచి జరుగుతున్నపుడు అందరం ఆహ్వానించాల్సిందేనని పేర్కొన్నారు. బుధవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియా సమావేశంలో మాట్లాడారు. "నాదే కాదు.. సీఎం రేవంత్‌రెడ్డి ఫాంహౌస్, మంత్రులు, కాంగ్రెస్ నేతలు కట్టుకున్న ఫాంహౌస్‌లు బఫర్‌జోన్‌లో ఉన్నా కూల్చివేయాలి. మంత్రి పొంగులేటి, ఆ పార్టీ నేతలు కేవీపీ, పట్నం మహేందర్‌రెడ్డి, సుఖేందర్‌రెడ్డి, వివేక్‌ల రాజభవనాలు ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఉన్నాయి. వాటిని చూపిస్తా.. ప్రభుత్వానికి దమ్ముంటే వాటినీ కూల్చేయాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు. హైడ్రా పేరుతో సర్కారు హైడ్రామా చేస్తోందని, దానిని ఇప్పటికైనా ఆపాలన్నారు. ప్రభుత్వానికి నిజాయితీ ఉంటే ఒకే రోజు అక్రమ నిర్మాణాలన్నింటినీ కూల్చివేయాలని, ముందుగా అధికార పార్టీ నేతల అక్రమ నిర్మాణాలు కూల్చి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు.

రుణమాఫీ కోసం నేడు రాష్ట్రవ్యాప్త ధర్నాలు

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు కేవలం పావుశాతం రుణమాఫీ చేసి.. మొత్తం చేశామంటూ మోసం చేసిందని కేటీఆర్ ఆరోపించారు. ఆంక్షలేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ తరఫున గురువారం అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లో ధర్నాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిసెంబరు 9లోపు రుణమాఫీ చేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఆ తర్వాత ఆగస్టు 15 అంటూ మాట తప్పారని విమర్శించారు. ఇప్పుడు అడ్డగోలు ఆంక్షలు విధించి 40% రైతులకు మాఫీ చేయకుండా ఎగ్గొట్టారని ఆరోపించారు. 70 లక్షల మంది రైతుల సాక్షిగా ముఖ్యమంత్రి బండారం బట్టబయలైందన్నారు. ఏ పార్టీ ప్రేరేపించకుండానే రైతులు స్వచ్ఛందంగా ఎక్కడికక్కడ ఆందోళన చేస్తూ బ్యాంకులను ముట్టడిస్తున్నారని తెలిపారు. వందశాతం రుణమాఫీ జరిగితే రైతులు ఆందోళనలు ఎందుకు చేస్తున్నారో సీఎం చెప్పాలన్నారు.


రైతులపై కేసులా?

ఆదిలాబాద్ జిల్లాలోని బజార్‌హత్నూర్‌లో ప్రభుత్వం రైతులపై కేసులు పెట్టి వేధిస్తోందని కేటీఆర్ అన్నారు. రుణమాఫీ జరగలేదని ఆందోళన చేస్తే ఏడేళ్ల జైలుశిక్ష పడేలా కేసులు పెట్టి వేధించడమేంటని మండిపడ్డారు. రైతులపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టిన ప్రభుత్వాన్ని వారు క్షమించరన్నారు. వెంటనే కేసులను ఉపసంహరించుకోవాలని, లేదంటే రైతులు, బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి జైల్‌భరోకు పిలుపునిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి నియోజకవర్గం కొడంగల్ పరిధిలోని కోస్గి మండలంలో ఐదు బ్యాంకుల్లో ఖాతాలున్న 20,239 మంది రైతుల్లో కేవలం 8,527 మందికి మాత్రమే రుణమాఫీ చేశారని, దీనిని బట్టిచూస్తే.. సీఎం చెప్పిన మాటలన్నీ మోసాలేనని అర్థమవుతోందన్నారు.

చట్టప్రకారం వెళ్లండి

(మొదటిపేజీ తరువాయి)

పేరిట హైడ్రా హైడ్రామా చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేసింది. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం జన్వాడ పంచాయతీలోని 311 సర్వే నంబర్‌లో 1210 చదరపు గజాల్లో ఉన్న ఫాంహౌజ్ ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) పరిధిలో ఉందంటూ అధికారులు ఇబ్బంది పెడుతున్నారని.. ఆ ఫామ్‌హౌజ్ విషయంలో వారు జోక్యం చేసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ యజమాని బద్వేల్ ప్రదీప్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. విచారణ ప్రారంభం కాగానే.. హైడ్రా కూల్చివేతలపై ధర్మాసనం ప్రశ్నల వర్షం కురిపించింది. "కూల్చివేతల పేరిట హైడ్రా హైడ్రామా చేస్తోంది. చిన్నవాళ్లకు పెద్దవాళ్లకు తేడా చూపిస్తోంది. 20 ఏళ్ల కింద ఎప్పుడో కన్వర్షన్ రుసుములు కట్టి అనుమతులు పొంది ఇళ్లు నిర్మించుకుంటే ఇప్పుడు వచ్చి అక్రమ నిర్మాణాలు అంటారా? అలాంటప్పుడు రుసుములు తీసుకుని అదే ప్రభుత్వశాఖలు ఎలా అనుమతులు ఇచ్చాయి. ఒక ప్రభుత్వశాఖ అనుమతి ఇస్తే.. మరో ప్రభుత్వ శాఖ ఇళ్లను కూల్చేస్తుందా? అసలు హైడ్రా చట్టబద్ధత ఏంటి? దానికి ఎవరు నేతృత్వం వహిస్తున్నారు? ఎలా ఏర్పాటు చేశారు? దాని పరిధి, విధులు ఏంటి? ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నిర్మాణాలు అంటున్నారు. ప్రభుత్వం ఇప్పటివరకూ ఒక్క చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ మార్క్ చేసి తుది నోటిఫికేషన్ ఇచ్చిందా? ఎన్ని చెరువులకు ప్రాథమిక, తుది నోటిఫికేషన్‌లు ఇచ్చారు? ఇప్పటి వరకూ ఒక్క ఫైనల్ నోటిఫికేషన్‌నూ నీటిపారుదలశాఖ కోర్టుకు సమర్పించలేదు" అని వ్యాఖ్యానించింది.జన్వాడ ఫాంహౌజ్‌ను కూల్చబోమంటూ అండర్‌టేకింగ్ ఇవ్వాలని.. ఈ కేసు విచారణను గురువారానికి వాయిదా వేస్తామని పేర్కొంది. అండర్ టేకింగ్ ఇవ్వకపోతే స్టేటస్ కో



(యథాతథస్థితి) విధిస్తామని పేర్కొంది. అండర్‌టేకింగ్ ఇవ్వడానికి నిరాకరించిన అదనపు అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్.. ప్రభుత్వ సూచనలు అందుకునే వరకు వాయిదా వేయాలని కోరడంతో విచారణ మధ్యాహ్నం 2.15 గంటలకు వాయిదా పడింది.

నోటీసులు ఇచ్చాకే కూల్చివేతలు..

మళ్లీ విచారణ మొదలయ్యాక ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ.. హైడ్రా ఏర్పాటు జీవో 99 గురించి, దాని పరిధి, విధుల గురించి వివరించారు. ప్రస్తుత ఫాంహౌజ్ 111 జీవో పరిధిలో ఉందని పేర్కొన్నారు. స్థానిక సంస్థలతో కలిసి సమన్వయంతో హైడ్రా పనిచేస్తోందని.. ప్రభుత్వ ఆస్తులను రక్షించడంతోపాటు అక్రమ నిర్మాణాలు తొలగిస్తోందని పేర్కొన్నారు. ఇప్పటివరకూ చట్టవిరుద్ధంగా నోటీసులు ఇవ్వకుండా ఎలాంటి కూల్చివేతలూ చేపట్టలేదన్నారు. అలాగే హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్న అన్ని చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లను గుర్తించి ఫైనల్ నోటిఫికేషన్‌లు ఇవ్వాలంటూ చీఫ్ జస్టిస్ ధర్మాసనం ఆదేశాలు ఇచ్చిందని.. అందులో భాగంగానే హైడ్రా పనిచేస్తోందని పేర్కొన్నారు. ఎఫ్‌టీఎల్‌ల గుర్తింపులో ఆలస్యం అయినా పని పూర్తిచేయాలని ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. "జన్వాడ ఫాంహౌజ్‌కు అనుమతి లేదు. పిటిషనర్‌కు విక్రయించిన విక్రయదారు సర్పంచ్ నుంచి అనుమతి పొందారని పేర్కొంటున్నారు కానీ సర్పంచ్‌కు అనుమతి ఇచ్చే అధికారం లేదు. పంచాయతీ సెక్రటరీ అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది." అని ఏఏజీ పేర్కొన్నారు. ఎఫ్‌టీఎల్ గుర్తిస్తూ నోటిఫికేషన్‌తోపాటు కౌంటర్ దాఖలు చేస్తామని పేర్కొన్నారు. ఇక.. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది వి.హరిహరణ్ వాదనలు వినిపించారు. విక్రయదారు సర్పంచ్ అనుమతి తీసుకున్నారని.. ఫాంహౌజ్ ఎఫ్‌టీఎల్‌లో లేదని తెలిపారు. ఈనెల 14న నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్, సూపరింటెండెంట్ ఇంజినీర్ తమ ఫాంహౌజ్ ఉస్మాన్‌సాగర్ ఎఫ్‌టీఎల్‌లో ఉందని.. హైడ్రా అధికారులతో కలిసి వస్తామని బెదిరించారని.. ఎలాంటి నోటీసు ఇవ్వలేదని ధర్మాసనానికి వెల్లడించారు. హైడ్రాతో కలిసి ఫాంహౌజ్ కూల్చడానికి ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఇరువర్గాల వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. జన్వాడ ఫాంహౌజ్ విషయంలో చట్టప్రకారం వ్యవహరించాలని పేర్కొంది. అనుమతులతోపాటు అన్ని అంశాలూ పరిగణనలోకి తీసుకోవాలని.. వివాదంలో ఉన్న ఆస్తి ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందా? లేదా? అనే విషయాన్ని ప్రాథమిక, తుది నోటిఫికేషన్‌ల ద్వారా పరిశీలించాలని సూచించింది. చర్యలు తీసుకునే ముందు పిటిషనర్ సమర్పించే రికార్డులు పరిశీలించాలని.. హైడ్రా జీవో 99 నిబంధనలు కచ్చితంగా పాటించాలని పేర్కొంది. ఎఫ్‌టీఎల్ నోటిఫికేషన్‌తో సహా కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే హైడ్రా కూల్చివేతలు చేపట్టే ముందు టైటిల్‌ను, జీహెచ్‌ఎంసీ లేదా ఇతర స్థానిక సంస్థల నుంచి పొందిన అనుమతులను పరిశీలించాలని సూచించింది. స్థలం 60 నుంచి 100 గజాలు ఉన్నా.. ఎకరంపైన ఉన్నా ఎలాంటి వివక్షా లేకుండా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం కలిగేలా హైడ్రా వ్యవహరించాలని హైకోర్టు పేర్కొంది. ఈ నిబంధనలు పాటిస్తూ ఎన్ని నిర్మాణాలు కూల్చారో కౌంటర్‌లో వివరించాలని తెలిపింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 12కు వాయిదావేసింది.

పంచాయతీ 'ఓటరు జాబితా'కు షెడ్యూల్

6న ముసాయిదా జాబితా తయారీ

21న తుది ఓటరు జాబితా ప్రచురణ

షెడ్యూల్ విడుదల చేసిన ఎస్ఈసీ

హైదరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారన్నదానిపై స్పష్టత లేనప్పటికీ రాష్ట్ర ఎన్నికల సంఘం మాత్రం ఓటరు జాబితా రూపకల్పనపై దృష్టి సారించింది. ఇందుకుగాను గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా ఓటర్ల జాబితా రూపకల్పనకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) బుధవారం షెడ్యూల్ విడుదల చేసింది. సెప్టెంబరు 6న జిల్లా పంచాయతీ అధికారులు (డీపీవోలు), మండల అభివృద్ధి అధికారుల (ఎంపీడీవో) ఆధ్వర్యంలో వార్డులు, గ్రామ పంచాయతీల వారీగా ముసాయిదా ఓటరు జాబితాలను ఆయా పంచాయతీల్లో ప్రచురిస్తారు. ఆ జాబితాలపై జిల్లా కలెక్టర్లు, ఎంపీడీవోలు అదేనెల 9, 10వ తేదీల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి, వారి సూచనలు స్వీకరిస్తారని ఎన్నికల కమిషనర్ పార్థసారథి తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే సెప్టెంబరు 7 నుంచి 13 వరకు డీపీవో, ఎంపీడీవోలు వాటిని స్వీకరించి 19వ తేదీ లోపు పరిష్కరిస్తారని వెల్లడించారు. 21న వార్డులు, పంచాయతీల వారీగా తుది ఓటరు జాబితాను ప్రచురించాలని షెడ్యూల్‌లో తెలిపారు.

అధికారులతో ఎస్ఈసీ పార్థసారథి సమీక్ష

రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు చేపట్టాల్సిన 2వ సాధారణ ఎన్నికల్లో భాగంగా వార్డులు, గ్రామ పంచాయతీ వారీగా ఓటరు జాబితా తయారీ, ప్రచురణపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో వార్డులు, పంచాయతీల వారీగా ఓటరు జాబితాను రూపొందిస్తున్నట్లు తెలిపారు.

నెలాఖరులోగా సూపరింటెండెంట్లు!

18 బోధనాస్పత్రులకు నియామకం

హైదరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 18 బోధనాస్పత్రులకు ఈనెలాఖరు నాటికి శాశ్వత సూపరింటెండెంట్లు రానున్నారు. గత నెల చేపట్టిన సాధారణ బదిలీల్లో ఆ ఆస్పత్రుల సూపరింటెండెంట్లు వేరేచోట్ల నియమితులయ్యారు. దాంతో సూపరింటెండెంట్లు లేకుండానే ఆ ఆస్పత్రులు నడుస్తున్నాయి. ఒక్క హైదరాబాద్‌లోనే ఏడు పెద్దాస్పత్రులు ఉన్నాయి. దాంతో వాటిలో పాలన అస్తవ్యస్తంగా మారింది. సీనియర్ వైద్యులు కూడా బదిలీ కావడంతో వైద్య సేవలపై తీవ్ర ప్రభావం పడింది. నిజానికి గత బీఆర్ఎస్ సర్కారు రాష్ట్రస్థాయి కీలక విభాగాధిపతులపోస్టుల నుంచి కాలేజీల ప్రిన్సిపాల్స్, బోధనాస్పత్రుల సూపరింటెండెంట్ల వరకు అంతా ఇన్‌చార్జులతోనే నెట్టుకొచ్చింది. రాష్ట్రంలో అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు ఇన్‌చార్జుల పాలనకు స్వస్తి పలికింది. రాష్ట్రస్థాయిలో రెగ్యులర్ హెచ్‌వోడీ పోస్టులు మంజూరు చేసింది. ప్రస్తుతం 50 అదనపు వైద్య విద్య సంచాలకుల (ఏడీఎంఈ) పోస్టుల భర్తీకి పదోన్నతులు చేపట్టింది. ఈ హోదా ఉన్నవారినే కాలేజీల ప్రిన్సిపాల్స్‌గా, బోధనాస్పత్రులకు సూపరింటెండెంట్లుగా నియమించాలని నిబంధనలు చెబుతున్నాయి. వారంలోపే పదోన్నతులు ఇచ్చి.. ప్రిన్సిపాల్స్, సూపరింటెండెంట్లుగా పంపనున్నట్లు సచివాలయ వర్గాలు వెల్లడించాయి.

త్వరలో రెగ్యులర్ డీహెచ్ నియామకం!

ప్రజారోగ్య సంచాలకులడి (రెగ్యులర్ డీహెచ్) పోస్టు కూడా త్వరలో భర్తీ కానుంది. ఈ పోస్టుకు అర్హత ఉన్నవారి సీనియారిటీ జాబితా పంపాలని ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా ఇన్‌చార్జి డీహెచ్‌ను ఆదేశించారు. దీంతో డీహెచ్ కార్యాలయం ఐదుగురి పేర్లతో జాబితా విడుదల చేసింది. ఈ జాబితాలో రవీంద్ర నాయక్, అమర్‌సింగ్ నాయక్, మోజీరాం రాథోడ్, డాక్టర్ కే పద్మజ, డాక్టర్ ఆర్ పుష్ప ఉన్నారు. సీనియారిటీలో ముందున్న వారికి అవకాశం ఇవ్వాలని నిబంధనలు చెబుతున్నాయని, రవీంద్ర నాయకునే డీహెచ్‌గా నియమించే అవకాశాలు ఉన్నాయని సచివాలయ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వం కూడా సీనియారిటీనే ప్రాతిపదికగా తీసుకోవాలని భావిస్తోందని సమాచారం.

సెప్టెంబరు మొదటి వారంలో భూముల విలువపై నిర్ణయం?

హైదరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజుల్లో రాష్ట్రంలో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్ విలువ పెరగనుంది. భూముల విలువ సవరించాలని నిర్ణయించిన ప్రభుత్వం జూలైలోనే ధరల పట్టిక రూపొందించింది. దాన్ని ఒక ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించి అధ్యయనం చేయాలని కోరింది. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నేరుగా ఆ ఏజెన్సీని పర్యవేక్షిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ అంశంపై ఈ నెల 25న రిజిస్ట్రేషన్ శాఖ అధికారులతో మంత్రి పొంగులేటి సమావేశం కానున్నారు. 23లోపు ఏజెన్సీ నివేదిక అందే అవకాశం ఉందని, దానిపై ఉన్నతాధికారులు, సబ్ రిజిస్ట్రార్లతో మంత్రి చర్చించే అవకాశం ఉందని తెలిసింది.

హైడ్రా పరిధిలోకి జీవో 111 ప్రాంతాలు?

ఉన్నతస్థాయిలో చర్చలు.. పరిశీలిస్తున్న ప్రభుత్వం

» హిమాయత్‌సాగర్‌లో కూల్చివేతలపై ప్రతిష్టంభన

» ప్రభుత్వాన్ని స్పష్టత కోరనున్న హైడ్రా

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ప్రముఖుల గెస్ట్ హౌస్‌లపై చర్యలుంటాయా..? చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లు, పార్కుల్లో నిర్మాణాలను నేలమట్టం చేస్తున్న హైదరాబాద్ విపత్తు నిర్వహణ, ఆస్తుల సంరక్షణ సంస్థ(హైడ్రా) బడాబాబుల అతిథి గృహాల జోలికి వెళ్తుందా? అన్నది ప్రస్తుతం రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. హైడ్రా విధివిధానాల ప్రకారం ప్రస్తుతం అతిథి గృహాలపై చర్యలకు అవకాశం లేదు. కానీ, భవిష్యత్తులో జీవో 111 పరిధిలోని ప్రాంతాలను హైడ్రా కిందకు తీసుకొచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రజల నుంచి వస్తున్న డిమాండ్ల నేపథ్యంలో హైడ్రా అధికారాల పరిధిని పెంచుతారని సమాచారం. ఈ విషయంపై ఉన్నతస్థాయిలోనూ చర్చలు జరుగుతున్నట్లు తెలిసింది. వాస్తవంగా హైడ్రా ఏర్పాటుకు కసరత్తు జరుగుతున్న సమయంలోనే జీవో 111 ప్రాంతాలను సంస్థ పరిధిలోకి తీసుకొచ్చే అంశం ప్రస్తావనకు వచ్చినట్టు ఓ అధికారి తెలిపారు. జల వనరులు, పార్కులు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ ప్రధాన లక్ష్యంగా తొలుత సంస్థ ఏర్పాటు చేయాలని.. పనితీరు, స్పందనను బట్టి తదుపరి నిర్ణయాలు తీసుకోవాలని ప్రభుత్వ పెద్దలు సూచించినట్లు సమాచారం. నెల రోజుల క్రితం పురుడు పోసుకున్న సంస్థ పనితీరుపై తెలంగాణలోనే కాదు.. ఇతర రాష్ట్రాల నుంచీ ప్రశంసలు దక్కుతున్నాయి. హైడ్రా ఏర్పాటు, విధివిధానాలపై రిటైర్డ్ ఐఏఎస్‌లు, ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. ఢిల్లీ, ఏపీ ప్రజల నుంచి హైడ్రా వంటి సంస్థ ఏర్పాటుకు డిమాండ్లు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఏజెన్సీకి మరిన్ని హక్కులు కల్పిస్తూ పర్యావరణ పరిరక్షణ దిశగా చర్యలు తీసుకోవాలని సర్కారు భావిస్తున్నట్లు సమాచారం. ఇక జీహెచ్‌ఎంసీతో పాటు ఔటర్ వరకు ఉన్న పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థలను తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్(టీసీయూఆర్)గా పేర్కొంటూ.. దాన్ని హైడ్రా పరిధిగా ప్రభుత్వం నిర్ణయించింది. ఆయా ప్రాంతాల్లోని చెరువులు, పార్కులు, లేఅవుట్‌లోని ఖాళీ స్థలాలు, ఆట స్థలాలు, నాలాలు, రహదారులు, ఫుట్‌పాత్‌ల పరిరక్షణ, వాటిలోని ఆక్రమణల తొలగింపు హైడ్రా బాధ్యతలుగా జీవో99లో పేర్కొన్నారు. ఇందుకోసం సంస్థలో ప్రత్యేకంగా 'ఆస్తుల సంరక్షణ' విభాగాన్ని ఏర్పాటు చేశారు. విపత్తుల నిర్వహణకు మరో విభాగాన్ని ప్రతిపాదించారు. ఓఆర్ఆర్ వెలుపలి ప్రాంతాలు కూడా హైడ్రా పరిధిలోకి వస్తాయని అధికారులు చెబుతున్నారు. నార్సింగ్, బండ్లగూడ, శంషాబాద్, తుక్కుగూడ, ఆదిభట్ల, దుండిగల్ మునిసిపాలిటీల్లోని పలు గ్రామాలు ఔటర్ వెలుపల ఉన్నాయి. ఆ ప్రాంతాల్లోనూ హైడ్రా చర్యలు తీసుకోనుంది.

ఎఫ్‌టీఎల్ ప్రతిష్టంభన..

చెరువుల్లో ఆక్రమణల తొలగింపులో న్యాయపరమైన చిక్కులు లేకుండా హైడ్రా జాగ్రత్త పడుతోంది. ఈ క్రమంలో చెరువుల ఎఫ్‌టీఎల్ నోటిఫై చేశారా? లేదా? అన్నది ప్రామాణికంగా తీసుకుంటున్నారు. ఔటర్ వరకు 400కు పైగా చెరువులుండగా.. మెజారిటీ చెరువుల ఎఫ్‌టీఎల్ నిర్ధారణకు సంబంధించి హెచ్‌ఎండీఏ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. దీని ఆధారంగా హైడ్రా కూల్చివేతలు చేపడుతోంది. గండిపేట జలాశయం ప్రాథమిక నోటిఫికేషన్ గతంలోనే ప్రకటించగా దాని ఆధారంగానే ఇటీవల భవనాలు నేలమట్టం చేశారు. హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్ నిర్ధారణకు సంబంధించి ఎలాంటి నోటిఫికేషన్ ప్రకటించలేదు. దీంతో ఆ జలాశయం ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో నిర్మాణాల తొలగింపుపై తాత్కాలికం గా ప్రతిష్టంభన నెలకొంది. దీనిపైనా ప్రభుత్వంతో చర్చించాలని హైడ్రా భావిస్తోంది. గతంలో గుర్తించిన ఎఫ్‌టీఎల్ ఆధారంగా చర్యలు తీసుకోవాలా? నోటిఫై చేసే వరకు వేచి చూడాలా? అన్న దానిపై సర్కారును స్పష్టత కోరనుంది.

ఆర్ఆర్ఆర్ వరకు..?

హైడ్రా పరిధిని పెంచాలన్న డిమాండ్‌లూ వస్తున్నాయి. ముందస్తు ప్రణాళిక, పరిరక్షణ లేకనే జీహెచ్‌ఎంసీ, ఔటర్ వరకు ఉన్న ప్రాంతాల్లో చెరువులు, పార్కులు అన్యాక్రాంతమయ్యాయి. ఔటర్‌ను దాటి ప్రస్తుతం అభివృద్ధి విస్తరిస్తున్న క్రమంలో ఆయా ప్రాంతాల్లోనూ జలాశయాలు, ఖాళీ స్థలాలు, పార్కులు ఆక్రమణకు గురయ్యే ప్రమాదముందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆక్రమణలు జరిగాక నిర్మాణాలు తొలగించడం కంటే.. ముందస్తుగా కబ్జాలు నియంత్రించేందుకు రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్ఆర్) వరకు హైడ్రా పరిధిని విస్తరించాలని ప్రభుత్వానికి వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇన్‌ఫార్మర్ పేరిట మహిళా మావోయిస్టు హత్య

(మొదటిపేజీ తరువాయి)

లభించిన ఆనవాళ్ల ప్రకారం ఆమెను గొంతు నులిమి చంపినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఇన్‌ఫార్మర్‌గా వ్యవరిస్తున్నందుకే హత్య చేశామని ఆంధ్రా-ఒడిసా బోర్డర్ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేశ్ పేరిట లేఖ విడుదల చేశారు. ఆ లేఖలో పేర్కొన్న వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని బాలాజీనగర్ కు చెందిన బంటి రాధ డీఎంఎల్‌టీ (డిప్లొమా ఇన్ మెడికల్ లేబొరేటరీ టెక్నాలజీ) పూర్తి చేసి 2018లో మావోయిస్టు పార్టీలో చేరింది. గడిచిన ఆరేళ్లలో ఆంధ్రా, ఒడిసా బోర్డర్‌లో పార్టీ సభ్యురాలిగా, జోన్ మిలటరీ ఇన్‌స్పెక్టర్‌గా, దళ కమాండర్‌గా పని చేసింది. ఈ ఎదుగుదలతో పాటు కొన్ని బలహీనతలు కూడా ఆమె కలిగి ఉందని మావోయిస్టులు లేఖలో పేర్కొన్నారు. క్రమశిక్షణతో వ్యవహరించకపోవడం, నిజాయితీగా ఉండకపోవడం, పార్టీని పక్కదారి పట్టించడం వంటి చర్యలకు పాల్పడటంతో మూడు నెలల క్రితం ఆమెను కమాండర్ బాధ్యతల నుంచి పార్టీ సస్పెండ్ చేసిందని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే రాధను పార్టీ నుంచి బయటకు తీసుకెళ్లేందుకు ఆమె కుటుంబసభ్యులపై పోలీసులు ఒత్తిడి చేశారని తెలిపారు. రాధ తమ్ముడు సూర్యానికి ఉద్యోగం, డబ్బులు, విలాసవంతమైన జీవితం ఆశ చూపారని, ఫలితంగా అతడు ఏజెంట్‌గా మారాడని ఆరోపించారు. అప్పటి నుంచి తను ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేస్తూ కొందరితో బృందంగా ఏర్పడి, దళాల సమాచారం పోలీసులకు చేరవేస్తున్నాడని ఆరోపించారు. కొద్ది రోజుల క్రితం రాధ ఫోన్ నంబర్ తెలుసుకున్న పోలీసులు తన స్నేహితురాలి ద్వారా ఆమెను ఉద్యమం నుంచి బయటకు తీసుకొచ్చేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. ఆమె అంగీకరించకపోవడంతో కుటుంబసభ్యులను జైల్లో పెడతామని పోలీసులు బెదిరించారని పేర్కొన్నారు. రాధ తమ్ముడు సూర్యం ద్వారా ఫోన్ చేయించి కుటుంబ ఆర్థిక ఇబ్బందులు, తల్లి అనారోగ్య సమస్యలు చెప్పి, ఉద్యమం నుంచి బయటకు రావాలని లేదంటే పార్టీ సమాచారం ఇస్తే కుటుంబసమస్యలు తీరతాయని చెప్పారని పేర్కొన్నారు. అందుకు ఆమె అంగీకరించి.. అప్పటి నుంచి పార్టీకి సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ పోలీస్, ఇంటెలిజెన్స్ అధికారులకు అందిస్తోందని మావోయిస్టులు లేఖలో ఆరోపించారు. కాగా రాధ మృతదేహాన్ని మావోయిస్టులు రహదారిపై పడేయడంతో స్థానికులు, వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. చర్ల సీఐ రాజు వర్మ, ఎస్ఐ నర్సిరెడ్డి అక్కడికి చేరుకుని మృతదేహాన్ని తొలుత చర్లకు, అక్కడి నుంచి భద్రాచలం వైద్యశాలకు తరలించి పంచనామా నిర్వహించారు. కాగా ఐదు రోజుల క్రితం రాజు అనే కమాండర్‌ను కూడా మావోయిస్టులు ఇన్‌ఫార్మర్ నెపంతో హత్య చేశారు. కాగా మావోయిస్టులు తోటి దళ సభ్యురాలు రాధను హత్య చేయడాన్ని భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ ఖండించారు. దళిత మహిళను కిరాతకంగా చంపడం హేయమైన చర్య అని మండిపడ్డారు. కూతురు మృతదేహం తీసుకొచ్చేందుకు తల్లిదండ్రులు భద్రాచలం వెళ్లారు. రాధ అంత్యక్రియలు కాప్రాలోనే జరుగుతాయని వారి బంధువులు చెప్పారు. కాగా రాధ తల్లిదండ్రులైన బాలయ్య-పోచమ్మ స్వస్థలం యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలం వెంకటాపురం గ్రామం. ఇరవై ఏళ్ల క్రితమే కాప్రాలోని ఇందిరానగర్‌కు వచ్చి స్థిరపడ్డారు. బాలయ్య ఆటో నడుపుతున్నాడు. పోచమ్మ కూలీ పనులకు వెళుతోంది. డీఎంఎల్‌టీ కోర్సు చదివే క్రమంలోనే రాధ మావోయిస్టు భావజాలానికి ఆకర్షితురాలైంది. 2018లో ఆమె ఇంటి నుంచి వెళ్లిపోవడంతో తల్లిదండ్రులు అప్పట్లోనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

హైదరాబాద్-విజయవాడ రహదారి విస్తరణ పనులు నవంబరులో ప్రారంభం

» మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ - విజయవాడ (ఎన్‌హెచ్- 65) రోడ్డు పనులకు స్టాండింగ్ ఫైనాన్స్ కమిటీ ఆమోదం తెలిపిందని.. రెండు నెలల్లో టెండర్లు పిలిచి నవంబరు నాటికి పనులు ప్రారంభిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. సచివాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగానికి సంబంధించిన భూసేకరణ దాదాపు పూర్తయ్యిందని, మిగిలిన కాస్త భూసేకరణ వచ్చేనెల 15 నాటికి పూర్తిచేసి కేంద్రానికి పంపిస్తామని, ఆ వెంటనే టెండర్లకు నోటిఫికేషన్ వస్తుందని పేర్కొన్నారు. దక్షిణ భాగానికి సంబంధించి భూసేకరణను ప్రారంభించాలని అధికారులను ఆదేశించామని, భవిష్యత్ అవసరాలకు తగినట్లుగా అలైన్‌మెంట్ ఉండాలని అధికారులకు సీఎం సూచించారని చెప్పారు. ఇకనుంచి ఉత్తర, దక్షిణ భాగానికి సంబంధించిన ఆర్ఆర్ఆర్ పనులపై రోజువారీగా సమీక్ష చేయాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. రెండు, మూడు రోజుల్లో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి రాష్ట్రంలో చేపట్టిన అన్ని జాతీయ రహదారుల పనులను ముందుకు తీసుకెళ్లేలా సహకరించాలని కోరుతామన్నారు.

రుణమాఫీపై కేటీఆర్ మాట్లాడడం సిగ్గుచేటు

» డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఎర్రుపాలెం, ఆగస్టు 21: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న రైతు రుణమాఫీపై మాజీ మంత్రులు హరీశ్ రావు, కేటీఆర్‌లు మాట్లాడడం సిగ్గుచేటని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. భద్రాద్రి జిల్లా ఎర్రుపాలెం మండలంలో బుధవారం పర్యటించిన భట్టి పలుచోట్ల రహదారులకు శంకుస్థాపన చేశారు. అనంతరం జమలాపురంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో రైతులకు రూ.లక్ష రుణమాఫీని నాలుగు దఫాలుగా చేశారని, ఆ ప్రక్రియను కూడా సరిగా జరగలేదన్నారు. అధికారం చేపట్టి ఏడాది కూడా గడవకుండానే ఒకేసారి రూ.2లక్షల రుణమాఫీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. రైతుల రుణమాఫీ కోసం ఇప్పటికే రూ.18.5వేల కోట్లను బ్యాంకులకు జమ చేశామన్నారు.

మంచి ఫలితాలనిస్తున్న 'టీ- సేఫ్' యాప్: సీతక్క

హైదరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మహిళా భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన 'టీ- సేఫ్' యాప్ మంచి ఫలితాలనిస్తోందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. టీ-సేఫ్ ద్వారా పోలీసులకు సమాచారం ఇస్తే మహిళలు గమ్యస్థానాలు చేరే వరకు వారి భద్రతకు ప్రభుత్వమే భరోసా కల్పిస్తుందని తెలిపారు. ఈ యాప్ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని వెల్లడించారు. ఈ- యాప్‌ను అభినందిస్తూ హీరో మాధవన్ తన ఎక్స్ ఖాతాలో వీడియోను పోస్ట్ చేయడంపై మంత్రి హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు. మహిళల భద్రతపై సచివాలయంలో మంత్రి సీతక్క బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల భద్రత కోసం మంత్రులు, ఉన్నతాధికారులతో త్వరలో ఒక కోర్ కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అన్ని శాఖల్లో త్వరలో ఉమెన్ సేఫ్టీ కమిటీలు నియమిస్తామని అన్నారు.

నేడు ఈడీ కార్యాలయం ముందు కాంగ్రెస్ ధర్నా

అదానీ మెగా కుంభకోణం, సెబీ చైర్మన్ అక్రమాలపై జేపీసీ వేయడానికి కేంద్ర ప్రభుత్వం నిరాకరణకు నిరసనగా.. గురువారం అసెంబ్లీ ముందు ఉన్న అమరవీరుల స్థూపం వద్ద నుంచి ఈడీ కార్యాలయం వరకు టీపీసీసీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ జరగనుంది. అనంతరం ఈడీ కార్యాలయం ముందు భారీ ధర్నా కార్యక్రమం జరగనుంది. ఏఐసీసీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ఈడీ కార్యాలయాల ముందు ఆయా రాష్ట్రాల పీసీసీలు గురువారం నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. అందులో భాగంగా టీపీసీసీ కూడా ఈడీ కార్యాలయం వరకు నిరసన కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్యనాయకులు పాల్గొననున్నారు. అదానీ మెగా కుంభకోణంపై విచారణ, సెబీ చైర్మన్ అక్రమాలపై జేపీసీ వేయాలన్న డిమాండ్లతో ఈ ఆందోళన కార్యక్రమం జరగనుంది.

న్యాయవాదుల రక్షణ బిల్లు సాధ్యాసాధ్యాలేంటి?

» రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల రక్షణ బిల్లు(అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్) ఆమోదం అంశంలో సాధ్యాసాధ్యాలను తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఓ న్యాయవాదిపై పోలీసులు దాడి చేసిన ఘటనపై దాఖలైన పిటిషన్లను విచారిస్తూ హైకోర్టు ఈ నోటీసులు ఇచ్చింది. హైదరాబాద్, బోరబండ ప్రాంతంలో నివసించే పీ సంతోష్ అనే న్యాయవాది ఇంట్లోకి పోలీసులు చొరబడి దాడి చేశారంటూ కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ ఫిర్యాదు చేసింది. దీంతోపాటు ఆ న్యాయవాదిపై దాడికి సంబంధించి పత్రికల్లో వచ్చిన కథనాలను హైకోర్టు సుమోటోగా స్వీకరించింది. ఈ పిటిషన్లపై బుధవారం విచారణ చేపట్టిన చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం గతంలోనూ న్యాయవాదులపై దాడులు జరిగాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో న్యాయవాదిపై దాడి ఘటనలో వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ ప్రభుత్వం, పోలీసులకు నోటీసులు జారీ చేసింది. అయితే, అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్ ఖాన్ నాలుగువారాల గడువు కోరడంతో ఆ మేరకు విచారణ వాయిదా పడింది. ఇదే సందర్భంలో అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ సాధ్యాసాధ్యాలపై కూడా వివరణ ఇవ్వాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది.

వర్గీకరణపై కాంగ్రెస్ వైఖరి స్పష్టం చేయాలి

» సోనియా, రాహుల్ ఎందుకు మౌనంగా ఉన్నారు?

» సీఎం రేవంత్ ప్రకటనను స్వాగతిస్తున్నాం: మందకృష్ణ



పంజాగుట్ట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు అనుకూలమా లేక వ్యతిరేకమా అనే విషయాన్ని కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఎందుకు మౌనంగా ఉన్నారని, వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును ఎందుకు స్వాగతించడం లేదని ప్రశ్నించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆయన కులానికే నాయకుడు తప్ప మాదిగలకు కాదన్నారు. ప్రాణం ఉన్నంత వరకూ నల్ల కండువాను వదలనని స్పష్టం చేశారు. తమ ఉద్యమం దేశాన్ని ప్రభావితం చేసిందన్న ఆయన.. మాల సామాజిక వర్గంలో ఎదిగిన మేధావులు, రాజకీయ నాయకులు మనువాదులుగా తయారయ్యారని ఆరోపించారు. తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కప్పర ప్రసాద్‌రావు అధ్యక్షతన బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో 'క్రాస్ టాక్ విత్ మంద కృష్ణ మాదిగ'లో మాట్లాడారు. వర్గీకరణపై సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నామని, వర్గీకరణను నిర్వీర్యం చేస్తే ఎదుర్కొంటామన్నారు. ఆయన టీపీసీసీ అధ్యక్షుడు అయ్యాక మాదిగలకు చట్టసభల్లో సీట్లు తగ్గాయన్నారు. ప్రధాని మోదీ మనువాది కాదని, మానవతావాది అన్నారు. మాల సామాజిక వర్గంలో అంబేడ్కరిస్టులు లేరని, మనువాదుల సంఖ్య పెరిగిందని, వారు అసమానతలు తొలగించాలనుకోవడం లేదన్నారు. మాలలు రిజర్వేషన్ ఫలాలు ఎక్కువగా పొందారు కాబట్టే వర్గీకరణను వ్యతిరేకిస్తున్నారని ఆరోపించారు. జనాభా దామాషా ప్రకారం ఎవరి జనాభా ఎంత ఉందో అంత వాటా వారికి రావాలన్నారు.

రాష్ట్రంలో ప్రశాంతంగా భారత్ బంద్

హైదరాబాద్/ నల్లగొండ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ నిర్వహించిన భారత్‌బంద్ రాష్ట్రంలో ప్రశాంతంగా జరిగింది. కరీంనగర్ ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో మాలమహానాడు నాయకులు ఆర్టీసీ బస్సులను అడ్డుకునేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకోవడంతో వారు రోడ్డుపై పడుకుని రాస్తారోకో చేశారు. పలు జిల్లాల్లో ప్రైవేటు విద్యాసంస్థలు మూతపడగా, అక్కడక్కడా దుకాణాలను ఉదయం కొద్దిసేపు మూసివేయించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బంద్ పాక్షికంగా ముగిసింది. సూర్యాపేట జిల్లా కేంద్రంలో మాలమహానాడు, ఎస్సీ ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు ఆర్టీసీ డిపో ఎదుట బస్సులు బయటకు రాకుండా ధర్నా నిర్వహించారు. ఇక్కడ కొన్ని వ్యాపార, వాణిజ్య దుకాణాలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నాయి. ప్రభుత్వ ప్రైవేట్ విద్యాసంస్థలు సెలవు ప్రకటించాయి. యాదాద్రి జిల్లాలో బంద్ పాక్షికంగా జరిగింది.

రుణమాఫీపై ఫిర్యాదుల స్వీకరణ ప్రారంభం

రూ.2లక్షల వరకు రుణాలున్న రైతుల నుంచే.. 5 క్యాటగిరీల్లో వివరాలను సేకరిస్తున్న ఏఈవోలు

» ఫిర్యాదుల స్వీకరణను వారం రోజుల్లోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న అధికారులు

హైదరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రుణాలు మాఫీ కాని రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరించే ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. ఆధార్ తప్పుగా ఉన్న, కుటుంబ నిర్ధారణ కాని, పట్టాదారు పాస్‌పుస్తకం లేని, ఆధార్ పేరు-లోన్ అకౌంట్ పేరులో తేడా ఉన్నవారు, అసలు-వడ్డీ సరిపోలక తిరస్కరణకు గురైన రైతుల నుంచి.. మొత్తం ఐదు కేటగిరీలవారీగా అధికారులు ఫిర్యాదులను స్వీకరిస్తున్నారు. ఫిర్యాదుల కోసం వ్యవసాయశాఖ ఎలాంటి ప్రత్యేకమైన ప్రొఫార్మాను రూపొందించలేదు. కానీ అదే శాఖకు చెందిన ఓ అధికారి.. ఒక ప్రొఫార్మా తయారు చేసి సోషల్ మీడియాలో సర్క్యులేట్ చేశారు. ఆ ప్రొఫార్మా ప్రకారమే ఏఈవో/ఏవోలు రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, రేషన్/డ్రైవింగ్ లైసెన్స్/ఓటరు కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, క్రాప్ లోన్ అకౌంట్‌కు సంబంధించిన జిరాక్సు కాపీలను కూడా రైతుల నుంచి తీసుకుంటున్నారు. కుటుంబ నిర్ధారణ కాని, సాంకేతిక సమస్యలు తలెత్తిన ఖాతాలకు సంబంధించిన సమస్యలను నెల రోజుల్లోగా పరిష్కస్తామని ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. అయితే, రైతుల నుంచి ఫిర్యాదుల స్వీకరణను వారంలోగా పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే, రూ. 2 లక్షల వరకు రుణమాఫీ కేటగిరీలో ఉన్న రైతుల నుంచి మాత్రమే అధికారులు ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. రూ.2 లక్షలకు మించి పంట రుణాల బకాయిలు ఉన్న రైతులకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఇంకా స్పష్టమైన ఆదేశాలు రాలేదని వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు సూచించినట్లు సమాచారం. రూ.2 లక్షలకు మించి అప్పున్న రైతులు.. పైమొత్తాన్ని చెల్లిస్తే, మిగిలిన రూ.2 లక్షలు మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

రైతుల ఫిర్యాదులపై రోజువారీ నివేదికలు

రైతుల నుంచి ఫిర్యాదులను తీసుకున్న తర్వాత అధికారులు వాటిని కేటగిరీల వారీగా 'సీఎల్‌డబ్ల్యూ'(క్రాప్ లోన్ వీవర్) పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంది. ఈ పోర్టల్‌ను ప్రస్తుతం అప్‌డేట్ చేస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో పోర్టల్‌లో ఫిర్యాదుల అప్‌లోడ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. అయితే, రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను గురువారం నుంచి జిల్లా వ్యవసాయ అధికారి(డీఏవో)కి పంపించాలని వ్యవసాయశాఖ డైరెక్టరేట్ నుంచి ఏఈవోలకు ఆదేశాలు వెళ్లాయి. రైతుల ఫిర్యాదులపై రోజు వారీ నివేదికలు మండలాల నుంచి జిల్లాలకు, అక్కడి నుంచి డైరెక్టరేట్‌కు వెళ్లనున్నాయి.

10 రోజుల్లో పరిహారం లెక్కలు

2013 చట్టం ప్రకారమే ఆర్ఆర్ఆర్ పరిహారం .. 31 వరకు ఖరారు.. అదేరోజు 3డీ నోటిఫికేషన్

హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) కోసం సేకరిస్తున్న భూముల పరిహారం మరో పది రోజుల్లో ఖరారు కానుంది. ఈ భూములకు సంబంధించిన విలువలను గతంలోనే ప్రాథమికంగా నిర్ణయించారు. రహదారి కోసం భూములను కోల్పోతున్న వారికి పరిహారం గరిష్ఠంగా అందేలా చూడాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) అధికారులకు సూచించారు. ఈ నేపథ్యంలోనే ఎన్‌హెచ్ఏఐ 2013 భూపరిహార చట్టం కింద పరిహారం అందించాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన అంచనాలను తయారు చేస్తున్నారు. భూములు కోల్పోతున్న రైతులకు చెల్లించాల్సిన పరిహారాన్ని నెలాఖరులోగా ఖరారు చేయమని ప్రభుత్వం కలెక్టర్లను ఆదేశించింది. యాదాద్రి భువనగిరి జిల్లాలోని రాయగిరి ప్రాంత రైతులు భూముల అప్పగింత, పరిహారంపై కోర్టులో పిటిషన్లు వేశారు. వారితో చర్చలు జరిపి ఒప్పించాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు అందాయి. ఆగస్టు 31న 3డీ నోటిఫికేషన్ జారీ చేయాలని కలెక్టర్లకు ప్రభుత్వం నిర్దేశించింది. రహదారి నిర్మాణం కోసం సేకరిస్తున్న భూములు ఎవరివి, ఎంతెంత? అనే వివరాలు 3డీ నోటిఫికేషన్‌లో ఉంటాయి. 2013భూ పరిహార చట్టం ప్రకారం సవరించిన భూ పరిహార వివరాల ముసాయిదాను సెప్టెంబరు 15లోగా ఎన్‌హెచ్ఏఐకి పంపాలని గడువు పెట్టారు. అనంతరం పరిహారం చెల్లింపుల ప్రక్రియ మొదలవుతుంది. పరిహారం విషయంలో రైతులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే వారితో చర్చించి పరిహారాన్ని ఖరారు చేస్తారు. ఆ వివరాలతో కూడిన 3జీ జాబితాను ప్రకటిస్తారు.

పెరగనున్న పరిహారం

రాష్ట్రంలో గత ప్రభుత్వం రెండు సార్లు భూముల రిజిస్ట్రేషన్ విలువల్లో సవరణలు చేయడంతో ఆ మేరకు పరిహారం కూడా పెంచింది. ఇప్పుడు 2013 భూపరిహార చట్టం కూడా తోడు కావడంతో గరిష్ఠ పరిహారం అందుతుందని అధికారిక వర్గాలు అంటున్నాయి. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్, గెజిట్‌లను సిద్ధం చేస్తున్నారు. 3డీ నోటిఫికేషన్‌కు సంబంధించి సంగారెడ్డి జిల్లాలో 93.10 హెక్టార్లు, మెదక్ జిల్లా పరిధిలో 189.13 హెక్టార్లు, సిద్దిపేట జిల్లా పరిధిలో 39.79 హెక్టార్లు, యాదాద్రి భువనగిరి జిల్లాలో 126.08 హెక్టార్లు పెండింగ్‌లో పడ్డాయి. 3జీ జాబితాకు సంబంధించి సంగారెడ్డి జిల్లా పరిధిలో 93.10 హెక్టార్లు, మెదక్‌లో 189.13హెక్టార్లు, సిద్దిపేటలో 39.79 హెక్టార్లు, యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలో 315.80 హెక్టార్ల మేర పెండింగ్‌లో ఉంది. ఈ పెండింగ్‌ను పరిష్కరిస్తేనే భూసేకరణ వ్యవహారం పూర్తవుతుంది. ఈలోపు కేంద్రం నుంచి అటవీ అనుమతులు కూడా వస్తాయని భావిస్తున్నారు. కాగా, ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం తన 'విజన్-2047' పథకంలో చేర్చింది. ఈ మేరకు ఎన్‌హెచ్ఏఐకు సమాచారం అందింది.



సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. వేరే పని మీద సచివాలయానికి వచ్చిన రాఘవులును చూసిన సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి ముఖ్యమంత్రి వద్దకు తీసుకెళ్లారు. సీఎంను కలిసిన వారిలో జూలకంటి రంగారెడ్డి కూడా ఉన్నారు.

దక్షిణ భాగం భూసేకరణ ప్రారంభించండి

(మొదటిపేజీ తరువాయి)

అందించాలన్నారు. బుధవారం సచివాలయంలో ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం భూసేకరణపై అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. సీఎస్‌తోపాటు మౌలిక వసతులు, ప్రాజెక్టుల సలహాదారు శ్రీనివాసరాజు, సీఎం ఓఎస్డీ షానవాజ్ ఖాసీం, ఆయా జిల్లాల కలెక్టర్లు, రోడ్లు, భవనాల శాఖ ఉన్నతాధికారులతో వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసి, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు అందులో పెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఆర్ఆర్ఆర్ మ్యాప్‌ను పరిశీలించిన సీఎం.. దక్షిణ భాగం అలైన్‌మెంట్‌లో కొన్ని మార్పులను ప్రతిపాదించారు. భవిష్యత్తు అవసరాలే ప్రాతిపదికగా అలైన్‌మెంట్ ఉండాలని, ఈ విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని అన్నారు. తాను ప్రతిపాదించిన మార్పులపై క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్ర నివేదికను వీలైనంత త్వరగా అందజేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించనున్న ఫ్యూచర్ సిటీకి రేడియల్ రోడ్ల నిర్మాణంపైనా సీఎం పలు సూచనలు చేశారు. రేడియల్ రోడ్లు ఎక్కడికక్కడ ప్రధాన రహదారులకు, ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు కానున్న పరిశ్రమలకు అనుసంధానమయ్యేలా చూడాలని సూచించారు.

నోటిఫికేషన్ జారీ చేసిన ఏడేళ్లకు పీఈటీల ఫలితాలు

హైదరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసిన ఏడేళ్ల తర్వాత అభ్యర్థులను ఎంపిక చేశారు. ఇలా గురుకులాల్లోని 594 ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్(పీఈటీ) పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమిషన్ అధికారులు బుధవారం ప్రకటించారు. ఈ పోస్టుల భర్తీ కోసం 2017 ఏప్రిల్ 14న నోటిఫికేషన్‌ను జారీ చేశారు. గతంలోనే పరీక్షలను నిర్వహించారు. మధ్యలో న్యాయపరమైన వివాదాలు చోటు చేసుకోవడంతో ఫలితాల ప్రకటనలో జాప్యం చోటు చేసుకుంది. ఎట్టకేలకు ఈ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను బుధవారం ప్రకటించారు. అంటే.. నోటిఫికేషన్ జారీ చేసిన ఏడేళ్ల తర్వాత ఫలితాలను ప్రకటించారు. భర్తీలో తీవ్ర జాప్యం జరిగినందున పలువురు అభ్యర్థులు ఇప్పటికే ఇతర ఉద్యోగాల్లో చేరి ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ పోస్టులను వద్దనుకునే అభ్యర్థులు 22 నుంచి 24 తేదీల మధ్య తమకు ఉద్యోగం వద్దని వెబ్‌సైట్‌లో పొందుపరచాలని అధికారుల సూచించారు. ఇలా వదులుకునే పోస్టుల్లో మెరిట్ జాబితాలోని దిగువ అభ్యర్థులకు అవకాశం కల్పించనున్నట్టు పేర్కొన్నారు.

రుణమాఫీ సొమ్ము వాపస్ చేసిన స్పీకర్

» తిరిగి ప్రభుత్వ ఖాతాలోకి 1.5 లక్షలు

తాండూరు, ఆగస్టు 21: సాంకేతిక కారణాలతో తన ఖాతాలో పొరపాటున జమ అయిన రైతు రుణమాఫీ నిధులను తిరిగి ప్రభుత్వ ఖాతాలోకి జమ చేయడం జరిగిందని శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ బుధవారం రాత్రి తెలిపారు. ఆయన ఆంధ్రజ్యోతి ప్రతినిధితో మాట్లాడుతూ తాను ఐటీ పరిధిలోకి వస్తానని, రుణమాఫీ పొందడానికి అనర్హుడినని చెప్పారు. ఈ మేరకు కలెక్టర్‌కు స్వయంగా లేఖ రాసి తన ఖాతాలో జమ అయిన రూ.1,50,863ను ఎల్మకన్నె సహకారబ్యాంకు ద్వారా తిరిగి ప్రభుత్వ ఖాతాకు జమ చేయడమైందని స్పీకర్ వివరించారు.

హోం శాఖలో సంజయ్ ఎక్కడ?

కేంద్ర వెబ్‌సైట్‌లో రాష్ట్రనేతకు దక్కని చోటు

హైదరాబాద్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కు ఆ శాఖలో తగిన గుర్తింపు లభించడం లేదు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అధికార వెబ్‌సైట్‌లో ఆయనకు స్థానం దక్కలేదు. వెబ్‌సైట్ హోం పేజీలో హోం మంత్రి అమిత్ షా, సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ ఫొటోలు, పేర్లు మాత్రమే ఉన్నాయి. కేంద్ర మంత్రివర్గంలో తొలిసారి చోటు దక్కించుకున్న బండి సంజయ్ జూన్‌9న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఇది జరిగి రెండున్నర నెలలు గడుస్తున్నా హోం శాఖ వెబ్‌సైట్‌లో ఆయన వివరాలు పెట్టలేదు. కానీ, మరో సహాయ మంత్రి, బిహార్‌లోని ఉజియార్‌పూర్ ఎంపీ నిత్యానంద్ రాయ్ పేరు, ఫొటోను మాత్రం వెబ్‌సైట్‌లో ఉంచారు. బండి సంజయ్, నిత్యానంద్ రాయ్ సమాన హోదా కలిగిన వారే అయిన సంజయ్‌ను విస్మరించారు. ఇదే కాదు సదుపాయాల కల్పనలోనూ సంజయ్ వివక్షకు గురవుతున్నట్టు తెలిసింది. వెబ్‌సైట్‌లోని కార్యాలయ విభాగాల వివరాల్లో మాత్రం బండి సంజయ్ వివరాలు పెట్టారు.

రేవంత్, భట్టికి అధిష్ఠానం పిలుపు

నేడు లేదా రేపు ఢిల్లీకి వెళ్లే అవకాశం.. అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ఖర్గేతో భేటీ

హైదరాబాద్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 8 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పని తీరును సమీక్షించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో అధిష్ఠానం భేటీ కానుంది. ఢిల్లీలో శుక్రవారం జరిగే ఈ భేటీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ.. ఇతర ఏఐసీసీ పెద్దలూ పాల్గొననున్నట్లు సమాచారం. ఈ భేటీలో పాల్గొనేందుకు గురువారం రాత్రి లేదా శుక్రవారం ఉదయం సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో పార్టీ నూతన అధ్యక్ష పదవి సహా టీపీసీసీ కార్యవర్గం, మంత్రివర్గ విస్తరణకు సంబంధించి అధిష్ఠానం ముందు ఇప్పటికే పలు ప్రతిపాదనలు ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఖర్గే, రాహుల్‌తో జరిగే భేటీ కీలకం కానున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వాస్తవానికి ఇటీవల సీఎం ఢిల్లీ వెళ్లినప్పుడే ఈ అంశాలపై అధిష్ఠానంతో చర్చలు జరగాల్సి ఉంది. అయితే, అప్పుడే మహారాష్ట్ర, హరియాణా ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడం, రాజ్యసభ ఎన్నికల్లో అభిషేక్ మను సింఘ్వి నామినేషన్‌కు ముందు ఇలాంటివి పెట్టుకోవద్దని అధిష్ఠానం భావించడంతో ఆ ప్రక్రియ వాయిదా పడింది. అయితే, ఏఐసీసీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ స్థానంలో ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేష్ భగేల్‌ను నియమించే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపైనా సీఎం, డిప్యూటీ సీఎంల అభిప్రాయం తీసుకోనున్నారు. టీపీసీసీ అధ్యక్ష పదవికి బీసీ సామాజిక వర్గం నుంచి మధుయాష్కీగౌడ్, ఎస్సీ మాదిగ సామాజిక వర్గం నుంచి ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, పార్టీ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎస్టీ కేటగిరీ నుంచి బలరాం నాయక్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్న సంగతి తెలిసిందే. అలాగే, మంత్రి పదవుల కోసం కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, బాలూ నాయక్, రామ్మోహన్‌రెడ్డి, మల్రెడ్డి రంగారెడ్డి, ప్రేమ్‌సాగర్‌రావు, గడ్డం వివేక్, గడ్డం వినోద్, సుదర్శన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి పోటీ పడుతున్నారు. ప్రచార కమిటీ చైర్మన్‌గా తూర్పు జగ్గారెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. భేటీలో ఈ అంశాలపై ఖర్గే, రాహుల్ సమీక్ష చేపట్టనున్నారు. అవసరమైతే మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణా చేపట్టే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నెలాఖరులోగా వీటిపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని చెబుతున్నారు. రాష్ట్రంలో రూ.2లక్షలమేర రుణమాఫీ నేపథ్యంలో వరంగల్‌లో తలపెట్టిన కృతజ్ఞతా సభకు రాహుల్‌గాంధీ వచ్చే తేదీలూ ఖరారయ్యే అవకాశం ఉంది.

ఇద్దరూ ఇద్దరే..

(మొదటిపేజీ తరువాయి)

మేలు కోసమే పనిచేశారు తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ సుమారు 400 పైగా హామీలు, 6 గ్యారెంటీల పేరుతో మభ్యపెట్టిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చాక హామీలు అమలు చేయకుండా జనాన్ని మోసం చేసిందని మండిపడ్డారు. రుణమాఫీ గందరగోళంగా మారిందన్నారు. బుధవారం సికింద్రాబాద్‌లో జరిగిన పార్టీ సభ్యత్వ నమోదు శిబిరంలో కిషన్‌రెడ్డి అధ్యక్షోపన్యాసం చేశారు. బీజేపీ అంటే కుటుంబాలు, వ్యక్తుల కోసం పనిచేసేది కాదని.. దేశం కోసం, సమాజం కోసం పనిచేసే పార్టీ అని చెప్పారు. కాంగ్రెస్-బీఆర్ఎస్ ఒకే తాను ముక్కలన్నారు. గతంలో గాంధీ భవన్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు తెలంగాణ భవన్‌కు వెళ్లగా, నేడు తెలంగాణ భవన్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు గాంధీభవన్‌కు వెళ్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్ పాలనలో బంగారు తెలంగాణ రాలేదని.. కాంగ్రెస్ పాలనలో ప్రజా పాలనా రాలేదని కిషన్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర విమోచన 75 ఏళ్ల వేడుకల్లో భాగంగా సెప్టెంబరు 17న హైదరాబాద్ విముక్తి దినోత్సవాన్ని నిర్వహించుకుంటామని చెప్పారు. బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా కమిటీలు ఏర్పాటు చేసుకుంటున్నట్లు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో అపూర్వ రీతిలో ప్రజల మద్దతు కూడగట్టామన్నారు. రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని పార్టీ శ్రేణులకు సూచించారు. జిల్లాలు, మండలాలు, పోలింగ్ బూత్‌ల వారీగా కమిటీలు ఏర్పాటు చేసుకుని, అన్ని వర్గాల ప్రజలను సభ్యులుగా చేర్చుకుని పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు.

ఎంపీలైనా, ఎమ్మెల్యేలైనా సాధారణ కార్యకర్తలే: అభయ్‌పాటిల్

పార్టీ సంస్థాగత నిర్మాణంలో ఎంపీలైనా, ఎమ్మెల్యేలైనా సాధారణ కార్యకర్తల్లాగే పనిచేయాలని పార్టీ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి అభయ్‌పాటిల్ స్పష్టం చేశారు. పదవులు పార్టీ సంస్థాగత పనుల్లో అడ్డంకి కారాదన్నారు. సభ్యత్వ నమోదు లక్ష్యం చేరుకోవడంలో భాగంగా జిల్లాల అధ్యక్షులకు సహకరించాలని ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు సీనియర్ నాయకులను కోరారు. 'నేను ఇక్కడకు ఇన్‌చార్జిగా వస్తున్నానంటే కొంతమంది భయపడ్డారు. మరికొంతమంది సంతోషపడ్డారు. దానికి నేనేం చేస్తా?' అంటూ తనపై వ్యతిరేకభావంతో ఉన్న నేతలనుద్దేశించి పాటిల్ వ్యాఖ్యానించారు. సభ్యత్వ నమోదు లక్ష్యం పూర్తిచేయాలని జాతీయ నాయకత్వం తనకు బాధ్యతలు అప్పగించిందని, ఇందుకోసం క్షేత్రస్థాయిలో ప్రతి అంశాన్నీ పరిశీలిస్తానని స్పష్టం చేశారు. తన పనితీరు నచ్చకుంటే ఢిల్లీకి ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. పార్టీ పదవులు కావాలంటే సభ్యత్వ నమోదు లక్ష్యం పూర్తిచేయాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. వేదికపైకి పిలవడం లేదని, ఫ్లెక్సీల్లో ఫొటో లేదంటూ కొంతమంది నాయకులు ఫిర్యాదు చేయడం విస్మయం కలిగిస్తోందని పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. ఫొటో లేనంత మాత్రాన ఏమవుతుందని ప్రశ్నించారు. ప్రతి పోలింగ్ బూత్‌లో కనీసం 200 సభ్యత్వాలు నమోదు చేయించాలని కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజయ రహత్కర్ అన్నారు. లక్ష్యానికి అనుగుణంగా కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. మూడు దశల్లో సభ్యత్వ నమోదు ప్రక్రియ ఉంటుందని తెలిపారు.

కేసీఆర్ సూచనతోనే సింఘ్వీ ఎంపిక!

కవిత బెయిలు కోసం వాదించిన సింఘ్వీ.. అందుకే రాజ్యసభ ఎన్నికలకు బీఆర్ఎస్ దూరం

» కేంద్ర మంత్రి బండి సంజయ్

» ఫాంహౌస్ మీది కాకపోతే రేవంత్‌పై కేసెందుకు పెట్టారని కేటీఆర్‌పై ధ్వజం



హైదరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు బెయిల్ కోసం ప్రముఖ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదించారని, అందుకే రాజ్యసభ ఎన్నికల్లో కేసీఆర్ అభ్యర్థిని నిలబెట్టలేదని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ సంచలన ఆరోపణ చేశారు. కేసీఆర్ సూచన మేరకే కాంగ్రెస్ నాయకత్వం సింఘ్వీని బరిలోకి దింపిందని చెప్పారు. తిహాడ్ జైల్లో ఉన్న కవితకు బెయిల్ ఇప్పించేందుకు సింఘ్వీ కింది కోర్టులో విశ్వప్రయత్నాలు చేశారని.. దానికి ప్రతిఫలంగా కేసీఆర్, రాజ్యసభ ఎన్నికల్లో పోటీకి బీఆర్ఎస్ తరఫున అభ్యర్థిని నిలబెట్టలేదని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకత్వాలు కలిసే ఆయన అభ్యర్థిత్వాన్ని నిర్ణయించాయన్నారు. రెండు పార్టీల ఉమ్మడి అభ్యర్థిగానే సింఘ్వీ నామినేషన్ వేశారని పేర్కొన్నారు. అతి త్వరలో బీఆర్ఎస్ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయడం తథ్యమని సంజయ్ చెప్పారు. 39 మంది ఎమ్మెల్యేలున్నా రాజ్యసభ ఎన్నికల్లో ఎందుకు పోటీ చేయలేదో కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పోటీ చేస్తే గెలిచేదేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌లో క్రాస్ ఓటింగ్ జరిగేదన్నారు. పది మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఫాంహౌస్‌లో కేసీఆర్‌తో భేటీ అయ్యారని చెప్పారు. కాంగ్రెస్‌లో కేసీఆర్ ఆడిందే ఆట.. పాడిందే పాట అని, అందుకే మంత్రి పదవుల కోసం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కేసీఆర్‌ను కలుస్తున్నారని తెలిపారు. బుధవారమిక్కడ సంజయ్ మీడియాతో మాట్లాడుతూ ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఐదారేళ్లుగా దొంగ నాటకాలాడుతూ ప్రజల్లో అయోమయం సృష్టించారన్నారు. ఇప్పుడు వారి నాటకాలకు తెరపడిందని.. కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనం కాబోతోందని పునరుద్ఘాటించారు. రాజ్యసభ ఎన్నికల్లో నామినేషన్ల దాఖలు గడువు బుధవారంతో ముగిసింది. బీఆర్ఎస్‌కు 39 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని, వారిలో కొంతమంది కాంగ్రెస్‌లో చేరినా, విప్ జారీచేస్తే బీఆర్ఎస్ అభ్యర్థికి ఓటు వేయాల్సిందేనని సంజయ్ చెప్పారు. కానీ, ఢిల్లీలో జరిగిన ఒప్పందంలో భాగంగానే కేసీఆర్ తన అభ్యర్థిని ప్రకటించలేదన్నారు. విగ్రహాల ఏర్పాటుపై రాజకీయం కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల డ్రామా అని మండిపడ్డారు.

హైడ్రా దాడుల వెనక వసూళ్ల దందా

హైడ్రా దాడుల వెనక వసూళ్ల దందా ఉందని సంజయ్ ఆరోపించారు. మహారాష్ట్ర, హరియాణాలో ఎన్నికల ఖర్చులకు తెలంగాణ నుంచి డబ్బులు పంపించాలని కాంగ్రెస్ నాయకత్వం నిర్దేశించిందని.. అందుకోసమే ఈ దందా అని చెప్పారు. కబ్జాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ వాళ్లవే ఎక్కువ భూములు ఉన్నాయని.. వారిద్దరూ ఇచ్చిపుచ్చుకునే ధోరణితో ఒక్కటవుతారని తెలిపారు. తనకు ఫాంహౌస్ లేదని, స్నేహితుడిది లీజుకు తీసుకున్నానంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై సంజయ్ స్పందించారు. కేటీఆర్ అమాయకుడు.. పాపం నోట్లో వేలుపెడితే కూడా కొరకలేడని ఎద్దేవా చేశారు. తన ఫాంహౌస్‌పై అక్రమంగా డ్రోన్ కెమెరాలతో ఫొటోలు తీయించారంటూ నాడు రేవంత్‌పై ఎందుకు కేసు పెట్టారని నిలదీశారు. ప్రధాని మోదీ, బీజేపీ సిద్ధాంతాలను నమ్మి సీఎం రేవంత్ సహా ఎవరు వచ్చినా పార్టీలో చేర్చుకుంటామని ఒక ప్రశ్నకు సమాధానంగా సంజయ్ చెప్పారు. కాగా, ఎఫ్‌టీఎల్ నిబంధనల ఉల్లంఘించి నిర్మించిన 100 పైగా కట్టడాలను హైడ్రా కూల్చివేస్తే కేటీఆర్‌కు లేని ప్రేమ, ఆందోళన జన్వాడ ఫాంహౌస్ అంశంలో మాత్రం ఎందుకని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర రెడ్డి ప్రశ్నించారు.

పరువు నష్టం కేసులో సీఎం రేవంత్ రెడ్డికి నోటీసులు

హైదరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నేతలు దాఖలు చేసిన పరువు నష్టం కేసులో సీఎం రేవంత్ రెడ్డికి నాంపల్లి కోర్టు బుధవారం నోటీసులు జారీ చేసింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో బీజేపీ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు తొలగించనుందని ప్రచారం చేయడం, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఫేక్ వీడియో వైరల్ చేయడం, బండి సంజయ్ తదితర బీజేపీ నేతలను అసభ్యపదజాలంతో దూషించడంతో రేవంత్ రెడ్డి పరువు నష్టం కలిగించారంటూ బీజేపీ ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, అజయ్‌కుమార్ తదితరులు నాంపల్లిలోని న్యాయస్థానంలో ప్రైవేటు ఫిర్యాదు దాఖలు చేశారు. ఈ ఫిర్యాదును కోర్టు స్వీకరించడకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ బి. విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం వీలైనంత త్వరగా సదరు ప్రైవేటు ఫిర్యాదుపై విచారణ చేపట్టాలని స్థానిక కోర్టును ఆదేశించింది. ఈ మేరకు నాంపల్లిలోని స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు బీజేపీ నేతలు దాఖలు చేసిన పరువు నష్టం ఫిర్యాదుపై విచారణ చేపట్టి సీఎం రేవంత్ రెడ్డికి నోటీసులు జారీ చేసింది.

రెడ్ మీట్‌తో జాగ్రత్త !

రోజూ తినేవారికి మధుమేహం ముప్పు..లాన్సెట్ అధ్యయనం

హైదరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మీరు మాంసాహార ప్రియులా? అవకాశం దొరికితే రెడ్ మీట్(మేక, గొర్రె, పంది తదితర జంతువుల మాంసం)ను ఇష్టంగా లాగించేస్తుంటారా? అయితే, కొంచెం జాగ్రత్త పడాల్సిందే. ఎందుకంటే రెడ్ మీట్‌ను రోజు తినేవారు మధుమేహం బారిన పడే ముప్పు అధికంగా ఉన్నట్టు తేలింది. రెడ్‌మీట్(ప్రాసెస్ చేసిన, చేయని)ను రోజూ తినేవారు మధుమేహం(టైప్-2 డయాబెటిస్) బారిన పడే ప్రమాదం ఇతరులతో పోలిస్తే 15% అధికంగా ఉంటుందని కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు గుర్తించారు. 20 దేశాలకు చెందిన 20 లక్షల మంది సమాచారాన్ని విశ్లేషించి ఈ విషయాన్ని తేల్చారు. లాన్సెట్ డయాబెటిస్ అండ్ ఎండోక్రైనాలజీలో ఈ అధ్యయన వివరాలు ప్రచురితమయ్యాయి. అధ్యయనంలో భాగంగా రెడ్ మీట్ వినియోగం, దానికి తగ్గట్టు పెరుగుతున్న టైప్-2 డయాబెటిస్‌ను పరీక్షించారు. ప్రాసెస్ చేయని మాంసం, ప్రాసెస్డ్ మాంసం రోజూ తీసుకునేవారిలో టైప్ 2 డయాబెటిస్ పెరిగే ప్రమాదానికి స్థిరమైన సంబంధం ఉన్నట్లు గుర్తించారు. రెడ్ మీట్ మాత్రమే కాదు ప్రతిరోజు కోడిమాంసం తినేవారిలోనూ 8 శాతం మేరకు టైప్ 2 డయాబెటిస్ సోకే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ముద్రణాలయంలో భారీ కుంభకోణం!

సైదాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ చంచల్‌గూడలోని ప్రభుత్వ ముద్రణాలయం (కమిషనరేట్ ఆఫ్ ప్రింటింగ్ స్టేషనరీ అండ్ స్టోర్స్)లో ప్రింటింగ్ పేపర్ కొనుగోలులో భారీ కుంభకోణం చోటుచేసుకుంది. సుమారు రూ.25 కోట్ల గోల్‌మాల్ జరిగినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై ప్రింటింగ్ ప్రెస్ ఇన్‌చార్జ్ కమిషనర్ అంజనీ కుమార్ ఆదేశాల మేరకు 3 నెలలుగా అంతర్గత విచారణ జరుగుతున్నట్లు సమాచారం. ఎన్నికల బ్యాలెట్ పత్రాలు, ప్రభుత్వ గెజిట్‌లు, సచివాలయం, ప్రభుత్వ కార్యాలయాలకు రిజిస్టర్లు, ఫారాలు, ఇతర పత్రాలు ఈ ముద్రణాలయం నుంచే సరఫరా చేస్తారు. ఇందుకు సంబంధించిన ప్రింటింగ్ పేపర్లను తమిళనాడుతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి తెప్పించుకుంటారు. అయితే దిగుమతి చేసుకున్న ఈ పేపర్లు పక్కదారిలో ప్రైవేటు సంస్థలకు చేరినట్లు సమాచారం. ఈ వ్యవహారాన్ని ఉద్యోగులు, జేఏసీ నేతలు.. ఇన్‌చార్జ్ కమిషనర్ అంజనీకుమార్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన విచారణకు ఆదేశించారు.

వ్యవసాయశాఖలో 86 మంది ఏడీఏల బదిలీ

హైదరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖలో 86 మంది ఏడీఏలు బదిలీ అయ్యారు. మల్టీజోన్- 1లో 45 మంది, మల్టీజోన్- 2లో 41 మంది కలిపి మొత్తం 86 మందిని బదిలీచేస్తూ రాష్ట్ర వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. వీరితో పాటు 8 మంది డీడీఏ (డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్), నలుగురు జేడీఏ(జాయింట్ డైరెక్టర్లు)ను కూడా బదిలీ చేశారు.

ఘోరం



కర్మాగారంలో మంటలను అదుపుచేసేందుకు యత్నిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

(మొదటి పేజీ తరువాయి)

దట్టమైన పొగలు! పేకమేడలా కూలిపోయిన ఫ్యాక్టరీ శ్లాబ్! ఒకరిద్దరితో మొదలైన ప్రాణనష్టం... సమయం పెరిగేకొద్దీ పెరుగుతూనే ఉంది. ఫార్మా పరిశ్రమ చరిత్రలోనే అతి పెద్ద ప్రమాదం చోటు చేసుకుంది. ఇంటర్మీడియట్ కెమికల్స్ ఉత్పత్తి ఎసెన్షియా అడ్వాన్స్‌డ్ సైన్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో బుధవారం మధ్యాహ్నం తొలి షిఫ్టు కార్మికులు విధులు ముగించుకుని వెళ్తుండగా... దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. కొన్ని నిమిషాల్లోనే భారీ పేలుడు సంభవించింది. దీని తీవ్రతకు శ్లాబ్, గోడ కుప్పకూలిపోయాయి. ఒకదాని వెంట మరొకటిగా జరిగిన ఘటనలతో కార్మికులు కకావికలమయ్యారు. పేలుడు ధాటికి కొందరి శరీరాలు తుత్తునీయలయ్యాయి. శ్లాబ్ శిథిలాల కింద కొందరు నలిగిపోయారు. దట్టమైన పొగ అలుముకోవడంతో... ఎటుపోతున్నామో తెలియకుండా పరుగులు తీస్తూ గోడలకు తగిలి, మెట్లపై నుంచి కొందరు కింద పడ్డారు. ఈ మూడు కారణాల వల్లే భారీగా ప్రాణనష్టం సంభవించింది.

అసలేం జరిగింది

ఎసెన్షియా ఫార్మా కంపెనీలో భారీ ప్రమాదానికి 'వేపర్ క్లౌడ్ ఎక్స్‌ప్లోజన్' కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు. థర్డ్‌ఫ్లోర్‌లో ఉన్న రియాక్టర్ నుంచి గ్రౌండ్‌ఫ్లోర్‌లోని ఒక ట్యాంకర్‌లోకి 'మిథైల్ టెరిషరీ బుయటైల్ ఈథర్' అనే ద్రవ రసాయనం పంపిస్తున్నారు. ఈ క్రమంలో పైపులు లీకై... గ్రౌండ్‌ఫ్లోర్‌లోని విద్యుత్ ప్యానల్స్‌పై రసాయనం పడింది. దీంతో రసాయనం ఆవిరై... దట్టమైన మేఘాలు ఏర్పడ్డాయి. ఆ గది మొత్తం అలుముకున్నాయి. ఆ తర్వాత ఎలక్ట్రికల్ ప్యానల్స్, ఏసీ డక్టుల ద్వారా భవనమంతా రసాయన మేఘాలు వ్యాపించాయి. సాల్వెంట్ పడిన ఎలక్ట్రిక్ ప్యానల్స్ వద్ద నిప్పు రాజుకుంది. క్షణాల్లోనే దట్టమైన పొగలా అలుముకున్న రసాయన ఆవిరి వల్ల భారీ పేలుడు జరిగింది. దీని తీవ్రతకు గ్రౌండ్‌ఫ్లోర్ శ్లాబ్, గోడ కుప్పకూలాయి. మూడో ఫ్లోర్‌లో ఉన్న రియాక్టర్‌కూడా పేలిపోయినట్లు తెలుస్తోంది.

రెండు షిఫ్టుల సిబ్బంది...

'ఎసెన్షియా'లో ఒక్కో షిఫ్టులో 80 మంది కార్మికులు పని చేస్తారు. సరిగ్గా ఏ-షిఫ్టు సిబ్బంది బయటికి వెళ్తూ... బి-షిఫ్టు కార్మికులు లోపలికి వెళ్లేటప్పుడే ఈ ఘోరం జరిగింది. మరో ఐదు నిమిషాలు ఉంటే తొలి షిఫ్టు కార్మికులు మొత్తం బయటికి వచ్చేవాళ్లు. రెండో షిఫ్టు సిబ్బంది వాహనాలు దిగి కర్మాగారం ప్రధాన గేటు దాటి వెళ్తుండగా ఈ పేలుడు జరిగింది. దీంతో బయట ఉన్న కార్మికులు పరుగులు తీశారు. కొందరు ధైర్యం చేసి కర్మాగారంలోకి ప్రవేశించారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లు, కర్మాగారం బస్సుల్లో అచ్యుతాపురంలోని వివిధ ప్రైవేటు ఆస్పత్రులకు తరలించారు.

మృతుల్లో ఏజీఎంలు, ట్రైనీలు

ఎసెన్షియా ఫార్మా కంపెనీ ప్రమాదంలో మరణించిన వారిలో బుధవారం అర్ధరాత్రి సమయానికి 13 మందిని గుర్తించారు. వారిలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్ స్థాయి నుంచి ఆఫీసు బాయ్ వరకు ఉన్నారు. పీహెచ్‌డీ, ఎమ్మెస్సీ, బీటెక్ చదివిన వారు ఉన్నారు. మృతుల్లో... నీలాపు రామిరెడ్డి (ఏజీఎం/అసోసియేట్ డైరెక్టర్), ప్రశాంత్ హంస (సీనియర్ ఎగ్జిక్యూటివ్), మహంతి నారాయణ (టీమ్ లీడర్), కొప్పర్తి గణేశ్ కుమార్ (సీనియర్ ఎగ్జిక్యూటివ్), చల్లపల్లి హారిక (ట్రైనీ ఇంజనీర్), పైడి రాజశేఖర్ (ట్రైనీ ప్రాసెస్ ఇంజనీర్), మరిశెట్టి సతీశ్ (సీనియర్ ఎగ్జిక్యూటివ్), మొండి నాగబాబు (అసిస్టెంట్ మేనేజర్), నాగేశ్వర రామచంద్రరావు (టీమ్ లీడర్), వేగి సన్యాసినాయుడు (హౌస్ కీపింగ్ బాయ్), యల్లబిల్లి చిన్నారావు(పెయింటర్), పార్థసారధి(ఫిట్టర్), పపూడి మోహన్ దుర్గా ప్రసాద్ (హౌస్ కీపింగ్) ఉన్నారు.

భీతావహం

ముక్కలుగా మృతదేహాలు... గుర్తుపట్టలేని స్థితిలో కాలిన శరీరాలు... ఎటు చూస్తే అటు శిథిలాలతో ప్రమాదస్థలం భీతావహంగా మారింది. కొందరి శరీర భాగాలు సమీపంలోని ఒక చెట్టు కొమ్మల్లోనూ చిక్కుకున్నాయి. క్షతగాత్రులు చెల్లాచెదురుగా పడిపోయి కనిపించారు. ప్రమాదం సంభవించినప్పుడు ఎంత మంది కంపెనీ ఆవరణలో ఉన్నారో, వారిలో ఎందరు బయటికి వచ్చారు, ఎందరు శిథిలాల కింద చిక్కుకున్నారనేది ఇంకా లెక్క తేలడంలేదు.

రంగంలోకి ఎన్డీఆర్ఎఫ్

దట్టమైన పొగలు కమ్ముకోవడం, వాటిని పీల్చిన వారు అస్వస్థతకు గురి కావడంతో అగ్నిమాపక సిబ్బంది, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది తప్ప ఇంకెవరూ లోపలకు వెళ్లలేకపోయారు. కంపెనీ ప్రతినిధులు కూడా గేట్లు మూసేసి లోపలికి ఎవరినీ రానీయలేదు. మధ్యాహ్నం ప్రమాదం జరిగితే రాత్రి చీకటి పడే వరకు గాయపడిన వారిని అంబులెన్సుల్లో తరలిస్తూనే ఉన్నారు. ఎన్డీఆర్ఎఫ్ రంగంలోకి దిగిన తర్వాతే సహాయ చర్యలు ఊపందుకున్నాయి.

అనుభవజ్ఞులు లేకనే

ఎసెన్షియా అడ్వాన్స్‌డ్ సైన్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో అనుభవజ్ఞులైన నిపుణులు లేకపోవడమే భారీ ప్రమాదానికి కారణమని భావిస్తున్నారు. గ్యాస్ లీకైనపుడు అది గాలిలో కలిసిపోతే ఎటువంటి ప్రమాదం ఉండదు. అదే గ్యాస్ లీకై తలుపులు మూసిన గదిలోనే ఉంటే... అవి మేఘంగా మారుతుంది. చిన్న 'స్పార్క్'తో భారీ పేలుడు సంభవిస్తుంది. ఎసెన్షియాలో జరిగిన ప్రమాదం కూడా అలాంటిదే. 'మిథైల్ టెరిషరీ బుయటైల్ ఈథర్' గాలిలో కలిసిన వెంటనే దట్టమైన ఆవిరి మేఘాలుగా మారిపోతుంది. భవనం మొత్తం క్లోజ్‌గా ఉండటంతో... ఇది పొగలా అలుముకుంది. ఎలక్ట్రికల్ ప్యానళ్ల నుంచి భవనంలో అన్ని మూలలకు విస్తరించింది. మంటలు చెలరేగిన వెంటనే అన్ని ప్రాంతాలకు చేరడం.. అప్పటికే పైపుల్లో ఉన్న ఆవిరి మేఘం విచ్ఛిన్నమవడంతో రియాక్టర్ కూడా పేలిందని ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయ అధికారులు ప్రభుత్వానికి ప్రాథమికంగా నివేదించినట్లు తెలిసింది.





క్షతగాత్రుడికి ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్న దృశ్యం, మృతులు మోహన్ దుర్గాప్రసాద్, హారిక

కాటేసిన కల్తీ కల్లు!

- ఒకరి మృతి.. మరొకరి పరిస్థితి విషమం
- 30 మందికి అస్వస్థత.. ఆస్పత్రిలో చేరిక
- వికారాబాద్ జిల్లా పీరంపల్లిలో ఘటన

వికారాబాద్, ఆగస్టు 21: వికారాబాద్ రూరల్ పీరంపల్లిలో కల్తీకల్లు తాగి ఒకరు మృతిచెందారు. మరొకరు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. మరో 30మంది తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రోజు మాదిరిగానే గ్రామంలోని కూలీలు 32 మంది పనులు ముగిశాక సోమవారం సాయంత్రం ఊర్లోనే కల్లుతాగారు. కొద్దిసేపటికే వాంతులు, విరేచనాలు కావడంతో జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో చేరారు. చికిత్స పొందుతున్న వారిలో దుర్గయ్య (55) పరిస్థితి విషమించడంతో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత మృతిచెందాడు. మరో మహిళ పరిస్థితి విషమంగా ఉందని గ్రామస్థులు చెబుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఎనిమిది మంది, మెడిక్యూర్ ఆస్పత్రిలో నలుగురు, మిషన్ ఆస్పత్రిలో ఆరుగురు, ఇతర ఆస్పత్రుల్లో మిగతా వారు చికిత్స పొందుతున్నారు. కాగా సమాచరం తెలుసుకున్న అధికారులు పీరంపల్లిలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రెండు రోజులుగా గ్రామంలో కల్లు తాగిన వారితో పాటు ఇతర గ్రామస్థులకూ వైద్య పరీక్షలు నిర్వహించారు. కాగా, మండల పరిషత్తు అధికారులు గ్రామానికి వెళ్లి తాగునీటిని సరఫరా చేసే ట్యాంకులను పరిశీలించారు. పరీక్షల కోసం నీటి నమూనాలను సేకరించారు. గ్రామంలో సరఫరా అయ్యే నీటి వల్ల ఎలాంటి సమస్య లేదని అధికారులు నిర్ధారించారు.

కుక్కలు బాబోయ్..

- నల్లగొండ జిల్లాలో ఐదుగురిపై దాడి
- మహబూబాబాద్ జిల్లాలో ఇద్దరికి గాయాలు
- మెదక్ జిల్లాలో కుక్కకాటుతో వ్యక్తి మృతి

దేవరకొండ/ బయ్యారం/ చిలప్‌చెడ్, ఆగస్టు 21: రాష్ట్రంలోని పలు జిల్లాల్లో బుధవారం కుక్కలు పెట్రేగిపోయాయి. నల్లగొండ జిల్లాలో ఓ పిచ్చికుక్క ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడు సహా ఐదుగురిపై దాడిచేసి తీవ్రంగా గాయపరచగా, మహబూబాబాద్ జిల్లాలో కుక్క దాడిలో తండ్రీ, కొడుకులు గాయపడ్డారు. మెదక్ జిల్లాలో కుక్కకాటుతో ఓ వ్యక్తి మృతి చెందాడు. నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం పలుగుతండాలో ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడు సహా ఐదుగురిపై పిచ్చికుక్క దాడి చేసింది. వారిలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానికులు దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు తీవ్రంగా గాయపడిన ముగ్గురిని హైదరాబాద్‌కు పంపించారు. మెదక్ జిల్లా చిలప్‌చెడ్ మండలం ఫైజాబాద్‌లో కుక్కకాటుకు ఒకరు మృతి చెందారు. ఫైజాబాద్‌కు చెందిన మ్యాకల శ్రీనివాస్ (41) నెల రోజుల క్రితం తన వ్యవసాయ పొలం వద్ద ఉన్న గుడిసెలో నిద్రిస్తుండగా కుక్క దాడి చేసి గాయపరిచింది. అప్పటి నుంచి జోగిపేట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీనివాస్ ఆరోగ్యం విషమించి బుధవారం మృతి చెందాడు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం గంధంపల్లి గ్రామానికి చెందిన షేక్ యూసఫ్ భార్య తన మూడేళ్ల కుమారుడికి ఇంటి ఆవరణలోని వరండాలో అన్నం తినిపిస్తున్న సమయంలో హఠాత్తుగా వీధి కుక్క బాలుడిపై దాడి చేసింది. ఆమె కేకలు వేయడంతో ఇంట్లో నుంచి బయటకు వచ్చిన యూసఫ్ కుక్కను తరిమే ప్రయత్నం చేయగా అతడిపై కూడా కుక్క దాడి చేసి గాయపరిచింది. ఇద్దరూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

బిట్స్ పిలానీలో పీజీ కోర్సులు

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● గురువారం 22 ఆగస్టు 2024
diksuchi@andhrajyothy.co

పిలానీలోని బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(బిట్స్)- వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లను అందిస్తోంది. ఇవి వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్‌లు. సంబంధిత విభాగాల్లో కనీసం ఏడాది అనుభవం ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. కెరీర్ బ్రేక్ లేకుండా కోర్సులు కొనసాగించే వీలుంటుంది. వారాంతాల్లో లైవ్ ఆన్‌లైన్ సెషన్స్, మిగిలిన రోజుల్లో ఆఫీసు వేళల తరవాత ఆన్‌లైన్ లెక్చర్స్ ఉంటాయి. డౌట్ క్లియరింగ్ సెషన్స్, ఆన్‌లైన్ ట్యుటోరియల్స్, ఇండస్ట్రీ టాక్స్, ఆన్‌లైన్ ఎగ్జామ్స్ నిర్వహిస్తారు. ఫైనల్ సెమిస్టర్‌లో డిజర్టేషన్(ప్రాజెక్ట్ వర్క్) ఉంటుంది. ప్రతి సెమిస్టర్‌లో మిడ్, కాంప్రహెన్సివ్ పరీక్షలు ఉంటాయి. వీటిని ఆన్‌లైన్ ద్వారా లేదా ఎంచుకొన్న పరీక్ష కేంద్రానికి వెళ్లి రాయవచ్చు.

ఎంటెక్ డేటా సైన్స్ అండ్ ఇంజనీరింగ్: ఈ ప్రోగ్రామ్ వ్యవధి నాలుగు సెమిస్టర్లు. డేటా సైంటిస్టులు, డేటా అనలిస్టులు, డేటా ఆర్కిటెక్టులు, డేటా ఇంజనీర్లుగా రాణించేందుకు అవసరమైన మేథమెటికల్, ఇంజనీరింగ్ స్కిల్స్ పెంపొందించేలా కోర్సుని రూపొందించారు. మేథమెటికల్ ఫౌండేషన్ ఫర్ డేటా సైన్స్, స్టాటిస్టికల్ మెథడ్స్, డేటా స్ట్రక్చర్స్ అండ్ అల్గారిథమ్స్ డిజైన్, సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్, డేటా మైనింగ్, మెషిన్ లెర్నింగ్, డేటా విజువలైజేషన్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్, ఎథిక్స్ ఫర్ డేటా సైన్స్, డీప్ లెర్నింగ్, ఆర్టిఫీషియల్ అండ్ కంప్యూటేషనల్ ఇంటెలిజెన్స్, డేటా వేర్‌హౌసింగ్, ప్రాసెసింగ్ ఆఫ్ అనలిటిక్స్ తదితర అంశాలు వివరిస్తారు.

ఎంటెక్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్: ఈ ప్రోగ్రామ్ వ్యవధి నాలుగు సెమిస్టర్లు. మెషిన్ లెర్నింగ్ ఇంజనీర్లు, ఏఐ సైంటిస్టులుగా రాణించేందుకు ఈ ప్రోగ్రామ్ ఉపకరిస్తుంది. ఇందులో మెషిన్ లెర్నింగ్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, నెట్‌వర్క్స్, కంప్యూటర్ విజన్, రోబోటిక్స్, డీప్ లెర్నింగ్, డేటా అనాలిసిస్ తదితర అంశాలు వివరిస్తారు.

పీజీ ప్రోగ్రామ్ ఇన్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్: ఈ ప్రోగ్రామ్ వ్యవధి 11 నెలలు. ఇందులో రిగ్రెషన్, ఫీచర్ ఇంజనీరింగ్, క్లాసిఫికేషన్, అన్ సూపర్‌వైజ్డ్ లెర్నింగ్ అండ్ అసోసియేషన్ రూల్ మైనింగ్, టెక్స్ మైనింగ్, డీప్ లెర్నింగ్ అండ్ ఏఎన్ఎన్ తదితర అంశాలు బోధిస్తారు. ఎనిమిది వారాల క్యాప్‌స్టోన్ ప్రాజెక్ట్ కూడా ఉంటుంది.



అర్హత: ప్రథమ శ్రేణి మార్కులతో బీఈ/బీటెక్/ఎంసీఏ ఉత్తీర్ణులు; మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్ట్‌గా ఎమ్మెస్సీ/తత్సమాన కోర్సు పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. మేథమెటిక్స్‌లో ప్రావీణ్యం, ప్రోగ్రామింగ్ నాలెడ్జ్ తప్పనిసరి.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 16
- **వెబ్‌సైట్:** bits-pilani-wilp.ac.in/

రిమైండర్స్

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (సెంట్రల్ యూనివర్సిటీ)- పీహెచ్‌డీ 2024 జూలై సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆలిండియా ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. జేఆర్ఎఫ్ అర్హత ఉన్న అభ్యర్థులు ఎంట్రెన్స్ రాయనవసరం లేదు.

మొత్తం 170 సీట్లు ఉన్నాయి.

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో పీహెచ్‌డీ



స్పెషలైజేషన్లు-సీట్లు: ఇంగ్లీష్ 6, తెలుగు 19, ఉర్దూ 3, అప్లయిడ్ లింగ్విస్టిక్స్ 8, హిస్టరీ 8, పొలిటికల్ సైన్స్ 10, సోషియాలజీ 20, ఆంత్రోపాలజీ 9, ఎడ్యుకేషన్ 2, రీజనల్ స్టడీస్ 5, ఇండియన్ డయాస్పొరా 2, సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇన్‌క్లూజివ్ పాలసీ 4, జెండర్ స్టడీస్ 5, ఎకనామిక్స్ 28, డ్యాన్స్ 3, ఆర్ట్ హిస్టరీ అండ్ విజువల్ స్టడీస్ 1, కమ్యూనికేషన్ 3, ట్రాన్స్‌లేషన్ స్టడీస్ 4, ఇంగ్లీష్ లాంగ్వేజ్ స్టడీస్ 8, హెల్త్ సైన్స్-ఆప్టోమెట్రీ 2, మెటీరియల్స్ ఇంజనీరింగ్ 16, నానోసైన్స్ అండ్ టెక్నాలజీ 4 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత స్పెషలైజేషన్‌తో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన ఇతర/తత్సమాన అర్హతల వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600; ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.550; ఓబీసీ అభ్యర్థులకు రూ.400; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.275
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 14
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** అక్టోబరు 10 నుంచి
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(రాత పరీక్ష) తేదీలు:** అక్టోబరు 19, 20
- **ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** నవంబరు 8
- **ఇంటర్వ్యూలు:** నవంబరు 18 నుంచి 21 వరకు
- **ఇంటర్వ్యూలో ఎంపికైనవారి జాబితా విడుదల:** డిసెంబరు 2
- **కౌన్సెలింగ్:** డిసెంబరు 10, 11
- **తరగతులు ప్రారంభం:** 2025 జనవరి 2 నుంచి
- **వెబ్‌సైట్:** www.uohyd.ac.in

అంబేద్కర్ యూనివర్సిటీలో పీజీ, పీజీ డిప్లొమా

శ్రీకాకుళంలోని డా.బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ(బీఆర్ఏయూ)- మాస్టర్ ఆఫ్ హెల్త్‌కేర్ అడ్మినిస్ట్రేషన్(ఎంహెచ్ఏ), పీజీ డిప్లొమా ఇన్ మెడికల్ రికార్డ్స్ అండ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఎంహెచ్ఏ వ్యవధి రెండేళ్లు. పీజీ డిప్లొమా వ్యవధి ఏడాది. ఒక్కో ప్రోగ్రామ్‌లో 40 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్‌లకు ఆదిత్య ఎడ్యుకేషనల్ సొసైటీకి చెందిన బొల్లినేని మెడ్‌స్కిల్స్ సహకారం అందిస్తోంది. థియరీ తరగతులతో పాటు ప్రాక్టికల్స్ కూడా ఉంటాయి.

అర్హత: ఎంబీబీఎస్/బీడీఎస్/బీఎస్సీ/బీఫార్మసీ/బీఎస్సీ నర్సింగ్/బీఏఎంఎస్/బీహెచ్ఎంఎస్/బీఎస్సీ/బీకాం/బీఏ/ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

అభ్యర్థుల వయసు 20 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.

- **క్యాంపస్ సెంటర్:** బొల్లినేని మెడ్ స్కిల్స్, జెమ్స్ అండ్ హాస్పిటల్ క్యాంపస్, రాగోలు, శ్రీకాకుళం-532484
- **దరఖాస్తు ఫీజు:** రూ.250
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఆగస్టు 30
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆఫీస్, డా.బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ, ఎచ్చెర్ల, శ్రీకాకుళం-532410
- **వెబ్‌సైట్:** www.brau.edu.in, www.bollinenimed-skills.in



ఏపీ సార్వత్రిక విద్యలో పదో తరగతి ప్రవేశాలు



ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరానికిగాను పదో తరగతి ప్రవేశాల ప్రకటన విడుదలైంది.

వయసు: 2024 ఆగస్టు 31 నాటికి అభ్యర్థి 14 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి లేదు. జనన ధ్రువీకరణ పత్రం లేదా టీసీని సమర్పించాల్సి ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 27

రూ.200 ఆలస్య రుసుముతో ఫీజు చెల్లింపు చివరి తేదీ: ఆగస్టు 28

వెబ్‌సైట్: https://apopenschool.ap.gov.in/

ఒబెరాయ్ గ్రూప్ స్కాలర్‌షిప్

ఒబెరాయ్ గ్రూప్ తమ సంస్థ 90వ వార్షికోత్సవాల సందర్భంగా 'ద ఒబెరాయ గ్రూప్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్'ని ప్రారంభించింది. హాస్పిటాలిటీ రంగంలో తరవాత తరాన్ని ప్రోత్సహించేందుకు ఈ స్కాలర్‌షిప్‌ని ఉద్దేశించారు. ఒబెరాయ్ గ్రూప్‌ని రాయ్ బహద్దూర్ సింగ్ ఒబెరాయ్ నెలకొల్పారు. తరవాత ఈ సంస్థను ప్రిథ్విరాజ్ సింగ్ ఒబెరాయ్ అభివృద్ధి పథంలో నడిపించారు. వీరిద్దరి పేరిట ఈ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్‌కి రూపకల్పన చేశారు.

- **రాయ్ బహద్దూర్ మోహన్ సింగ్ ఒబెరాయ్ - డేర్ టు డ్రీమ్ స్కాలర్‌షిప్:** విదేశాల్లో హోటల్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు దీన్ని ఉద్దేశించారు.
- **ప్రిథ్విరాజ్ సింగ్ ఒబెరాయ్- బి ద బెస్ట్ స్కాలర్‌షిప్:** ఇండియా, విదేశాల్లో ఉన్న ఒబెరాయ్ గ్రూప్ హోటళ్ల సిబ్బందికి దీనిని ఉద్దేశించారు. ఈ స్కాలర్‌షిప్స్ పొందిన అభ్యర్థులు స్విట్జర్లాండ్‌లోని ఈహెచ్ఎల్ హాస్పిటాలిటీ బిజినెస్ అండ్ హోటల్ మేనేజ్‌మెంట్ స్కూల్‌లో రెండేళ్ల ఎంబీఏ కోర్సు చదివే అవకాశం లభిస్తుంది.

వెబ్‌సైట్: https://www.oberoigroup.com/scholarships/

జాబ్ కార్నర్

హెచ్ఏఎల్‌లో నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

ఖాళీలు 166

బెంగళూరులోని హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్), ఎల్‌సీఏ తేజస్ డివిజన్... కింద పేర్కొన్న నాన్ ఎగ్జిక్యూటివ్ కేడర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- డిప్లొమా టెక్నీషియన్: **43 పోస్టులు**
- టెక్నీషియన్: **123 పోస్టులు**

ట్రేడులు: మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్, మెటలర్జీ, ఫిట్టర్, షీట్ మెటల్, ఫౌండ్రీమన్, వెల్డర్, మెషినిస్ట్, ఎలక్ట్రోప్లాటర్.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో టెన్త్, ఐటీఐ, డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం, అప్రెంటిషిప్ సర్టిఫికెట్ ఉండాలి.

జీతం: నెలకు రూ.44,796 నుంచి రూ.46,764

వయోపరిమితి: 2024 జూలై 31 నాటికి 28 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీ/అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ వారికి మూడేళ్లు సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం: దరఖాస్తుల షార్ట్‌లిస్టింగ్, రాత పరీక్ష, మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాల ఆధారంగా

దరఖాస్తు ఫీజు: రూ.200. ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ/ఎక్స్-అప్రెంటీస్‌లకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 28

వెబ్‌సైట్: https://hal-india.co.in/

కేంద్రీయ విద్యాలయలో టీచింగ్ స్టాఫ్

గచ్చిబౌలిలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం... 2024-25 విద్యా సంవత్సరానికి కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

పోస్టుల వివరాలు
1. పీజీటీ(మేథ్స్, కామర్స్)
2. టీజీటీ(మేథ్స్, ఇంగ్లిష్)
3. పీజీటీ - ప్రైమరీ టీచర్
4. స్పెషల్ ఎడ్యుకేటర్
5. ఎడ్యుకేషనల్ కౌన్సెలర్
6. స్పోర్ట్స్/ఆర్ట్ కోచ్

అర్హత: పోస్టును అనుసరించి డిప్లొమా, డిగ్రీ, పీజీ, బీఈడీ, సీటీఈటీ ఉత్తీర్ణులై ఉండాలి.

ఇంటర్వ్యూ తేదీ: ఆగస్టు 24

వేదిక: పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం, గచ్చిబౌలి, హైదరాబాద్.

వెబ్‌సైట్: https://gachibawli.kvs.ac.in/

నల్సార్ వర్సిటీలో ఫ్యాకల్టీ

ఖాళీలు 33

హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా(నల్సార్)... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. అసిస్టెంట్ ప్రొఫెసర్: **18 పోస్టులు**
2. అసోసియేట్ ప్రొఫెసర్: **8 పోస్టులు**
3. ప్రొఫెసర్: **7 పోస్టులు**

విభాగాలు: లా, మేనేజ్‌మెంట్, సోషియాలజీ, ఎకనామిక్స్

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 55 శాతం మార్కులతో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు నెట్/సెట్/స్లెట్ స్కోరు ఉండాలి. పని అనుభవం ఉండాలి.

దరఖాస్తు ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.1000, ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ/దివ్యాంగ/మహిళా అభ్యర్థులకు రూ.750. **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 12

వెబ్‌సైట్: https://apply.nalsar.ac.in/recruitment/

కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో ట్రెయినీలు

ఖాళీలు 64

కేరళలోని ప్రభుత్వరంగ సంస్థ- కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్(సీఎస్ఎల్)... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. షిప్ డ్రాఫ్ట్స్‌మన్ ట్రెయినీ(మెకానికల్): **46 పోస్టులు**
2. షిప్ డ్రాఫ్ట్స్‌మన్ ట్రెయినీ(ఎలక్ట్రికల్): **18 పోస్టులు**

అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, డిప్లొమా(మెకానికల్/ఎలక్ట్రికల్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 25 ఏళ్లు మించకూడదు.

వ్యవధి: 2 సంవత్సరాలు

స్టయిపెండ్: మొదటి ఏడాది రూ.14,000; రెండో ఏడాది రూ.20,000

దరఖాస్తు ఫీజు: రూ.600. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఎంపిక విధానం: రాత పరీక్ష, ప్రాక్టికల్ టెస్ట్ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 31


వెబ్‌సైట్: https://cochinshipyard.in/

పవర్‌గ్రిడ్‌లో జూనియర్ ఇంజనీర్లు

ఖాళీలు 38

గుర్‌గావ్‌లోని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్... కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు
1. జూనియర్ ఇంజనీర్(గ్రేడ్-3/ఎస్2)(సర్వే ఇంజనీరింగ్)
2. సర్వేయర్(గ్రేడ్-4/డబ్ల్యూ4)
3. డ్రాఫ్ట్స్‌మన్(గ్రేడ్-4/డబ్ల్యూ 4)



అర్హత: ఐటీఐ(డ్రాఫ్ట్స్‌మన్ సివిల్ / ఆర్కిటెక్చరల్ డ్రాఫ్ట్స్‌మన్), ఇంజనీరింగ్ డిప్లొమా(సివిల్/సర్వేయర్), బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: జూనియర్ ఇంజనీర్ పోస్టుకు 31 ఏళ్లు, సర్వేయర్, డ్రాఫ్ట్స్‌మన్ పోస్టులకు 32 ఏళ్లు మించకూడదు.

వేతనం: జూనియర్ ఇంజనీర్ పోస్టుకు రూ.26,000 - రూ.1,18,000; సర్వేయర్, డ్రాఫ్ట్స్‌మన్ పోస్టులకు రూ.22,000 - రూ.85,000.

దరఖాస్తు ఫీజు: జూనియర్ ఇంజనీర్(సర్వే ఇంజనీరింగ్) పోస్టుకు రూ.300; సర్వేయర్, డ్రాఫ్ట్స్‌మన్ పోస్టులకు రూ.200; ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీ/ఎక్స్ సర్వీస్‌మన్‌లకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఎంపిక విధానం: రాత పరీక్ష, ట్రేడ్ టెస్ట్, షార్ట్‌లిస్ట్ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: ఆగస్టు 29

వెబ్‌సైట్: https://www.power-grid.in/




దురాశ ఫలితం

ఒక నగరంలో రంగా మరియు కమల అనే భార్యా భర్తలు ఉండేవారు. రంగా అడవికి వెళ్లి కట్టెలు కొట్టి తెచ్చి అమ్ముకుని జీవనం సాగించేవాడు. ఒకరోజు రంగాకు కాలికి గాయం ఐన ఒక ముని కనిపించాడు. రంగా ముని గాయానికి కట్టు కట్టి సేవ చేసాడు అప్పుడు ముని సమయానికి సాయం చేసి నాకెంతో మేలు చేసావు. నీకేం కావాలో కోరుకో అన్నాడు. రంగా ఆగండి స్వామీ ఇంటికి వెళ్లి నాభార్యను అడిగొస్తాను అని చెప్పి ఇంటికి వచ్చి కమలను అడగగా ఆమె మనకొక ఇల్లు కావాలని అడిగిరండి అని చెప్పింది. ఆమెకోరిక ప్రకారమే ఆ మర్నాటికల్లా వారికి ఒక ఇల్లు ప్రత్యక్షమైంది. కొద్ది రోజుల తర్వాత కమలకు పెద్ద మేడలో ఉండాలనే కోరిక కలిగింది. మునిని అడిగి రమ్మని భర్తను అడవికి పంపింది. ముని సరే అనడంతో ఆమర్నాడు మేడ ప్రత్యక్షమైంది. కొంత కాలం గడిచాక కమలకు ఆ రాజ్యానికి తానే రాణి కావాలనే కోరిక పుట్టింది. మరలా భర్తను ముని వద్దకు పంపింది. ముని సరే అనడంతో కొద్దిరోజుల్లోనే వారిద్దరూ ఆ రాజ్యానికి రాజు, రాణి అయ్యారు. కొంతకాలం తర్వాత మరలా ముని వద్దకు వెళ్లాడు రంగా ఈసారి ఏం కోరికతో వచ్చావు? అని అడిగిన మునితో స్వామీ నా భార్య సూర్య చంద్రులు తనింటనే ఉండేలా వరం అడిగి రమ్మంది అన్నాడు. ఆ మాటలు విన్న ముని ఎంత దారుణమైన కోరిక ఇది అనుకుంటూ సూర్యచంద్రులు మీ ఇంటనే ఉండాలంటే మీరిద్దరూ ఒక చెట్టు కింద ఉంటే సరి అన్నాడు. రంగా తన భవనం వద్దకు వచ్చేసరికి కమల బాధగా ఏడుస్తూ, చెట్టుకింద కూర్చుని కనిపించింది. మన సంపద, మన భవనం అంతా మాయం అయిపోయిందండీ అని బాధగా అన్నది. ఉన్నదానితో తృప్తిపడలేని నీ ఆత్యాశ చూసావా మనకు ఎలాంటి పరిస్థితి తెచ్చిపెట్టిందో? అన్నాడు రంగా. ఇకపై ఉచితంగా దొరికేవాటికి ఆశపడకుండా ఉన్నదానితో సర్దుకుని కష్టపడి పనిచేసి సంపాదించుకుందాం అండి అన్నది కమల. ఆమెలో వచ్చిన ఈ మార్పుకు రంగా చాలా సంతోషించాడు.


10 తేడాలు గుర్తించండి




ఎన్ని పిల్లులు, కుక్కలు ఉన్నాయి



సరైన నీడ ఏది



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 390

		6	2		4			
2		7		6		3		
						8		
6	7		1	3				4
		8				9		
9				8	7		6	3
		4						
		1		5		4		8
			4		1	7		

సుడోకు - 389 సమాధానం

2	9	1	3	6	7	8	5	4
8	6	3	5	4	1	2	7	9
4	5	7	2	8	9	3	1	6
1	4	6	9	5	2	7	3	8
7	2	8	1	3	4	6	9	5
9	3	5	8	7	6	1	4	2
6	1	9	7	2	5	4	8	3
5	8	2	4	1	3	9	6	7
3	7	4	6	9	8	5	2	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.